## 1వ పాఠము

**ప్రియమైన తల్లిదండ్రులారా,**

ఈ వారము మన బైబిలు (తరగతి) సమయమునందు యేసు జీవితమును తిరిగి పరిశీలించుటకు పాత నిబంధన నుండి క్రొత్త నిబంధన లోనికి వెళ్ళుచున్నాము.

యేసు జననము గూర్చిన ప్రియ సత్యములపైన కేంద్రీకరించుచు మనము లూకా 1 మరియు 2 అధ్యాయములను అధ్యయనము చేయుదుము.

మేము మా విద్యార్థులలో మన రక్షకుని జన్మము యొక్క సుందర వృత్తాంతము యెడల ఒక గంభీరమైన భక్తి భావమును కలుగజేయవలెనని మరియు అది మనకెన్నడును సామాన్యమైనదిగా ఉండరాదని మా ప్రార్థనయై యున్నది.

# బాలుడైన యేసు

సౌమ్యురాలు మరియు మంచి ప్రవర్తన కలిగిన యౌవనస్థురాలైన మరియ నజరేతు పట్టణము నందు నివసించెను. యోసేపు అను పేరుగల ఒక వడ్రంగిని ఆమె త్వరలో పెండ్లి చేసుకొనబోవుచుండెను. ఒకరోజు గాబ్రియేలను పేరుగల దేవదూత ఆమెను దర్శించి, ఆమె ఒక కుమారుని కనును మరియు ఆమె అతనికి యేసు అను పేరుపెట్టునని ఆమెతో చెప్పెను. పరిశుద్ధాత్మ ఆమెతో ఉండును మరియు బాలుడు దేవుని కుమారుడని అతడు చెప్పెను.

మరియ యోసేపులు ఒకరోజు జనసంఖ్య నమోదు కొరకు బెత్లెహేముకు ప్రయాణము చేయవలసి వచ్చెను. అది ఒక సుదీర్ఘ ప్రయాణము. వారు బెత్లెహేము చేరుకున్నప్పుడు సత్రములో వారికి స్థలము లేకపోయెను. ఆరాత్రి వారు పశువుల పాకలో గడిపిరి. ఆ రాత్రి శిశువు పుట్టెను. ప్రభువు దూత చెప్పినట్లుగా వారు అతనికి యేసు అని పేరు పెట్టిరి.

దగ్గరలోని పొలములలో ఉన్న గొఱ్ఱెల కాపరులకు ఒక దేవదూత కనబడెను. ఒక గొప్ప వెలుగు వారిపై ప్రకాశించెను, మరియు దేవదూత వారితో ఇట్లు చెప్పెను," భయపడకుడి, ప్రభువైన క్రీస్తు అను ఒక రక్షకుడు ఈ రాత్రి పుట్టియున్నాడు". గొఱ్ఱెల కాపరులు ఈ బాలుని వెదకుచు వెళ్ళిరి. వారాయనను పశువుల తొట్టిలో కనుగొనిరి.

తూర్పు దేశపు జ్ఞానులు యేసును వెదకుచు ఒక నక్షత్రమును వెంబడించి యెరూషలేముకు వచ్చిరి. "యూదుల రాజు" అని వారు పిలచుచున్న ఈ బాలుడు ఎక్కడ ఉన్నాడో అతడు కనుగొనునట్లు రాజైన హేరోదు ఈ మనుష్యులను మోసగించ ప్రయత్నించెను. (ఏదో ఒక రోజున ఆ బాలుడు అతని సింహాసనమును అతని నుండి తీసికొనునని అతడు భయపడెను). ఆ జ్ఞానులు బెత్లెహేములోని ఒక ఇంటిలో యేసును కనుగొనిరి. వారాయనను పూజించిరి మరియు ఆయనకు బంగారము, సాంబ్రాణి మరియు బోళమును కానుకలుగా సమర్పించిరి.

యేసు పండ్రెండేళ్ళ వాడైనప్పుడు మరియ యోసేపులు ఆయనను తమతో పాటు పస్కా పండుగ కొరకు యెరూషలేమునకు తీసికొని పోయిరి. వారు తిరిగి ఇంటికి వెళ్ళు మార్గములో జన సమూహము ఎక్కువగా ఉండెను. యేసు వారితో లేడని వారు తెలియక యుండిరి. వారు వెనుకకు తిరిగి వెళ్ళినప్పుడు వారాయనను దేవాలయములో ధర్మశాస్త్రము యొక్క బోధకులతోను మరియు ఉపదేశకులతోను మాట్లాడుచు కనుగొనిరి. "నేను నా తండ్రి పనుల మీద ఉండవలెనని మీరెరుగరా?" అని ఆయన వారితో చెప్పెను. ఆయన వారితో నజరేతునకు తిరిగి వెళ్ళి, వారికి లోబడి యుండెను. యేసు జ్ఞానమందును, వయస్సునందును, దేవుని దయయందును మనుష్యుల దయయందును వృద్ధిపొందెను.

ఒక బాలునిగా యేసు యొక్క ఈ కథలు మత్తయి 1 మరియు 2 అధ్యాయములు మరియు లూకా సువార్త 2వ అధ్యాయములో కనుగొనబడును.

### : కంఠత వాక్యము :

అయితే ఆ దూత – భయపడకుడి, ఇదిగో ప్రజలందరికిని కలుగబోవు మహా సంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియజేయుచున్నాను. దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు. ఈయన ప్రభువైన క్రీస్తు. దానికిదే మీకానవాలు, ఒక శిశువు పొత్తి గుడ్డలతో చుట్టబడి యొక తొట్టిలో పండుకొని యుండుట మీరు చూచెదరని వారితో చెప్పెను. **లూకా 2:10 – 12**

# 1వ పాఠము - పరీక్ష
# బాలుడు యేసు

1. మరియ నివసించిన పట్టణము ....................... ( )
ఎ) బెత్లెహేము బి) నజరేతు సి) యెరూషలేము

2. మరియకు ప్రత్యక్షమైన దూత ......................... ( )
ఎ) గాబ్రియేలు బి) మిఖాయేలు సి) సెరాఫిమ్

3. ................ మరియ యోసేపులు బెత్లెహేముకు ప్రయాణమై పోయిరి. ( )
ఎ) మరియ తన తల్లిని చూచుటకు
బి) యూదుల పండుగ కొరకు
సి) వారి సుంకము చెల్లించుటకు

4. వారు (మరియ, యోసేపులు) శిశువుకు యేసు అను పేరు పెట్టుటకు కారణము .... ( )
ఎ) దూత ఆ శిశువుకు యేసు అను పేరు పెట్టమని చెప్పెను
బి) కుటుంబ పరమైన పేరు
సి) ఇది యోసేపు పేరులో మధ్యన ఉండుట

5. దూత గొఱ్ఱెల కాపరులతో ఈలాగు చెప్పెను ............... ( )
ఎ) మందను మరొక పొలమునకు తీసుకెళ్ళండి
బి) భయపడకుడి
సి) వెలుగు చాలా ప్రకాశమానమై యుండును

6. జ్ఞానులు యేసును ............... ద్వారా కనుగొనిరి ( )
ఎ) ప్రకాశవంతమైన నక్షత్రమును వెంబడించుట
బి) బైబిల్ చదువుట
సి) అతను ఎక్కడున్నాడని రాజును అడుగుట

7. ఏ విషయమై హేరోదు శిశువుకు భయపడెను .................... ( )
ఎ) అతడు సుంకము చెల్లించడని
బి) తన సింహాసనమును తీసుకొనునని
సి) దేశమును వదిలిపెడతాడని

8. యేసు పన్నెండు సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు వారు అతనిని ఎక్కడికి తీసుకొని వెళ్ళిరి ( )
ఎ) బెత్లెహేములోని పశువుల పాకకు
బి) గలిలయ సముద్రంలో చేపలు కొరకు
సి) యెరూషలేములోని పండుగకు

9. అతని (యేసు) తల్లిదండ్రులు అతనిని ఎక్కడ కనుగొనిరి? ( )
ఎ) వారి బంధువులతో ఉన్నట్లు
బి) దేవాలయములో
సి) రోడ్డుపై ఉండి వారికోసం ఎదురు చూస్తున్నప్పుడు

10. పిల్లలు తమ తల్లిదండ్రులను ఇలా గౌరవించగలరు? ( )
ఎ) సత్యము మాట్లాడుతూ తల్లిదండ్రులకు లోబడివుండుట
బి) యెరూషలేముకు వెళ్ళుచుండుట
సి) ఇబ్బందిలో పడుట

## 2వ పాఠము

# బాప్తీస్మమిచ్చు యోహాను

## లూకా 3వ అధ్యాయము

యేసు తల్లియైన మరియ యోహాను తల్లియైన ఎలీసబెతుకు బంధువు. దూత మరియకు ప్రత్యక్షమై యేసు రాకను గూర్చి ఆమెకు చెప్పిన తరువాత ఆమె ఎలీసబెతును చూచుటకు వెళ్ళెను మరియు ఆమె కూడా ఒక బిడ్డకు జన్మ ఇవ్వనైయున్నదని తెలుసుకొనెను. ఇప్పుడు ఎలీసబెతు మరియు ఆమె భర్త జకర్యా బహు కాలము గడచిన వృద్ధులు మరియు వారి బిడ్డ చాలా ప్రత్యేకమైన బిడ్డ. అతడు ఒక ప్రత్యేకమైన పని కొరకు దేవుని చేత ఎన్నుకోబడినవాడు. రాబోవు మెస్సీయ కొరకు జనుల హృదయములను సిద్ధపరచుటయే ఆ పని.

ప్రవక్తయైన యెషయా యోహానును గూర్చి "అరణ్యములో కేకవేయు ఒకని శబ్దము" అని చెప్పుచూ రాబోవు యేసు కొరకు సిద్ధపడుడని జనులతో చెప్పెను. యేసు తన కంటే గొప్పవాడు మరియు శక్తిమంతుడని మరియు ప్రభువు చెప్పులు మోయుటకైనను అతడు యోగ్యుడు కాడని యోహాను వారితో చెప్పెను.

అతడు ఒంటె రోమముల చేత చేయబడిన వస్త్రములు ధరించెను మరియు మొలచుట్టు తోలుదట్టి ధరించియుండెను. అతడు అరణ్యములో నివసించెను, మిడుతలను మరియు అడవి తేనెను భుజించెను.

అతడు పాపక్షమాపణ నిమిత్తము మారుమనస్సు విషయమైన బాప్తీస్మమును ప్రకటించుచు యోర్దానునది చుట్టూ ఉన్న ప్రదేశమందంతటా వెళ్ళెను. జన సమూహములు తమ పాపములు ఒప్పుకొనుచు వచ్చిరి మరియు అతడు వారికి యోర్దాను నదిలో బాప్తీస్మము ఇచ్చెను.

వారు మంచిగా జీవించవలెనని అతడు వారితో చెప్పెను. వారేమి చేయవలెనని వారతనిని అడిగిరి. వారు రెండు అంగీలు కలిగియున్న యెడల అంగీలేని వ్యక్తితో వారు పంచుకొనవలెనని మరియు వారు ఆహారము కలిగియున్న యెడల లేని వారితో వారు పంచుకొనవలెనని అతడు చెప్పెను.

వారేమి చేయవలెనని సుంకపు గుత్తదారులు అడుగగా వారు పన్నులు వసూలు చేయుటలో నిజాయితీగా ఉండవలెనని మరియు వారు వసూలు చేయవలసినంత కంటె ఎక్కువ వసూలు చేయరాదని అతడు వారితో చెప్పెను.

వారేమి చేయవలెనని సైనికులు అడిగిరి మరియు అతడు వారితో అన్యాయముగా జనుల నుండి ద్రవ్యము తీసికొనరాదని, ఎల్లప్పుడు సత్యమునే చెప్పవలెనని మరియు అబద్ధముగా జనులపై నిందమోపరాదని చెప్పెను. వారి జీతముతో వారు సంతృప్తి చెందవలెను మరియు దాని గూర్చి సణగకూడదు అని వారితో చెప్పెను.

జనులు సత్యమును విననొల్లకున్నను యోహాను ఎల్లప్పుడు సత్యమునే పలికెను. హేరోదు చేసియున్న దుష్ట క్రియలను బట్టి అతడు హేరోదును నిర్భయముగా ఎదుర్కొనెను. చివరకు సత్యము కొరకు ఇట్లు నిలచుట వలన యోహాను తన ప్రాణము పోగొట్టుకొనెను.

### : కంఠత వాక్యము :

స్త్రీలు కనిన వారిలో బాప్తీస్మమిచ్చు యోహాను కంటె గొప్పవాడు పుట్టలేదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. అయినను పరలోక రాజ్యములో అల్పుడైనవాడు అతని కంటే గొప్పవాడు.

**మత్తయి 11:11**

## 2వ పాఠము - పరీక్ష

# బాప్తీస్మమిచ్చు యోహాను

1. యోహాను తల్లి ఎలీసబెతు .................... కు బంధువు ( )
ఎ) అన్నా బి) మగ్దలేని మరియ సి) యేసు తల్లియైన మరియ

2. యోహాను యొక్క పని ........................... ( )
ఎ) పరలోకము గూర్చి ప్రజలకు చెప్పుట
బి) మెస్సీయ రాకడ కొరకు ప్రజలను సిద్ధపరచుట
సి) యూదుల మతము గూర్చి బోధించుట

3. యెషయా యోహాను గూర్చి ఇలాగున ప్రవచించెను ( )
ఎ) ప్రవక్తల మధ్యలో ఒక ప్రవక్త
బి) అరణ్యములో ఒకని శబ్దము
సి) యేసుకు సోదరుడు

4. ....................... అని యోహాను చెప్పెను ( )
ఎ) యేసు అతని కంటే గొప్పవాడు
బి) అతడు యేసు కంటే గొప్పవాడు
సి) అతడు యేసు సమానులు

5. యోహాను వస్త్రధారణ ....................... ( )
ఎ) వ్యాపార వస్త్రములు
బి) పొడవాటి వస్త్రములు
సి) ఒంటె రోమముల వస్త్రము, తోలు దట్టి

6. యోహాను ....................... తినెను ( )
ఎ) ప్రతిసారీ హోటళ్ళలో
బి) మిడుతలు మరియు అడవి తేనె
సి) పట్టణ ప్రజలు తినే ఆహారము

7. యోహాను ....................... బోధించెను. ( )
ఎ) పాపక్షమాపణ నిమిత్తము మారుమనస్సు కొరకు బాప్తీస్మము పొందుమని
బి) నీకు సంతోషం కలుగు రీతిలో జీవించుమని
సి) విశ్వాసులకు సంపద మరియు శ్రేయస్సు కలుగును అని

8. యోహాను ......................... చెప్పెను ( )
ఎ) శత్రువులను తప్ప అందరినీ ప్రేమించాలని
బి) పేదలతో కలిసి పంచుకోవాలని
సి) అవసరమైనచో అబద్దాలు చెప్పవచ్చని

9. .................. సత్యము వినకూడదు అని అనుకున్నప్పటికిని యోహాను సత్యము చెప్పెను ( )
ఎ) యేసు బి) మత్తయి సి) హేరోదు రాజు

10. ............... యందు సంతోషమును వెదకుటను మనము నేర్చుకొనవలసిన అవసరమున్నది ( )
ఎ) ఆటలకు వెళ్ళుట
బి) ఇతరులకు సేవచేయుట
సి) అతిగా తినుట

## 3వ పాఠము
# యేసు యొక్క బాప్తీస్మము
## మత్తయి 3:13-17

యోహాను యొర్దాను నదిలో బాప్తీస్మము ఇచ్చుచుండెను. ఒకరోజు యేసు గలిలయలోని నజరేతు నుండి వచ్చి తనకు బాప్తీస్మము ఇమ్మని యోహానును అడిగెను. యోహానుకు బాప్తీస్మము ఇవ్వవలసినది యేసు అని యోహాను తలంచెను కాబట్టి యోహాను అభ్యంతరము తెలిపెను. అయితే నీతి యావత్తు నెరవేర్చుటకు వారు దీనిని చేయవలసిన అవసరమున్నదని యేసు అతనితో చెప్పెను. కాబట్టి యోహాను ఆయనకు నదిలో బాప్తీస్మము ఇచ్చెను.

ఆయన బాప్తీస్మము పొందిన వెంటనే ఆయన ప్రార్థన చేయుచుండగా ఆకాశము తెరువబడి ఒక పావురము దిగివచ్చి యేసుపై నిలిచెను. అది యేసు ఎవరో చూపుట కొరకు ఒక పక్షి రూపములో దిగివచ్చిన పరిశుద్ధాత్ముడే. యేసు దానిని చూచెను మరియు యోహాను కూడా పావురమును చూచెను.

"నీవు నా ప్రియ కుమారుడవు, నీయందు నేను ఆనందించుచున్నాను" అని చెప్పుచు పరలోకము నుండి ఒక స్వరము అకస్మాత్తుగా వచ్చెను. యేసు వాగ్దానము చేయబడిన మెస్సీయా అనుటకు పావురము మరియు దేవుని స్వరము సూచనగా ఉండెను.

దీని తరువాత యోహాను తిరిగి జనుల సమూహముతో కూడియుండెను, మరియు యేసు ఆ సమూహమును సమీపించెను. ఏమి జరిగి యుండెనో యోహాను వారికి తెలియజేసెను. "ఇదిగో! లోకపాపములను మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల!" అని అతడు చెప్పెను. దేవుని ఆత్మ ఒక పావురము రూపములో యేసుపైకి దిగివచ్చుట అతడు చూచియున్నాడని యోహాను వారితో చెప్పెను. ఇది అతనికి ఒక సూచనయై యున్నదని అతడు చెప్పెను ఏలయనగా ఒక పావురము ఎవరిమీద దిగివచ్చుట అతడు చూచునో ఆయనే దేవుని కుమారుడని దేవుడు అతనికి బయలుపరచియుండెను. ఈ విధముగానే యోహాను ఖచ్చితముగా తెలుసుకొనెను.

ఇప్పుడు యోహాను మరియు యేసు బంధువులు  వారు కలిసి పెరిగిరి. యోహాను తల్లియైన ఎలీసబెతు, మొదటి నుండి అనగా యేసు జన్మించుటకు ముందుగానే తన బంధువురాలైన మరియ దేవుని కుమారునికి తల్లి కాబోవుచున్నదని ఎఱిగియుండెను. యేసు భూమిమీదకు వచ్చిన మానవరూపములోని దేవుడు. యేసు బాప్తీస్మము నొద్ద ఈ సంఘటన జరుగువరకు యేసు యొక్క నిజమైన గుర్తింపు యోహానుకు తెలియనట్లు కనబడును.

అయితే క్రీస్తు రాక కొరకు ప్రజలను సిద్ధపరచుటకు యోహాను పని కలిగియుండెను మరియు అతడు తన పని నెరవేర్చుచుండెను. ఇప్పుడు క్రీస్తు బయల్పరచబడెను.

కొంతమంది జనులు యోహాను నొద్దకు వచ్చిరి మరియు ఇప్పుడు జన సమూహములు యోహానుకు బదులుగా యేసు నొద్దకు వెళ్ళుచున్నారని అతనితో చెప్పిరి. అతడు ఆందోళన చెందునని వారు తలంచిరి కాని అతడు ఏమాత్రము పట్టించుకొనలేదు. అతడు తానే క్రీస్తును కాదని అతడు వారికి తెలియజేసెనని అతడు చెప్పెను. క్రీస్తు పెండ్లి కొడుకు మరియు యోహాను కేవలము తోడి పెండ్లికొడుకు లేక పెండ్లికొడుకు స్నేహితునిగా ఉన్నట్లుండెను. ప్రజలు క్రీస్తువైపు తిరుగుచున్నందున అతడు ఆనందించుచుండెను. యేసు హెచ్చవలసియున్నదని మరియు అతడు, యోహాను, తగ్గవలసియున్నదని యోహాను చెప్పెను.

### : కంఠత వాక్యము :

మరియు – ఇదిగో ఈయనే నా ప్రియకుమారుడు, ఈయన యందు నేనానందించుచున్నానని యొక శబ్దము ఆకాశము నుండి వచ్చెను. **మత్తయి 3:17**

## 3వ పాఠము - పరీక్ష

# యేసు యొక్క బాప్తీస్మము

1. యోహాను ................ నందు బాప్తీస్మము ఇచ్చుచుండెను . ( )
   ఎ) యోర్దాను నది
   బి) గలిలయ సముద్రము
   సి) మృత సముద్రము

2. యేసు ................... తనకు బాప్తీస్మము ఇమ్మని చెప్పెను. ( )
   ఎ) తాను ఒక పాపి గనుక
   బి) నీతి యావత్తు నెరవేర్చు నిమిత్తమై
   సి) అతడు తన పనిని ప్రారంభించుచున్నందున

3. యేసు బాప్తీస్మము పొందిన తరువాత ................ . ( )
   ఎ) ఆయన తడిసిపోలేదు
   బి) ఒక పావురము ఆయన మీదికి దిగివచ్చెను
   సి) ఆయన యోహాను స్థానములో ఇతరులకు బాప్తీస్మము ఇచ్చుట ప్రారంభించెను

4. ఆకాశము నుండి ఒక స్వరము ఇట్లు చెప్పెను .......................... . ( )
   ఎ) యోహానూ నీవు సరిగా చేసితివి
   బి) ఇప్పుడు నీ పని ప్రారంభింపబడును
   సి) నీవు నా ప్రియకుమారుడవు

5. ఈ సంఘటనల తరువాత యోహాను ............. తెలుసుకొనెను . ( )
   ఎ) యేసే మెస్సీయా అని
   బి) అతడు బాప్తీస్మమిచ్చుట కొనసాగించవలెనని
   సి) అతడు ఇతరులకు బాప్తీస్మమిచ్చుట ఆపవలెనని

6. జన సమూహములు ఇప్పుడు యేసునొద్దకు వెళ్ళుచున్నారని యోహాను తెలుసుకొన్నప్పుడు ....... . ( )
   ఎ) అసూయతో ఫిర్యాదు చేయుట మొదలుపెట్టెను
   బి) ఆంధోళన చెంది తన యొద్దకు రమ్మని సమూహములతో చెప్పెను
   సి) వారు ఆవిధముగా వెళ్ళుచున్నందుకు సంతోషించెను

7. యోహాను ప్రజలతో ................ చెప్పెను . ( )
   ఎ) తాను క్రీస్తును కాదని
   బి) తాను క్రీస్తునని
   సి) విశ్వాసము ముఖ్యమైనది కాదని

8. క్రీస్తు పెండ్లి కుమారుని వలెను మరియు యోహాను ........ వలెను ఉన్నట్లుండెను. ( )
   ఎ) పెండ్లి కుమార్తె బి) పెండ్లి కుమారుని స్నేహితుని సి) సేవకుని

9. యేసు హెచ్చింపబడవలెను మరియు అతడు, యోహాను ............ అని యోహాను చెప్పెను. ( )
   ఎ) ఇంకను గొప్పవాడు కావలెను
   బి) అదృశ్యుడవ్వవలెను
   సి) తగ్గింపబడవలెను

10. మనము సరియైన దానినే చేయవలెను, ఎందుకనగా ............. . ( )
    ఎ) మనము అట్లు చేయని యెడల మనము శిక్షింపబడుదుము
    బి) అది మనలను ముఖ్యులనుగా చేయును
    సి) "అది చేయుటకు సరియైనది"

## 4వ పాఠము

# యేసు యొక్క శోధన

యేసు బాప్తీస్మము పొందిన తరువాత ఆయన ఆత్మ చేత అరణ్యము లోనికి నడిపింపబడెను మరియు అపవాది చేత నలుబది దినములు శోధింపబడెను. యేసు ఆ నలుబది దినములు ఉపవాసముండెను. అనగా ఆ సమయమునందు ఆయన యేమియు తినలేదు మరియు ఆ సమయము ముగిసిన తరువాత ఆయన చాలా ఆకలిగొనెను.

ఆయనను తిరిగి శోధించుటకు ఇది ఒక అవకాశముగా సాతాను చూచెను. "నీవు దేవుని కుమారుడవైతే, ఈ రాళ్ళు రొట్టెలగునట్లు ఆజ్ఞాపించుము" అని అతడు యేసుతో చెప్పెను. "మనుష్యుడు రొట్టె వలన మాత్రము జీవించడు గాని, దేవుని నోట నుండి వచ్చు ప్రతి మాట వలన జీవించును" అని ద్వితియోపదేశకాండము నుండి ఉల్లేఖించుచు యేసు సమాధానమిచ్చెను.

ఇశ్రాయేలు సంతానము అరణ్యమునందు ఉండగా వారు ఆకలిగొనినప్పుడు దేవుడు వారికి పరలోకము నుండి "మన్నా" అనే ప్రత్యేక ఆహారమును భుజింపచేసెనని నీవు జ్ఞాపకము చేసుకొందువు. వారి యొక్క అన్ని అవసరతల కొరకు వారు ఆయన మీద ఆధారపడియున్నారని ఆయన వారికి తెలియజేసెను.

అపవాది మిగుల ఎత్తయిన కొండ మీదికి యేసును తీసికొనిపోయి లోకరాజ్యములన్నిటిని ఆయనకు ఒక్క నిముషములో చూపెను. అప్పుడు అతడెవ్వరికి ఇవ్వగోరునో వానికి ఆ రాజ్యములను ఇచ్చుటకు అతనికి అధికారము ఇవ్వబడియున్నదని అతడు ఆయనతో చెప్పెను. అతనికి ఆ అధికారము నిజముగా ఇవ్వబడెనా?

జ్ఞాపకముంచుకొనుము, అపవాది ఒక అబద్ధికుడు. దేవుడు మనుష్యుల రాజ్యములయందు పరిపాలన చేయును మరియు ఆ అధికారమును ఎవరు కలిగియుండవలెనని ఆయన కోరునో ఆ ప్రజలకు ఆ అధికారమును ఇచ్చువాడు ఆయనే. ఆయన సాతానును ఆరాధించిన యెడల అతడు ఆయనకు ఆ రాజ్యములన్నిటిని ఇచ్చునని సాతాను యేసుతో చెప్పెను.

"సాతానా, నా వెనుకకు పొమ్ము! నీ దేవుడైన ప్రభువునకు మ్రొక్కి ఆయనను మాత్రమే సేవింపవలెను" అని యేసు జవాబిచ్చెను. మరలా యేసు ద్వితియోపదేశకాండములో మోషే వ్రాసినవి ఎత్తిచూపెను.

సాతాను తిరిగి ప్రయత్నించును. అతడు యేసును యెరూషలేమునకు తీసికొనివచ్చి మరియు ఆయనను దేవాలయ శిఖరమునకు కొనిపోయి, అక్కడ నుండి క్రిందికి దుముకుమని ఆయనతో చెప్పెను. ఆయనకు దెబ్బ తగలకుండా దేవదూతలు వచ్చి ఆయనను ఎత్తిపట్టుకొందురని అతడు చెప్పెను.

అపవాది లేఖనములు ఎత్తి చూపుట కూడా మొదలుపెట్టెను. అతడు 91వ కీర్తన నుండి ఎత్తి చూపెను. "నీ మార్గములన్నిటిలో నిన్ను కాపాడుటకు ఆయన నిన్ను గూర్చి తన దూతలకు ఆజ్ఞాపించును. నీ పాదములకు రాయి తగలకుండా వారు నిన్ను తమ చేతులమీద ఎత్తిపట్టుకొందురు" ("నీ మార్గములన్నిటిలో నిన్ను కాపాడును" అను భాగమును సాతాను వదలివేసెను).

"నీ దేవుడైన ప్రభువును శోధింపవలదు" అని యేసు అతనికి సమాధానమిచ్చెను.

సాతాను ఆయనను వదలిపోయెను, కాని యేసుతో పాపము చేయించుటకు అతనికి అవకాశము కలిగియున్నాడని అతడు తలంచినప్పుడు అతడు మరలా తిరిగివచ్చును. అయితే అతడు ఎన్నడు విజయము పొందలేదని మనమెరుగుదుము.

సాతాను వెడలిపోయిన తరువాత దేవదూతలు వచ్చిరి మరియు యేసుకు సహాయపడిరి. దేవదూతలు ఆయనకు సహాయపడుటకు వచ్చిన ఇతర సమయములు కూడా ఆయన జీవితమునందుండెను.

ఒకసారి యేసు పరలోక రాజ్యములో అందరికన్నా ఎవరు గొప్ప అని మాట్లాడుచున్నప్పుడు ఆయన ఒక చిన్నపిల్లవానిని తన యొద్దకు పిలిచెను మరియు వారు చిన్నపిల్లల వలె కావలెనని జనులతో చెప్పెను. "పరలోకమందున్న నా తండ్రి ముఖమును పరలోకములో వారి దూతలు ఎల్లప్పుడు చూచునని నేను మీతో చెప్పుచున్నాను" అని ఆయన చెప్పెను.

రక్షింపబడిన వారికి సహాయము చేయుటకు పంపబడిన 'పరిచారము చేయు దూతలు' ఉన్నారని హెబ్రీయులు గ్రంధకర్త ద్వారా మనము చెప్పబడియున్నాము. ఎంత ఆదరణకరమైన మాట!

**కంఠత వాక్యము: యేసు యొక్క శోధనను గూర్చి బైబిలులో లూకా 4:1-13లో చదువగలవు.**

## 4వ పాఠము - పరీక్ష

# యేసు యొక్క శోధన

1. యేసు అరణ్యమునందు ............ అపవాది చేత శోధింపబడెను . ( )
ఎ) ఒక సంవత్సరము బి) 10 రోజులు సి) 40 రోజులు

2. యేసు ఆకలిగొనగా అపవాది ఆయనను ........... చేయునట్లు ప్రయత్నించెను. ( )
ఎ) రాళ్ళు రొట్టెలుగా మార్చుట బి) రొట్టె రాళ్ళుగా మార్చుట సి) రాళ్ళను తినుట

3. యేసు ఈ శోధనకు ఇలా సమాధానం చెప్పెను ............... . ( )
ఎ) రాళ్ళు తినుటకు మంచివి కావు
బి) నేను నీకు విధేయతగా ఉండను
సి) "మనుష్యుడు రొట్టెవలన మాత్రము జీవింపడు" అని వ్రాయబడివున్నది

4. అపవాది యేసుకు భూలోక రాజ్యములన్నిటిని చూపి, తనకు ఆయన (యేసు) మ్రొక్కిన యెడల ...అని చెప్పెను. ( )
ఎ) రాజ్యములలో యేసు సగము పొందును
బి) అతను రాజ్యములన్నింటిని ఆయనకు (యేసుకు) ఇచ్చును
సి) అతడు మరణము పొందడు

5. యేసు ఇట్లు సమాధానమిచ్చెను ...................... . ( )
ఎ) ఇవ్వడానికి అవి నీవి కావు
బి) రాజ్యములన్నియు నావైయున్నవి
సి) నీ దేవుడైన ప్రభువును మాత్రమే సేవింపవలెను

6. సాతాను మూడవసారి యేసును .................... కు పురికొల్పెను. ( )
ఎ) దేవాలయము శిఖరము నుండి దుముకుట
బి) బండ నుండి నీరు వచ్చునట్లు ఆజ్ఞాపించుట
సి) రాజ్యములను పాలించుట

7. యేసు మూడవ శోధనకు స్పందించి ఇలా చెప్పెను .......... . ( )
ఎ) మనుష్యుడు రొట్టె వలన మాత్రము జీవింపడు
బి) నీ దేవుడైన ప్రభువును శోధింపవలదు
సి) దూతలు నాకు సహాయము చేయలేరు

8. సాతాను విడిచిపోయిన తరువాత ..................... . ( )
ఎ) దేవదూతలు వచ్చి యేసుకు పరిచర్య చేసిరి
బి) యేసు అరణ్యమును విడిచి పట్టణము లోనికి పోయెను
సి) యోహానును కనుగొనుటకు యేసు వెళ్ళెను

9. ............. పరలోకమందున్న మన తండ్రి ముఖమును ఎల్లప్పుడు చూచుదురు అని యేసు చెప్పెను. ( )
ఎ) అపోస్తలులు బి) రాజులు సి) దూతలు

10. లేఖనము కంఠస్థము చేయుట నీకు ఇట్లు సహాయము చేయగలదు ........... . ( )
ఎ) నీకు లేఖనము ఎంత తెలుసో చూపును
బి) శోధనను తట్టుకొనచేయును
సి) సాతానుకు లోబడచేయును

## 5వ పాఠము

**ప్రియమైన తల్లిదండ్రులారా,**

మన అనుదిన జీవితములో సాగుటకు ముందు దేవునిని ఆలకించుట కొరకు సమయము కేటాయించుటను గూర్చి ఈ వారము మనము నేర్చుకొందుము. ఈ ప్రాముఖ్యమైన నియమమును వివరించుటకు మనము మరియ మార్తల కథను అధ్యయనము చేయుదుము. ఈ సహోదరీలు యేసు యొక్క సన్నిహిత స్నేహితులు. మరియు ఆయన బేతనియలోని వారి ఇంటినొద్ద వారితో ఉండెను. మరియ యేసు బోధలను విను శ్రేష్ఠమైన పనిని ఎన్నుకొనెను, అయితే యేసు మాటలు ఎంత ప్రాముఖ్యమైనవో చూడలేనంతగా ఆత్రుతతోను, పని వత్తిడితోను మార్త ఉండెను.

# యేసు స్నేహితులు

**అపోస్తలులు: యోహాను 1:35-49 మరియు అపోస్తలుల కార్యములు 1:12-26**

యేసుకు సహాయము చేయుట కొరకు కొంతమంది ప్రత్యేకమైన శిష్యులు ఆయనకు అవసరమై యుండెను. వారు అపోస్తలులని పిలువబడిరి. చేపలు పట్టువారైన సీమోను పేతురు మరియు అతని సహోదరుడైన ఆంద్రెయ మొదటగా పిలువబడిరి. చేపలు పట్టువారైన మరి ఇద్దరు సహోదరులను కూడా ఆయన పిలిచెను. వారు జెబెదయి అని పిలువబడిన ఒక మనుష్యుని కుమారులైన యాకోబు మరియు యోహాను.

ఆ తరువాత ఆయన తన్ను వెంబడించుటకు ఇతరులను పిలిచెను, ఫిలిప్పు, బర్తలోమయి (నతానియేలు), మరియు సుంకపు గుత్తదారుడైన మత్తయి (లేవి) ఇంకను మరి అయిదుగురు కూడా ఎన్నుకొనబడిరి.

వారిని జ్ఞాపకముంచుకొనుటలో మనకు సహాయపడుటకు జీసస్ లవ్స్‌మి" అను ఇంగ్లీషు రాగములో ఒక పాటను నేర్చుకొందము.

యేసువారిని ఒకని వెంబడి ఒకని పిలిచెను
పేతురు. ఆంద్రెయ, యాకోబు మరియు యోహాను
తరువాత వచ్చినది ఫిలిప్పు, తోమా కూడా
మత్తయి మరియు బర్తిలోమయి
చిన్నయాకోబు అని వారు పిలిచినవాడు
సీమోను తద్దయి కూడ
అతని చేత యేసు అప్పగింపబడిన
ఆఖరున అపోస్తలుడుగా చేయబడిన యూదా.

యేసు మరణించి తిరిగి లేచి మరియు తండ్రి యొద్దకు తిరిగి వెళ్ళిన తరువాత యేసును అప్పగించిన ఇస్కరియోతు యూదా బదులుగా మత్తీయ ఎన్నుకొనబడెను. తరువాత పౌలు అపోస్తలునిగా ఉండుటకు ఎన్నుకొనబడెను. క్రొత్త నిబంధనలోని పత్రికలలో ఎక్కువైన వాటిని అతడు వ్రాసెను.

**లూకా 10:32-42 మరియ, మార్త మరియు లాజరు.**

యేసు కొందరు మిక్కిలి సన్నిహితులైన స్నేహితులను కలిగియుండెను, ఇద్దరు సహోదరీలు మరియు వారి సహోదరుడు. ఒకప్పుడు ఆయన వారి ఇంట ఉండెను. మరియ యేసు బోధలను వినుచు ఆయన పాదముల యొద్ద కూర్చుండెను. ఆమె సహోదరి మార్త భోజనము సిద్ధపరచుచు విస్తారమైన పనిపెట్టుకొని యుండెను. పని అంతయు ఆమె ఒక్కతే చేయవలసి వచ్చుట చేత ఆమె వ్యాకుల పడెను. ఆమెకు సహాయపడవలెనని యేసు మరియతో చెప్పవలెనని ఆమె కోరెను. యేసు, "మార్తా, మార్తా, నీవనేకమైన పనులను గూర్చి విచారము కలిగి తొందరపడుచున్నావు గాని అవసరమైనది ఒక్కటే. మరియ ఉత్తమమైన దానిని ఏర్పరచుకొనెను, అది ఆమె యొద్దనుండి తీసివేయబడదు" అని చెప్పెను.

**: కంఠత వాక్యము:**

అవసరమైనది ఒక్కటే. మరియ ఉత్తమమైన దానిని ఏర్పరచుకొనెను. అది ఆమె యొద్ద నుండి తీసివేయబడదు.

**లూకా 10: 41-42**

## 5వ పాఠము – పరీక్ష

# యేసు యొక్క స్నేహితులు

1. యేసు యొక్క ప్రత్యేక సహాయకులు ............... అని పిలువబడిరి . ( )
   ఎ) ప్రతినిధులు
   బి) అపోస్తలులు
   సి) రబ్బీలు

2. యేసు ఏర్పరచుకొన్న మొదటి సహాయకుడు ................. . ( )
   ఎ) సీమోను పేతురు
   బి) బర్తలోమయి
   సి) అంద్రెయ

3. .................... సహోదరులు. ( )
   ఎ) ఫిలిప్పు మరియు బర్తలోమయి
   బి) మత్తయి మరియు యోహాను
   సి) పేతురు మరియు అంద్రెయ

4. .............. సుంకపు గుత్తదారుడు ( )
   ఎ) నతానియేలు
   బి) మత్తయి
   సి) యోహాను

5. యేసు .................... చేత అప్పగింపబడెను. ( )
   ఎ) తద్దయి
   బి) యాకోబు
   సి) యూదా

6. యేసు చనిపోయి తిరిగి లేచిన తరువాత ఎన్నుకోబడిన ఇద్దరు అపోస్తలులు ............. . ( )
   ఎ) మత్తీయ మరియు పౌలు
   బి) పేతురు మరియు యోహాను
   సి) మత్తయి మరియు బర్తలోమయి

7. ................ అను సహోదరీలు మరియు లాజరు యేసు యొక్క స్నేహితులు . ( )
   ఎ) దోర్కా మరియు మార్త
   బి) సలోమి మరియు మరియ
   సి) మరియ మరియు మార్త

8. .............. యేసు నుండి నేర్చుకొనుటకు ఆయన పాదముల యొద్ద కూర్చుండెను . ( )
   ఎ) దోర్కా
   బి) మరియ
   సి) మార్త

9. యేసు కొరకు భోజనము తయారుచేయుటకై ............. విస్తారమైన పని కలిగియుండెను. ( )
   ఎ) మరియ
   బి) మార్త
   సి) సలోమి

10. ఉత్తమమైన దానిని ఏర్పరచుకొనుట ........... అయి ఉన్నది. ( )
   ఎ) నీ ఆదివారపు బడి పాఠము చదువుట
   బి) నీ అభిమాన టెలివిజన్ కార్యక్రమము చూచుట
   సి) బేస్‌బాల్ ఆటకు వెళ్ళుట

## 6వ పాఠము

**ప్రియమైన తల్లిదండ్రులారా,**

బైబిలునందు ఈ వారపు పాఠము యేసు యొక్క శక్తిని గూర్చి నొక్కి చెప్పుచున్నది. ఇందులో యేసు యొక్క కొన్ని సూచక క్రియలపై మేము కేంద్రీకరించుచున్నాము. యేసు చేసిన ఎన్నో సూచక క్రియలు ఆయన నిజముగా దేవుని కుమారుడని నిరూపించుచున్నవి.

# యేసు యొక్క సూచక క్రియలు

**నీళ్ళు ద్రాక్షరసమగుట**

గలిలయలోని కానాను అను పట్టణములోని వివాహ విందులో యేసు మొదటి సూచక క్రియను చేసెను. వివాహ కార్యక్రమమునందు ద్రాక్షారసము అయిపోయినదని యేసు తల్లి మరియ యేసుతో చెప్పెను. నీళ్ళతో నీటి బానలను నింపుడని పరిచారకులతో యేసు చెప్పెను. మరియు వారు బానలలో ముంచగానే బానలలో ద్రాక్షారసముండెను. యేసు నీటిని ద్రాక్షారసముగా మార్చెను. **యోహాను 2:1-11**

**తుఫానును నిమ్మళము చేయుట**

ఒక తుఫాను అకస్మాత్తుగా వచ్చినప్పుడు యేసు మరియు ఆయన శిష్యులు సముద్రములో ఉండిరి. యేసు దోనెలో నిద్రించెను మరియు ఆయన స్నేహితులు భయపడిరి. వారు ఆయనను నిద్రలేపిరి. ఆయన లేచి తుఫానును ఆగుమనగా అది పూర్తిగా నిమ్మళమాయెను. గాలి వీచుట ఆగిపోయెను మరియు నీరు నిమ్మళమాయెను. ఆయన శిష్యులు ఆశ్చర్యపడిరి. "ఈయనకు గాలియు సముద్రమును లోబడుచున్నవని" చెప్పుకొనిరి. **మత్తయి 8:23-27**

**స్వస్థతలు**

ఒక అపాయకరమైన జ్వరముతో ఉన్న సీమోను పేతురు అత్తను యేసు స్వస్థపరిచెను. ఆమె లేచి ఆయనకు ఉపచారము చేసెను. **మత్తయి 8:14-15**

పుట్టు గ్రుడ్డియైన ఒక మనుష్యుడు యెరూషలేము నందు ఉండెను. యేసు గ్రుడ్డివాని కన్నుల మీద బురద ఉంచి, నీవు సిలోయము కోనేటికి వెళ్ళి అందులో కడుగుకొనుమని వానితో చెప్పెను. వాడు బురదను కడిగివేయగానే వాడు చూడగలిగెను. **యోహాను 9:1-41**

ఒకప్పుడు యెరూషలేము నందు బర్తిమయి అను ఒక గ్రుడ్డి బిక్షగాడు 'కరుణించుము, స్వస్థపరచుము' అని యేసును అడిగెను. అతని విశ్వాసము అతనిని స్వస్థపరచెనని యేసు వానితో చెప్పెను. వాడు తన చూపుకై దేవుని స్తుతించెను. **మార్కు 10:46-52**

కపెర్నహూమునందు ఒక పక్షవాయువు గలవాడుండెను. అతడు నడువలేడు. కాబట్టి అతని స్నేహితులు యేసును చూచుటకు అతనిని తీసికొని వచ్చిరి. అక్కడ గొప్ప జన సమూహము కూడి ఉండుట వలన వారు ఇంటిలోపల ఉన్న యేసును చేరలేకపోయిరి. వారు ఇంటి కప్పుకు రంధ్రము చేసి వారి స్నేహితుని, ఇంటి కప్పు రంధ్రము గుండా క్రిందికి దించిరి. వాని పాపములు క్షమింపబడినవని మరియు లేచి మంచమెత్తుకొని ఇంటికి వెళ్ళవలెనని యేసు వానితో చెప్పెను. మొదట కొంతమంది యేసు విషయమై అభ్యంతర పడిరి. కాని ఆ మనుష్యుడు లేచి, తిన్నగా మరియు నిటారుగా నిలబడగా వారు ఆశ్చర్యపడిరి. **లూకా 5:17-26**

పదిమంది కుష్ఠరోగులు వారికి సహాయము చేయుమని యేసును అడిగిరి. యేసు ఆ వ్యాధి విషయమై భయపడలేదు. మీరు వెళ్ళి మీ యాజకులకు మిమ్మును మీరు కనపరచుకొనుడని యేసు వారితో చెప్పెను. వారు వెళ్ళుచుండగా వారు పూర్తిగా శుద్ధులయ్యిరి. పదిమంది కుష్ఠరోగులలో ఒకడు మాత్రమే యేసునొద్దకు పరుగెత్తుకొని వచ్చి మోకరించి ఆయనకు కృతజ్ఞతలు చెప్పెను. **లూకా 17:11-19**

### : కంఠత వాక్యము :

అందుకాయన లేచి గాలిని గద్దించి, "నిశ్శబ్దమై ఊరకుండుమని" సముద్రముతో చెప్పగా, గాలి అణగి మిక్కిలి నిమ్మళమాయెను. **మార్కు 4:39**

## 6వ పాఠము - పరీక్ష

# యేసు యొక్క సూచక క్రియలు

1. కానా లోని పెండ్లి విందులో యేసు ........................... . ( )
ఎ) నీళ్ళను ద్రాక్షారసముగా మార్చెను
బి) వివాహ కార్యక్రమమును జరిపించెను
సి) అతిధులకు రొట్టెలు చేపలు ఇచ్చెను

2. యేసు తుఫానును ఆపిన విధము ...................... . ( )
ఎ) అతని చేతిని ఆడించుచు
బి) నీటి మీద నడచుచు
సి) ఆగుమని దానిని ఆజ్ఞాపించుట ద్వారా

3. ఆయన శిష్యులు ఇందుకు ఆశ్చర్యపడిరి ....................... . ( )
ఎ) తుఫాను సమయమందు యేసు నిద్రించుట
బి) గాలియు సముద్రమును ఆయనకు లోబడుట
సి) దోనె మునగనందున

4. యేసు పేతురు యొక్క .................... ను స్వస్థపరచెను . ( )
ఎ) భార్య
బి) సహోదరి
సి) అత్త

5. యేసు యెరూషలేమునందు గ్రుడ్డివానిని ............ చే స్వస్థపరచెను . ( )
ఎ) అతని కన్నులను ముట్టుట
బి) అతని కన్నుల మీద బురద వుంచుట
సి) అతని కన్నులకు కట్టు చుట్టుట

6. ఆయన గ్రుడ్డివానితో ................. నందు కడుగుకొనుమని చెప్పెను . ( )
ఎ) సిలోయమనే కోనేరు
బి) యొర్దాను నది
సి) గలిలయ సముద్రము

7. యేసు గ్రుడ్డి భిక్షగాడు బర్తిమయితో ............. అని చెప్పెను. ( )
ఎ) నదిలో ఏడుసార్లు కడుగుము
బి) అతని విశ్వాసము అతనిని బాగుచేసెను
సి) యాజకుని యొద్దకు వెళ్ళుము

8. కప్పెర్నహూమునందు పక్షవాయువు గలవానిని అతని స్నేహితులు ....... తరువాత యేసుచే స్వస్థతనొందెను. ( )
ఎ) ఇంటి కప్పు రంధ్రము ద్వారా అతనిని క్రిందికి దించిన
బి) సముద్ర తీరముననున్న యేసునొద్దకు తీసుకొచ్చుట
సి) అతని కొరకు ప్రార్థించిన

9. పదిమంది యేసునొద్దకు .................... నుండి శుద్ధులగుటకు వచ్చిరి . ( )
ఎ) గ్రుడ్డితనము
బి) కుంటితనము
సి) కుష్ఠువ్యాధి

10. మేము ఆశ్చర్యకార్యములను ఎందుకు నమ్ముదుమనగా ............. . ( )
ఎ) ఆశ్చర్యకార్యములను చేయుటకు సులువుగా వుంటాయి
బి) ఆయన జీవించుచున్నాడు మరియు సర్వశక్తిమంతుడు
సి) అవి నిజమని బోధకుడు మాకు చెప్పెను

## 7వ పాఠము

**ప్రియమైన తల్లిదండ్రులారా,**

ఈ వారము మన బైబిలు సమయములో యేసు తన పరిచర్య కాలములో చెప్పిన మూడు ఉపమానములను మేము ఉద్ఘాటించుచున్నాము. వారు బాగుగా ఎఱిగియున్న పరిస్థితులు మరియు వస్తువులను గూర్చిన కథలు వారికి చెప్పుట ద్వారా యేసు జనులకు బోధించెను. ఉపమానములు కొన్నిసార్లు "పరలోక సంబంధమైన అర్థములు కలిగిన భూసంబంధమైన కథలు" అని పిలువబడెను.

# యేసు యొక్క ఉపమానములు

**1. విత్తువాని ఉపమానము** **మత్తయి 13:1-23**

ఈ కథలో దేవుని వాక్యము విత్తువాడు (రైతు) వెదజల్లిన విత్తనము పోలి ఉన్నదని యేసు చెప్పెను. అది చాలా రకములైన నేలలపైన పడెను.

**త్రోవ ప్రక్కన** – పక్షులు వచ్చి వాటిని తినివేసెను. (వ్యక్తి సందేశమును వినును కాని దానిని గ్రహింపడు. దుష్టుడు దానిని ఎత్తుకొని పోవును)

**రాతినేల** – వెంటనే ఎండిపోయెను (వ్యక్తి వాక్యమును అంగీకరించును, కాని శ్రమ వచ్చినప్పుడు పడిపోవును)

**ముండ్ల పొదలు**– విత్తనమును అణచివేసెను (జీవితము మరియు ధనభోగములను గూర్చి చింత కలిగిన వ్యక్తి)

**మంచి నేల** – ఆరోగ్యవంతమైన మొక్కలుగా ఎదిగెను. (వాక్యమును విని, దానిని గ్రహించు వ్యక్తి) "మంచి నేల యధార్థవంతులైన జనులను పోలియున్నది. వారు దేవుని వాక్యమును వినినప్పుడు, వారు దానిని జ్ఞాపకముంచుకొందురు, మరియు దేవుడు చెప్పిన దానిని చేయుదురు"

**2. మంచి సమరయుడు** **లూకా 10:25-37**

ఇది నిత్య జీవము పొందుటకు అతడేమి చేయవలెనని ఒక మనుష్యుడు అడిగినప్పుడు యేసు చెప్పిన కథ.

"ధర్మశాస్త్రమునందేమి వ్రాయబడియున్నది" అని యేసు అడిగెను.

"నీ దేవుడైన ప్రభువును నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణ మనస్సుతోను, నీ పూర్ణ శక్తితోను, నీ పూర్ణ వివేకముతోను ప్రేమింపవలెను, నిన్ను వలె నీ పొరుగు వాని ప్రేమింపవలెను" అని అతడు సమాధానమిచ్చెను.

అప్పుడు "అవునుగాని నా పొరుగువాడెవడు" అని ఆ మనుష్యుడు తెలుసుకొనగోరెను.

యేసు అప్పుడు,యెరూషలేము నుండి యెరికో పట్టణమునకు వెళ్ళుచు దోచుకొనబడి, కొట్టబడి, కొనప్రాణముతో త్రోవ పక్క వదలిపెట్టబడిన మనుష్యుని గూర్చి చెప్పెను.

మొదట ఒక యాజకుడు ఆ త్రోవను వచ్చెను. అతడు గాయపడినవానిని చూచెను, అతడు అవతలి ప్రక్కగా పోయెను.

తరువాత లేవీయుడొకడు వచ్చెను. అతడు కూడా ఆ నైరాశ్యపు మనుష్యుని చూచెను మరియు అతడు త్రోవకు అవతలి ప్రక్కగా పోయెను.

అప్పుడొక సమరయుడు అటు వచ్చెను. అతడు గాయపడిన వాని యెడల చింతచూపెను మరియు అప్పుడు అతనిని తన గాడిదపై ఎక్కించి ఒక పూట కూళ్ళ వాని ఇంట ఉంచుటకు అతనిని తీసికొని పోయెను. సమరయుడు సమస్తము కొరకు ధనము చెల్లించెను.

యేసు ఉపమానమును ముగించినప్పుడు "ముగ్గురిలో ఎవడు పొరుగువాడు?" అని ఆయన అడిగెను.

"అతని మీద జాలిపడినవాడే" అని ఆ మనుష్యుడు సమాధానమిచ్చెను. నీవును పోయి ఆలాగు చేయుము అని యేసు అతనితో చెప్పెను.

**3. తప్పిపోయిన కుమారుడు:** **లూకా 15:11-31**

యేసు తప్పిపోయిన కుమారుని కథను చెప్పెను.

ఒక ధనవంతునికి అతడు ఎంతగానో ప్రేమించిన ఇద్దరు కుమారులుండిరి. చిన్న కుమారుడు తన ఆస్థిని యిమ్మని అడిగెను మరియు ఇల్లు వదలిపోయెను. పెద్దకుమారుడు ఇంటి వద్ద ఉండి తన తండ్రికి సహాయము చేసెను. ఎక్కువ కాలము కాకముందే చిన్న కుమారుడు తన ధనమంతయు ఖర్చు చేసెను మరియు అతడు ఇక యేమాత్రము ధనవంతుడుగా ఉండనందున అతని స్నేహితులు అతనిని విడిచిపోయిరి.

అప్పుడు ఆ దేశమందు కరువు వచ్చెను. చిన్న కుమారుడు ఒంటరి అయ్యెను మరియు పందులను కాయు పని కూడ చేసెను.

ఆఖరిగా తన తండ్రి ఇంట కూలివారు తనకంటే మంచిగా ఉండిరని అతడు తెలిసికొనెను. కాబట్టి అతడు తిరిగి ఇంటికి దూరప్రయాణమున బయలుదేరెను. అతని తండ్రి అతనిని క్షమించి అతనిని ఇంటిలోనికి ఆహ్వానించెను. వారు గొప్ప విందు మరియు ఉత్సవము జరుపుకొనిరి. తండ్రి అతనికి ఒక వస్త్రము, ఒక ఉంగరము మరియు చెప్పులు ఇచ్చెను. అన్న కోపము తెచ్చుకొనెను కాని అతని తండ్రి అతనితో అతని సహోదరుని క్షమించి, అతడు ఇంటికి వచ్చినందుకు సంతోషించవలెనని చెప్పెను.

ఈ తండ్రి తన కుమారుని ప్రేమించిన విధముగా దేవుడు మనలను ప్రేమించును.

## : కంఠత వాక్యము :

మనము సంతోషపడి ఆనందించుట యుక్తమే, ఈ నీ తమ్ముడు చనిపోయి తిరిగి బ్రదికెను, తప్పిపోయి దొరికెను.

**లూకా 15:32**

## 7వ పాఠము – పరీక్ష

# యేసు యొక్క ఉపమానములు

1. విత్తువాని ఉపమానమునందు యేసు రాతినేలను .................. వానితో పోల్చెను. ( )
   ఎ) వాక్యమును అంగీకరించి శ్రమలు రాగానే పడిపోయిన
   బి) సంతోషముతో వాక్యమును అంగీకరించిన
   సి) మంచి పంట ఫలించిన
2. జీవితము మరియు ధనమును గూర్చిన చింత గల వ్యక్తిని ............ తో పోల్చెను . ( )
   ఎ) త్రోవ ప్రక్కన పడిన విత్తనము
   బి) ముళ్ళ పొదలు
   సి) మంచి నేల
3. మంచి పంటనిచ్చిన విత్తనము ............. నేలను పడెను . ( )
   ఎ) మంచి
   బి) రాతి
   సి) ముళ్ళపొద
4. నిత్య జీవము పొందుటకు అతడేమి చేయవలెనని అడుగగా అతడు ........... అని యేసు చెప్పెను. ( )
   ఎ) ధనాగారమందు ధనముంచవలెను
   బి) యెరూషలేమునకు వెళ్ళవలెను
   సి) దేవునిని మరియు ఇతరులను ప్రేమించవలెను
5. గాయమొందిన వాడు ......................... చేత సహాయము పొందిన కథను యేసు చెప్పెను. ( )
   ఎ) యాజకుని
   బి) లేవీయుని
   సి) సమరయుని
6. ఒక మంచి పొరుగువాడు ........................... . ( )
   ఎ) అవసరతలో ఉన్నవారికి సహాయము చేయును
   బి) అవసరతలో ఉన్న వ్యక్తిని కేవలము చూచును
   సి) ఇతరులను పట్టించుకొనడు
7. దుబారా చేయు కుమారుని ఉపమానము నందు .................. ఇల్లు విడిచిపోయెను. ( )
   ఎ) పెద్ద కుమారుడు
   బి) చిన్న కుమారుడు
   సి) ఇద్దరు కుమారులు
8. బాలుని వద్ద ధనము అయిపోయినప్పుడు మరియు అతడు ఆకలిగొనినప్పుడు .............. . ( )
   ఎ) ద్రాక్షతోటలో పనిచేయు ఉద్యోగము పొందెను
   బి) ఒక స్టోరునందు పని చేసెను
   సి) ఒకని పందులను కాచెను
9. కుమారుడు ఇంటికి వచ్చినప్పుడు అతని సోదరుడు .................... . ( )
   ఎ) కోపపడి అతనిని ఆహ్వానించలేదు
   బి) చేతులు చాచి అతనిని ఆహ్వానించలేదు
   సి) అతని సోదరుడు వెళ్ళిపోవునట్లు చేయవలెనని తండ్రికి చెప్పెను
10. ....................... దేవుడు మనలను కోరును. ( )
    ఎ) విరోధ భావము పెట్టుకొనవలెనని
    బి) మనకు కీడు చేసినవారిని క్షమించవలెనని
    సి) ప్రజలు మారుమనస్సు పొందినప్పుడు సంతోషించరాదని

## 8వ పాఠము

**ప్రియమైన తల్లిదండ్రులారా,**

ఈ వారము పాఠము చిన్న పిల్లల వలె తెరచిన హృదయము మరియు స్వీకరించు మనస్సు కలిగియుండుట యొక్క ప్రాముఖ్యతను తెలియజేయును. దేవుని రాజ్యము ఒక వరమువలె పొందుకొనవలెను. అది మానవ ప్రయత్నము ద్వారా సాధించబడదు. వారు అసహాయులని ఎట్టి అధికారము లేక యోగ్యత లేనివారని తెలుసుకున్నవారు మాత్రమే దానిలో ప్రవేశింతురు.

వారిని గూర్చి యేసు ఒక పాఠము తెలిపెను కావున ఇది మన యౌవనులకు యేసు జీవితములో ఒక యిష్టమైన సంఘటన.

# యేసు యొక్క బోధలు

జన సమూహములు యేసు బోధ వినుటకు ఆయన యొద్దకు వచ్చిరి. కొన్నిసార్లు ఆయన సూచక క్రియలు చేసెను మరియు ఆయన దేవుని యొద్ద నుండి వచ్చెనని వారు తెలుసుకొనిరి. ఆయన వారికి అనేక సంగతులు బోధించెను.

**యేసు బోధలు** **మత్తయి 5,6 మరియు 7**

ఒకసారి ఆయన గలిలయ సముద్రమునకు దగ్గరగా ఉన్న కొండమీద బోధించెను. వారెట్లు ఆనందముగా ఉందురో మరియు దేవునికి ప్రీతికరముగా ఉండుటకు వారెట్లు జీవించవలెనో యేసు ప్రజలకు చెప్పెను.

“సమాధానపరచువారిగా ఉండుడి, మీరు దేవుని పిల్లలని పిలువబడుదరని” ఆయన వారితో చెప్పెను.

వారి శత్రువులను ప్రేమింపవలెను, వారిని ద్వేషించువారికి మేలు చేయవలెను, వారిని బాధించువారి కొరకు వారు ప్రార్థన చేయవలెను అని ఆయన వారికి చెప్పెను.

ఉప్పువలె ఉండుడి, కొండమీద పట్టణమువలె ఉండుడి మరియు ఇతరుల త్రోవకు వెలుగిచ్చు వెలుగువలె ఉండుడని యేసు వారికి చెప్పెను. ఆయనను వెంబడించువారు ఇతరులపై ఒక మంచి ప్రభావముగా ఉండవలెను మరియు ఇతర ప్రజలు సరియైన క్రియలు చేయునట్లు ప్రయత్నించవలెను.

వారి యెడల ఉన్న ప్రేమను బట్టి ప్రజలు ఒకరితో ఒకరు పంచుకొనవలెనని ఆయన కోరెను.

“ఇతరులకు తీర్పు తీర్చకుడి, దేని గూర్చియైనను చింతింపకుడి. దేవుడు మీ కొరకు చింతించును” అని ఆయన వారితో చెప్పెను.

**పిల్లల ప్రాముఖ్యత** **మార్కు 10:13-16**

యేసు పిల్లలను ప్రేమించెను. ఆయన అలసిపోయినను తన ప్రక్కన పిల్లలుండుటను ఆయన ప్రేమించెను.

ఒకరోజు తల్లుల సమూహము ఒకటి ఆయన చేత ఆశీర్వదింపబడుటకు తమ పిల్లలను యేసునొద్దకు తీసికొని వచ్చిరి. పిల్లలను పట్టించుకొనుటకు వీలులేనంతగా యేసు పని వత్తిడిలో ఉన్నాడని ఆయన శిష్యులు పిల్లలను పంపివేయుచుండిరి. యేసు వారిని ఆపి, “చిన్న పిల్లలను నాయొద్దకు రానియ్యుడి, వారిని ఆటంకపరచవద్దు, దేవుని రాజ్యము ఈలాటి వారిదని” చెప్పెను. మరియు ఆయన తన చేతులు వారిపైన ఉంచి వారిని ఆశీర్వదించెను.

### : కంఠత వాక్యము :

చిన్న పిల్లలను నా యొద్దకు రానియ్యుడి, వారి నాటంకపరచవద్దు. దేవుని రాజ్యము ఈలాటి వారిదే.

**మార్కు 10:14**

## 8వ పాఠము – పరీక్ష

# యేసు యొక్క బోధలు

1. యేసు గలిలయ సముద్రము దగ్గర ............. ప్రజలకు బోధించెను. ( )
   - ఎ) చేపలు పట్టు గ్రామములో
   - బి) ఒక కొండమీద
   - సి) ఒక పెద్ద పట్టణములో
2. ............. దేవుని పిల్లలుగా పిలువబడుదరని ఆయన చెప్పెను. ( )
   - ఎ) ధనవంతులు
   - బి) మతస్థులు
   - సి) సమాధాన పరచువారు
3. యేసు వారి శత్రువులను .................. అని ప్రజలకు చెప్పెను . ( )
   - ఎ) శపించుడి
   - బి) ప్రేమించుడి
   - సి) పగతీర్చుకొనుడి
4. దేవుని బిడ్డను ఆయన ................... ఉన్న ఒక పట్టణముతో పోల్చెను. ( )
   - ఎ) ఒక కొండమీద
   - బి) ఒక లోయలో
   - సి) సముద్రము ప్రక్కన
5. యేసును వెంబడించువారు ప్రయత్నించవలసినది ............. . ( )
   - ఎ) ఇతరులు మంచి చేయునట్లు చూచుట
   - బి) ప్రజలు నేరము చేయునట్లు ప్రభావింపచేయుట
   - సి) ఇతరులకు సహాయము చేయకుండుట
6. ఆయన ప్రజలకు చెప్పినది ................... . ( )
   - ఎ) భవిష్యత్తును గూర్చి వ్యాకుల పడుడి మరియు చింతించుడి
   - బి) చింతింపక దేవునిపై ఆధారపడుడి
   - సి) భవిష్యత్తులో చింతింపకుండునట్లు ఎక్కువ ధనము పొదుపు చేయుడి
7. తల్లులు తమ పిల్లలను యేసునొద్దకు ............... తీసికొని వచ్చిరి . ( )
   - ఎ) ఎట్లు చదువవలెనో వారికి బోధించుటకు
   - బి) ఆయన నుండి కొంత ధనమును పొందుటకు
   - సి) ఆయన చేత ఆశీర్వదింపబడుటకు
8. పిల్లలు వచ్చినప్పుడు ఆయన శిష్యులు .................. కోరిరి. ( )
   - ఎ) వారికి కొంత ఆహారము ఇవ్వవలెనని
   - బి) వారిని పంపివేయవలెనని
   - సి) వారికి కొన్ని పుస్తకములు ఇవ్వవలెనని
9. యేసు చెప్పెను "..................................." . ( )
   - ఎ) చిన్న పిల్లలను నా యొద్దకు రానియ్యుడి
   - బి) పిల్లలు నాకు ఒక తలనొప్పి
   - సి) యాబై మంది పిల్లలను రానియ్యుడి కాని అంతకంటె ఎక్కువ మంది వద్దు
10. ........................ మనము దేవునిపై ఆధారపడవలెను . ( )
    - ఎ) పౌరులు ప్రభుత్వముపై ఆధారపడునట్లు
    - బి) తల్లిదండ్రులు తమ పిల్లలపై ఆధారపడునట్లు
    - సి) పిల్లలు తమ తల్లిదండ్రులపై ఆధారపడునట్లు

## 9వ పాఠము

# నీకొదేము

**యోహాను 3:1-21**

నీకొదేము పరిసయ్యులు అని పిలువబడు ఒక గుంపులోని యూదులకు ఒక అధికారి. అతడు యేసు చేసిన సూచక క్రియలను చూచెను మరియు ఆయన బోధను వినెను. యేసు దేవుని యొద్ద నుండి పంపబడిన ఒక సత్యమైన బోధకుడని అతడు విశ్వసించెను. అతడు వెళ్ళి ఆయనతో మాట్లాడవలెననుకొనెను కాని అతడు వెళ్ళుటకు రాత్రి సమయము వరకు వేచియుండెను.

అతడు రాత్రియందు ఎందుకు వెళ్లెనో బైబిలు చెప్పలేదు కాని యూదుల నాయకులు యేసుపై కోపముగా ఉన్నారని, ఆయనను నాశనము చేయుటకు ఒక మార్గము కొరకు చూచుచున్నారని మనము ఎరుగుదుము. కాబట్టి నీకొదేము పగటివేళ బహిరంగముగా ఆయన యొద్దకు వెళ్ళుటకు భయపడియుండవచ్చును.

దేవుడు యేసుకు తోడైయున్నాడని లేనియెడల ఆయన చేయుచున్న అద్భుత కార్యములన్నియు ఆయన చేయజాలడని అతడు యేసుతో చెప్పెను. అప్పుడు యేసు అతనికి బోధించుట మొదలుపెట్టెను. ఒకడు దేవుని రాజ్యమును చూడగోరిన యెడల, అతడు తప్పక తిరిగి జన్మించవలెనని ఆయన నికొదేముతో చెప్పెను. తిరిగి జన్మించుట! నీకొదేము తాను తిరిగి ఒక శిశువగుటను కేవలము ఊహించుకొనగలిగెను. ఇది ఎట్లు సాధ్యమగును? పెద్దవాడైన మనుష్యుడు తిరిగి జన్మించుట అన్నది ఒక అసాధ్యమైన విషయమువలె కనిపించెను.

అయితే యేసు భౌతిక జన్మను గూర్చి మాట్లాడుటలేదు. ఆయన ఒక ఆత్మీయ జన్మము గూర్చి మాట్లాడుచుండెను. ఒకడు నీటిమూలముగాను ఆత్మమూలముగాను జన్మించవలెనని ఆయన చెప్పెను. వీచుచున్న గాలిని నీవు చూడనట్లే క్రొత్త జన్మను నీవు చూడలేవు. ఒకడు ముందున్నట్లే కనబడవచ్చును కాని అతడు లేక ఆమె అంతరంగమునందు మార్పుచెందిన వ్యక్తి.

సర్పములు అరణ్యములో ఇశ్రాయేలు సంతానమును చంపుచున్నప్పుడు దేవుడు మోషేతో ఇత్తడి సర్పమును చేసి ఒక స్థంబముపైకి ఎత్తుమని చెప్పెనని నీవు జ్ఞాపకము చేసికొందువు. స్థంబముపైకి ఎత్తిన ఆ సర్పము వైపు చూచిన ప్రతి ఒక్కరు దేవుని చేత స్వస్థపరచబడిరి. ఆయన కూడా పైకి ఎత్తబడవలెను మరియు ఆయనయందు విశ్వాసముంచువాడు నశింపడు కాని నిత్యజీవము పొందును అని యేసు చెప్పెను.

అప్పుడు యేసు నీకొదేముతో చక్కని మాటలు చెప్పెను. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవాని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను". యేసు లోకప్రజలను రక్షించుటకు వచ్చెను, వారిని శిక్షించుటకు కాదు.

యేసు మరణము తరువాత నీకొదేమును గూర్చి మనము ఇంకను చదువుదుము. అరిమతయివాడైన యోసేపు ఒక ధనవంతుడు మరియు యూదుల సభలో ఒక సభ్యుడు. ఇతడు మంచివాడు, న్యాయవంతుడు మరియు క్రీస్తు యొక్క శిష్యుడు. అతడు దేవుని రాజ్యము కొరకు ఎదురుచూచుచుండెను. మరియు వాగ్దానము చేయబడినవాడు యేసే అని అతడు విశ్వసించెను.

అతడు ధైర్యము తెచ్చుకొనెను కాని రహస్యముగా వచ్చి, అతడు ఆయనను సమాధి చేయునట్లు యేసు దేహమును యిమ్మని పిలాతును అడిగెను. అతనితోపాటు వచ్చిన మనుష్యుడు నీకొదేము.

సమాధి కొరకు సిద్ధపరచుటలో చనిపోయిన వ్యక్తి దేహముపై సుగంధ ద్రవ్యములు పూయుట యూదుల ఆచారము. వారు సుమారు వంద పౌండ్ల బోళము మరియు సాంబ్రాణిల మిశ్రమమైన సుగంధ ద్రవ్యములు తెచ్చిరి మరియు యేసు దేహమును సిద్ధపరచిరి. వారు యేసు దేహమును నారబట్టతో చుట్టిరి.

యేసు సిలువ వేయబడిన స్థలమునకు దగ్గరలో ఒక తోట ఉండెను మరియు అక్కడ యోసేపుకు ఎవడును అంతకు ముందెన్నడును దానిని ఉపయోగింపని ఒక క్రొత్త సమాధి ఉండెను. సమాధి స్థలము పెద్ద బండలో తొలిపించబడెను. వారు దేహమును అక్కడ ఉంచి, ఆ సమాధి యొక్క ద్వారమునకు ఎదురుగా పెద్దరాయి పొర్లించి వెళ్ళిపోయిరి. అయితే మగ్దలేనే మరియయు, వేరొక మరియయు అక్కడనే సమాధికి ఎదురుగా కూర్చొనిరి.

**: కంఠత వాక్యము :**

దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవాని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్య జీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను. **యోహాను 3:16**

## 9వ పాఠము – పరీక్ష

# యేసు మరియు నీకొదేము

1. నీకొదేము యూదుల అధికారియైన ఒక .................... . ( )
   ఎ) సద్దూకయ్యుడు
   బి) పరిసయ్యుడు
   సి) శాస్త్రి
2. యేసు .......................... అని అతడు నమ్మెను . ( )
   ఎ) మోసగాడు
   బి) యూదుడు కాదు
   సి) దేవుని యొద్ద నుండి పంపబడెను
3. యేసును చూచుటకు నీకొదేము ..................... వచ్చెను . ( )
   ఎ) రాత్రియందు
   బి) ఉదయమున
   సి) మధ్యాహ్నమందు
4. యేసు అతనితో .................... అని చెప్పెను . ( )
   ఎ) మనుష్యులందరు ఒకసారి మాత్రమే పుట్టెదరు
   బి) అతడు నిశ్చయముగా తిరిగి జన్మించవలెను
   సి) అతడు నిశ్చయముగా మరణించును
5. యేసు అతనితో చెప్పినది అతనికి ................. గా తోచెను . ( )
   ఎ) అసాధ్యము
   బి) తర్క సమ్మతము
   సి) సంభావ్యము
6. యేసు ఒక .................... జన్మము గూర్చి మాట్లాడుచుండెను . ( )
   ఎ) అకస్మాత్
   బి) భౌతిక
   సి) ఆత్మీయ
7. మోషే అరణ్యములో సర్పమును పైకి ఎత్తిన విధముగా యేసు ............. . ( )
   ఎ) నమ్మినవారి రక్షణ కొరకు ఎత్తబడవలెను
   బి) అరణ్యమునందు ఒక సర్పమును పైకెత్తును
   సి) యెరూషలేము నుండి సర్పములన్నిటినీ తరిమివేయును
8. దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను కాగా ఆయన ............. . ( )
   ఎ) సూర్యుని సృష్టించెను
   బి) తన అద్వితీయ కుమారుని యిచ్చెను
   సి) యేసును పరలోకములో ఉంచెను
9. యేసు మరణము తరువాత నీకొదేము . ( )
   ఎ) యేసు దేహమును సిద్ధపరచుటకు అరిమతయి వాడైన యోసేపుతో వెళ్ళెను
   బి) శిష్యులు పారిపోయినప్పుడు అతడు పారిపోయెను
   సి) యేసును పాతిపెట్టుటకు అతని స్వంత సమాధిని ఉపయోగించెను
10. పిల్లలకు వారి ప్రశ్నలకు జవాబులు అవసరమైనప్పుడు వారు ........... . ( )
   ఎ) వారి స్నేహితుల యొద్దకు వెళ్ళవలెను
   బి) జవాబు తెలుసుకొనుటకు వారంతట వారే ప్రయత్నించవలెను
   సి) సలహా కొరకు వారి తల్లిదండ్రుల యొద్దకు వెళ్ళవలెను

## 10వ పాఠము

# బేతస్థ కోనేరు యొద్ద స్వస్థత

**యోహాను 5:1-18**

యేసు యూదుల పండుగను ఆచరించుటకు యెరూషలేమునకు వెళ్ళెను. ఆయన గొఱ్ఱెల ద్వారము దగ్గర ఉన్న కోనేటి యొద్ద ఉండెను. ఆ కోనేరుకు హెబ్రీ బాషలో బేతస్థ అను పేరుండెను మరియు ఆ కోనేరు చుట్టును అయిదు మంటపములు కలవు.

కొన్ని సమయములలో ఒక దేవదూత దిగివచ్చి నీటిని కదిలించును అని కొన్ని రచనలు చెప్పెను. అప్పుడు నీళ్ళు కదిలించబడిన తరువాత కోనేటి లోనికి దిగిన మొదటి వ్యక్తి ఏ వ్యాధియైనను లేక ఏ దౌర్బల్యమైనను కలిగియున్న యెడల అతడు స్వస్థత నొందును.

కావున నీళ్ళు కదిలించబడుట కొరకు కోనేటి దగ్గర జనులు వేచియుందురు. గ్రుడ్డివారు కొందరు, కుంటివారు కొందరు మరియు పక్షవాయువు గలవారు కొందరు, కదలలేక యుండిరి. కోనేటి యొద్ద ఆరోజు ఉన్నవారిలో ఒకడు ముప్పయి ఎనిమిది సంవత్సరముల నుండి నడువలేక యుండెను. యేసు అతనిని అక్కడ చూచి అతని స్థితిని ఎరిగెను.

బాగుపడగోరుచున్నావా అని ఆయన అతనిని అడిగెను. అయితే ఆ మనుష్యుడు బాగుపడగోరెను కాని అతనిని కోనేటిలోనికి దించుటకు సహాయము చేయుటకు వాని కెవడును లేడని అతడు చెప్పెను. నీళ్ళు కదిలించబడినప్పుడు అతడు అక్కడకు చేరుటకు ముందుగానే మరియొకడు కోనేటి లోనికి దిగును.

లేచి అతడు పరుండియున్న పరుపును ఎత్తికొని నడువుమని యేసు వానితో చెప్పెను. వెంటనే ఆ మనుష్యుడు బాగుచేయబడెను మరియు యేసు అతనికి ఆజ్ఞాపించినట్లు చేసెను. అతడు తన పరుపెత్తుకొని నడిచెను. కృతజ్ఞతలు చెప్పుటకు అతనికి అవకాశము దొరకుటకు ముందే యేసు జనసమూహము లోనికి నడచిపోయెను.

ఆ మనుష్యుడు ముప్పై ఎనిమిది సంవత్సరములు కుంటివాడుగా ఉండిన తరువాత నడువ గలిగినందుకు ప్రతి ఒక్కడు సంతోషించునని నీవనుకొందువు. అయితే అక్కడ జరిగిన దానిని చూచిన యూదుల అధికారులు కొందరు ఉండిరి మరియు వారు ఆలోచించగలిగిన ఒకే ఒక వాస్తవమేమనగా అతడు తన పరుపును మోసికొనిపోవుచుండెను మరియు విశ్రాంతి దినమున నీవు ఏపనియైనను చేయకూడదని యూదుల ధర్మశాస్త్రము చెప్పెను. వారు ఆ మనుష్యుని గూర్చి ఏమాత్రము పట్టించుకొనలేదు.

"ఇది విశ్రాంతి దినము గదా. నీవు నీ పరుపెత్తుకొనతగదే" అని వారు చెప్పిరి. అతనిని స్వస్థపరచినవాడు అతనిని పరుపెత్తుకొనుమని అతనితో చెప్పెనని అతడు వారితో చెప్పెను.

అతనిని స్వస్థపరచినవాడెవడు అని అధికారులు వానిని అడిగిరి. కాని అతనికి తెలియదు ఏలయనగా అతడు ఆయనతో మాట్లాడకముందే యేసు జనసమూహము లోనికి పోయెను.

అటు తరువాత యేసు దేవాలయములో అతనిని చూచి ఇప్పుడు నీవు స్వస్థతనొందితివి, మరి ఎక్కువ కీడు నీకు కలుగకుండునట్లు ఇకను పాపము చేయకుమని అతనితో చెప్పెను.

ఆ మనుష్యుడు యూదుల నాయకుల యొద్దకు వెళ్ళి, తన్ను స్వస్థపరచినవాడు యేసు అని చెప్పెను. ఆయన దీనిని విశ్రాంతి దినమున చేసినందుకు ఆయనను ఎప్పటికైనను చంపవలెనని నాయకులు మరి ఎక్కువగా నిశ్చయించుకొనిరి.

" నా తండ్రి యిదివరకు పనిచేయుచున్నాడు, నేనును చేయుచున్నానని" యేసు వారికి ఉత్తరమిచ్చెను. ఇది నిజముగా నాయకులను కలవరపరచెను. ఎందుకనగా ఆయన విశ్రాంతి దినమున స్వస్థపరచుటయే కాక దేవుడు తన తండ్రి అని చెప్పి, తన్ను దేవునితో సమానునిగా చేసుకొనుచున్నాడని వారు చెప్పిరి.

**: కంఠత వాక్యము :**

విశ్రాంతి దినము మనుష్యుల కొరకే నియమింపబడెను గాని మనుష్యులు విశ్రాంతి దినము కొరకు నియమింపబడలేదు. అందువలన మనుష్య కుమారుడు విశ్రాంతి దినమునకు ప్రభువై యున్నాడు. **మార్కు 2:27-28**

## 10వ పాఠము – పరీక్ష

# బేతస్థ కోనేరు యొద్ద స్వస్థత

1. కోనేరు చుట్టూ అయిదు ...................... కలవు . ( )
   ఎ) మంటపములు
   బి) స్తంభములు
   సి) ద్వారములు
2. నీరు కదిలించబడిన తరువాత, నీటిలోనికి దిగిన మొదటి వ్యక్తి ............. . ( )
   ఎ) స్నానము చేయవలసి వచ్చెను
   బి) కొంత ధనము యివ్వబడెను
   సి) వ్యాధి నుండి స్వస్థత పొందెను
3. ముప్పై ఎనిమిది సంవత్సరముల నుండి ........... ఒక మనుష్యుడు కోనేటి యొద్ద ఉండెను . ( )
   ఎ) గ్రుడ్డివాడైన
   బి) కుంటివాడైన
   సి) చెవిటివాడైన
4. ఆ మనుష్యుడు కోనేటి లోనికి దిగలేకపోయెను, ఎందుకనగా ............. . ( )
   ఎ) అతడు తన దారిని కనుగొనలేకపోయెను
   బి) కోనేటిలోనికి దింపుటకు వానికెవడును లేడు
   సి) ఏ దారిని వెళ్ళవలెనో తెలియదు
5. యేసు అతనితో ................... చెప్పెను ( )
   ఎ) అతని పరుపెత్తుకొని నడువుమని
   బి) వానికి కొంత ధనమిమ్మని
   సి) అతనిని కోనేటిలోనికి దింపుటలో సహాయము చేయుటకు ఎవనినైన కనుగొనుమని
6. కొంతమంది యూదుల నాయకులు కలతచెందిరి, ఎందుకనగా ఆ మనుష్యుడు ....... . ( )
   ఎ) విశ్రాంతి దినమున నడుచుచుండెను
   బి) బిగ్గరగా అరచుచుండెను
   సి) విశ్రాంతి దినమున పరుపు ఎత్తికొని పోవుచుండెను
7. అతనిని స్వస్థపరచినదెవరని అడిగినప్పుడు ఆ మనుష్యుడు ....... అని చెప్పెను . ( )
   ఎ) ఆయన యేసు
   బి) నన్ను స్వస్థపరచినదెవరో నాకు తెలియదు
   సి) నేను నీకు చెప్పను
8. తరువాత యేసు అతనిని చూచినప్పుడు ఆ మనుష్యుడితో ...... అని చెప్పెను . ( )
   ఎ) పాపము చేయుట మానుము
   బి) వెళ్ళి యాజకునికి నిన్ను కనపరచుకొనుము
   సి) అధికారులతో మాటలాడుము
9. యూదుల నాయకులు కలతచెందిరి. ఎందుకనగా యేసు విశ్రాంతిదినమున స్వస్థపరచెను మరియు ............ . ( )
   ఎ) వారి నుండి దాగుకొనుచుండెను
   బి) దేవుని తన తండ్రియని పిలిచెను
   సి) విశ్రాంతి దినమున స్వస్థపరచుటయందు నమ్మకముంచలేదు
10. మనము రోగులైనప్పుడు, వైద్యులు మనకు సహాయపడుదురు. కాని మనము కూడా ............... అవసరమున్నది . ( )
    ఎ) వారు యిచ్చిన మందులను విసిరివేయవలసిన
    బి) ఒక మంత్రవైద్యుని చూడవలసిన
    సి) స్వస్థత కొరకు దేవుని ప్రార్థించవలసిన

## 11వ పాఠము

# ధన్యతలు

## మత్తయి 5:1-12

ప్రజల యేసును చూచుటకు వచ్చిరి. ఆయన కొండ పైకి ఎక్కివెళ్లెను మరియు తన శిష్యులను తన యొద్దకు పిలిచెను. ఆయన బోధించుట ప్రారంభించి యిట్లు చెప్పెను.

**"ఆత్మ విషయమై దీనులైన వారు ధన్యులు; పరలోకరాజ్యము వారిది"**

వీరు వినయము కలిగినట్టి ప్రజలు మరియు వారు తమ్మును గూర్చి తలంచుకొనవలసిన దాని కంటె హెచ్చుగా తలంచరు. ఒక చిన్న బిడ్డవలె తన్ను తగ్గించుకొనువాడు పరలోక రాజ్యములో మిక్కిలి గొప్పవాడగునని యేసు ఒకసారి చెప్పెను. ఒక మనుష్యుని గర్వము వానిని తగ్గించును, వినయ మనస్కుడు ఘనతనొందును" అని సామెతలు గ్రంథము నందు మనము చదువుదుము.

**"దుఃఖపడువారు ధన్యులు; వారు ఓదార్చబడుదురు"**

మనకు దుఃఖమును తెచ్చు అనేక సంగతులు జీవితములో మనకు సంభవించును, కాని మనము దేవుని వైపు తిరిగిన యెడల ఆయన మనకు ఆదరణ కలుగజేయును. అవిధేయత కారణముగా దేవుని దుఃఖపరచు సంగతులను అతడు / ఆమె చేసినప్పుడు ఆ వ్యక్తి కూడ దుఃఖించవలెను లేక విచారించవలెను.

**"సాత్వికులు ధన్యులు; వారు భూలోకమును స్వతంత్రించుకొందురు"**

సాత్వికము కూడ వినయమును గూర్చినదే. మోషే ఒక సాత్వికుడైన వ్యక్తియని వర్ణింపబడెను. అతడు యేమి సాధించినను అతని స్వంత శక్తి చేత కాదు కాని దేవుడు అతనికి యిచ్చిన శక్తి ద్వారానేయని అతడు ఎఱిగియుండెను.

**"నీతికొరకు ఆకలిదప్పులు గలవారు ధన్యులు; వారు తృప్తిపరచబడుదురు"**

ఆకలిగొనిన ఒక పసిబిడ్డ పాల కొరకు యేడ్చును. మనమేమి చేయవలెనని దేవుడు కోరుచున్నాడో దానిని నేర్చుకొనుటకు మనము కూడ ఆకలి కలిగి ఉండవలెను. దేవునిని సంతోషపరచు విషయములను గూర్చి బైబిలు మనకు తెలియజేయును మరియు అక్కడనే మనము మన ఆత్మీయ "ఆహారము"ను పొందుదుము.

**"కనికరము గలవారు ధన్యులు; వారు కనికరము పొందుదురు"**

కనికరము కలిగిన వ్యక్తి దయ మరియు క్షమాపణ గుణము కలిగియుండును. ఈ వ్యక్తి ఇతరుల యెడల ద్వేషము కలిగియుండడు కాని ప్రజలలోని మంచి గుణముల కొరకు చూచుచుండును.

**"హృదయశుద్ధి గల వారు ధన్యులు; వారు దేవుని చూచెదరు"**

మనము మన మనస్సులను మంచి తలంపులతో నింపుకొనిన యెడల మనము హృదయశుద్ధి కలిగియుండగలము. మనము లోకము యొక్క చెడు సంగతులను వినిన యెడల మన హృదయములు మరియు మనస్సులు చెడిపోవును మరియ మురికగును మనము చూచు, చదువు మరియు విను సంగతులను గూర్చి మనము జాగ్రత్తగా ఉండవలెను.

**"సమాధానపరచువారు ధన్యులు; వారు దేవుని కుమారులనబడుదురు"**

సర్దుకొనిపొమ్మని మరియు స్నేహితులుగా ఉండుమని నీవు ప్రజలను ప్రోత్సహించుచున్నావా? అట్లయిన నీవు సమాధానపరచువాడవు. సమాధానము సంబంధించి నీవు సమస్యలో భాగము కావచ్చును, లేక పరిష్కారములో భాగము కావచ్చును. సమాధానపరచువానిగా ఉండుము.

**"నీతి నిమిత్తము హింసింపబడువారు ధన్యులు; పరలోక రాజ్యము వారిది"**

ఒకవేళ అది ఎవనికైన మనపై కోపము తెప్పించినప్పటికినీ లేక వారు మన యెడల అభ్యంతర పడినప్పటికనీ మనము సరియైన దాని కొరకు నిలువబడవలెను. కొన్నిసార్లు అది చేయుట కష్టము కాని అది దేవునికి యిష్టమయినది.

**కంఠత వాక్యము :**

హృదయ శుద్ధి గల వారు ధన్యులు; వారు దేవుని చూచెదరు. మత్తయి 5:8.

## 11వ పాఠము – పరీక్ష

# ధన్యతలు

1. "ఆత్మ విషయమై దీనులైన వారు ధన్యులు................ " అని యేసు చెప్పెను. ( )
   ఎ. వారు ఓదార్చబడుదురు
   బి. పరలోక రాజ్యము వారిది
   సి. వారు తృప్తిపరచబడుదురు
2. "దుఃఖపడువారు ధన్యులు.................." ( )
   ఎ. వారు తృప్తిపరచబడుదురు
   బి. పరలోకరాజ్యము వారిది
   సి. వారు ఓదార్చబడుదురు.
3. నీతి కొరకు ఆకలి దప్పులు గలవారు ధన్యులు......................." ( )
   ఎ. వారు దేవుని కుమారులనబడుదురు
   బి. వారు తృప్తిపరచబడుదురు
   సి. వారు దేవుని చూచెదరు
4. "కనికరము గలవారు ధన్యులు..........................." ( )
   ఎ. వారు కనికరము పొందుదురు
   బి. వారు దేవుని చూచెదరు
   సి. పరలోక రాజ్యము వారిది
5. "హృదయశుద్ధి గలవారు ధన్యులు; ............." ( )
   ఎ. వారు కనికరము పొందుదురు
   బి. వారు తృప్తిపరచబడుదురు.
   సి. వారు దేవుని చూచెదరు.
6. "సమాధానపరచువారు ధన్యులు................" ( )
   ఎ. వారు ఓదార్చబడుదురు.
   బి. వారు దేవుని కుమారులనబడుదురు,
   సి. వారు తృప్తిపరచబడుదురు
7. మనమేతప్పు చేయనప్పటికినీ శ్రమ నొందినపుడు మనము ................................ ( )
   ఎ. నీతినిమిత్తము హింసింపబడితిమి
   బి. సమాధానపరచువానిగా ఉంటిమి.
   సి. కనికరముతో ఉంటిమి.
8. హృదయ శుద్ధి కలిగిన ప్రజలు............. . ( )
   ఎ. టీవీలో చెడు కార్యక్రమములను చూతురు
   బి. హింసతో కూడిన వీడియోగేమ్సు ఆడుదురు
   సి. వారి మనస్సులను మంచి ఆలోచనలతో నింపుదురు
9. నీతి కొరకు ఆకలి దప్పులు గల వ్యక్తి........... కోరును. ( )
   ఎ. ఎల్లప్పుడు తినుటను
   బి. దేవుని గూర్చి ఎక్కువ తెలుసుకొనుటను
   సి. చరిత్ర పుస్తకములను ఎక్కువ చదువుటను
10. మనము నిజముగా ఆశీర్వదించబడాలన్నా లేదా సంతోషముగా ఉండాలన్నా మనము యేసును మొదట వుంచి....... ( )
   ఎ. రెండవదిగా మనలను, ఆఖరున ఇతరులను ఉంచవలెను.
   బి. రెండవదిగా ఇతరులను ఆఖరున మనలను ఉంచవలెను.
   సి. ఇక ఎవరిని పట్టించుకొననవసరము లేదు.

## 12వ పాఠము

# యేసు బహుజనులకు ఆహారము పెట్టుట

ప్రజల యొక్క గొప్ప సమూహము యేసును వెంబడించిరి ఎందుకనగా వారు ఆయన చేసిన అద్భుతములను చూచిరి మరియు వారి కొరకు, వారి కుటుంబముల కొరకు స్వస్థతను కోరిరి. యేసు మరియు ఆయన శిష్యులు పరిచర్యలో నిమగ్నులై వారు భోజనము చేయుటకు కూడ వారికి సమయము లేకుండెను. వారు అక్కడ నుండి వెడలిపోయి కొంత సమయము కేవలము ఏకాంతముగా ఉండవలెనని ఆయన నిర్ణయించెను. అది ప్రత్యేకముగా కష్ట సమయము ఏలయనగా బాప్తీస్మమిచ్చు యోహాను యొక్క మరణమును గూర్చి యేసు అప్పుడే తెలుసుకొనెను.

ఆయన మరియు ఆయన శిష్యులు ఒక నావలో గలిలయ సముద్రమును దాటిరి. కాని వారెక్కడికి వెళ్లుచున్నారో ప్రజలు చూచిరి మరియు చుట్టుప్రక్కల ఉన్న పట్టణముల నుండి వచ్చి సముద్రము అవతలివైపున వారి కొరకు వేచియుండిరి. యేసు ప్రజలను చూచినపుడు, ఆయన వారి యెడల కనికరపడెను. వారు వారిని నడిపించుటకు కాపరి లేని గొఱ్ఱెల మంద వలె ఉండిరి. యేసు వారితో దేవుని రాజ్యమును గూర్చి మాట్లాడెను మరియు వారిలో స్వస్థత అవసరమైన వారిని స్వస్థపరచెను.

దినములో ఆలస్యమగుచుండెను మరియు శిష్యులు ఆయన యొద్దకు వచ్చి, వారు పొరుగున ఉన్న పల్లె ప్రాంతములు మరియు గ్రామముల లోనికి వెళ్లి తినుటకు మరియు రాత్రి గడుపుటకు జన సమూహములను పంపవలెనని సలహాయిచ్చిరి. “వారు వెళ్లనక్కరలేదు మీరే వారికి భోజనము పెట్టుడని” యేసు చెప్పెను. ఆ ప్రజలందరి కొరకు ఆహారము కొనుటకు చాలినంత ధనము వారివద్ద లేదని శిష్యులు ఎరిగియుండిరి. అక్కడ సుమారు 5000 మంది పురుషులు ఇంకను స్త్రీలు మరియు పిల్లలు ఉండిరి.

వారు ఆహారమును ఎక్కడ కొనగలరని ఆయన ఫిలిప్పును అడిగెను. అప్పుడు యేసు అతనిని కేవలము పరీక్షించుచుండెను. ఆయన వారికి ఎట్లు ఆహారము పెట్టబోవుచున్నాడో ఆయన అప్పటికే యెరిగి యుండెను. ప్రతి ఒక్కడు కేవలము కొంచెముగా తినుటకు చాలినంత ఆహారము కొనుటకు 200 దేనారములు అగునని ఫిలిప్పు చెప్పెను. ఒక దేనారము అనగా ఒక రోజు జీతము. కాబట్టి 200 దేనారములు అనగా ఒక మనుష్యుడు 200 రోజులు, సుమారు 7 నెలలు పనిచేయుట ద్వారా సంపాదించగలుగు ధనము అగును.

మధ్యాహ్న భోజనము తెచ్చుకొనిన ఒక చిన్నవాడు సమూహములో ఉన్నాడని సీమోను పేతురు సహోదరుడైన అంద్రెయ యేసుకు చెప్పెను. ఆ చిన్నవాడు లేక అతని పోషణ చూచు మరియొకరు ముందుగానే ఏర్పాటు చేసియుండెను మరియు అతడు అయిదు బార్లీ రొట్టెలు మరియు రెండు చిన్న చేపలు కలిగియుండెను. అతడు ఆ మధ్యాహ్న భోజనమును తన కొరకే తెచ్చుకొనియున్నప్పటికినీ యేసు దానిని ఉపయోగించుటకు అతడు యిష్టపడెను.

ఆ స్థలములో ఎక్కువ గడ్డి ఉండెను మరియు 50 మంది మరియు 100 మంది చొప్పున గుంపులుగా ప్రజలను క్రింద కూర్చుండ బెట్టుడని యేసు శిష్యులతో చెప్పెను.

అప్పుడు ఆయన రొట్టెలు తీసుకొని, కృతజ్ఞతా స్తుతులు చెల్లించి, వాటిని విరిచి తన శిష్యులకు అందజేసెను. రొట్టెలు వృద్ధి చెందుచు మరి ఎక్కువ రొట్టెలు తయారయ్యెను. వారు రొట్టె మరలా మరలా విరిచిరి.

ఆయన ఆ రెండు చేపలతో కూడ అట్లే చేసెను. వారి కడుపు నిండు వరకు ప్రతివాడు తినువరకు వారు ఆహారమును అందజేయుచు వచ్చిరి. అప్పుడు ఏదియును వృథా కాకుండా మిగిలిన ఆహారమును పోగు చేయుడని యేసు శిష్యులకు చెప్పెను. ఎంత మిగిలెనో నీవు ఎరుగుదవా? అక్కడ మిగిలిపోయిన రొట్టెలు మరియు చేపలతో నిండిన పన్నెండు గంపలు ఉండెను.

ఆయన ప్రజలందరకు ఏలాగున ఆహారము తినిపించెనో మనుష్యులు చూచినప్పుడు, వారు “నిజముగా ఈ లోకమునకు రాబోవు ప్రవక్త ఈయనే” అని చెప్పుకొనిరి.

ప్రజలు బలవంతముగా ఆయనను తీసికొని మరియు ఆయనను రాజుగా చేయుటకు సిద్ధముగా ఉండిరని యేసు చూచెను కావున ఒక స్థలమునకు ఒంటరిగా వెళ్లిపోయెను.

**కంఠత వాక్యము :**

జీవాహారమును నేనే. నా యొద్దకు వచ్చువాడు ఏ మాత్రము ఆకలిగొనడు మరియు నా యందు విశ్వాసముంచువాడు ఎప్పుడును దప్పిగొనడు, యోహాను 6:35.

## 12వ పాఠము – పరీక్ష
# యేసు బహుజనులకు ఆహారము పెట్టుట

1. బహుజనులు యేసును వెంబడించిరి, ఎందుకనగా........... . ( )
   ఎ. ఒక క్రొత్త రాజు కొరకు ఎదురు చూచుచుండిరి.
   బి. అద్భుతములను చూచిరి మరియు స్వస్థతను కోరిరి.
   సి. వార్తా పత్రికలలో ఆయను గూర్చి చదివిరి.
2. యేసు మరియు ఆయన శిష్యులు ఒక నావలో సముద్రము దాటినప్పుడు........... . ( )
   ఎ. సమూహములు ఆవలి ఒడ్డున వేచియుండిరి.
   బి. వారు సమూహముల నుండి బయటికి రాగలిగిరి.
   సి. వారు నావలోనే నిలిచిరి మరియు ఒడ్డుకు వెళ్లలేదు.
3. యేసు సమూహములను చూచి ఆయన వారిని................. పోల్చెను. ( )
   ఎ. తోడేళ్ల మధ్య గొఱ్ఱెలతో
   బి. బాతుల మందతో
   సి. కాపరి లేని గొఱ్ఱెలతో
4. శిష్యులు యేసుకు................. సలహా ఇచ్చిరి. ( )
   ఎ. సమూహము కొరకు ఆయన కొంత ఆహారమును సృష్టించవలెనని
   బి. వారు సమూహమును ఆహారమును కనుగొనుటకు పంపివేయవలెనని
   సి. వారు సమూహమును విడిచి, భుజించుటకు వెళ్లవలెనని
5. సమూహమునందు......................... కలరు. ( )
   ఎ. పిల్లలతో కలసి 5000 మంది ప్రజలు
   బి. 2000 మంది పురుషులు మరియు స్త్రీలు, పిల్లలు
   సి. 5000 మంది పురుషులు మరియు స్త్రీలు, పిల్లలు
6. ..................... అంద్రెయ యేసుతో చెప్పెను. ( )
   ఎ. సమూహములోని ఒక చిన్నవాడు మధ్యాహ్న భోజనమును తెచ్చియుండెనని
   బి. వారు ఆహారము కొనుటకు దగ్గరలో ఒక అంగడి ఉన్నదని
   సి. అంత ఎక్కువ మంది ప్రజలకు ఆహారము పెట్టుట అసాధ్యమని
7. యేసు ప్రజల కొరకు...............నుండి ఆహారమును చేసెను. ( )
   ఎ. అయిదు రొట్టెలు మరియు రెండు చేపల
   బి. అయిదు చేపలు మరియు రెండు రొట్టెల
   సి. కేవలము అయిదు రొట్టెల
8. యేసు ఆహారమును అందించుటకు ముందు ఆయన................... . ( )
   ఎ. అది శుద్ధముగా ఉండునట్లు జాగ్రత్తపడెను
   బి. దాని కొరకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించెను.
   సి. దాని కొరకు ధనము వసూలు చేయుమని శిష్యులకు చెప్పెను.
9. అందరు సంతృప్తిగా తినిన తరువాత...... గంపల ఆహారము మిగిలెను. ( )
   ఎ. పది
   బి. రెండు
   సి. పన్నెండు
10. ...... దేవుడు మనలను కోరును. ( )
   ఎ. మనకున్న తలాంతులను ఆయన కొరకు వాడవలెనని
   బి. మన తలాంతులను దాచి, వాటిని వాడకూడదని
   సి. ఆయనను సేవించుటకు మనకు తలాంతులు లేవని

## 13వ పాఠము

# పేతురు యేసును ఒప్పుకొనుట

## మత్తయి 16:13-29

యేసు ఫిలిప్పుదైన కైసరయ ప్రాంతముల యందు బోధించుచుండెను. ఆయన తరచుగా చేసినట్లు ఈ ప్రత్యేక దినమున ప్రార్థించుటకు ఒంటరిగా దూరము వెళ్లెను.

ఆయన శిష్యులు ఆయనను కనుగొనిరి మరియు "నేను ఎవరినని జనులు చెప్పుకొనుచున్నారు?" అని ఆయన వారిని అడిగెను.

యేసును గూర్చి అక్కడ అనేక విభిన్న అభిప్రాయములుండెను. కొందరు ప్రజలు బాప్తీస్మమిచ్చు యోహాను లేక ఏలీయా మృతులలో నుండి యేసుగా తిరిగి వచ్చియుండెనని తలంచిరి. కొందరు బహుశ యిర్మీయా లేక ప్రవక్తలలో మరియొకడు భూమికి తిరిగివచ్చెనని తలంచిరి.

అయితే ఆయనను గూర్చి వారేమి తలంచిరో చెప్పవలెనని యేసు తన శిష్యులను కోరెను. "నీవు సజీవుడవగు దేవుని కుమారుడవైన క్రీస్తువు" అని సీమోను పేతురు చెప్పెను. దీనిని గూర్చి పేతురు అంత ఖచ్చితముగా ఎట్లు ఎఱిగియుండెను?

మనకు యేసు జవాబిచ్చుచున్నాడు. ఆయన పేతురు పేరును సీమోను బర్ యోనా లేక యోనా కుమారుడవైన సీమోనూ అని పిలిచెను. యేసు ఎవరో పేతురు ఎఱిగియుండుట దైవిక బయల్పాటు ద్వారా జరిగెనని ఆయన చెప్పెను. దేవుడు తానే పేతురుతో చెప్పెను.

యేసు తన సంఘమును కట్టబోవుచున్నాడని మరియు సాతాను ఎన్నడును దానిని జయించలేడని ఆయన పేతురుతో చెప్పెను. ఆయన ప్రజలు విజయులగుదురు మరియు చెడును గెలుతురు. పేతురు రాజ్యము యొక్క "తాళపు చెవులు" కలిగియుండును. దేవునిని సంతోషపరచు సంగతులు మరియు దేవునికి అసంతోషము కలిగించు సంగతులను అతడు ప్రజలకు తెలియజేయును. అతడు దేవుని మాటలు పలుకు వానిగా ఉండును మరియు పేతురు ప్రకటించిన దేవుని బోధలకు ప్రజలు లోబడవలెను. యేసు పేతురుతో, "నీవు భూలోకమందు దేని బంధించుదువో అది పరలోకమందును బంధింపబడును, భూలోకమందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడును" అని చెప్పెను.

అప్పుడు యేసు వారు ఆయన నిజ గుర్తింపును మరికొంత కాలము రహస్యముగా ఉంచవలెనని వారితో చెప్పెను. ఆయన శ్రమ పొంది చనిపోయి మరియు తిరిగి లేపబడవలసి యున్నది.

యేసు చనిపోవుటను గూర్చిన తలంపును కూడ పేతురు యిష్టపడలేదు, మరియు ఒక రోజున "ప్రభువా, అది నీకెన్నడును కలుగదు" అని అతడు ఆయనతో చెప్పెను.

అయితే సాతాను పేతురు మాటల ద్వారా యేసుకు హానిచేయుటకు ప్రయత్నించుచున్నాడని ఆయన ఎఱిగెను మరియు ఆయన పేతురుతో "సాతానా, నా వెనుకకు పొమ్ము" అని చెప్పెను.

సుమారు ఒక వారము తరువాత యేసు పేతురు, యాకోబు మరియు యోహానులను ఎత్తైన కొండ మీదికి తీసికొనివెళ్లెను. ఆయన వారి కన్నుల యెదుట మార్పు (రూపాంతరము) చెందెను. ఆయన సూర్యుని వలె ప్రకాశించుచుండెను. యేసు నిజముగా దేవుని కుమారుడనుటకు ఇది మరియొక ఋజువు.

**: కంఠత వాక్యము :**

అందుకు సీమోను పేతురు – "నీవు సజీవుడవగు దేవుని కుమారుడవైన క్రీస్తువని" చెప్పెను. **మత్తయి 16:16.**

## 13వ పాఠము - పరీక్ష

# పేతురు యేసును ఒప్పకొనుట

1. యేసు........... ప్రాంతములో బోధించుచుండెను ( )
   ఎ. మృత సముద్రము
   బి. ఫిలిప్పుదైన కైసరయ
   సి. యెరూషలేము
2. యేసు తన శిష్యులను............. అని అడిగెను. ( )
   ఎ. నేను ఎవరినని మనుష్యులు అనుకొనుచున్నారు.
   బి. తరువాత మనము ఎక్కడకు వెళ్లవలెను
   సి. పేతురు ఎక్కడ
3. కొంత మంది ప్రజలు యేసును మృతులలో నుండి తిరిగి వచ్చిన.... అని తలంచుచుండిరి. ( )
   ఎ. మోషే లేదా దావీదు
   బి. అబ్రాహాము లేదా యెషయా
   సి. బాప్తీస్మమిచ్చు యోహాను లేదా ఏలీయా
4. ఆయన ప్రశ్నకు సీమోను పేతురు "నీవు....." అని సమాధానమిచ్చెను. ( )
   ఎ. సజీవుడవగు దేవుని కుమారుడైన క్రీస్తు
   బి. బాప్తీస్మమిచ్చు యోహాను
   సి. ప్రవక్తలలో ఒకనివి
5. క్రీస్తు ఎవరో పేతురు తెలియును ఏలాగనగా............... ( )
   ఎ. అతని బైబిలు నందు అతడు చదివెను
   బి. దేవుడు దానిని అతనికి బయలుపరచెను.
   సి. అంద్రెయ అతనికి చెప్పెను.
6. యేసు......... కట్టబోవుచున్నానని పేతురుతో చెప్పెను. ( )
   ఎ. ఒక దేవాలయమును
   బి. ఒక కోటను
   సి. తన సంఘమును
7. పేతురు ...................... కలిగియుండును. ( )
   ఎ. రాజ్యపు తాళపు చెవులు
   బి. రాజ్యము యొక్క ద్వారము
   సి. ఇతర అపోస్తలులపై అధికారము
8. యేసు ఎత్తైన కొండమీద రూపాంతరము చెందెను అనగా వారి కన్నుల యెదుట.......... . ( )
   ఎ. ఆయన పరలోకమునకు తీసికొనిపోబడెను.
   బి. ఆయన అనేక మందికి బోధించెను
   సి. ఆయన మార్పు చెందెను
9. యేసు రూపాంతరము చెందినప్పుడు ఆయన............... . ( )
   ఎ. వారికి కనబడకుండా అదృశ్యుడాయెను
   బి. సూర్యునివలె ప్రకాశించెను
   సి. చనిపోయిన మనుష్యునివలె ఆయెను
10. మన జీవితములలో యేసును ఒప్పుకున్నప్పుడు......... ( )
   ఎ. దేవుడు మనలను ఆయన సంకల్పము కొరకు వాడుకొనగలడు.
   బి. దేవుడు సంతోషించును.
   సి. మనము మంచి ప్రభావము కలిగియుండము.

### 14వ పాఠము

# పరిసయ్యులు మరియు సద్దూకయ్యులు

**మత్తయి 23:1-36**

యేసు భూమి మీద ఉన్నప్పుడు అతడు ప్రజల యెడల సాధారణముగా దయతోను మరియు ప్రేమతోను ఉండెను. అయితే అక్కడ కొంతమంది ప్రజలు ఆయన దయను పొందలేకపోయిరి కాని ఆయన కోపమును పొందిరి. ఈ ప్రజలు మతాసక్తి గలవారిగా నటించిరి కాని వారు ఇతర ప్రజల యెడల చాలా ప్రేమలేనివారుగాను, దయలేని వారిగాను ఉండిరి.

ఆయన పరిసయ్యులుగా పేరొందిన యూదుల మతనాయకులతో కఠినమైన మాటలు మాట్లాడెను. ఈ మనుష్యులు దశమ భాగము విషయములోను లేక దేవునికి ఒక కానుకగా వారి ఆదాయము అంతటిలో పదియవ వంతు యిచ్చుటలోను చాలా శ్రద్ధగా ఉండిరి. అయితే తమ ధనమును చందా వేసినప్పుడు అందరూ వారిని చూచునట్లు కొన్నిసార్లు ప్రజల ధ్యానమును వారు తమ వైపు త్రిప్పుకొనిరి. వారు మోషే ధర్మశాస్త్రమును పాటించుచున్నారన్న వాస్తవమును బట్టి వారు చాలా గర్వముతో ఉండిరి. కాని వారు తమ పొరుగువారి యెడల, తమ కుటుంబముల యెడల ఎట్టి ఆసక్తి లేకుండగను, గర్వముగా కూడను ఉండిరి.

యేసు వారిని తెల్లని సున్నము కొట్టబడిన మరియు బయటకు చాలా అందముగా కనబడిన సమాధులతో పోల్చెను. కాని వారు అసలు అందముగా లేరు, నిజమునకు చనిపోయిన మనుష్యుల ఎముకలతో నిండిన సమాధుల వలె ఉండిరి. ఒకవేళ వారికి వారు తెచ్చిన సందేశము వినుటకు కోరికలేనిచో ఈ మనుష్యులు దేవుడు పంపిన ప్రవక్తలను కూడా చంపుదురు. బాప్తీస్మమిచ్చు యోహాను ప్రకటించుచు వచ్చినప్పుడు మరియు మారుమనస్సు పొందవలెనని చెప్పినప్పుడు వారు అతనిని వినలేదు మరియు బాప్తీస్మము పొందుటకు తిరస్కరించిరి.

శాస్త్రులు పరిసయ్యుల గుంపులో ఒక భాగము. వారు చేతితో ధర్మశాస్త్రమును నకలు చేసిరి మరియు వారు యూదుల ధర్మశాస్త్రము యొక్క అర్ధమును ప్రజలకు చెప్పిరి. వారు దానిని వ్యాఖ్యానించిరి గనుక వారు ముఖ్యులుగా చూడబడిరి. వారు విశాలమైన అంచులతో పొడవైన దుస్తులు ధరించిరి లేక వారి ప్రాముఖ్యత తెలియపరచుటకు వాటి మీద జాలరులు కలిగియుండిరి. వారు సమాజమందిరములలోను, ఆరాధనా స్థలములలోను ఉత్తమ పీఠము పొందవలెనని కోరిరి. ప్రజలు వారిని రబ్బీయని లేక బోధకుడని పిలుచుటను వారు ప్రేమించిరి. వారిని ప్రజలు చూడవలెనని వారు బయట బహిరంగముగా దీర్ఘ ప్రార్థనలు చేసిరి. సామాన్య ప్రజలు పరిసయ్యుల వైపు చూచి వారిని అతిమతాసక్తి గలవారిగా తలంచిరి.

ఇప్పుడు పరిసయ్యుడుగా ఉండుట చెడ్డ విషయము కాదు. అది ఒక మంచి విషయము. యేసు ఈ పరిసయ్యులను ఖండించుటకు కారణము వారి వేషధారణయే. వారు సత్యమును ప్రకటించిరి కాని వారి జీవితములలో వారు దేవుని ధర్మశాస్త్రమునకు విధేయత చూపుటకు నటించిరి. వారు ఇతరులకు మర్యాద యివ్వలేదు లేక ఆసక్తి చూపలేదు. మనము అట్టి ప్రజలను వేషధారులని పిలుతుము.

సద్దూకయ్యులు సంపన్న కుటుంబముల నుండి వచ్చిన యూదుల మతనాయకులై యుండిరి. ఈ గుంపు ప్రజలు పునరుత్థానులగుదురని లేక సమాధి నుండి లేపబడుదురని నమ్మలేదు. వారు దేవదూతలు ఉండిరని కూడ నమ్మలేదు. కంఠస్థ సూచిక : పునరుత్థానమును లేదా దేవదూతలను నమ్మని వారిని "సాడ్ యు సీ" (సద్దూకయ్యులు)గా చేయును.

అక్కడ "సన్ హెడ్రిన్"గా పిలువబడిన యూదుల పాలన సభ ఉండెను. అది పరిసయ్యులు మరియు సద్దూకయ్యులు కలిపి 71 మంది యొక్క ఒక గుంపుగా ఉండెను. మత నాయకులు అందరు గర్వము మరియు దురహంకారము గలవారై యుండలేదు. బైబిలు కాలంలో ముఖ్యులైన ముగ్గురు మంచి పరిసయ్యులను మీరు ఎఱిగియుండవచ్చును. అపోస్తలుడైన పౌలు, నికోదేము మరియు సభలో జ్ఞానియైన గమలీయేలు ఉండిరి.

### : కంఠత వాక్యము :

శాస్త్రులును పరిసయ్యులును మోషే పీఠమందు కూర్చుండువారు! గనుక – వారు మీతో చెప్పువాటినన్నిటినీ అనుసరించి గైకొనుడి. అయినను వారి క్రియల చొప్పున చేయకుడి. వారు చెప్పుదురే గాని చేయరు. **మత్తయి 23:3**

## 14వ పాఠము - పరీక్ష

# పరిసయ్యులు మరియు సద్దూకయ్యులు

1. ఏ ప్రజల వైపు యేసు కోపముతో చూచెను ? ( )
   ఎ) దయ మరియు కనికరముగల వారివైపు
   బి) ఆయన యెడల ఉదాసీనముగా ఉన్న వారివైపు
   సి) ప్రేమ మరియు కనికరములేని వారివైపు
2. .............. దశమ భాగము ఇచ్చుటకు చాలా జాగ్రత్తగలవారై యుండిరి . ( )
   ఎ) పరిసయ్యులు
   బి) సద్దూకయ్యులు
   సి) సుంకరులు
3. దశమ భాగము అనగా ...................... . ( )
   ఎ) మీ ధనమంతా దేవునికి కానుకగా యిచ్చుట
   బి) మీ ఆదాయములో పదవ భాగము దేవునికి కానుకగా ఇచ్చుట
   సి) దేవునికి యేమియు యియ్యకపోవుట
4. యేసు పరిసయ్యులను ................. తో పోల్చెను . ( )
   ఎ) బయట మాత్రమే అందముగా ఉండిన సమాధుల
   బి) కాపరిలేని గొఱ్ఱెల
   సి) తోడేళ్ళ వస్త్రములో గొఱ్ఱెల
5. పరిసయ్యులు ............ ప్రవక్తను వినుటకు తిరస్కరించిరి . ( )
   ఎ) యెషయా
   బి) ఏలియా
   సి) బాప్తీస్మమిచ్చు యోహాను
6. శాస్త్రులు .......................... . ( )
   ఎ) దేవదూతలను నమ్మలేదు
   బి) యంత్రము ద్వారా ధర్మశాస్త్రమును నకలుచేసిరి
   సి) చేతి ద్వారా ధర్మశాస్త్రమును నకలు చేసిరి
7. శాస్త్రులు ఇంకను ............................ . ( )
   ఎ) ధర్మశాస్త్రము యొక్క ప్రతులు అమ్మిరి
   బి) ప్రజలకు ధర్మశాస్త్రము యొక్క అర్థము చెప్పిరి
   సి) పునరుత్థానమునందు నమ్మకముంచలేదు
8. సద్దూకయ్యులు ................... . ( )
   ఎ) దేవదూతల యందు నమ్మకముంచలేదు
   బి) దేవదూతల యందు నమ్మకముంచిరి
   సి) ధర్మశాస్త్రమును నకలు చేసిరి
9. యూదుల పాలన సభ ............... గా పిలువబడెను . ( )
   ఎ) మతపరమైన సభ
   బి) ఉన్నత న్యాయస్థానము
   సి) సన్‌హెడ్రిన్
10. నీవు ................. ప్రేమించిన యెడల, నీవు ఎల్లప్పుడు సరియైన దానిని చేయుదువు . ( )
   ఎ) దేవునిని మరియు ఇతరులను
   బి) నిన్ను మరియు దేవునిని
   సి) ఇతరులను మరియు నిన్ను

### 15వ పాఠము

# గ్రుడ్డి మనుష్యుడు

**లూకా 18:35-43, మార్కు 10:45-47**

యేసు ఎచ్చటకు వెళ్ళినను, జనులు రోగులైన వారి స్నేహితులను, బంధువులను స్వస్థత కొరకు తీసికొనివచ్చుచు బహు జన సమూహములు ఆయనను వెంబడించిరి. ఒక రోజున ఆయన యెరూషలేము విడిచి వెళ్ళుచుండగా తిరిగి ఒక జనసమూహము ఆయనను వెంబడించెను.

ఆయన యెరికో పట్టణమునకు దగ్గరగా వచ్చినప్పుడు వారు ఒక గ్రుడ్డి భిక్షకుడు రోడ్డు ప్రక్కన కూర్చొని ఉండుటను చూచిరి. అతని పేరు 'బర్తిమయి'.

అతడు "దావీదు కుమారుడా, యేసూ... నన్ను కరుణింపుము" అని కేకలు వేయ మొదలుపెట్టెను.

(ఆయన చాల సంవత్సరములకు పూర్వము ఇశ్రాయేలును 40 సంవత్సరములు పరిపాలించిన రాజైన దావీదు వంశస్థుడు కావున యేసు దావీదు కుమారుడని పిలువబడెను).

గ్రుడ్డి మనుష్యుని స్నేహితులు నిశ్శబ్దముగా ఉండవలెనని అతనికి చెప్పిరి కాని అతడు ఇంకను బిగ్గరగా యేసును పిలిచెను.

యేసు నిలిచి బర్తిమయిని తన యొద్దకు పిలువుమని తన శిష్యులతో చెప్పెను. వారు అతనితో "ధైర్యము తెచ్చుకొని నీ పాదములపై నిలువుము. ఆయన నిన్ను పిలుచుచున్నాడు" అని చెప్పిరి. అతడు తన బట్టను పారవేసి, యేసునొద్దకు వచ్చెను. అతడేమి కోరుచున్నాడని యేసు అతనిని అడిగెను. అతడు "రబ్బీ (అనగా బోధకుడా) నేను చూడగోరుచున్నానని" చెప్పెను.

యేసు, "నీ విశ్వాసము నిన్ను స్వస్థపరచెను పొమ్ము' అని చెప్పెను. వెంటనే అతడు చూడగలిగెను మరియు అతడు యేసును వెంబడించెను.

దేవుని కుమారుని స్వస్థపరచు శక్తియందు విశ్వాసముంచిన ఈ గ్రుడ్డి మనుష్యుని జీవితములో ఆరోజు ఎంత సంతోషకరమైనదో గదా!

**: కంఠత వాక్యము :**

నమ్ముట నీవలననైతే నమ్మువానికి సమస్తము సాధ్యమే. **మార్కు 9:23**

## 15వ పాఠము – పరీక్ష

# గ్రుడ్డి మనుష్యుడు

1. యేసు యెరుషలేము నుండి .................... కు వెళ్ళుచుండెను . ( )
   ఎ) దమస్కు
   బి) యెరికో
   సి) బెత్లహేము
2. .............. పేరుగల ఒక గ్రుడ్డి బిక్షకుడు త్రోవ ప్రక్కన కూర్చొని యుండెను . ( )
   ఎ) లాజరు
   బి) జక్కయ్య
   సి) బర్తిమయి
3. .................... అని బిక్షకుడు కేకలు వేసెను . ( )
   ఎ) యేసూ స్వస్థపరచు
   బి) యేసూ దావీదు కుమారుడా నన్ను కరుణింపుము
   సి) గ్రుడ్డివాడినైన నాకు సహాయము చేయుము
4. .................. అని గ్రుడ్డి మనుష్యుని స్నేహితులు చెప్పిరి . ( )
   ఎ) ఊరకుండుము
   బి) పెద్దగా కేకలు పెట్టుము
   సి) వేరొక బాషతో మాట్లాడుము
5. ............. అని యేసు శిష్యులు గ్రుడ్డివానితో చెప్పిరి . ( )
   ఎ) ఆగడానికి సమయము లేదు
   బి) ఆయన అతనిని పిలుచుచున్నాడు
   సి) అతని పేరును తెలుసుకోగోరెను
6. ఏమి కావలయునని అడిగినందుకు ........... అని గ్రుడ్డివాడు చెప్పెను . ( )
   ఎ) నన్ను స్వస్థపరచగలవా?
   బి) దయవుంచి నాకు సహాయము చేయుము
   సి) బోధకుడా, నాకు చూపుకావలెను
7. ................. అని యేసు అతనితో చెప్పెను . ( )
   ఎ) నీవు త్వరలో చూడగలుగుతావు
   బి) నీవు వెళ్ళుము నీ విశ్వాసము నిన్ను స్వస్థపరచెను
   సి) నీవు రేపు స్వస్థత పొందగలవు
8. గ్రుడ్డివాడు స్వస్థత పరచబడిన వెంటనే ఆ మనుష్యుడు ............. . ( )
   ఎ) యేసును వెంబడించెను
   బి) పట్టణములోనికి వెళ్ళను
   సి) అతని తల్లి దండ్రులకు చెప్పుటకు ఇంటికి వెళ్ళెను
9. ఆ మనుష్యుడు .................. . ( )
   ఎ) ఏమియు తోచకుండెను
   బి) కృతజ్ఞత లేనివాడుగా వుండెను
   సి) సంతోషించెను (ఆనందపడెను)
10. ఈ కథ నుండి మనము తెలుసుకున్న పాఠమేదనగా ..................... . ( )
   ఎ) విడువక యేసును వెంబడించవలెను
   బి) మనము స్వస్థత పొందగోరుటకు రోడ్డు ప్రక్కన కూర్చొని వుండవలెను
   సి) మనం బిగ్గరగా మాట్లాడవలెను

## 16వ పాఠము

# పదిమంది కుష్టరోగులు

**లూకా 17:11-19**

కుష్టరోగము ఒక భయంకరమైన చర్మవ్యాధి. అది అంటువ్యాధి. అనగా అది ఒక వ్యక్తి నుండి ఇతరులకు వ్యాపించును, మరియు వారికి కూడ ఆ వ్యాధి కలుగును. కుష్టరోగులు పాటించవలసిన కొన్ని కఠిన నియమములు ఉండెను. ఆ వ్యాధి ఇతరులకు సోకకుండా ఉండుటకు దూరముగా జీవించవలెను. ఒకవేళ పుండ్లు మానినచో ఆ కుష్టరోగి పరీక్షింపబడుటకు యాజకుని యొద్దకు వెళ్ళవలెను. ఒకవేళ ఆ మనుష్యుని ద్వారా వ్యాధి ఇతరులకు ఇక సోకదని ఆ యాజకుడు చెప్పిన యెడల అతడు తిరిగి వెళ్ళి తన కుటుంబముతో నివసింపవచ్చును.

కొన్నిసార్లు ప్రజలు దేవునికి అవిధేయులైనందున వారు ఈ వ్యాధిని పొందిరి. మోషే సహోదరియైన మిర్యాముకు కుష్టరోగము వచ్చెను. ఎందుకనగా ఆమె మరియు ఆమె సోదరుడు అహరోను, దేవుడు వారి సోదరుడైన మోషే ద్వారా మాట్లాడినట్లు వారి ద్వారా మాట్లాడవలెనని చెప్పిరి.

ఒకసారి ఒకరాజు దేవునికి వ్యతిరేకముగా తిరుగుబాటు చేసెను గనుక అతనికి కుష్టవ్యాధి కలిగెను. అతని పేరు ఉజ్జియా మరియు అతడు యూదా రాజై యుండెను. అతని పరిపాలన ప్రారంభములో అతడు ఒక మంచి రాజై యుండెను, కాని తరువాత అతడు అవిధేయత మొదలుపెట్టెను. అతడు దేవాలయములోనికి వెళ్ళి దేవునికి ధూపము వేయుటకు నిర్ణయించుకొనెను. యాజకులు మాత్రమే దీనిని చేయుటకు అనుమతింపబడిరి, మరియు అతడు యాజకుడు కాడు. తన శేషజీవితమంతా అతడు కుష్టరోగము కలిగియుండెను మరియు ఒక వేరు యింటిలో నివసింపవలసివచ్చెను.

పదిమంది కుష్టరోగులను గూర్చిన కథ యేసు యెరూషలేమునకు తన మార్గమున ఉండగా సంభవించెను. ఆ మనుష్యులు ఆయనను కలిసిరి, కాని చాలా దూరముగా నిలుచుండిరి. (ఒక కుష్టరోగి దగ్గరకు రాకూడదు మరియు "అపవిత్రుడను!" అని పెద్దగా చెప్పవలెనని ధర్మశాస్త్రము చెప్పెను. అందును బట్టి అతడు కుష్టరోగము కలిగియున్నాడని జనులు తెలుసుకొందురు.)

"యేసు ప్రభువా, మమ్మును కనికరించుము" అని ఈ మనుష్యులు కేకలు వేసిరి. ఆయన ఇతరులను స్వస్థపరచెనని వారెరుగుదురు.

వారు వెళ్ళి తమ్మును యాజకులకు కనుపరచుకొనవలెనని యేసు వారికి చెప్పెను, మరియు వారు వెళ్ళుచుండగా, ఒక అద్భుత విషయము జరిగెను. వారి చర్మము కుష్టరోగము నుండి విడుదలపొంది శుద్ధి ఆయెను! వారు పొందిన ఆనందమును మనము ఊహించగలము.

ఆ మనుష్యులలో తొమ్మిదిమంది యాజకుని చూచుట కొరకు వెళ్ళుటను కొనసాగించిరి, అయితే ఒక మనుష్యుడు వెనుకకు తిరిగి యేసు నొద్దకు వచ్చెను. అతడు గొప్ప శబ్దముతో దేవుని స్తుతించుచుండెను మరియు అతడు యేసు పాదముల యొద్ద పడి ఆయనకు కృతజ్ఞతలు తెలిపెను. ఈ మనుష్యుడు ఒక సమరయుడు, సమరయ ప్రాంతము నుండి వచ్చిన ఒక మనుష్యుడు. సమరయులు యూదుల చేత ద్వేషింపబడిరి.

మిగిలిన ఆ తొమ్మండుగురు మనుష్యులు ఎక్కడ అని యేసు అడిగెను. పదిమంది శుద్ధులైరి, కాని ఒక్కడే కృతజ్ఞత చెప్పుటకు తిరిగి వచ్చెను, మరియు అతడు ఒక పరదేశి.

"నీవు లేచిపొమ్ము, నీ విశ్వాసము నిన్ను స్వస్థపరచెను" అని యేసు ఆ మనుష్యునితో చెప్పెను.

**: కంఠత వాక్యము :**

యెహోవా దయాళుడు. ఆయనకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుడి. ఆయన కృప నిరంతరముండును. **కీర్తనలు 136:1**

## 16వ పాఠము – పరీక్ష

# పదిమంది కుష్ఠురోగులు

1. ఒక వ్యక్తి కుష్ఠురోగమును ............ నుండి పొందవచ్చును. ( )
   ఎ) ఆ వ్యాధి కలిగిన మరియొక వ్యక్తి
   బి) ఒక జంతువు
   సి) గాలి
2. కుష్ఠు రోగమున్న వ్యక్తి ...................... . ( )
   ఎ) తన కుటుంబముతో కలసి నివసింపవచ్చును
   బి) ఇంటిలో ఒక ప్రత్యేకమైన గదిలో నివసింపవచెను
   సి) ఊరి వెలుపట మాత్రమే నివసింపవలెను
3. మోషే సహోదరియైన ........... దేవునికి అవిధేయత చూపినందుకు కుష్ఠురోగము పొందెను. ( )
   ఎ) శారా
   బి) మిర్యాము
   సి) రాహేలు
4. ఒకప్పుడు ....................... అను పేరుగల రాజు దేవునికి వ్యతిరేకముగా తిరుగుబాటు చేసినందుకు. ఆ వ్యాధి వచ్చెను ( )
   ఎ) ఆహాబు
   బి) ఉజ్జియా
   సి) దావీదు
5. ఈ రాజు ............. ద్వారా అవిధేయత చూపించెను . ( )
   ఎ) అతడు యాజకుడు కాపన్పుడు యాజకుని పనిచేయుట
   బి) దేవుని శపించుట
   సి) వేరు దేశపు భార్యలను పెండ్లియాడుట
6. ఎప్పుడైనా ఒక కుష్ఠురోగి దారిలో ఎవనినైనా కలసిన యెడల అతడు ... అని కేకలు వేయవలెను. ( )
   ఎ) నా దగ్గరకు రావద్దని
   బి) నాకు కుష్ఠు ఉన్నదని
   సి) అపవిత్రుడను, అపవిత్రుడను
7. యేసు యెరూషలేముకు తన మార్గములో ఉండగా ..... కుష్ఠురోగులు ఆయనను కలుసుకొనిరి. ( )
   ఎ) నలుగురు
   బి) పదిమంది
   సి) ఆరుగురు
8. ఆ మనుష్యులు .................. వారు కుష్ఠు రోగము నుండి స్వస్థత పొందిరి. ( )
   ఎ) యాజకుని వద్దకు కనబడుటకు వెళ్ళుచున్నప్పుడు
   బి) యేసువైపు చూచినప్పుడు
   సి) యేసు వారితో మాట్లాడుచున్నప్పుడు
9. స్వస్థత పొందిన మనుష్యులలో ....................... . ( )
   ఎ) అందరు కృతజ్ఞత చెప్పుటకు తిరిగివెళ్ళిరి
   బి) సమరయుడు మాత్రమే యేసుకు కృతజ్ఞత చెప్పుటకు తిరిగివచ్చెను
   సి) అయిదుగురు కృతజ్ఞత చెప్పుటకు తిరిగివచ్చిరి
10. ఈ కథ నుండి మనము తెలుసుకొను పాఠము యేమనగా ............ . ( )
    ఎ) రోగులైన ప్రజలకు దూరముగా ఉండవలెను
    బి) సహాయము కోరుటకు గుంపుగా వెళ్ళవలెను
    సి) కృతజ్ఞత గల వ్యక్తిగా ఉండవలెను

## 17వ పాఠము

# ఇంటి పైకప్పు ద్వారా క్రిందికి

**మార్కు 2:1-12**

యేసు కపెర్నహూము పట్టణములో ఒక యింటిలో ఉండెను. అక్కడ అనేకమంది జనులు ఉన్నందున ఇతరులు ఒక్కరైనను వాకిలి గుండా లోనికి ప్రవేశింపలేకపోయిరి.

కొందరు మనుష్యులు తమ స్నేహితుని యేసునొద్దకు తెచ్చిరి. అతడు పక్షవాయువు గలవాడై కదలలేని స్థితిలో ఉండెను. యేసు అతనిని బాగుచేయగలడని అతని స్నేహితులు నమ్మిరి, అయితే వారు వాకిలి ద్వారా లోనికి చేరలేకపోయిరి.

వారికొక ఆలోచన కలిగెను. వారు ఇంటిలోనికి మరియొక మార్గమును కనుగొన్నారు. వారు ఇంటి కప్పుపైకి వెళ్ళగలిగిన యెడల వారు కప్పు యొక్క కొంత భాగమును తొలగించి మరియు జన సమూహము ఉన్న చోటికిపైగా ఒక రంధ్రము చేయగలుగుట సరిగా అదియే వారుచేసిరి. అప్పుడు తమ స్నేహితుడు పరుండియున్న మంచమునకు వారు త్రాళ్ళు కట్టి నెమ్మదిగా అతనిని గదిలోనికి క్రిందికి సరిగా యేసు యెదుటికి దించిరి.

యేసు వారి విశ్వాసమును చూచినప్పుడు ఆయన “కుమారుడా! నీ పాపములు క్షమింపబడినవని” ఆయన చెప్పెను.

కొందరు యూదుల నాయకులు అక్కడ కూర్చొని యుండిరి మరియు “దేవుడు మాత్రమే పాపములు క్షమించగలడు. అతని పాపములు క్షమింపబడినవని ఈ మనుష్యుడు అతనికి ఎట్లు చెప్పగలడు” అని వారు ఆలోచించుచుండిరి.

వారేమి ఆలోచించుచున్నారో యేసు ఎఱిగెను. ఆయన చెప్పెను. ఏది చెప్పుట సులభము? నీ పాపములు క్షమింపబడినవనియా, లేక నీ పరుపెత్తికొని నడువుము అనియా? అయితే నీ పాపములు క్షమింపబడినవని చెప్పుట సులభము కావచ్చును. యేసు దేవుడు మరియు నిజముగా పాపములు క్షమించగలడు కాని యిది నిజముగా జరిగినదని ఋజువు చేయుటకు ఎట్టి దారి ఉండదు.

కాబట్టి ఆయన పాపములను క్షమించగలడని వారికి నిరూపించుటకు ఆయన ఎక్కువ కష్టమైన దానిని చేసెను. “నీ పరుపెత్తికొని నడువుము” అని ఆయన చెప్పెను. మరియు కదలలేని స్థితిలో ఉన్న ఆ మనుష్యుడు పైకి లేచెను మరియు నడిచెను. యేసు చెప్పిన మాటల ఫలితముగా యేమి జరిగెనో ప్రతి ఒక్కడు చూడగలిగెను.

వారు చూచిన దానిని నమ్ముట ప్రజలకు కష్టమాయెను. వారెన్నడును అట్టి శక్తిని చూచియుండలేదు.

### : కంఠత వాక్యము :

నా ప్రాణమా, యెహోవాను సన్నుతించుము, ఆయన చేసిన ఉపకారములలో దేనిని మరువకుము. ఆయన నీ దోషములన్నిటినీ క్షమించువాడు, నీ సంకటములన్నిటినీ కుదుర్చువాడు. **కీర్తన 103:2-3**

## 17వ పాఠము - పరీక్ష

# ఇంటి పై కప్పు ద్వారా క్రిందికి

1. యేసు ............. నందు ఒక ఇంటిలో వుండెను. ( )
   ఎ) యెరుషలేము
   బి) కపెర్నహూము
   సి) నజరేతు
2. కొందరు మనుష్యులు .......... మనుష్యుడు బాగుపడాలని యేసు వద్దకు తెచ్చిరి . ( )
   ఎ) పక్షవాయువుగల
   బి) గ్రుడ్డివానిని
   సి) చెవిటివానిని
3. స్నేహితులు అతనిని ఇంటి కప్పుపైకి తెచ్చిరి. ఎందుకనగా ............. . ( )
   ఎ) బాగా కనిపించుటకై
   బి) తలుపు లోపలికి వెళ్ళ వీలులేనందున
   సి) అతనికి సూర్యరశ్మి అవసరమని భావించినందున
4. వారు తమ స్నేహితుని ఇంటిలోనికి దింపుటకు .......... ఉపయోగించిరి. ( )
   ఎ) గొలుసులు
   బి) కలిపి ఒకటిగా కట్టిన బట్టలు
   సి) త్రాళ్ళు
5. వారి విశ్వాసమును యేసు చూచినప్పుడు .......... అని చెప్పెను. ( )
   ఎ) కుమారుడా నీ పాపములు క్షమింపబడియున్నవి
   బి) నేను ఇంతటి గొప్ప విశ్వాసమును చూడలేదు
   సి) ఇంత మంచి స్నేహితులు వుండుట నీ అదృష్టము
6. యూదుల నాయకులు .............. కలత చెందిరి . ( )
   ఎ) స్వస్థత జరిగినందున
   బి) ప్రజా సమూహపు స్పందనను బట్టి
   సి) యేసు మాటలను బట్టి
7. యేసు చేసిన ఎక్కువ కష్టమైన కార్యమేదనగా ...................... . ( )
   ఎ) ఆ మనుష్యుని బాగుపరచుట
   బి) నీ పాపములు క్షమించబడియున్నవని ఆ మనుష్యునితో చెప్పుట
   సి) ఏమియునూ చేయకుండుట
8. ................ అని యేసు మనుష్యునితో చెప్పెను. ( )
   ఎ) నీ స్నేహితులు నిజంగా నిన్ను ప్రేమించిరి
   బి) నేను నా శక్తిని నీకు చూపిస్తాను
   సి) నీ పరుపు ఎత్తుకొని నడువుము
9. యేసు ఈ మాటలు చెప్పినప్పుడు ..................... . ( )
   ఎ) ఆ మనుష్యుని స్నేహితులు నవ్విరి
   బి) పరలోకము నుండి ఒక వెలుగు వారి చుట్టూ కనబడెను
   సి) ఆ మనుష్యుడు పైకి లేచి నడచెను
10. మన విశ్వాసమును ఇతరులతో పంచుకొనునప్పుడు మనము ..................... . ( )
    ఎ) ఒక మంచి స్నేహితునిగా ఉందుము
    బి) ప్రజలకు కోపము తెప్పించగోరుచున్నాము
    సి) దేవునిని సంతోషపరచలేము

## 18వ పాఠము

# లాజరును లేపుట

## యోహాను 11:1-46

యేసు కొంతమంది సమీప స్నేహితులను కలిగియుండెను; లాజరు మరియు అతని సహోదరీలు మరియ మరియు మార్త, ఆయన వారి గృహమును తరచుగా దర్శించెను.

ఒక రోజు లాజరు రోగిగా ఉండెనని మార్త యేసుకు సమాచారము పంపెను కాని యేసు వెంటనే వారి యొద్దకు వెళ్లలేదు. ఆయన వేచియుండెను మరియు ఆ సమయములో లాజరు చనిపోయెను.

చివరకు యేసు బేతనియకు వెళ్ళవలెనని నిర్ణయించుకొనినప్పుడు లాజరు చనిపోయి నాలుగు రోజులైయుండెను. యేసు వచ్చుచుండెనని మార్త విని ఆయనను కలుసుకొనుటకు ఆమె ఇంటిలో నుండి పరుగెత్తి వెళ్లెను. ఆయన ఊరి చివరన ఉండెను కాని దానిలోనికి ఇంకను ప్రవేశింపకయుండెను. యేసు అక్కడ ఉండిన యెడల లాజరు చనిపోయియుండెడివాడు కాదు అని ఆమె చెప్పెను.

“నీ సహోదరుడు తిగిలేచును” అని యేసు చెప్పెను. కాలము అంతమున జరుగు పునరుత్థానమును గూర్చి ఆయన మాట్లాడుచుండెనని మార్త తలంచెను. అతి సమీపములోని సమయమును గూర్చి యేసు మాట్లాడుచుండెనని ఆమె గ్రహించినట్లు లేదు.

యేసు పునరుత్థానమును గూర్చి ఆమెతో మాట్లాడెను మరియు నమ్ముచున్నావా అని ఆమెను అడిగెను. “అవును ప్రభువా, నీవు లోకమునకు రావలసిన దేవుని కుమారుడవైన క్రీస్తువని నమ్ముచున్నాను” అని ఆమె చెప్పెను.

మార్త తన సహోదరి మరియను తెచ్చుటకు వెళ్లెను. ఆమె వచ్చి యేసు పాదముల వద్ద పడెను. మార్త చెప్పియున్న అదే సంగతిని ఆమె చెప్పెను. “నీవు ఇక్కడ ఉండిన యెడల అతడు చనిపోయి ఉండకపోవును.” వారు యేడ్చుట యేసు చూచినపుడు ఆయన కూడా వారితో యేడ్చెను.

లాజరు సమాధి చేయబడియుండిన స్థలమునకు వారు వెళ్లిరి. అది దాని ద్వారముపై ఒక రాయి ఉంచబడిన ఒక గుహయై యుండెను. రాయిని తీసివేయుడని యేసు వారితో చెప్పెను.

అప్పుడు ఆయన దేవునికి ప్రార్థన చేసి, “లాజరూ, బయటికి రా” అని చెప్పెను, మరియు గుహలో నుండి లాజరు బయటికి నడచుకొని వచ్చెను. అతడు నార బట్టలతో చుట్టబడెను మరియు అతని ముఖమునకు ఒక వస్త్రము చుట్టబడియుండెను.

“అతని సమాధి వస్త్రములు తీసివేసి అతనిని పోనియ్యుడి” అని యేసు చెప్పెను. మరియ, మార్త మరియు వారి స్నేహితులు ఎంతో సంతోషించిరి. లాజరు సజీవుడై తిరిగి వారితో ఉండెను! దీని తరువాత యూదులనేకులు యేసు నందు విశ్వాసముంచిరి.

**కంఠత వాక్యము**

పునరుత్థానమును జీవమును నేనే; నా యందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును. **యోహాను 11:25.**

## 18వ పాఠము - పరీక్ష

# లాజరును లేపుట

1. యేసు స్నేహితులెవరనగా లాజరు మరియు అతని సహోదరీలు.......... . ( )
   ఎ. లూదియ మరియు దొర్కా
   బి. మరియ మరియు మార్త
   సి. శారా మరియు రిబ్కా
2. లాజరు రోగిగా ఉండెనన్న వార్త యేసు విన్నప్పుడు ఆయన.............. ( )
   ఎ. అతని దగ్గరక వెళ్లుటకు ఆలస్యము చేసెను
   బి. ఆ సందేశమును పట్టించుకొనలేదు
   సి. వెంటనే అతని యొద్దకు వెళ్లెను.
3. మార్త యేసు వచ్చుచుండెనని వినెను మరియు ................... . ( )
   ఎ. ఆమె భోజనము సిద్ధపరచబోవుచున్నదని మరియతో చెప్పెను
   బి. ఆయన రాక కొరకు యింటిలో ఎదురు చూచెను
   సి. ఆయనను కలుసుకొనుటకు ఇంటిలో నుండి బయటికి పరుగెత్తెను.
4. యేసు అక్కడ ఉండిన యెడల........... అని మార్త చెప్పెను. ( )
   ఎ. లాజరు చనిపోయి యుండకపోవును.
   బి. ఆయన అతనిని మృతులలో నుండి లేపియుండెడివాడు.
   సి. లాజరు దాని విషయమై సంతోషించియుండెడివాడు
5. లాజరు తిరిగి లేచునని యేసు చెప్పినప్పుడు మార్త .............. గూర్చి తలంచెను. ( )
   ఎ. లాజరు కుటుంబమునకు తిరిగి వచ్చుట.
   బి. పునరుత్థానము
   సి. అసాధ్యములు
6. యేసు......... అని ఆమె నమ్ముచున్నదని మార్త చెప్పెను. ( )
   ఎ. ఒక మంచి మనిషి
   బి. ఒక గొప్ప ప్రవక్త.
   సి. దేవుని కుమారుడైన క్రీస్తు
7. లాజరు సమాది చేయబడిన స్థలము.............. . ( )
   ఎ. భూమిలో ఒక గుంట
   బి. ద్వారముపైన రాయి పెట్టబడి యుండిన ఒక గుహ
   సి. ఒక తెరచిన గుహ
8. యేసు ప్రార్థన చేసి ............ అని చెప్పెను. ( )
   ఎ. దేవుడు అతనిని తిరిగి లేపునని
   బి. లాజరు బయటికి రా
   సి. లాజరు పోయెనని నేను తలంచుచున్నాను
9. లాజరు సమాధిలో నుండి బయటికి వచ్చినపుడు, అతడు................ . ( )
   ఎ. ఒక పొడవైన వస్త్రము కలిగియుండెను.
   బి. ఉన్ని దుప్పటితో కప్పబడియుండెను
   సి. నార బట్టలతో చుట్టబడి యుండెను.
10. యేసు, మరియ మరియు మార్తలను.............. ద్వారా ఆశ్చర్యపరిచెను. ( )
   ఎ. వారు తలంచిన దానికంటె అధికముగా చేయుట
   బి. వారు ఆశించిన దానిని చేయుట
   సి. వారి ప్రార్థనకు సమాధానము యివ్వకుండుట.

## 19వ పాఠము

# ధనవంతుడైన యువ అధికారి

**లూకా 18:18-30**

ఒకరోజు ఒక యువ అధికారి యేసు వద్దకు వచ్చి ఆయన ముందు మోకరించి, "సద్బోధకుడా, నిత్యజీవము పొందుటకు నేను ఏమి చేయాలి?" అని అతడు అడిగెను.

ఆజ్ఞలను పాటించమని యేసు అతనితో చెప్పెను. "వేటిని?" అని ఆ యవ్వనుడు అడిగెను. యేసు 10 ఆజ్ఞలలో కొన్ని చెప్పడం ప్రారంభించెను. "నరహత్య చేయవద్దు, వ్యభిచరింపవద్దు, దొంగిలించవద్దు, అబద్ద సాక్ష్యం పలుకవద్దు, నీ తల్లిదండ్రులను సన్మానింపుము".

తరువాత యేసు 10 ఆజ్ఞలలో కానిది, లేవీయకాండము నుండినదైన "నిన్నువలె నీ పొరుగు వారిని ప్రేమింపవలెను", అను ఆజ్ఞను చెప్పెను. "కీడుకు ప్రతి కీడు చేయకూడదు లేక ప్రజల మీద కోపముంచుకొనక, నిన్నువలె నీ పొరుగు వారిని ప్రేమింపవలెను" అని లేవీ కాండము 19:18లో జనులు చెప్పబడిరి.

ఆ యవ్వనుడు తను బాల్య దినముల నుండి ఈ ఆజ్ఞలన్నిటిని పాటించుచుండెనని చెప్పెను. అతడు ఒక మంచి జీవితము జీవించెను. యేసు అతని వైపు చూసి అతన్ని ప్రేమించెనని బైబిలు చెప్పుచున్నది, కాని యేసు ఆ యవ్వనుడి హృదయంలోకి చూసెను మరియు అతడు వెంబడించుటకు ఆటంకపరుచుచున్న దానిని కూడా చూసెను.

యేసు అతనికి ఇంకను ఒకటి కొదువగా ఉండెనని మరియు తనకు కలిగినవన్నియు అమ్మి ఆ ధనము పేదలకు ఇవ్వవలెన అతనితో చెప్పెను. అప్పుడు అతడు పరలోకమందు ధనము కలిగివుండును మరియు అతడు యేసును వెంబడించగలడు.

ఆ యవ్వనుడు అతను వదులుకోలేని మిక్కిలి ఆస్తి వున్నందున అతడు ముఖము చిన్నబుచ్చుకొని విచారముగా వెళ్ళెను.

ఆ యవ్వనుడు వెళ్ళిన తరువాత, యేసు పరలోక రాజ్యములో ప్రవేశించుట ఒక ధనవంతుడికి ఎంతో దుర్లభమని తన శిష్యులకు చెప్పెను. "సూదిబెజ్జములో ఒంటె దూరుట సులభము కాని దేవునికి సమస్తము సాధ్యమని" ఆయన చెప్పెను.

ఈ కథ లూకా 18:18-30లో కనుగొనబడును.

### : కంఠత వాక్యము :

ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా ఉండనేరదు, అతడు ఒకరిని ద్వేషించి యొకని ప్రేమించును, లేదా ఒకని పక్షముగా ఉండి యొకని తృణీకరించును. మీరు దేవునికిని సిరికిని దాసులుగా ఉండనేరరు. **మత్తయి 6:24**

## 19వ పాఠము – పరీక్ష

# ధనవంతుడైన యువ అధికారి

1. అధికారి అడిగిన ప్రశ్న .......................... . ( )
   ఎ) గొప్ప ఆజ్ఞ ఏమిటి ?
   బి) నిత్య జీవము పొందుటకు నేను ఏమి చేయాలి ?
   సి) అన్ని ఆజ్ఞలు ఒక్కటే
2. యేసు అతనికిచ్చిన సమాధానము .............................. . ( )
   ఎ) ఆజ్ఞలు పాటించుము
   బి) నేను పరలోకము నుండి వచ్చాను
   సి) అన్ని ఆజ్ఞలు ఒక్కటే
3. యేసు పది ఆజ్ఞలను ఉటంకించి, తరువాత .................. అని చెప్పెను . ( )
   ఎ) చట్టములన్నియు అవియే
   బి) నిన్నువలె నీ పొరుగు వారిని ప్రేమించుము
   సి) నీకు ఇంకా ఏమి కొదువ?
4. ప్రతీకారం కోరు వ్యక్తి ................... . ( )
   ఎ) తన పొరుగు వానిని ప్రేమించున్నాడు
   బి) తన పొరుగువానిని ప్రేమించుటలేదు
   సి) దేవున్ని సంతోషపరుచుచున్నాడు.
5. యవ్వనుడు .................. యుండెను . ( )
   ఎ) చెడు జీవితాన్ని జీవించి
   బి) ఇతరుల గురించి శ్రద్ధ వహించక
   సి) ఒక మంచి జీవితం జీవించి
6. యేసు.......................అని పరిశుద్ధ గ్రంధము చెప్పుచున్నది. ( )
   ఎ) యవ్వనుని ప్రేమించెను
   బి) యవ్వనుని ద్వేషించెను
   సి) యవ్వనుడు చెడు తలంపులు గలవాడని తలంచెను
7. యేసు యవ్వనస్థునికి ........................ చెప్పెను. ( )
   ఎ) అతన్ని తన మార్గములో వెళ్ళి, పాపము చేయవద్దని
   బి) అతనికి కలిగినదంతయు అమ్మి, ఆ ధనము పేదలకు ఇవ్వమని
   సి) అతని ధనాన్ని యేసు కొరకు మరియు అతని అపోస్తులుల కొరకు ఉపయోగించమని
8. యేసుతో మాట్లాడిన తరువాత యవ్వనుడు .................. . ( )
   ఎ) సంతోషంగా విధేయుడై ఆయనను వెంబడించెను
   బి) తన తండ్రితో మాట్లాడతానని చెప్పెను
   సి) విచారముతో వెళ్లెను
9. ధనవంతుడు పరలోక రాజ్యములో ప్రవేశించుట కంటే ........... సులభమని యేసు చెప్పెను. ( )
   ఎ) ఒక మనిషి మహా సముద్రాన్ని ఈదుట
   బి) సూది బెజ్జములో ఒంటె దూరుట
   సి) చంద్రుని వద్దకు ఒక మనిషి రెక్కలు కట్టుకొని ఎగురుట
10. మనలను గూర్చి దేవుడు .................. సంతోషించును. ( )
   ఎ) మనము ధనమును ఇతరులకు పంచి పెట్టినప్పుడు
   బి) మన ధనమంతా మన కొరకు ఖర్చుపెట్టినప్పుడు
   సి) కష్టపడిన ధనాన్ని ఖర్చుపెట్టుటకు తిరస్కరించినప్పుడు

## 20వ పాఠము

# జక్కయ్య

## లూకా 19:1-10

జక్కయ్య పన్నులు వసూలు చేయువాడు.

వాస్తవమునకు అతడు పన్నులు వసూలు చేయు ప్రధాన అధికారి మరియు ధనవంతుడై యుండెను. వారు చేయవలసిన దాని కంటె ఎక్కువ వసూలు చేయుట ద్వారా ప్రజలను మోసము చేయుచున్నారను కారణము చేత పన్నులు వసూలు చేయవారు ద్వేషింపబడిరి. ధనములో కొంత భాగమును వారు ప్రభుత్వమునకిచ్చిరి మరియు మిగిలిన దానిని తమ కొరకు ఉంచుకొనిరి.

పన్నులు వసూలు చేయువారు తామేమి చేయవలెనని బాప్తీస్మమిచ్చు యోహానును అడిగినప్పుడు అవసరమైన దాని కంటె ఎక్కువ వసూలు చేయవద్దని అతడు వారితో చెప్పెను.

అనేక పర్యాయములు బైబిలు నందు వారు పాపులు, అన్యులు మరియు దుర్నీతిపరులైన జనులతో జత కట్టబడిరి. అయితే యేసు వారితో అనేకులను బోధింపబడగల వారిగాను మరియు మారుమనస్సు పొందుటకు సిద్ధముగా ఉన్నవారిగానూ చిత్రించెను.

పరిసయ్యుడు మరియు సుంకరి (పన్నులు వసూలు చేయువాడు) యొక్క ఉపమానము వారి స్వభావము లోని తేడాను చూపును. పరిసయ్యుడు తన మంచితనమును గూర్చి గర్వించెను. అయితే సుంకరి వినయము కలిగియుండెను మరియు పాపక్షమాపణను కోరెను. ఈ ఉపమానమును నీవు లూకా 18:10-14లో చదువగలవు.

జక్కయ్య అట్టి మనుష్యుడై యుండెను. అతడు యేసును చూడగోరెను కాని అతడు అంత పొడగరి కాదు. అతని బ్రతుకంతా సమూహములో జనుల తలలు మరియు భుజముల మీదుగా చూచుచు కష్టపడుచుండెను. అతనికి ఒక ఆలోచన కలిగెను. అతడు సమూహమునకు ముందుగా పరుగెత్తిపోయి యేసు నడుచు దారి ప్రక్కన ఉన్న మేడి చెట్టుపైకి ఎక్కెను.

అతని పొట్టి కాళ్ళు అతనిని ఆ స్థలమునకు తీసుకొనిపోయెను మరియు అతడు ఆ చెట్టు ఎక్కెను. ఎంత శ్రేష్ఠమైన స్థలము! అతనికి "ముందు వరుసలో స్థానము" దొరికెనని మనము చెప్పవచ్చును.

యేసు ఆ చెట్టు వద్దకు వచ్చినప్పుడు ఆయన జక్కయ్య వైపు పైకి చూచెను. వెంటనే దిగిరమ్మని ఆయన అతనితో చెప్పెను. ఆయన జక్కయ్య యింటికి వెళ్లగోరెను! జక్కయ్య ఎంతగానో పొంగిపోయెను. అతడు క్రిందికి దిగెను మరియు యేసును ఆహ్వానించెను.

యేసు ఒక "పాపి" యింటికి వెళ్లుచున్నాడని జనులు యేసును విమర్శించుట మొదలుపెట్టిరి కాని జక్కయ్య ఒక మారుమనస్సు పొందిన పాపి. అతడు చేయుచున్న చెడ్డ విషయములను గూర్చి అతడు దుఃఖపడెను. అతడు కలిగియున్న ఆస్తిలో సగ భాగమును బీదలకు ఇచ్చెదనని మరియు అతడు ఎవరినైనను ఏ విషయమందైనను మోసగించిన యెడల ఆ సొమ్మునకు నాలుగురెట్లు తిరిగి ఇచ్చెదనని అతడు ప్రభువుతో చెప్పెను.

ఈ చిన్న మనుష్యుని హృదయము యొక్క శ్రేష్ఠమైన స్వభావముతో యేసు సంతోషించెను. "నేడు ఈ యింటికి రక్షణ వచ్చియున్నది" అని ఆయన చెప్పెను.

**కంఠత వాక్యము**

నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెను. **లూకా 19:10.**

# 20వ పాఠము - పరీక్ష
# జక్కయ్య

1. జక్కయ్య................ మరియు ధనవంతుడైన మనుష్యుడు. ( )
   ఎ. యాజకుడు
   బి. వ్యాపారస్థుడు
   సి. పన్ను వసూలు చేయువాడు
2. జక్కయ్య వంటి వారు ................. ప్రజలచే ద్వేషింపబడిరి. ( )
   ఎ. ప్రజలను మోసపుచ్చినందున
   బి. చిన్నపిల్లలపై కేకలు వేసినందున
   సి. ప్రజలను చంపినందున
3. బాప్తీస్మమిచ్చు యోహాను జక్కయ్య వంటి వారితో ................ చెప్పెను. ( )
   ఎ. వారి స్వరములు తగ్గించవలెనని
   బి. ప్రజలను బాధించుట మానవలెనని
   సి. వారు చేయవలసినంత వరకే వసూలు చేయవలెనని
4. యేసును చూచుట జక్కయ్యకు సమస్యగా ఉండెను. ఎందుకనగా అతడు................ . ( )
   ఎ. ఆయన ఎక్కడ బోధించుచున్నాడో అతడు కనుగొనలేకపోయెను
   బి. చాలా పొట్టివాడు
   సి. గ్రుడ్డివాడు
5. అతని సమస్యను అతడు.............. ద్వారా పరిష్కరించుకొనెను. ( )
   ఎ. యేసు ఎక్కడ బోధించుచున్నాడో అడుగుట
   బి. ఒక చెట్టుపైకి ఎక్కుట
   సి. చేయిపట్టుకొని తీసుకొని వెళ్లమని ఎవరినైనా అడుగుట
6. దారి ప్రక్కన ఒక ............... ఉండెను. ( )
   ఎ. గంగిరేణి వంటి చెట్టు
   బి. అక్రోటు జాతి చెట్టు
   సి. మేడి చెట్టు
7. .............. యేసు జక్కయ్యతో చెప్పెను. ( )
   ఎ. ఆయన అతని యింటికి వెళ్లగోరుచున్నాడని
   బి. అతడు అపాయకర స్థితిలో ఉన్నాడని
   సి. అతడు చట్టము మీరెనని
8. ............. యేసును ప్రజలు విమర్శించిరి. ( )
   ఎ. దారిలో బోధించుచున్నందున
   బి. సబ్బాతు దినమున స్వస్థపరచుచున్నందున
   సి. పాపి యింటికి వెళ్ళుచున్నందున
9. ............ జక్కయ్య చెప్పెను. ( )
   ఎ. అతని ఆస్థిలో సగము పేదలకు ఇత్తునని
   బి. ఉద్యోగము మారుదునని
   సి. మరలా చెట్టు ఎక్కనని
10. నీకు ఎప్పుడైనా సమస్య వచ్చినచో............ . ( )
   ఎ. ఒకసారి ప్రయత్నించి వదిలివేయుము
   బి. పరిష్కారము లేదని చెప్పుము
   సి. నీవు పరిష్కరించగల అన్ని విధముల ఆలోచించి వాటిని ప్రయత్నించుము.

## 21వ పాఠము

# తలాంతులను గూర్చిన ఉపమానము

**మత్తయి 25:14-30**

యేసు తరచుగా ఒక పాఠమును బోధించుటకు ఒక కథ చెప్పెను. తలాంతులను గూర్చిన కథను వినుము.

ఒకరోజున ఒక మనుష్యుడు దూర ప్రయాణముపై పోవుచుండెను. అతడు వెళ్ళియుండగా అతని ఆస్థిని జాగ్రత్తగా చూచుకొనుటకు అతని దాసులు అతనికి అవసరమైయుండెను కాబట్టి అతడు వారిని తన యొద్దకు పిలిచెను.

మొదటి దాసునికి అతడు ఐదు తలాంతుల ధనమునిచ్చెను. (ఒక తలాంతు ఒక నాణెము కాదు, కాని వెండివంటి విలువైన లోహము యొక్క ఒక తూనిక మరియు ఒక తలాంతు 1000 డాలర్ల కంటె ఎక్కువ విలువ కలది. కాబట్టి ఈ దాసుడు 5000 డాలర్ల కంటే ఎక్కువ విలువైన ధనమును పొందెను).

ఈ మనుష్యుడు దానిని రెట్టింపు చేయువరకు తన ధనమును ఉపయగించుటకు వెంటనే పని ప్రారంభించెను. అతడు యిప్పుడు అయిదుకు బదులుగా పది తలాంతులను కలిగియుండెను. ఆ యజమానుడు రెండవ మనుష్యునికి రెండు తలాంతులు యిచ్చెను. ఆ మాత్రపు ధనమును నిర్వహించుటకు ఆ మనుష్యుడు సామర్థ్యము గలవాడని బహుశ అతడు తలంచెను. రెండవ మనుష్యుడు కూడా సఫలుడయ్యెను మరియు తన ధనమును రెట్టింపు చేసెను. అతడు 2000 కంటే ఎక్కువ డాలర్లతో మొదలు పెట్టెను మరియు ఇప్పుడు అతడు దానికి రెట్టింపు కలిగియుండెను.

మూడవ మనుష్యుడు ఇతర ఇద్దరి అంత సామర్థ్యము కలవాడు కాదు కాని అతడు దానిని బాగుగా నిర్వహించునను ఆశతో యజమానుడు అతనికి ఒక తలాంతు యిచ్చెను. అతడు కూడా అతని ధనమును ఎక్కువ చేసియుండవచ్చును కాని అతడు ఒక గుంట తవ్వి దానిని భూమిలో దాచిపెట్టెను.

చాలాకాలమైన తరువాత ఆ యజమానుడు తిరిగి వచ్చెను. (యజమానుని ప్రయాణము యేసు పరలోకమునకు తిరిగివెళ్ళుట మరియు ప్రయాణము నుండి తిరిగివచ్చుట మానవజాతి తీర్పు యొక్క చిత్రమని కొందరు తలంతురు) అతడు దాసుల నివేదిక కొరకు సిద్ధముగా ఉండెను.

ఐదు తలాంతులు పొందిన మనుష్యుడు తన ధనమును తెచ్చెను మరియు అతడు దానిని రెట్టింపు చేసెనని యజమానునికి చూపెను. ఫలితములను తన యజమానునికి చూపుటకు అతడు సంతోషించెను.

యజమానుడు చాలా సంతోషించెను. అతడు “భళా, నమ్మకమైన మంచి దాసుడా, నీవు ఈ కొంచెములో నమ్మకముగా ఉంటివి, నిన్ను అనేకమైన వాటిమీద నియమించెదను. నీ యజమానుని సంతోషములో పాలు పొందుము”, అని చెప్పెను.

రెండు తలాంతులు యివ్వబడియున్న మనుష్యుడు, అతడు కూడా అతని ధనమును రెట్టింపు చేసెనని యజమానునికి చూపెను. పది తలాంతులు పొందియున్న మొదటి మనుష్యునివలె అతడు అదే ప్రశంసా పలుకులను పొందెను.

ఒక తలాంతు పొందుకొనియున్న మనుష్యుడు అతడు పాతిపెట్టియున్న తలాంతును త్రవ్వితీసి యజమానుని యొద్దకు దానిని తెచ్చెను. అతని యొద్ద పని చేయుటకు అతడు ఒక కఠినుడైన మనుష్యుడని యజమానుని మీద అతడు నేరము మోపెను, అతడు భయపడెనని, కాబట్టి అతడు తన తలాంతును కేవలము పాతిపెట్టెనని చెప్పెను. అతడు దానిని "ఇదిగో, నీది నీవు తీసుకొమ్మని" చెప్పుచు యజమానునికి తిరిగి యిచ్చివేసెను.

యజమానుడు అతని మీద చాలా కోపపడెను మరియు అతనిని ఒక సోమరియైన చెడ్డదాసుడని పిలిచెను. ఆ మనుష్యుడు కనీసము ఆ ధనమును సాహుకారుల యొద్ద ఉంచవలసినదని మరియు వడ్డీ తీసికొని యుండవలసినదని ఆయన చెప్పెను.

(ఇప్పుడు యూదులు ఒక తోటి యూదునికి వడ్డీ వేయుటగాని, వడ్డీ తీసుకొనుటగాని చేయకూడదు కాని యూదుడు కాని వ్యక్తి నుండి వారు వడ్డీ తీసికొనవచ్చును.)

యజమానుడు అతని ఒక్క తలాంతును అతని నుండి తీసికొని, పది తలాంతులు కలిగియున్న మనుష్యునికి యిచ్చెను, మరియు అతనికి యివ్వబడిన తలాంతును సరిగా ఉపయోగించలేదు కావున ఒక తలాంతు మనుష్యుడు శిక్షింపబడెను.

ఈ కథ నుండి మనము యేమి నేర్చుకొనగలము? దేవుడు మనకు యిచ్చియున్న ఎటువంటి "తలాంతు" నైనను మనము ఉపయోగించవలెను. అది ధనము, సామర్థ్యము లేక అవకాశము కావచ్చును. మనము దానిని వివేకముతో ఉపయోగించిన యెడల ఆయన దానిని అధికము చేయును. దానిని బట్టి మన జీవితములు ఆయనను మహిమపరచును.

### : కంఠత వాక్యము :

కలిగిన ప్రతివానికి ఇయ్యబడును అతనికి సమృద్ధి కలుగును, లేనివాని యొద్ద నుండి వానికి కలిగినదియు తీసివేయబడును. **మత్తయి 25:29**

## 21వ పాఠము – పరీక్ష

# తలాంతులను గూర్చిన ఉపమానము

1. ప్రయాణమైపోవుచున్న మనుష్యుడు ................. అవసరము కలిగియుండెను . ( )
   ఎ) రైలు వరకు ఎవరైన దింపవలసిన
   బి) తన ప్రయాణము కొరకు ధనము యొక్క
   సి) అతడు వెళ్ళియుండినప్పుడు అతని ఆస్థిని ఎవరైనా జాగ్రత్తగా చూడవలసిన
2. మొదటి దాసుడు ................... పొందెను . ( )
   ఎ) అయిదు తలాంతులు
   బి) రెండు తలాంతులు
   సి) ఒక తలాంతు
3. మొదటి దాసుడు ......................... . ( )
   ఎ) తన ధనమును భూమిలో దాచెను
   బి) దాని పది తలాంతులకు రెట్టింపు చేసెను
   సి) జూదమాడి తన ధనమును పోగొట్టుకొనెను
4. రెండవ మనుష్యుడు బహుశ ............ చేత రెండు తలాంతులు మాత్రమే పొందెను . ( )
   ఎ) ఆ మాత్రమే నిర్వహించుటకు అతడు సామర్థ్యము కలిగియుండెనని అతని యజమానుడు తలంచుట
   బి) అతడు యజమానునికి ధనము ఋణపడియుండెను
   సి) అతడు సోమరియైన పనివాడు
5. యజమానుడు మూడవ మనుష్యునికి ............... యిచ్చెను . ( )
   ఎ) సరిగా మొదటి మనుష్యునికి యిచ్చినది
   బి) సరిగా రెండవ మనుష్యునికి యిచ్చినది
   సి) ఒక తలాంతు మాత్రమే
6. మూడవ మనుష్యుడు ........................ . ( )
   ఎ) దానిని అయిదు రెట్లు వృద్ధిచేయుట ద్వారా ప్రతి ఒక్కరిని ఆశ్చర్యపరిచెను
   బి) తన తలాంతును భూమిలో దాచెను
   సి) దానిని నదిలో పడవేసెను
7. అయిదు తలాంతుల మనుష్యుడు తన నివేదికను యిచ్చినప్పుడు, యజమానుడు ............. . ( )
   ఎ) చాలా సంతోషించెను
   బి) సంతోషించలేదు
   సి) అతని మాట వినలేదు
8. రెండు తలాంతుల మనుష్యుడు తన నివేదిక యిచ్చినప్పుడు యజమానుడు ............... . ( )
   ఎ) అతడు యింకను ఎక్కువ సంపాదించి యుండవలసినదని అతనితో చెప్పెను
   బి) అతనిని ప్రశంసించెను
   సి) అతని ధనమును ఒక తలాంతు మనుష్యునికి యిచ్చెను
9. యజమానుడు ఒక తలాంతు మనుష్యుని మీద ............. ఉండెను . ( )
   ఎ) చాలా కోపముతో
   బి) సంతోషించెను
   సి) ఆసక్తి చూపలేదు
10. దేవుడు మనకు యిచ్చియున్న సామర్థ్యములను మనము .................. . ( )
    ఎ) దాచిపెట్టవలెను
    బి) తిరస్కరించవలెను
    సి) ఉపయోగించవలెను

## 22వ పాఠము

# పదిమంది కన్యకలను గూర్చిన ఉపమానము

**మత్తయి 25:1-13**

ఒకరోజు యేసు ఒక పెండ్లి విందును గూర్చిన ఒక కథను చెప్పెను. కథను వినుటకు ముందు యూదుల సాంప్రదాయములను గూర్చి మనము కొంత నేర్చుకొందము.

యూదుల పెండ్లి ఒక దీర్ఘకాల సమయములో మూడు దశలలో జరిగెను. వధూవరులు యింకను లేత యవ్వన దశలో ఉండగానే తల్లిదండ్రులు, కొన్నిసార్లు "పెండ్లిండ్లను కుదుర్చువారి" సహాయముతో ఒక నిశ్చితార్థము ఏర్పాటు చేయుదురు.

రెండవదిగా, పెండ్లికూతురు యింటి వద్ద ఒక ప్రధాన కార్యక్రమము జరుగును. వధూవరులు ప్రమాణములు చేసుకొందురు మరియు పెండ్లి కుమారుడు పెండ్లి కుమార్తెకు బహుమతులు యిచ్చును. ఈ కాలము ఒకటి లేక రెండు సంవత్సరములు ఉండెను, కాని పెండ్లి కుమార్తె ఆమె తల్లిదండ్రుల యొద్దనే ఉండును. ఈ సమయములో పెండ్లికుమార్తె ఆ యవనస్థునికి "ప్రధానము చేయబడినది" లేక "వివాహ ఒప్పందము చేయబడినది" అని చెప్పబడును.

తరువాత పెండ్లి విందు భోజనము వచ్చును. సాధారణముగా అది రాత్రి జరుగును. పెండ్లి కుమారుడు మరియు అతని స్నేహితులు పెండ్లి కుమార్తె యింటికి వచ్చెదరు. ఆమె ఒక దళసరియైన ముసుగును ధరించును. ఆమె మరియు ఆమె స్నేహితులు పెండ్లి కుమారుడు మరియు అతని స్నేహితుల వెంట అతని తండ్రి యింటికి లేదా బహుశ పెండ్లి వేడుకలు జరుగు పెద్ద హాలుకు వెళ్ళుదురు. ఒక ఒప్పందము సంతకము చేయబడును. పెండ్లికుమార్తె మరియు పెండ్లి కుమారుడు కొంత సమయము కలసి గడుపుదురు, అప్పుడు పెండ్లికుమార్తె ఏడు దినములు ఒంటరిగా ఉండును. వారము అంతమున, పెండ్లికుమార్తె గుంపు నొద్దకు తిరిగివచ్చును ప్రతి ఒక్కడు ఆమెను చూడగలుగునట్లు తన ముసుగు తీసివేయును. ఆ యవనస్థురాలు ముందెన్నడును పెండ్లియాడని యెడల విందు ఏడు దినములు జరుగును. ఆమె పునర్వివాహము చేసుకొనుచున్న ఒక విధవరాలైన యెడల అది మూడు దినములు జరుగును.

యేసు చెప్పిన కథలో పదిమంది కన్యకలు పెండ్లికుమారుని రాక కొరకు కనిపెట్టుకొనియుండిరి. బహుశ వారు పెండ్లికుమారుడు తన పెండ్లికుమార్తెను తీసికొని వచ్చుచున్న పెండ్లి వేడుక స్థలమునొద్ద అప్పటికే ఉండి యుండవచ్చును. అది రాత్రి సమయము మరియు వారందరు వాటిలో నూనె ఉన్నట్టి దివిటీలను కలిగియుండిరి మరియు ఆ దివిటీలు ప్రకాశవంతముగా వెలుగుచుండెను.

వారు చాలా సమయము వేచియుండిరి. ఇంకను పెండ్లి గుంపు రాలేదు. చాలా సమయము గడిచినందున వారికి నిద్రమైకము కమ్మెను మరియు ఒకరి తరువాత ఒకరు నిద్రపోయిరి.

అప్పుడు వారు, ఇదిగో పెండ్లికుమారుడు! అతనిని కలుసుకొనుటకు బయటకు రండి" అని ఎవరో పిలుచుట వినిరి. వారు లేవబోయిరి కాని కొన్ని దివిటీలు ఆరిపోవుట మొదలాయెను.

అయిదుగురు కన్యకలు అట్టి సంఘటన కొరకు సిద్ధపడియుండిరి. వారు ముందుగానే ఆలోచించి ఆలస్యమగునని ఊహించిరి. వారి దివిటీలలో నింపుటకు ఎక్కువ నూనె కలిగియుండిరి. ఇట్లు సిద్ధపడుటకు వారు బుద్ధి కలిగియుండిరి.

అయిదుగురు బుద్ధిలేని కన్యకల యొద్ద అధికమైన నూనె లేదు. వారు బుద్ధిగల కన్యకల నుండి కొంత అప్పు తీసుకొనగోరిరి, కాని వారు నిరాకరించిరి. వారు తమ యొద్ద వారందరికి సరిపడునంత నూనె ఉండకపోవచ్చుననిరి.

వారు ఈ కన్యకలు దానిని అమ్మువాని యొద్దకు వెళ్ళి కొంచెము నూనె కొనుక్కొనుడని చెప్పిరి. ఆ కన్యకలు వారికి నూనె అమ్మునట్టి వ్యాపారిని కనుగొనుటకు వెళ్ళిరి.

వారు వెళ్ళియుండగా పెండ్లి కుమారుడు వచ్చెను మరియు అయిదుగురు బుద్ధిగల కన్యకలు మరియు మిగిలిన పెండ్లి గుంపు అంతయు లోనికి వెళ్ళిరి. తలుపు మూయబడెను.

అయిదుగురు బుద్ధిలేని కన్యకలు తిరిగివచ్చిరి. వారి కొరకు ఎవరైనా తలుపు తీయవలెనని వారు కేకలు వేసిరి కాని వారి విచారమేమంటే  వారు ప్రవేశించుటకు ఎట్టి మార్గము లేకుండెను. “మిమ్మునెరుగనని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను” అని పెండ్లి కుమారుడు బదులిచ్చెను.

ఈ ఉపమానము యొక్క అర్థమును గూర్చి అనేక అభిప్రాయములున్నవి. అయితే ఒక అభిప్రాయము చాలా తేటగా  కనిపించును. ప్రభువు రాకడ కొరకు లేక మన జీవితముల  అంతము కొరకు  మనము ఎల్లప్పుడు సిద్ధముగా ఉండు విధముగా మనము మన జీవితములను జీవించవలెను.

### : కంఠత వాక్యము :

మీరు అనుకొనని గడియలో మనుష్య కుమారుడు వచ్చును గనుక మీరును సిద్ధముగా ఉండుడి. **లూకా 12:40**

## 22వ పాఠము - పరీక్ష

# పదిమంది కన్యకలను గూర్చిన ఉపమానము

1. ఈ ఉపమానములో పదిమంది కన్యకలు ........... రాక కొరకు ఎదురుచూచుచుండిరి. ( )
   ఎ) పెండ్లి కుమార్తె
   బి) పెండ్లి కుమారుని
   సి) పెండ్లికుమారుని స్నేహితుని
2. అది రాత్రి సమయము కాబట్టి వారందరు .......... కలిగియుండిరి . ( )
   ఎ) ఫ్లాష్ లైట్లు
   బి) కిరోసిన్ దివిటీలు
   సి) నూనె దివిటీలు
3. ఆలస్యమైనందున కన్యకలు ........... మొదలుపెట్టిరి . ( )
   ఎ) నిద్రపోవుట
   బి) వదలివేయుట
   సి) బిగ్గరగా మాట్లాడుట
4. కొన్ని దివిటీలు ............. మొదలాయెను . ( )
   ఎ) ఎక్కువ ప్రకాశవంతముగా వెలుగుట
   బి) ఆరిపోవుట
   సి) పడిపోవుట
5. సిద్ధపడిన అయిదుగురు కన్యకలు .................... . ( )
   ఎ) వారితో అధికముగా నూనె కలిగియుండిరి
   బి) తమ డబ్బు తీసికొనిరి మరియు నూనె కొనుటకు వెళ్ళిరి
   సి) తమ పొరుగువారిని నూనె కొరకు అడిగిరి
6. బుద్ధిలేని కన్యకలు నూనె అప్పు యిమ్మని అడిగినప్పుడు వారు .......... చెప్పబడిరి . ( )
   ఎ) ఇతరులు సంతోషముగా పంచుకొందురని
   బి) వెళ్ళి మరింత నూనె కొనుక్కొమ్మని
   సి) కొనుక్కొనుటకు అక్కడ యిక ఏమాత్రము నూనె లేదని
7. బుద్ధిలేని కన్యకలు ................. వెళ్ళిరి . ( )
   ఎ) నూనె బావిని కనుగొనుటకు
   బి) నూనె తెచ్చుకొనుటకు యింటికి తిరిగి
   సి) నూనె కొనుక్కొనుటకు వ్యాపారి యొద్దకు
8. ఆ కన్యకలు తిరిగి వచ్చినప్పుడు ........................ . ( )
   ఎ) వారు పెండ్లికి తిరిగి ఆహ్వానింపబడిరి
   బి) తలుపు మూయబడెను
   సి) బుద్ధిగల కన్యలు వారి కొరకు తలుపు తెరచిరి
9. వారు కేకలు వేసినప్పుడు ........... పెండ్లికొడుకు జవాబిచ్చెను . ( )
   ఎ) నేను మిమ్ము నెరుగనని
   బి) మీరు యిక్కడనే యుండవలసినదని
   సి) మీరు చాలినంతగా సిద్ధపడలేదని
10. మనము .............. మనము మన శ్రేష్ఠమైన పని చేయుదుము . ( )
   ఎ) ఒక పని చేయుటకు చివరి నిముషము వరకు వేచియున్నప్పుడు
   బి) ఒక పని ముగించుటకు తొందరపడినప్పుడు
   సి) ముందుగానే మొదలుపెట్టి, దానిని బాగుగా చేయుటకు చాలినంత సమయమును ప్రణాళిక చేసుకొన్నప్పుడు

## 23వ పాఠము

# యెరూషలేముకు వెళ్ళుట

**ప్రియమైన తల్లిదండ్రులారా,**

మన బైబిలు అధ్యయనము నందు మనము ఇప్పుడు యేసు జీవితములోని చివరి వారమునకు వచ్చియున్నాము. యెరుషలేము లోనికి యేసు యొక్క విజయోత్సాహ ప్రవేశముపై మనము కేంద్రీకరించెదము.

## యెరూషలేముకు వెళ్ళుట

యేసు మరియు ఆయన శిష్యులు పస్కా పండుగ కొరకు యెరూషలేము వెళ్ళు తమ మార్గములో ఉండిరి. మార్గములోని ఒక గ్రామము లోనికి వెళ్ళమని మరియు ఎన్నడును ఎవడును ఎక్కని ఒక గాడిద పిల్లను వారు కనుగొందురని యేసు తన ఇద్దరు శిష్యులతో చెప్పెను. వారు దానిని యేసునొద్దకు తేవలెను. ఎవడైనను వారిని ప్రశ్నించిన యెడల అది ప్రభువునకు కావలసియున్నదని వారు చెప్పవలెను. వెంటనే అతడు దానిని తోలిపెట్టును. అని వారితో చెప్పను.

అనేక సంవత్సరములకు ముందే ప్రవక్త, “ఇదిగో నీ రాజు సాత్వీకుడై, గాడిదను భారవాహక పశువు పిల్లయైన చిన్న గాడిదను, ఎక్కి నీ యొద్దకు వచ్చుచున్నాడు” అని చెప్పియుండెను.

వారు ఆ గాడిదను యేసు నొద్దకు తెచ్చిరి మరియు తమ బట్టలు దానిపై వేసిరి మరియు ఆయన దానిపైన కూర్చుండెను. వారు మార్గమున వెళ్ళుచుండగా జనులు వారి ముందున్న దారి పొడుగున తమ బట్టలు పరచుట మొదలుపెట్టిరి. కొందరు కొమ్మలను నరికి వాటిని దారిలో పరిచిరి. వారు తమ రాజు యొక్క ప్రవేశమునకు మార్గము సిద్ధపరచుచుండిరి.

వారు “దావీదు కుమారునికి జయము. ప్రభువు పేరిట వచ్చువాడు స్తుతింపబడును గాక. సర్వోన్నతమైన స్థలములలో జయము” అని కేకలు వేసిరి.

మరుసటి దినమున ఆయన యెరూషలేములో దేవాలయమును ప్రవేశించెను. ఆయన దేవాలయము ప్రాంగణము లోనికి ప్రవేశించినప్పుడు జనులు బలి అర్పించుటకు గాను పశువులు, గొఱ్ఱెలు మరియు పావురములను కొనుట మరియు అమ్ముటను చూచెను. ఆయన మిక్కిలి కోపము తెచ్చుకొనెను మరియు త్రాళ్ళతో ఒక కొరడాను చేసి, వారిని వెళ్ళ గొట్టెను. ఆయన రూకలు మార్చు బల్లలను పడద్రోసెను మరియు జంతువులను ఆ ప్రదేశము నుండి త్రోలివేసెను.

ఆయన “వీటిని యిక్కడ నుండి తీసివేయుడి! నా తండ్రి యింటిని ఒక అంగడిగా మార్చుటకు మీకు ఎంత ధైర్యము!” అని చెప్పెను.

“దావీదు కుమారునికి జయము” అని చిన్న పిల్లలు యింకను కేకలు వేయుచుండిరి. చిన్న పిల్లలు యేమి చెప్పుచున్నారో ఆయన వినెనా అని దేవాలయపు నాయకులు ఆయనను అడిగిరి. “అవును. బాలుర యొక్కయు చంటి పిల్లల యొక్కయు నోట స్తోత్రము సిద్ధింపజేసితివి” అని ఆయన చెప్పెను. చిన్న పిల్లల స్తుతి వినుటను యేసు ప్రేమించును.

యేసు యెరూషలేముకు వెళ్ళుటను గూర్చిన కథ మార్కు 11వ అధ్యాయము 1–19వ వచనములలో కనుగొనబడును.

### : కంఠత వాక్యము :

జన సమూహములలో ఆయనకు ముందు వెళ్ళుచుండినవారును, వెనుక వచ్చుచుండిన వారును దావీదు కుమారునికి జయము అని కేకలు వేయుచుండిరి. **మత్తయి 21:9**

## 23వ పాఠము - పరీక్ష

# యెరూషలేముకు వెళ్ళుట

1. యేసు ............. కొరకు యెరూషలేమునకు వెళ్ళుచుండెను. ( )
   ఎ) పస్కా పండుగ
   బి) పెంతెకోస్తు
   సి) పర్ణశాలల పండుగ
2. దానిపై ప్రయాణించుటకు ఒక ..... ను కనుగొనవలెనని ఆయన తన శిష్యులకు చెప్పెను . ( )
   ఎ) ఒంటె
   బి) గుర్రము
   సి) గాడిద
3. వారు కనుగొనవలసిన జంతువు ముందుగానే ............... . ( )
   ఎ) వారము ముందే నిర్ణయింపబడెను
   బి) ప్రకక్తల ద్వారా కొన్ని సంవత్సరములకు ముందే చెప్పబడెను
   సి) ఆయన తల్లి చేత ఎంపిక చేయబడెను
4. ఆయన త్రోవను వెళ్ళుచుండగా ప్రజలు ............. నేలపై వేసిరి. ( )
   ఎ) బట్టలు మరియు కొమ్మలు
   బి) పువ్వులు మరియు బట్టలు
   సి) కొమ్మలు మరియు ఆకులు
5. ప్రజలు "..................." అని కేకలు వేయుచుండిరి. ( )
   ఎ) యేసుకు దారి యియ్యుడి
   బి) దావీదు కుమారునికి జయము
   సి) యేసు ఒక జంతువుపై కూర్చొని వచ్చుచున్నాడు
6. యేసు దేవాలయము లోనికి ప్రవేశించినప్పుడు ఆయన .......... చూచెను . ( )
   ఎ) ప్రజలు ప్రార్థించుటను
   బి) చిన్న పిల్లలు పాడుటను
   సి) రూకలు మార్చువారు జంతువులను అమ్ముటను
7. యేసు యేమి జరుగుచున్నదో చూచినప్పుడు ఆయన ........... . ( )
   ఎ) బల్లలు పడద్రోసి జంతువులను వెళ్ళగొట్టెను
   బి) ప్రజలతో కలసి ప్రార్థించెను
   సి) పాడువారితో కలసి పాడెను
8. యేసు దేవాలయమును ............. శుద్ధి చేసెను. ( )
   ఎ) పశువులను పొడిచే కర్రతో
   బి) త్రాళ్ళతో చేసిన కొరడాతో
   సి) పెద్ద కర్రతో
9. పిల్లలు పాడుటకు ప్రారంభించినప్పుడు యేసు ............. . ( )
   ఎ) మౌనముగా ఉండుడి అని వారితో చెప్పెను
   బి) వారు పాడుచుండిన దానిని ఆమోదించెను
   సి) వారిని నిశ్శబ్దముగా ఉంచుడని దేవాలయ పెద్దలతో చెప్పెను.
10. పిల్లలు .......... వారు యేసును ఘనపరచెదరు . ( )
    ఎ) తల్లిదండ్రులకు అవిధేయులైనప్పుడు
    బి) వారు తమ సహోదరి సహోదరులతో పోట్లాడినప్పుడు
    సి) తల్లిదండ్రులకు లోబడి మరియు గౌరవించినప్పుడు

## 24వ పాఠము

ప్రియమైన తల్లిదండ్రులారా,

ఈ వారము మన బైబిలు కథ మార్కు సువార్తలో కనుగొనబడు విధవరాలి చిన్న కానుక యొక్క కథ నుండి తీసుకొనబడును మనము మన సంపాదనలో నుండి యివ్వవలెనని దేవుడు కోరుచున్నాడని మీ పిల్లలు గ్రహించుటకు ఈ కథ సహాయము చేయును. మనము యిచ్చు మొత్తము కన్న దాని వెనుక ఉద్దేశమునకు ఆయన ఎక్కువ విలువనిచ్చును.

"దేవుడు ఉత్సాహముగా ఇచ్చువానిని ప్రేమించును" అని **2 కొరింథీయులు 9:7** మనకు చెప్పును.

మీ పిల్లలు తమ సంపాదనలో నుండి కానుకలు యివ్వలేని యెడల వారు యింటి వద్ద డబ్బు సంపాదించుటకు అదనపు అవకాశములు సమకూర్చుటకు నీవు ఆలోచించవచ్చును.

# యేసు ఇచ్చుటను గూర్చి బోధించుట

**విధవరాలు కానుక : మార్కు 12:41-43**

దేవాలయము పెద్దది మరియు అందమైనది అనేక మంది ప్రజలు దేవుని ఆరాధించుటకు అక్కడకు వచ్చిరి. దేవాలయము లోపల కొన్ని పెద్ద కానుక పెట్టెలు ఉన్నవి. జనులు వాటిలో ధనమును వేసిరి. ఆ ధనము దేవాలయము కొరకై యుండెను మరియు అదంతయు దేవుని ఆరాధించుట కొరకు వాడబడెను.

ఒక రోజు యేసు కానుకల పెట్టెల ఎదురుగా కూర్చుండెను. అనేక మంది ధనవంతులైన ప్రజలు చాలా ధనమును అందులో వేయుట ఆయన చూచెను. అప్పుడు ఒక బీద విధవరాలు పెట్టెల యొద్దకు నడచి వెళ్లెను. ఆమె ఒక కాసు కన్న తక్కువ విలువగల రెండు చిన్న రాగి నాణెములను అందులో వేసెను.

యేసు తన స్నేహితుల వైపు చూచెను. "ఈ బీద స్త్రీ ధనవంతులైన ప్రజలు వేసిన దాని కంటే ఎక్కువ వేసినది" అని ఆయన చెప్పెను."ఎందుకనగా ధనవంతులైన ప్రజల యొద్ద యింకను చాలా ధనము మిగిలియున్నది. అయితే ఈ స్త్రీ కేవలము రెండు నాణెములనే కలిగియున్నది. ఆమె వద్ద యిక యేమాత్రము ధనము లేదు. ధనవంతులైన ప్రజలు వారు కలిగియున్న దానిలో ఒక భాగము మాత్రమే యిచ్చిరి. ఈమె తనకు కలిగినదంతయు యిచ్చివేసెను"

**గొఱ్ఱెలు మరియు మేకలు మత్తయి : 25:31-46**

మరియొక సందర్భములో యేసు గొఱ్ఱెలు మరియు మేకలను గూర్చిన కథను చెప్పెను. ఆయన తిరగివచ్చినప్పుడు, ఒక మనుష్యుడు తన గొఱ్ఱెలను తన మేకల నుండి వేరు చేయునట్లు ఆయన జనులను వేరు చేయునని ఆయన చెప్పెను.

దేవుని సంతోషపరచువారు గొఱ్ఱెలతో పోల్చబడిరి. అక్కరలో ఉన్న వారికి ఇచ్చుటకు యిష్టపడువారు దేవుని సంతోషపరచువారుగా ఉండిరి. ఆయన ఆకలిగా ఉన్నప్పుడు వారాయనకు భోజనము పెట్టిరని, ఆయన దప్పిగొనినప్పుడు ఆయనకు వస్త్రములిచ్చిరని యేసు వారితో చెప్పెను. ఆయన రోగిగా ఉన్నప్పుడు మరియు చెరసాలలో ఉన్నప్పుడు వారాయనను దర్శించియుండిరి.

యేసు కొరకు ఈ సంగతులు చేసినట్లు వారు గుర్తు చేసుకొనలేకపోయిరి, అయితే "మిక్కిలి అల్పులైన యీ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకు చేసితిరి" అని ఆయన సమాధానమిచ్చెను.

**కంఠత వాక్యము**

కానుక పెట్టెలో డబ్బులు వేసిన వారందరి కంటె ఈ బీద విధవరాలు ఎక్కువ వేసెనని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. వారందరు తమకు కలిగిన సమృద్ధిలో నుండి వేసిరి గాని యీమె తన లేమిలో తనకు కలిగినదంతయు అనగా తన జీవన మంతయు వేసెనని చెప్పెను. **మార్కు 12:43-44**.

## 24వ పాఠము - పరీక్ష

1. ప్రజలు దేవాలయమునకు వెళ్ళినపుడు వారు పెట్టెలో.... వేసిరి. ( )
   ఎ. అవసరతలో ఉన్న వారికి ఆహారము
   బి. చిహ్నములు
   సి. ధనము
2. యేసు దేవాలయములో కూర్చుని పరిశీలించినప్పుడు ధనవంతులు........... . ( )
   ఎ. ఎక్కువ ధనము వేసిరి
   బి. ఆయనతో మాట్లాడుట మానివేసిరి
   సి. ఆయనను తిరస్కరించిరి.
3. ఆ విధవరాలు ................ వేసినది. ( )
   ఎ. తక్కువ ఆహారాన్ని
   బి. రెండు చిన్న నాణెములు
   సి. పది నాణెములు
4. ఆమె ఇతరులకన్నా ఎక్కువ ఇచ్చెనని యేసు చెప్పారు. ఎందుకంటే....... . ( )
   ఎ. ఆమె తనకు కలిగినదంతయు ఇచ్చెను
   బి. ఆమె నాణెములు పెద్దవిగా ఉన్నవి
   సి. ఆమె నిజముగా ఇవ్వాలని అనుకోలేదు.
5. యేసు........... గూర్చి కథ చెప్పెను. ( )
   ఎ. ఆవులు మరియు గుర్రములు
   బి. గొర్రెలు మరియు ఆవులు
   సి. గొర్రెలు మరియు మేకలు
6. దేవుని సంతోషపరిచే వారిని ఆయన...............తో పోల్చెను. ( )
   ఎ. ఆవుల
   బి. గొర్రెల
   సి. గుర్రముల
7. దేవుని సంతోషపరిచే వారు.............. . ( )
   ఎ. ఎక్కువ సంపాదించాలని కోరిక కలిగి ఉంటారు.
   బి. అవసరములో ఉన్నవారికి పంచుటకు సిద్ధముగా ఉంటారు.
   సి. ఎల్లప్పుడు మంచి వస్త్రాలు ధరించుకుంటారు.
8. ప్రజలు............... దేవుని సంతోషరచుదురు. ( )
   ఎ. రోగులను, చెరసాలలో ఉన్న వారిని దర్శించినప్పుడు
   బి. రోగులకు దూరముగా ఉన్నప్పుడు
   సి. చెడ్డపనులు చేసి చెరసాలకు వెళ్లినప్పుడు
9. మనము ఇతరులకు సహాయము చేసినప్పుడు మనము........... అని యేసు చెప్పెను. ( )
   ఎ. మోషే ధర్మశాస్త్రములను అనుసరించువారము
   బి. దేశ చట్టాలకు లోబడచున్నాము
   సి. ఆయనకు సహాయము చేయుచున్నాము.
10. ఇతరులకు సహకరించుటకు ధనవంతుడు ధనము ఇచ్చినప్పుడు అతనికి......... . ( )
   ఎ. తన కుటుంబానికి ఆహారం లేకుండా చేయును.
   బి. చాలా ధనము మిగిలి యుండును.
   సి. కఠిన హృదయాన్ని కలిగి యుండుటను చూపించును.

## 25వ పాఠము

# యేసు దేవాలయమును శుద్ధి చేయుట

## మత్తయి 21:12-17

యేసు బోధించుచు, స్వస్థపరచుచు మరియు అనేక ఆశ్చర్య కార్యములు చేయుచు ఉండెను. అది సంవత్సరమునకు ఒకసారి వచ్చు యూదుల పండుగయైన పస్కాపండుగ సమయము. యేసు ఒక గాడిదపై సవారి చేయుచు యెరూషలేము ప్రవేశించెను. ప్రజలు వారి వస్త్రములను నేలమీద వేసిరి మరియు చెట్లనుండి కొమ్మలను నరికి, వాటిని ఊపుచు "సర్వోన్నతమైన స్థలములో జయము" అని వారు కేకలు వేసిరి. అది ఒక సంతోషకరమైన జయకరమైన సందర్భము.

యేసు దేవాలయములోనికి వెళ్లెను మరియు చుట్టును అక్కడ జరుగుచున్న సమస్తమును చూచెను. అయితే ఆలస్యమాయెను మరియు ఆయన అక్కడ నిలువలేదు. ఆయన మరియు ఆయన పన్నెండు మంది శిష్యులు బేతనియకు తిరిగి వెళ్లిరి మరియు రాత్రి గడిపిరి.

మోషే ధర్మశాస్త్రము ప్రకారము ప్రజలు జంతుబలులను అర్పించవలసియున్నది. యెరూషలేము లోని దేవాలయము చేరుటకు నీవు చాలదూరము ప్రయాణము చేయవలసియున్న యెడల బహుశ నీవు నీ జంతువును నీతో కూడ తీసికొని పోక, నీవు కొంత ధనమును తీసుకొని, నీవు యెరూషలేము  చేరిన తరువాత నీ అర్పణము కొరకు ఒక జంతువును కొందువు.

మరుసటి దినము వారు యెరూషలేమునకు తిరిగి వెళ్లిరి మరియు యేసు దేవాయలము లోనికి వెళ్లెను. అయితే ఈ సారి ఆయన చర్య తీసుకొనెను. దేవాలయము యొక్క ఆవరణములోనే సరిగా అక్కడనే మనుష్యులు బలులర్పించుట కొరకు జంతువులను అమ్ముచుండిరి! ఇది మంచిది కాదని ఆయన ఎఱిగియుండెను మరియు దాని కొరకు ఒకటి చేసెను. ఆయన త్రాళ్ళతో ఒక కొరడాను చేసెను మరియు రూకలు మార్చు వారిని, గొఱ్ఱెలు, ఎడ్లు మరియు పావురములతో పాటు ఆయన తరిమివేసెను. ఆయన వారి బల్లలను పడద్రోసెను మరియు ఆ ధనమును దేవాలయపు నేలపైన పారబోసెను.

"వీటిని బయటికి తీసుకొని పొండి! నా తండ్రి మందిరము ప్రార్థనా మందిరమని పిలువబడును అయితే మీరు దానిని దొంగల గుహగా చేసియున్నారు" అని ఆయన చెప్పెను.

దీని అంతటి ద్వారా యూదుల మత నాయకులు చాల కలవరము చెందిరి మరియు వారు యేసును నాశనము చేయు మార్గమును వెదకుట ప్రారంభించిరి. అయితే ప్రజలందరు ఆయన బోధకు ఆశ్చర్యపడినందున వారు ఆయనకు భయపడిరి.

అప్పుడు గ్రుడ్డివారు మరియు కుంటివారు దేవాలయములో ఆయన యొద్దకు వచ్చిరి మరియు ఆయన వారిని స్వస్థపరిచెను. "దావీదు కుమారునికి జయము!" అని చిన్న పిల్లలు కేకలు వేయుచుండిరి. మత నాయకులు దానిని వినిన్నప్పుడు వారాయనతో "వీరు చెప్పుచున్నది వినుచున్నావా?" అనిరి.

అవును, యేసు వినెను మరియు ఆయన వారి స్తుతిని అంగీకరించెను. అది చిన్న పిల్లల పెదవుల నుండి వచ్చుచున్న "పరిపూర్ణ స్తుతి" అని ఆయన నాయకులతో చెప్పెను.

**కంఠత వాక్యము**

"నా మందిరము ప్రార్థన మందిరము అనబడును, అయితే మీరు దానిని 'దొంగల గుహ'గా చేసియున్నారు" అని వ్రాయబడియున్నది. **మత్తయి 21:13.**

## 25వ పాఠము – పరీక్ష

# దేవాలయమును శుద్ధి చేయుట

1. యేసు యెరూషలేములో............ కొరకు ఉండెను. ( )
   - ఎ. పస్కా పండుగ
   - బి. పెంతకోస్తు
   - సి. వర్ణశాలల పండుగ
2. యేసు దేవాయలము లోపలికి వెళ్ళి చుట్టూ చూసిన తరువాత ఆయన .................. . ( )
   - ఎ. చూసినది ఆయనకు నచ్చ లేదని చెప్పెను.
   - బి. చూసిన వాటిని మరచిపోవుటకు నిర్ణయించుకొనెను
   - సి. ఆయన బేతనియకు వెళ్ళి ఆ రాత్రి గడిపెను
3. ఆయన యెరుషలేమునకు ................. తిరిగి వెళ్ళెను. ( )
   - ఎ. ఒక వారము తరువాత
   - బి. మరుసటి రోజు
   - సి. రెండు రోజుల తరువాత
4. యేసు......................... . ( )
   - ఎ. ఆరాధనకు వెళ్ళెను కాని రూకలు మార్చువారిని అలా ఒంటరిగా విడిచిపెట్టెను
   - బి. బల్లలు పడద్రోసి పారవేసెను
   - సి. పొరుగు పట్టణమునకు తిరిగి వెళ్ళెను.
5. ఆయన .................... ” అని చెప్పెను. ( )
   - ఎ. నా తండ్రి ఇల్లు ప్రార్థనమందిరమనబడును
   - బి. నాకు జంతువులు అంటే ఇష్టము. వాటిని అలా ఉండనీయుడి
   - సి. ఇది ఏదో మంచి వ్యాపారములా ఉన్నది
6. యూదా నాయకులు యేసుకు భయపడ్డారు. ఎందుచేతనంటే................. . ( )
   - ఎ. వారు ఆయనను దేవుడు అని అనుకున్నారు
   - బి. ఆయన చాలా పెద్దగా బలముగా ఉన్నారు
   - సి. ప్రజలందరూ ఆయన బోధకు ఆశ్చర్యపడిరి
7. దూర ప్రాంతము నుండి ఎల్లప్పుడు ప్రయాణము చేయువారు................ . ( )
   - ఎ. ఎల్లప్పుడు వారు బలిగా అర్పించే జంతువులను వారితో కూడా తెచ్చుకునేవారు
   - బి. యెరుషలేమునకు వచ్చిన తర్వాత వారు బలులకై జంతువులను కొనెడివారు.
   - సి. జంతువులను బలిగా అర్పించరు.
8. రూకలు మార్చువారు................. చేసి ఉండవలసినది. ( )
   - ఎ. జంతువులను దేవాయలము బయట అమ్ముట.
   - బి. దూరము నుండి వచ్చిన వారికి ఎక్కువ ఖరీదుకి అమ్ముట
   - సి. త్రోవ ప్రక్కన జంతువులను అమ్ముట
9. చంటి పిల్లల స్తుతిని యేసు.................... అని పిలిచెను. ( )
   - ఎ. అంగీకారమైన స్తుతి    బి. పరిపూర్ణ స్తుతి    సి. అసలు స్తుతియే లేదు
10. ఎగతాళి చేయబడుచున్న వ్యక్తిని మనము చూసినపుడు మనము ...................... . ( )
    - ఎ. హేళన చేయువారితో కలవవలెను.
    - బి. మౌనముగా ఉండవలెను
    - సి. హేళన చేయబడుచున్న వ్యక్తి కొరకు మాట్లాడవలెను.

## 26వ పాఠము

ప్రియమైన తల్లిదండ్రులారా,

ఈ వారము మన బైబిలు పాఠములో మనము "భూమి మీద యేసు చివరి వారము" గూర్చి ప్రత్యేకముగా అధ్యయనము చేయుదుము.

గురువారము : చివరి రాత్రి భోజనము మరియ గెత్సెమనెలో శ్రమపడుట

శుక్రవారము: ఆయన విచారణ మరియు సిలువ వేయబడుట

# యేసు చివరి దినములు

**చివరి రాత్రి భోజనము : మత్తయి 26:17-30, మార్కు 14:12-26**

పస్కా భోజనము తినుటకు ఎక్కడ సిద్ధము చేయవలెనని నీవు కోరుచున్నావని శిష్యులు యేసును అడిగిరి. యేసు వారితో ఒక వింతైన విధానములో జవాబు చెప్పెను. "పట్టణము లోనికి వెళ్లుడి, అక్కడ ఒక మనుష్యుని మీరు కనుగొందురు. తన సమయము సమీపించినదని బోధకుడు చెప్పుచున్నాడని అతనికి తెలుపుడి. శిష్యులతో కూడ అతని యింట పస్కాను ఆచరించవలెనని బోధకుడు కోరుచున్నాడని అతనితో చెప్పుడి. అతడు అర్థము చేసుకొనును" అని యేసు చెప్పెను.

పేతురు మరియు యోహాను పట్టణము లోనికి వెళ్లిరి. వారు వీధిలో నడుచుచు వెళ్లినప్పుడు కుండతో నీళ్ళు మోయుచున్న ఒక మనుష్యుని వారు చూచిరి. ఈ విధముగానే వారు ఆ మనుష్యుని తెలుసుకొందురని పేతురు యోహానులతో యేసు చెప్పెను.

పేతురు మరియు యోహాను ఆ మనుష్యుని వెంట ఒక యింటికి వెళ్లిరి. అప్పుడు వారు ఆ ఇంటి గదిని గూర్చి మాట్లాడిరి. బోధకుడు పస్కాను అక్కడ భుజించగోరుచున్నాడని వారు చెప్పిరి. అతడు వారికి పెద్ద మేడగది చూపించెను. ఆ గది అంతా అమర్చబడి ఉండెను మరియు వారు పస్కా విందుకు సమస్తము సిద్ధము చేయుట ప్రారంభించిరి. అప్పుడు పేతురు యోహానులు యేసు మరియు ఇతర శిష్యుల కొరకు వేచియుండిరి.

వారు భోజనము చేయుచుండగా యేసు జరుగబోవు సంగతులను గూర్చి చెప్పెను. ఆయన రొట్టెను ఆశీర్వదించి దానిని విరిచెను. దానిని వారికిచ్చెను.

"తీసికొని తినుడి, ఇది నా శరీరము" అని ఆయన చెప్పెను. ఆయన గిన్నెలోని ద్రాక్షారసము కొరకై కృతజ్ఞతలు చెల్లించెను."ఇది మీ కొరకు చిందింపబడుచున్న నా రక్తము" అని ఆయన చెప్పెను.

**తోటలో ప్రార్థించుట : మత్తయి 26:36-45, లూకా 22:39-52.**

యేసు ఆయన శిష్యులు పస్కాను భుజించిన వెంటనే శిష్యులలో ఒకడైన ఇస్కరియోతు యూదా, యూదుల యాజకులకు దేవాలయపు అధికారులకు యేసును అమ్మివేసెను. ఈ మనుష్యులు ఆయనను బంధించుటకు అవకాశము కొరకు చూచుచుండిరి. ఇది జరుగునని యేసు ముందే ఎరిగియుండెను. వాస్తవమునకు వారిలో ఒకడు ఆయనను అప్పగించునని ఆయన శిష్యులతో చెప్పియుండెను.

ఆయన వారిని విడిచి వెళ్లునని, ఆయన చంపబడునని మరియు తండ్రితో ఉండుటకు తిరిగి వెళ్లునని యేసు శిష్యులతో చెప్పెను. తండ్రి వారికి పరిశుద్ధాత్మ అను మరియొక సహాయకుని పంపించునని కూడా ఆయన వారికి చెప్పెను. అయితే ఆయన చెప్పుచున్నది శిష్యులు పూర్తిగా అర్థము చేసుకొనలేదు.

యేసు మరియు ఆయన శిష్యులు పస్కాను భుజించి గది విడిచి వచ్చిన తరువాత ఒలీవల కొండ మీదకు మరియు గెత్సెమనె తోటలోనికి వెళ్లిరి. యేసు తన శిష్యులను వేచియుండమని చెప్పి తోటలోనికి ప్రార్థన చేయుటకు ముందుకు వెళ్లెను. యూదా, తాను ముందుగానే విడిచి వెళ్లిపోయెను. కొంత సమయము అయిన తరువాత యేసు నిద్రపోవుచున్న తన శిష్యుల దగ్గరకు వచ్చెను. ఆయన చాలా దుఃఖపడెను మరియు ప్రార్థించుటకు మూడుసార్లు వెళ్లెను. అయితే శిష్యులు బాగా అలసిపోయినందున మెళకువగా ఉండలేకపోయిరి.

ఆయన వారిని నిద్రలేపెను. వారు మాట్లాడుకొనుచుండగా యూదా అక్కడికి వచ్చెను. అతడు కొందరు దేవాలయపు అధికారులతో ఉండెను. యూదా యేసును చూచినప్పుడు పరుగెత్తికొని వెళ్ళి ఆయనను ముద్దు పెట్టుకొనెను. ఇది సైనికులు యేసును గుర్తుపట్టుటకు ఆనవాలు. అక్కడున్న సైనికులు యేసును తీసికొని పోవుటకు వచ్చిరి. పేతురు మొదట వారితో పోట్లాడవలెనని కోరెను కాని యేసు అతనితో "వద్దు" అని చెప్పెను. యేసు ఆ మనుష్యులతో వెళ్లుటకు అంగీకరించెను.

**విచారణ : మత్తయి 26:47-67, మత్తయి 27:11-26**

సైనికులు యేసును ప్రధానయాజకుడైన కయప యొద్దకు తీసికొని వెళ్లిరి. అక్కడ ఆయనకు విచారణ జరిగెను. యాజకులు మరియు అధికారులు ఆయన దేవుని కుమారునిగా చెప్పుకొనుటను బట్టి దోషియని అంగీకరించిరి. ఆయన దేవుని కుమారుడని వారు నమ్మలేదు. ఆయన చంపబడవలెనని వారు అంగీకరించిరి.

అయినప్పటికినీ రోమా చట్టము ప్రకారము యూదుల నాయకులు ఒక మనుష్యునికి మరణశిక్షను విధించలేరు. అందుచేత యూదుల అధికారులు యేసును పిలాతు యొద్దకు తీసుకొనిపోయిరి. యేసు మరణము పొందునంత హేతువును పిలాతు ఆయనలో కనుగొనలేదు. కాని చాల సమయము తరువాత యూదుల నాయకులు యేసును వారు కోరిన విధముగా చేసుకొన వచ్చునని పిలాతు వారికి చెప్పెను.

సైనికులు యేసును గేళి చేసిరి. వారు ఆయనను రాజని పిలిచిరి కాని వారు ఆయన రాజు అని నమ్మలేదు. వారు ఆయన తలమీద ముళ్లకిరీటము, చేతిలో ఒక కఱ్ఱ పెట్టిరి. ఆయన పైన ఒక ఎఱ్ఱని వస్త్రమును వేసిరి మరియు ఆయనపై ఉమ్మిరి మరియు ఆయనను కొరడాలతో కొట్టిరి.

**యేసు మరణించుట : మత్తయి 27:32-65, యోహాను 19:1-37**

సైనికులు యేసును గొల్గొతా లేక కల్వరి అను కొండకు తీసుకొని వెళ్లిరి. వారు అక్కడ ఆయనను సిలువ వేసిరి మరియు ఒక చెక్క సిలువపై ఆయనను మరణమునకు అప్పగించిరి. కాని ఆయన సిలువమీద ఉండి కూడ ఆయనను సిలువ వేయుచున్న వారిని క్షమించెను. "తండ్రీ, వీరేమి యేచుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించు"మని ఆయన చెప్పెను.

యేసు సిలువ మీద ఉండగా ప్రజలు ఆయన దేవుని కుమారుడని తెలుసుకొనిరి. వారిలో ఒకడు యేసు ప్రక్కన సిలువపై సిలువ వేయబడుచున్న ఒక దొంగ. మరొక వ్యక్తి అక్కడ జరుగుతున్న సంఘటనలను చూచుచున్న ఒక రోమా సైనికుడు. అక్కడ ఒక గొప్ప భూకంపము కలిగెను. ఆ భూకంపము యొక్క శబ్దమును విని అక్కడ జరుగుచున్న సంఘటనలు చూసిన ఆ సైనికుడు భయపడి "నిజముగా ఈయన దేవుని కుమారుడు" అని చెప్పెను.

యేసు మరణించినప్పుడు దేవాలయములలో ఉండు మందమైన తెర రెండుగా చిరిగిపోయెను. పై నుండి క్రిందికి అది చిరిగిపోయెను. ఈ తెర రెండు గదులను వేరు చేసియుండెను. ఒక గదిలోనికి ప్రధాన యాజకుడు మాత్రమే వెళ్లగలడు మరియు మరియొక గదిలోనికి ఇతరులు వెళ్లగలరు. యేసు మరణించినప్పుడు మధ్యలో ఎవరును లేకుండా ప్రజలందరు దేవుని యొద్దకు వెళ్లి ఆయనను ఆరాధించుటను ఆయన సాధ్యము చేసెను. ఇప్పుడు యేసు మన ప్రధాన యాజకుడు.

**కంఠత వాక్యము:**

వారు కపాలమనబడిన స్థలమునకు వచ్చినపుడు అక్కడ కుడివైపున ఒకనిని, ఎడమవైపున ఒకనిని ఆ నేరస్థులను ఆయనతో కూడ సిలువవేసిరి. యేసు – "తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు, గనుక వీరిని క్షమించుమని" చెప్పెను. లూకా 23:33-34.

## 26వ పాఠము – పరీక్ష

# యేసు చివరి దినములు

1. యేసు తన శిష్యులతో................లో పస్కావిందును తినెను. ( )
   ఎ. మేడగది
   బి. విందుహాలు
   సి. పేతురు యింటి వద్ద
2. యేసు రొట్టెను విరిచి ఇట్లు చెప్పెను "...............". ( )
   ఎ. ఇది పులియని రొట్టె
   బి. తీసికొని తినుడి, ఇది నా శరీరము
   సి. దీనిని మీతో ఇంటికి తీసికొని వెళ్లుడి
3. ద్రాక్షరసము కొరకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించినప్పుడు ఆయన ఇట్లు చెప్పెను "...............". ( )
   ఎ. ఈ ద్రాక్షరసము త్రాగుడి
   బి. దీనిలో కొంచెము మాత్రమే త్రాగుడి
   సి. ఇది మీ కొరకై చిందించబడుచున్న నా రక్తము
4. యేసు.................. చేత అప్పగింపబడెను. ( )
   ఎ. యాకోబు
   బి. యూదా ఇస్కరియోతు
   సి. అంద్రెయ
5. ఆయన వారితో దేవుడు మరియొక సహాయకుని పంపించునని చెప్పెను. ఆయన............... . ( )
   ఎ. పరిశుద్ధాత్మ
   బి. పేతురు
   సి. ఒక దూత
6. యేసు కయప నొద్దకు తీసుకొని పోబడెను. కయప............... . ( )
   ఎ. ప్రధాన యాజకుడు
   బి. రోమను అధిపతి
   సి. చక్రవర్తి
7. ఆయన తలమీద వారు................... ఉంచిరి. ( )
   ఎ. కిరీటము
   బి. ముళ్ళ కిరీటము
   సి. టోపి
8. ఆయన సిలువ వేయబడిన స్థలము............... అని పిలువబడెను. ( )
   ఎ. గెత్సెమనె తోట
   బి. బెత్లెహేము
   సి. గొల్గొతా లేదా కల్వరి
9. యేసు మరణించినప్పుడు............... రెండుగా చిరిగెను. ( )
   ఎ. దేవలయము తెర
   బి. రహదారి
   సి. పట్టణపు గవిని
10. నన్ను ఎవరైనా బాధ పెట్టిన యెడల నేను............... . ( )
    ఎ. తిరిగి వారిని బాధపెట్టుటకు ప్రయత్నించవలెను.
    బి. నన్ను ఒంటరిగా విడువుడని వారితో చెప్పవలెను
    సి. వారిని క్షమించవలెను.

## 27వ పాఠము

**ప్రియమైన తల్లిదండ్రులారా,**

ఈ వారము పునరుత్థానమును గూర్చి మనము అధ్యయనము చేయుచుండగా యేసు మృతులలో నుండి మూడవ దినమున లేచెనని మనము సంతోషించెదము. ఆ మహిమకరమైన "వారపు మొదటి దినము" అయిన ఆదివారము యొక్క వృత్తాంతమును మనము నాలుగు సువార్తలన్నిటిలో నుండి చదివెదము.

## యేసు మరల సజీవుడాయెను

అరిమతయియ నుండి యోసేపు అను మనుష్యుడు పిలాతు నొద్దకు వెళ్ళెను మరియు యేసు దేహమును అడిగెను. ధనవంతుడైన యోసేపు యేసు యొక్క శిష్యుడై యుండెను. అతడు యేసు యొక్క దేహమును సిలువపై నుండి క్రిందికి దించెను. అతడు దానిని సన్నపు నారబట్టతో చుట్టెను మరియు దానిని తన స్వంతదైన క్రొత్త సమాధి లేక పాతిపెట్టు స్థలమునందు ఉంచెను.

అధిపతియైన పిలాతు సమాధి యొద్ద కావలివారిని ఉంచెను ఏలయనగా యేసు శిష్యులు సమాధి నుండి ఆయన దేహమును దొంగిలించి, ఆయన మృతులలో నుండి లేపబడి యున్నాడని చెప్పుదురని కొందరు మనుష్యులు భయపడిరి.

ఆదివారమున ఉదయము పెందలకడనే కొందరు స్త్రీలు సమాధి యొద్దకు వెళ్ళిరి. యేసు దేహమునకు పూయుట కొరకు వారు సిద్ధపరచిన కొన్ని సుగంధ ద్రవ్యములను వారు తెచ్చిరి. ఒక మహా భూకంపము కలిగెను. మరియు ఒక దూత వచ్చెను మరియు సమాధి ముందటి నుండి రాయిని వెనుకకు పొర్లించి వేసెను. అప్పుడు ఆ దూత ఆ పెద్దరాయిపైన కూర్చుండెను.

ఆ దూత స్త్రీలతో ఇట్లనెను, "భయపడకుడి, యేసు యిక్కడ లేడు. ఆయన చెప్పినట్లుగానే ఆయన లేచియున్నాడు. రండి మరియు ఆయన పరుండిన స్థలమును చూడుడి".

దీనిని శిష్యులకు తెలియజేయుమని దూత వారికి చెప్పెను. వారు వెళ్ళిపోవుచుండగా, యేసు వారిని కలుసుకొనెను. "గలిలయకు వెళ్ళుమని నా సహోదరులతో చెప్పుడి మరియు అక్కడ వారు నన్ను చూతురు" అని ఆయన చెప్పెను. వారు ఆయనను చూచిరి మరియు ఆయన వారితో భోజనము చేసెను.

ఇద్దరు మనుష్యులు ఎమ్మాయి గ్రామమునకు వెళ్ళుచుండిరి. యేసు వారితో పాటు నడచుట మరియు వారితో మాట్లాడుట ప్రారంభించెను. తరువాత వారు భోజనము చేయుటకు సిద్ధముగా ఉన్నప్పుడు యేసు కృతజ్ఞతాస్తుతులు చెల్లించెను మరియు రొట్టె విరిచెను. వెంటనే వారు ఆయనను గుర్తించిరి. జరిగియున్నదానిని వారికి చెప్పుటకు వారు పదునొకండు మందిని వెదకుటకు వెళ్ళిరి. వారు ఎంత సంతోషించిరి! యేసు మరల జీవించెను.

పునరుత్థానము యొక్క కథ ప్రతి సువార్తలోను కనుగొనబడును. మనము లూకా సువార్త, 24వ అధ్యాయములో చూచియున్నాము.

### : కంఠత వాక్యము :

అందుకతడు – కలవరపడకుడి. సిలువవేయబడిన నజరేయుడగు యేసును మీరు వెదకుచున్నారు, ఆయన లేచియున్నాడు, ఇక్కడ లేడు. వారు ఆయనను ఉంచిన స్థలము చూడుడి" **మార్కు 16:6**

## 27వ పాఠము – పరీక్ష

# మరల సజీవుడాయెను

1. .......... పిలాతు నొద్దకు వెళ్ళి యేసు యొక్క దేహమును అడిగెను. ( )
   ఎ) నీకొదేము
   బి) అరిమతయియ యోసేపు
   సి) లాజరు
2. యేసు దేహము ఏ వస్త్రములతో చుట్టబడినది? ( )
   ఎ) నారబట్ట
   బి) దూది వస్త్రాలు
   సి) ఉన్ని వస్త్రాలు
3. పిలాతు యేసు సమాధి యొద్ద కావలి వారిని ఉంచెను. ఎందుచేతనంటే .................. ( )
   ఎ) దేవదూతలు వచ్చెదరని
   బి) యేసు శిష్యులు యేసు దేహమును ఎత్తుకొని పోవుదురని
   సి) యేసు శిష్యులు అలా కావలి వారిని ఉంచమని పిలాతును కోరిరని
4. ఆదివారమున పెందలకడ స్త్రీలు సమాధి యొద్దకు ఏమి తెచ్చిరి? ( )
   ఎ) కావలి వారికి భోజనము
   బి) సమాధిపై ఉంచుటకు పువ్వులు
   సి) యేసు దేహమునకు పూయుటకు సుగంధ ద్రవ్యములు
5. సమాధి ఎదుట రాయిని ఎవరు పొర్లించిరి? ( )
   ఎ) దేవదూత
   బి) కావలివారు
   సి) యేసు శిష్యులు
6. సమాధి యొద్ద స్త్రీలకు సందేశం? ( )
   ఎ) యేసు మీ కొరకు ఎదురుచూచుచున్నాడు
   బి) భయపడకుడి, యేసు ఇక్కడ లేడు
   సి) యేసు సమాధిలో వున్నాడు
7. యేసు శిష్యులు యేసును ఎక్కడ కలవాలని యేసు చెప్పెను? ( )
   ఎ) ఐగుప్తు
   బి) రోమా
   సి) గలిలయ
8. మార్గములో యేసును ఎవరు కలిశారు? ( )
   ఎ) 10 మంది కుష్టురోగులు
   బి) ఎమ్మాయి గ్రామమునకు వెళ్ళు ఇద్దరు మనుష్యులు
   సి) యెరూషలేముకు వెళ్ళు శిష్యులు
9. యేసును వారు ఎప్పుడు గుర్తుపట్టారు ? ( )
   ఎ) కృతజ్ఞతలు చెల్లించి రొట్టె విరిచినప్పుడు
   బి) వారిని పేర్లతో పిలిచినప్పుడు
   సి) వెళ్ళుటకు నిలిచినప్పుడు
10. యేసు మరణించి తిరిగి లేచెనని మనకు తెలియును ఎందుకంటే ( )
   ఎ) ఈ రోజు మనము ఆయనను చూడగలము
   బి) పునరుత్థానము తర్వాత చాలా మంది ఆయనను చూశారు
   సి) ఆయన లేచెనని ఆయన శత్రువులు చెప్పారు

## 28వ పాఠము

**ప్రియమైన తల్లిదండ్రులారా,**

ఈ వారము మనము యేసు యొక్క ఆరోహణము గూర్చి అధ్యయనము చేయుదము. పునరుత్థానము తరువాత ఆయన అనేకులకు కనబడెను. మొదటి కొరింథీయులు 15:5-8లో ఐదు వందల సహోదరులకు ఒక్క సమయములోనే యేసు కనబడెనని పౌలు చెప్పెను. యేసు పునరుత్థానమునకు 40 రోజులు తరువాత ఆయన భూలోకమును విడిచివెళ్ళెను. "ఆయన వారి కన్నుల యెదుట తీసికొనిపోబడెను మరియు ఒక మేఘము ఆయనను వారి కన్నులకు కనబడకుండా మరుగుచేసెను".

# యేసు భూలోకమును విడిచి వెళ్ళుట

యేసు యొక్క పునరుత్థానము (మృతులలో నుండి లేపబడుట) తరువాత 40 దినములలో ఆయన తన శిష్యులకు (పలుమార్లు) తరచుగా కనబడెను. ఆయన దేవుని రాజ్యమును గూర్చి వారితో మాట్లాడెను.

ఒకసారి ఆయన వారితో వారు యెరూషలేములో ఉండి ఆయన అనుగ్రహించబోవు వరము కొరకు ఎదురు చూడవలెనని చెప్పెను. ఆ వరము పరిశుద్ధాత్మ. ఆయన వారిలో నివశించును మరియు వారిని నడిపించును. ఆయన వారికి ఆదరణకర్తగా ఉండును.

ఆయన వారి కొరకు మరణించెనని భూమిమీద ఉన్న ప్రతి ఒక్కరికి ప్రకటించవలెనని యేసు వారిని కోరెను. బోధించవలెనని మరియు విశ్వసించిన వారికి బాప్తీస్మము యివ్వవలెనని ఆయన వారికి చెప్పెను.

యేసు దీనిని చెప్పిన తరువాత ఆయన వారి కన్నుల యెదుట పరలోకమునకు కొనిపోబడెను. ఒక మేఘము ఆయనను వారి దృష్టి నుండి మరుగుచేసెను మరియు తెల్లని వస్త్రములు ధరించుకొనిన మనుష్యులవలె కనబడిన ఇద్దరు దూతలు వచ్చి వారి ప్రక్కన నిలిచిరి.

ఆ దూతలు యిట్లు చెప్పిరి, "మీరెందుకు ఆకాశమువైపు చూచుచున్నారు? పరలోకమునకు కొనిపోబడిన ఈ యేసే, ఏ రీతిగా పరలోకమునకు వెళ్ళుట మీరు చూచితిరో ఆ రీతిగానే ఆయన ఒక రోజు తిరిగివచ్చును".

మనము కూడా ఆయన తిరిగి వచ్చునని నమ్ముచున్నాము.

ఆరోహణమును గూర్చిన కథ లూకా 24:50-53, మరియు అపోస్తలుల కార్యములు 1:1-11లో కనుగొనబడును.

### : కంఠత వాక్యము :

మరియు ఆయన వారితో చెప్పెను, మీరు సర్వలోకమునకు వెళ్ళి, సర్వ సృష్టికి సువార్త ప్రకటించుడి. నమ్మి బాప్తీస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మనివానికి శిక్ష విధింపబడును.

ఈలాగున ప్రభువైన యేసు వారితో మాటలాడిన తరువాత పరలోకమునకు చేర్చుకొనబడి, దేవుని కుడి పార్శ్వమున ఆసీనుడయ్యెను. **మార్కు 16:15-16 మరియు 19**

## 28వ పాఠము - పరీక్ష

# యేసు భూలోకమును విడిచి వెళ్ళుట

1. పునరుత్థానము తర్వాత యేసు ఎన్ని దినములు భూమి మీద నుండెను. ( )
   ఎ) 40 రోజులు
   బి) ఒక సంవత్సరము
   సి) 2 వారములు
2. యేసు తన శిష్యులతో దేని గూర్చి మాట్లాడెను. ( )
   ఎ) చేపలు పట్టుట
   బి) భవనములు నిర్మించుట
   సి) దేవుని రాజ్యము
3. యేసు తాను తన శిష్యులకు అనుగ్రహించబోవు వరమును పొందుటకు ఎక్కడ ఎదురు చూడవలెనని చెప్పెను
   ఎ) యెరుషలేములో ( )
   బి) సముద్రతీరమున
   సి) కలువరి కొండపైన
4. ఆయన వారికి అనుగ్రహించిన వరము ఏమిటి? ( )
   ఎ) మరొక అపోస్తలుడు
   బి) పరిశుద్ధాత్మ
   సి) ఒక విందు
5. యేసు తన శిష్యులకు ఏమని ఆజ్ఞాపించెను? ( )
   ఎ) ఎవరితోను మాట్లాడవద్దు
   బి) పురుషులతో మాత్రమే మాట్లాడవలెను
   సి) నమ్మిన వారికి బోధించి, బాప్తీస్మము ఇవ్వవలెను
6. యేసు పరలోకమునకు వెళ్ళినప్పుడు ............ . ( )
   ఎ) ఆయన వెళ్ళుటను శిష్యులు చూచిరి
   బి) ఒక మేఘము వారికి కనబడకుండ ఆయనను దాచెను
   సి) శిష్యులు గ్రుడ్డివారు అయినందున వారు చూడలేకపోయిరి
7. వారి యొద్ద నిలువబడిన దూతలు ఎవరివలె కనిపించిరి? ( )
   ఎ) తెల్లని వస్త్రములు ధరించిన మనుష్యులు
   బి) రెక్కలు ధరించిన స్త్రీలు
   సి) రెక్కలు ధరించిన పిల్లలు
8. దూతలు ఎక్కడ ఉండిరి? ( )
   ఎ) గాలిలో
   బి) వారి యొద్ద నిలువబడిరి
   సి) నిచ్చెన మీద
9. దూతలు శిష్యులకు యేసును గూర్చి ఏమని చెప్పిరి? ( )
   ఎ) మరలా రాడు అని చెప్పిరి
   బి) ఒక సంవత్సరము తర్వాత మేఘములో వచ్చును అని చెప్పిరి
   సి) ఏలాగు వెళ్ళెనో అలాగే తిరిగి వచ్చును అని చెప్పిరి
10. యేసు పరలోకమునకు తిరిగి వెళ్ళిన తర్వాత ఆయన ............ . ( )
    ఎ) తిరిగి మరలా భూమి మీదకు అప్పుడప్పుడు వచ్చెను
    బి) దేవుని పాదముల యొద్ద కూర్చుండెను
    సి) దేవుని కుడి పార్శ్వమున కూర్చుండెను

## 29వ పాఠము

# అగ్నిజ్వాలల వంటి నాలుకలు

**అపోస్తులుల కార్యములు 2:1-40**

యూదులైన ప్రజలు సంవత్సరమంతయు వివిధ రకములైన పండుగలను ఆచరించుటకు దేవుని చేత ఆజ్ఞాపించబడిరి. ఐగుప్తీయుల జ్యేష్ఠ సంతానము ఐగుప్తులో తెగుళ్ళలో మరణించినప్పుడు సంహారకుడు వారిని "దాటి వెళ్ళియున్న" సమయమును జ్ఞాపకము చేసికొనుటకు వారు పస్కాపండుగను ఆచరించిరి.

వారు పస్కా పండుగకు యాభై దినముల తరువాత పెంతెకోస్తు పండుగను ఆచరించిరి. అది వారముల పండుగ అని కూడా పిలువబడెను. అది ఒక ఆదివారమున వచ్చెను మరియు ఒక దినము ఉండెను. అది గోధుమల కోతకాలపు అంతమున వచ్చెను.

ఈ కథలోని సంఘటనలు యేసు మరణము మరియు పునరుత్థానము తరువాత వచ్చిన పెంతెకోస్తునాడు జరిగెను. భక్తిగల చాలామంది యూదులు పండుగను ఆచరించుటకు యెరూషలేము పట్టణములో ఉండిరి. వారు అనేక దేశముల నుండి వచ్చిరి మరియు చాలా భిన్నమైన బాషలు మాట్లాడిరి.

అకస్మాత్తుగా ఒక గొప్ప శబ్దము వారు కూడియున్న ఇల్లంతటిని నింపెను. అది గొప్ప గాలి వీయుచున్న శబ్దమువలె ఉండెను.

అప్పుడు చూచుటకు అగ్ని జ్వాలల వంటి నాలుకలవలె ఉన్నదేదో కనబడెను, విభాగింపబడెను మరియు వారిలో ప్రతివానిపైన వ్రాలెను. వారిలో ప్రతివాడు ఇతర బాషలలో మాట్లాడుట ప్రారంభించిరి. వారు ఎన్నడును నేర్చుకొనని బాషలలో వారు ఇతరులతో మాట్లాడునట్లు పరిశుద్ధాత్మ చేయుచుండెను! నీవెన్నడు ఆ బాష మాట్లాడియుండకపోయినను ఒక విదేశీయునితో అతని స్వంత మాతృబాషలో సంభాషించగలుగుట నీవు ఊహించగలవా?

ఆ గాలి శబ్దము ఎంతో బిగ్గరగా ఉన్నందున ఏమి జరుగుచున్నదో చూచుటకు జనులు పరుగెట్టిరి. అపోస్తలులు వారి స్వంత బాషలలో మాట్లాడుట వారు వినినప్పుడు, "ఈ మనుష్యులు గలిలయులు కారా లేక గలిలయ నుండి వచ్చినవారు కారా? మనలో ప్రతివాడు తాను పుట్టిన దేశపు బాషతో వీరు మాటలాడుట మనము వినుచున్నామే అని వారు ఆశ్చర్యపడిరి.

వీరు మద్యముతో మత్తులైరి అని కొందరు తలంచిరి కాని అది సంభవము కాదు ఎందుకనగా అప్పుడు సమయము ఉదయము 9 గంటలు మాత్రమే. మద్యముతో మత్తులగువారిలో ఎక్కువ మంది జనులు దినములో అంత ప్రొద్దున్ననే మత్తులు కారు.

పేతురు పదునొకండు మందితో లేచి నిలువబడెను మరియు జన సమూహమునకు బోధించుట మొదలుపెట్టెను. యోవేలు ప్రవక్త ఈ సంఘటనలను గూర్చి చాలా సంవత్సరములకు పూర్వమే మాట్లాడెనని అతడు చెప్పెను. నజరేయుడైన యేసు ఎట్లు వచ్చెనో మరియు ఆయన భూమిమీద ఉన్నప్పుడు ఆయన చేసిన సూచక క్రియలు మరియు అద్భుతముల ద్వారా యేసును గూర్చిన తన ఆమోదమును దేవుడు ఎట్లు చూపెనో అతడు తెలియజేసెను.

సిలువ వేయబడుటకు దుష్టులైన మనుష్యుల చేతికి యేసును అప్పగించిరని పేతురు జన సమూహముపై నేరము మోపెను. పిలాతు యేసును విడుదల చేయగోరెను కాని యూదులు “ఆయనను సిలువవేయుడి” అని కేకలు వేసిన సంగతి మనకు జ్ఞాపకమే. రోమీయులు ఆయనను సిలువకు మేకులతో కొట్టి ఆయనను చంపిరి. అయితే దేవుడు ఆయనను మృతులలో నుండి లేపెను మరియు ఆయనను సజీవునిగా అనేకమంది జనులు చూచిరి.

వారేమి చేసియున్నారో సమూహములోని జనులు అర్థము చేసికొనినప్పుడు వారు బాధపడిరి మరియు “సహోదరులారా, మేమేమి చేతుము” అని పేతురును మరియు ఇతర అపోస్తలులను వారు అడిగిరి.

వారు మారు మనస్సుపొంది, వారు చేసిన దాని విషయమై నిజముగా దు:ఖపడి మరియు వారి పాపములు క్షమింపబడునట్లు వారిలో ప్రతివాడు యేసు నామమున బాప్తీస్మము పొందవలెనని పేతురు వారితో చెప్పెను. వారది చేసిన యెడల వారిలో నివశించుటకు పరిశుద్ధాత్మ అను దేవుని వరమును వారు పొందుదురని అతడు చెప్పెను.

అతని మాటలు విని మరియు వాటిని అంగీకరించినవారు బాప్తీస్మము పొందిరి మరియు యించుమించు 3000 మంది జనులు అదే పని చేసిరి.

ఈ అద్భుతమైన దినము సంఘము యొక్క ప్రారంభదినము.

**: కంఠత వాక్యము :**

మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తీస్మము పొందుడి, అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు. **అపోస్తలుల కార్యములు 2:38**

## 29వ పాఠము - పరీక్ష

# అగ్నిజ్వాలల వంటి నాలుకలు

1. ఐగుప్తులో తెగుళ్ళ నుండి తమ విడుదలను జ్ఞాపకము చేసికొనుటకు యూదులైన ప్రజలు ......... ఆచరింతురు. ( )
   ఎ) వారముల పండుగ
   బి) పస్కా పండుగ
   సి) గుడారముల పండుగ
2. ఈ కథలోని సంఘటనలు .............న జరిగినవి. ( )
   ఎ) పస్కా
   బి) శనివారము
   సి) పెంతెకోస్తు
3. యూదా మరణము తరువాత ఒక అపోస్తలుడుగా అతని స్థానము తీసికొనుటకు .... ఎన్నుకొనబడెను. ( )
   ఎ) మత్తీయ
   బి) పౌలు
   సి) మత్తయి
4. జనులు ......... వంటి ఒక గొప్ప శబ్దము వినిరి . ( )
   ఎ) గది గుండా సరకుల రైలు వచ్చు
   బి) వేగముగా వీచు బలమైన గాలి
   సి) బ్రహ్మాండమైన బృందగానము
5. ............. వారిలో ప్రతివాని మీద వ్రాలెను. ( )
   ఎ) అగ్ని జ్వాలల వంటి నాలుకలు
   బి) దేవదూతలు
   సి) గాలిలో వ్రాసిన చేతులు
6. ఆ మనుష్యులు ............... మొదలుపెట్టిరి . ( )
   ఎ) ఎవడును అర్థము చేసుకొనని బాషలలో మాట్లాడుట
   బి) వారెన్నడును నేర్చుకొనని బాషలలో మాట్లాడుట
   సి) స్తుతి గీతములు పాడుట
7. ఆ మనుష్యులు ........... అని జనులలో కొందరు తలంచిరి. ( )
   ఎ) మద్యముతో మత్తులైరి
   బి) వెర్రివారు
   సి) నాటకమాడుచున్నారని
8. పేతురు లేచి నిలబడి ........... ప్రారంభించెను. ( )
   ఎ) నిశ్శబ్దముగా ఉండవలెనని జనులకు చెప్పుట
   బి) యేసును గూర్చి వారికి ప్రకటించుట
   సి) మిగిలిన అపోస్తలులను పరిచయము చేయుట
9. ......... మంది జనులు పేతురు మాటలను అంగీకరించిరి మరియు ఆ దినమున బాప్తీస్మము పొందిరి. ( )
   ఎ) 200
   బి) 2000
   సి) 3000
10. మనము పొరపాట్లు చేసినప్పుడు మనము చేయవలసినది ............ . ( )
   ఎ) పేతురువలె మారుమనస్సు పొంది వాటిని జయించుట
   బి) మేము మంచివాళ్ళము కాదని చెప్పుచు వదలివేయుట
   సి) మంచిగా జీవించు ప్రయత్నము మానివేయుట

## 30వ పాఠము

**ప్రియమైన తల్లిదండ్రులారా,**

ఈ వారము మన బైబిలు సమయములో అపోస్తులులలో ఒకడు కూడా అయినట్టి యేసు యొక్క అత్యంత సన్నిహిత స్నేహితులలో ఒకనిపైన పిల్లలు కేంద్రీకరించబోవుచున్నారు. అతని పేరు సీమోను పేతురు. పేతురు సూచక క్రియలను చేసెను మరియు ఆ అవకాశములను యేసును గూర్చి బోధించుటకు ఉపయోగించెను. అతడు ఒక జాలరి మరియు తరువాత యేసు యొక్క సంఘము స్థాపింపబడిన పెంతెకోస్తు దినమున బోధించెను.

## పేతురు

సంఘము యొక్క ప్రారంభ దినములలో అపోస్తలులు దేవుని ద్వారా వారికి అనుగ్రహింపబడిన అద్భుత శక్తులు కలిగియుండిరి. వారు రోగులైన ప్రజలను తిరిగి బాగుచేయగలిగిరి, కాబట్టి కుటుంబములు తమయొక్క రోగులైన బంధువులను స్వస్థత కొరకు శిష్యుల యొద్దకు తీసికొని వచ్చుచుండిరి.

ఒకానొక మధ్యాహ్నము సుమారు మూడు గంటలకు పేతురు మరియు యోహాను దేవాలయమునకు ఎక్కి వెళ్ళిరి. అది సాయంకాలపు ప్రార్ధనా సమయము. వారు శృంగారపు ద్వారమని పిలువబడిన దేవాలయపు ద్వారము నొద్దకు చేరిరి. అక్కడ ఒక భిక్షగాడు కూర్చొని యుండుట వారు కనుగొనిరి. అతడు కుంటివాడు మరియు ఎన్నడును నడువలేకపోయిన వాడు. అతడు ఎప్పుడును ఒక అడుగు వేసియుండలేదు.

పేతురు యోహానులు దగ్గరకు వచ్చినప్పుడు అతని సహాయము కొరకు అతడు ఒక కానుకను అడిగెను. అతడు పనిచేయలేడు గనుక అతడు తన జీవనము కొరకు అతడు భిక్షమడిగెను. పేతురు యోహానులు ఆగి అతనివైపు చూచిరి. "మా తట్టు చూడుము" అని పేతురు అతనితో చెప్పెను.

వారు కొంత ధనమును అతనికి యివ్వబోవుచున్నారని ఆ మనుష్యుడు తలంచెను. వెండి బంగారములు నా యొద్ద లేవుగాని నాకు కలిగినదే నీకిచ్చుచున్నాను. నజరేయుడైన యేసు నామమున లేచి నడువుము" అని చెప్పెను.

అప్పుడు పేతురు ఆ మనుష్యుని కుడి చేయి పట్టుకొని అతనిని పైకి లేపెను. సరిగా అదే క్షణమున ఆ మనుష్యుని పాదములు మరియు చీలమండల ఎముకలు బలము పొందెను. ఆ మనుష్యుడు పైకి గెంతెను మరియు అతడు పేతురు యోహానులతో దేవాలయము లోనికి నడచివెళ్ళెను. అతనిని స్వస్థపరచినందుకు అతడు దేవుని స్తుతించెను.

అక్కడున్న ప్రజలందరు అతనిని చూచిరి. వారు ఆశ్చర్యముపొందిరి, ఏలయనగా దేవాలయపు ద్వారమునొద్ద కూర్చుండి భిక్షము అడుగుకొనుచుండినది ఈ మనుష్యుడే అని వారు ఎఱిగియుండిరి. అతడు నడువలేని వాడని వారు ఎఱిగియుండిరి. వారు చూచుటకు గుమ్మి గూడిరి.

**అప్పుడు పేతురు ప్రజలకు యేసును గూర్చి చెప్పుట మొదలుపెట్టెను.**

**పేతురు యోహానులను గూర్చిన ఈ కథ బైబిలులో అపోస్తలుల కార్యములు 3:1-12లో కనుగొనబడును.**

### : కంఠత వాక్యము :

యేసు గలిలయ సముద్ర తీరమున నడుచుచుండగా, పేతురనబడిన సీమోను, అతని సహోదరుడైన అంద్రెయ అను ఇద్దరు సహోదరులు సముద్రములో వలవేయుట చూచెను. వారు జాలరులు. ఆయన - నా వెంబడిరండి, నేను మిమ్మును మనుష్యులను పట్టు జాలరులనుగా చేతునని వారితో చెప్పెను. **మత్తయి 4:18-19**

## 30వ పాఠము - పరీక్ష

# పేతురు మరియు యోహాను

1. సంఘ ప్రారంభ దినములలో అపోస్తలులు ........... . ( )
   ఎ) అందరికి తెలియకయుండిరి
   బి) మంచిగా బోధించలేకపోయిరి
   సి) అద్భుతమైన స్వస్థత శక్తులు కలిగియుండిరి
2. పేతురు మరియు యోహానులు .......... వద్ద భిక్షగాడు కూర్చొని యుండుట కనుగొనిరి. ( )
   ఎ) శృంగారమను దేవాలయపు ద్వారము
   బి) సిలోయము కోనేరు
   సి) దేవాలయము
3. భిక్షగాడు .................... . ( )
   ఎ) గ్రుడ్డివాడు
   బి) కుంటివాడు
   సి) కుష్ఠురోగి
4. పేతురు అతనితో మాట్లాడి యిట్లు చెప్పెను ........................ . ( )
   ఎ) నీవు స్వస్థత పొందితివి
   బి) మా తట్టు తేరిచూడుము
   సి) ఇక్కడ ఎందుకు కూర్చుంటివి
5. ఆ మనుష్యుడు .......... ఎదురు చూచెను. ( )
   ఎ) ధనము కొరకు
   బి) స్వస్థపరచబడుటకు
   సి) ఏమియు దొరకదని
6. పేతురు ఆ భిక్షగానికి ............ ఇచ్చెను . ( )
   ఎ) కొంత ధనము
   బి) కొంత ఆహారము
   సి) స్వస్థత బహుమానము
7. పేతురు అతనిని పైకి లేవనెత్తినప్పుడు ................... . ( )
   ఎ) అతడు మరల చూడగలిగెను
   బి) వాని పాదములు, చీలమండ ఎముకలు బలముపొందెను
   సి) అతడు మరల క్రిందపడిపోయెను
8. ఆ మనుష్యుడు .............................. . ( )
   ఎ) స్వస్థపరచినందుకై దేవుని స్తుతించెను
   బి) ఒక్కమాట పలుకకుండ వెళ్ళిపోయెను
   సి) అతని తల్లిదండ్రులను కనుగొనుటకు వెళ్ళిపోయెను
9. జరిగిన దానిని ప్రజలు చూచినప్పుడు వారు .................... . ( )
   ఎ) అధికారులకు చెప్పుటకు వెళ్ళిరి
   బి) అది విశ్రాంతి దినము అయినందున బాగుగా కోపపడిరి
   సి) వారు విస్మయమొందిరి
10. మీ పాఠశాలకు ఒక క్రొత్త బాలుడు వచ్చినప్పుడు, నీవు ఏ సహాయము చేయగలవు? ........... . ( )
    ఎ) వానికి కొంత ధనము యిచ్చుట
    బి) అతనికి స్నేహితుడగుట
    సి) అతనిని పట్టించుకొనకపోవుట

## 31వ పాఠము

# స్తెఫను – మొదటి క్రైస్తవ హతసాక్షి

**అపోస్తలుల కార్యములు 6 మరియు 7**

ఆదిమ సంఘములో స్తెఫను గొప్ప విశ్వాసము కలిగిన మనుష్యులలో ఒకడై యుండెను. అతడు ఒక అపోస్తలుడు కాకపోయినప్పటికినీ లేఖనములలో అతడు ఒక ప్రత్యేక స్థానము కలిగియుండెను ఎందుకనగా యెరూషలేములో ఆసరా యివ్వబడుచున్న విధవరాండ్రకు పరిచర్య చేయుటకు అతడు ఎన్నుకొనబడెను. విధవరాండ్రలో కొందరు చిన్నచూపు చూడబడుచు మరియు నిర్లక్ష్యము చేయబడుచున్నట్లు కనబడును; కాబట్టి వారిని గూర్చి శ్రద్ధ తీసుకొనుట కొరకు "విశ్వాసముతోను పరిశుద్ధాత్మతోను నిండుకొనిన" స్తెఫను మరియు ఆరుగురు ఇతర మనుష్యులు ఎన్నుకొనబడిరి.

స్తెఫను మొదటి క్రైస్తవ హతసాక్షి కూడ. అతడు/ఆమె దాని నిమిత్తము చనిపోవుటకు సిద్ధపడునంతగా ఒక విశ్వాసమును గట్టిగా పట్టుకొను వ్యక్తియే ఒక హతసాక్షి. స్తెఫను యేసుక్రీస్తు నందు కలిగియున్న విశ్వాసము అట్టిదే.

స్తెఫను ప్రజల మధ్య అద్భుత క్రియలు చేయగలిగెను. అతడు బోధించుటను ప్రారంభించెను మరియు అతని నమ్మకములను గూర్చి యూదులు కొందరు అతనితో వాదించుచుండిరి. ఈ దుష్టులు స్తెఫను మోషేకు దేవునికి వ్యతిరేకముగా మాట్లాడుచున్నాడని చెప్పుటకు కొందరు మనుష్యులను ఒప్పించిరి. ఇది నిజము కాదు కాని చాలామంది ప్రజలు ఇది నిజమని వారు నమ్ముటనుబట్టి దాని గూర్చి కలవరము చెందిరి.

వారు స్తెఫనును పట్టుకొని అతనిని యూదుల పాలకులైన సన్‌హెడ్రిన్ ముందుకు తెచ్చిరి. అతని యెదుట అతని వస్త్రము ముందు భాగమున అందమైన రొమ్ముపతకముతో ప్రధాన యాజకుడు ఉండెను. అది బంగారము మరియు పన్నెండు వేరువేరు ప్రశస్థ రత్నములను కలిగియుండెను. ప్రతి రాయి పైన ఇశ్రాయేలు యొక్క ఒక్కొక్క గోత్రము పేరు వ్రాయబడియుండెను.

వీరు శక్తివంతులైన మనుష్యులైయుండి ప్రజల విషయము జీవన్మరణ నిర్ణయములు తీసుకొనగలవారై యుండిరి. అయితే స్తెఫను సత్యము చెప్పుటకు భయము లేక యుండెను. అతడు వారి యెదుట నిలువగా అతని ముఖము ఒక దేవదూత ముఖము వలె ఉండుటను వారు చూచిరి.

అతడు వారితో మాట్లాడుట ప్రారంభించెను. అబ్రాహాము మొదలుకొని యూదులైన ప్రజల చరిత్ర అంతటిని గూర్చి అతడు చెప్పెను. అప్పుడతడు ఆ మనుష్యులపైన మరియు వారి ముందున్న వారి పితరులపైన ప్రవక్తలను హింసించి మరియు చంపుటను గూర్చి మరియు నీతిమంతుడైన యేసును కూడా చంపుటను గూర్చి నేరము మోపెను.

అధికారులు అతనిపై చాలా కోపము తెచ్చుకొనిరి కాని స్తెఫను ఆకాశమువైపు తేరిచూచి దేవుని మహిమను చూచెను మరియు యేసు దేవుని కుడివైపున కూర్చుండుటను అతడు చూచెను. అతడు యేమి చూచుచున్నాడో దానిని అతడు ఆ మనుష్యులకు తెలియజేసెను.

వారు తమ చేతులతో తమ చెవులు మూసుకొనిరి, ఎందుకనగా వారు అతనిని వినుటకు యిష్టపడలేదు. వారు తమ స్వరములకు సాధ్యమైనంత బిగ్గరగా కేకలు వేసిరి. వారతని మీదపడి పట్టణపు వెలుపలికి అతనిని ఈడ్చుకొనిపోయిరి మరియు రాళ్ళతో కొట్టి చంపుట మొదలు పెట్టిరి.

వారతనిపై రాళ్ళు విసరుచుండగా స్తెఫను, "యేసు ప్రభువా, నా ఆత్మను చేర్చుకొనుము" మరియు "ప్రభువా, వారి మీద ఈ పాపము మోపకుము" అని ప్రార్థన చేసెను. అప్పుడు అతడు నిద్రించెను (మరణించెను).

యేసు సిలువ మీద ఉండి అదే మాటలు పలికినప్పుడు ఆయన కలిగియున్న అదే క్షమించు ఆత్మను స్తెఫను కలిగియుండెను.

స్తెఫను మరణమునకు సమ్మతించిన యౌవనస్థుడు తార్సువాడైన సౌలు.

**: కంఠత వాక్యము :**

మనము పగటివారమై యున్నాము గనుక మత్తులమై యుండక, విశ్వాస ప్రేమలను కవచము, రక్షణ నిరీక్షణయను శిరస్త్రాణమును ధరించుకొందము. **1 థెస్సలొనికయులు 5:8**

## 31వ పాఠము - పరీక్ష

## స్తెఫను

1. స్తెఫను యొక్క పనులలో ఒకటి ................ . ( )
   ఎ) అపోస్తలుడుగా ఉండుట
   బి) యెరూషలేములో విధవరాండ్రకు పరిచర్య చేయుట
   సి) పేతురు గారి బైబిలు మోయుట
2. స్తెఫను మొదటి ........................ . ( )
   ఎ) క్రైస్తవ హతసాక్షి
   బి) యేసుచేత ఎన్నుకొనబడిన అపోస్తలుడు
   సి) యోహాను చేత బాప్తీస్మము పొందిన వ్యక్తి
3. కొందరు దుష్టులైన మనుష్యులు స్తెఫనుపై యేమని నేరారోపణ చేసిరి? ( )
   ఎ) యెరూషలేములో విధవరాండ్రను మోసగించుట
   బి) మోషేకును దేవునికిని వ్యతిరేకముగా మాట్లాడుట
   సి) యూదా స్థానాన్ని పొందుటకు ప్రయత్నించుట
4. వారు స్తెఫనును యూదుల అధికారుల గుంపునొద్దకు తీసికొనిపోయిరి. దాని పేరు .......... . ( )
   ఎ) గొప్ప అధికారులు
   బి) హేరోదు న్యాయస్థానము
   సి) సన్‌హెడ్రిన్
5. స్తెఫను మాట్లాడుటకు నిలువబడినప్పుడు అతని ముఖము ఎవరి ముఖమువలె ఉండెను ? ( )
   ఎ) ముసుగుతో కప్పబడి
   బి) చీకటిగాను, భయపెట్టుచును
   సి) దేవదూత ముఖమువలె
6. స్తెఫను ఆ మనుష్యులపై యేమని నేరము మోపెను? ( )
   ఎ) ప్రవక్తలను, యేసును చంపుట
   బి) దేవుని వాక్యము తెలియకపోవుట
   సి) అన్యాయముగా అతనిని బంధించుట
7. స్తెఫను ఆ మనుష్యులతో ........ తాను చూచుచున్నాడని చెప్పెను . ( )
   ఎ) నిచ్చెన మీద దేవదూతలు ఎక్కుచు దిగుచుండుట
   బి) యేసు పరలోకమునకు ఎక్కివెళ్ళుట
   సి) యేసు దేవుని కుడి పార్శ్వమున నిలిచియుండుట
8. ఆ మనుష్యులు స్తెఫనును ఏ విధముగా చంపిరి ? ( )
   ఎ) నీటిలో ముంచుట ద్వారా
   బి) రాళ్ళతో కొట్టి
   సి) త్రాడుతో వ్రేలాడదీయుట ద్వారా
9. స్తెఫను చనిపోవుటకు ముందు .......... అని స్తెఫను యేసు వలె ప్రార్థించెను. ( )
   ఎ) ప్రభువా ఈ పాపము వారి మీద మోపకుము
   బి) ప్రభువా వారి పాపము నిమిత్తము వారిని శిక్షించుము అని
   సి) సమాప్తమైనది
10. మనము సత్యము ఎప్పుడు చెప్పవలెను? ( )
   ఎ) ఇతరులకు ఇబ్బంది లేనప్పుడు
   బి) అన్ని సమయములలో
   సి) మనకు ఇబ్బందిలేనప్పుడు

## 32వ పాఠము

# సువార్తికుడైన ఫిలిప్పు

## అపోస్తలుల కార్యములు 8:26-40

యెరూషలేములోని క్రైస్తవులకు గొప్ప హింస కలిగెను. సౌలు ఇంటింటికి వెళ్ళెను మరియు యేసు యొక్క అనుచరులైన వారిని పురుషులను మరియు స్త్రీలను చెఱసాలకు ఈడ్చుచుండెను.

క్రైస్తవులు వారు బంధింపబడి మరియు చంపబడకుండుటకు యెరూషలేము నుండి పారిపోయిరి. ఏదో ఒక కారణము చేత అపోస్తలులు కాపాడబడిరి మరియు బంధింపబడకుండ యెరూషలేములో నిలిచియుండగలిగిరి.

మన కథలోని ఫిలిప్పు అపోస్తలుడైన ఫిలిప్పు కాదు కాని యెరూషలేములోని విధవరాండ్రను గూర్చి శ్రద్ధ తీసికొనుటలో సహాయపడుట కొరకు ఎన్నుకొనబడిన ఏడుగురు మనుష్యులలో ఒకడై యుండెను. అతడు కూడ యెరూషలేము విడిచి సమరయ ప్రాంతములకు వెళ్ళెను.

ఒక రోజు ఒక దేవదూత ఫిలిప్పుతో మధ్యధరా సముద్రము తీరమునకు దగ్గరగా ఉన్న, యెరూషలేము నుండి గాజాకు పోవు ఒక మార్గమున దక్షిణమునకు పొమ్మని చెప్పెను. అతడు వెళ్ళుచుండగా అతడు ఐతియోపియ దేశము నుండి ఒక మనుష్యుని కలుసుకొనెను. ఆ మనుష్యుడు ఒక రథముతో ప్రయాణము చేయుచుండెను. అతని దేశము యొక్క ప్రభుత్వములో అతడు ఒక ప్రాముఖ్యమైన వ్యక్తియై యుండెను. కందాకే రాణి అతనిని దేశము యొక్క ధనాగారము మీద వారి సమస్త బంగారము, వెండి మరియు సంపద మీద అధికారిగా నియమించెను.

అతడు దేవుని యందు ఒక విశ్వాసియై యుండెను మరియు ఆరాధించుటకు యెరూషలేముకు వెళ్ళియుండెను. అతడు బహాశ యూదుడు కాడు కాని ఒక ప్రవిష్టుడు అనగా బాప్తీస్మము వంటి కొన్ని క్రియలు చేయుట ద్వారా యూదుల మతమును అంగీకరించిన వ్యక్తియై యుండెను. ఒక వ్యక్తి ప్రవిష్టుడు అయినప్పుడు అతనికి / ఆమెకు యూదుల పేరు పెట్టబడును.

ఫిలిప్పు రథము దగ్గరగా వెళ్ళెను, ఆ మనుష్యుడు ప్రవక్తయైన యెషయా గ్రంథము నుండి చదువుచుండెను.

"నీవు చదువుచున్నది నీవు గ్రహించుచున్నావా?" అని అతడు ఆ మనుష్యుని అడిగెను. దానిని అతనికి వివరించుటకు అతనికి ఎవరైనను కావలసియున్నదని ఆ మనుష్యుడు చెప్పెను మరియు అతడు తనతో రథములో కూర్చుండుటకు ఫిలిప్పును ఆహ్వానించెను. అప్పుడు వారు ప్రయాణము కొనసాగించిరి.

అతడు చదువుచుండిన లేఖనము 500 సంవత్సరములకు పూర్వము వ్రాయబడియుండెను మరియు అన్యాయముగా విచారణ చేయబడి మరియు తీర్పు తీర్చబడబోవుచున్ననప్పటికినీ, తన్ను కాపాడుకొనుటకు ప్రయత్నము చేయని ఒక మనుష్యుని గూర్చి యెషయా గ్రంథములోని ఒక ప్రవచనమైయుండెను.

"ప్రవక్త తన్ను గూర్చి వ్రాయుచున్నాడా లేక వేరొకని గూర్చియా" అని ఐతియోపీయుడు అడిగెను.

ఫిలిప్పు సరిగా అదే లేఖనము నుండి ప్రారంభించి యేసును గూర్చిన సువార్తను, ఆయన ఎట్లు భూమికి వచ్చెనో, చంపబడెనో మరియు దేవుడెట్లు మృతులలోనుండి ఆయనను లేపెనో అతనికి తెలిపెను మరియు స్పష్టముగా అతడు బాప్తీస్మమును గూర్చి కూడ మాట్లాడియుండెను. ఎందుకనగా వారు ఒక నీళ్ళున్న స్థలమునకు వచ్చినపుడు ఐతియోపీయుడు, ఇదిగో ఇక్కడ నీళ్ళున్నవి నేనెందుకు బాప్తీస్మము పొందరాదు?" అని అడిగెను. అతడు రథము నడుపువానిని ఆపుమని ఆజ్ఞాపించెను.

"నీ పూర్ణ హృదయముతో నీవు విశ్వసించిన యెడల నీవు పొందవచ్చును," అని ఫిలిప్పు చెప్పెను. "యేసు క్రీస్తు దేవుని కుమారుడని నేను నమ్ముచున్నాను" అని ఆ మనుష్యుడు చెప్పెను.

ఫిలిప్పు మరియు ఐతియోపీయుడు యిద్దరు నీటిలోనికి దిగి వెళ్ళిరి మరియు ఫిలిప్పు అతనికి బాప్తీస్మమిచ్చెను. ఇక్కడ "బాప్తీస్మమిచ్చెను" అను మాటకు ముంచెను అని అర్థము. అది ఒకనిని పాతిపెట్టుట వంటిది; అనగా ఒక వ్యక్తి మరణించి మరియు తిరిగి లేచుట, అక్షరానుసారముగా ఒక నూతన పురుషుడగుట వంటిది (రోమీయులు 6:3 చూడుము)

వారు నీటిలో నుండి బయటకి వచ్చినపుడు ప్రభువు యొక్క ఆత్మ వెంటనే ఫిలిప్పును కొనిపోయెను. అకస్మాత్తుగా అతడు వేరొక స్థలమునకు మార్చబడెనో లేక తరువాత స్థలమునకు పోవలెనని మాత్రమే అతడు ఆదేశింపబడెనో మనమెరుగము. ఏది ఏమైనప్పటికినీ ఆ ఐతియోపీయుడు అతనిని తిరిగి ఎన్నడును చూడలేదు.

రథములోని మనుష్యుడయితే ఎంతో సంతోషించెను! ఇప్పుడతడు యేసుతో మరియు తండ్రియైన దేవునితో ఒక అద్భుతమైన సంబంధము కలిగియున్నాడని ఎఱిగి, అతడు సంతోషించుచు తన దారిన వెళ్ళెను.

### కంఠత వాక్యము

అతడు దౌర్జన్యము నొందెను. బాధింపబడినను అతడు నోరు తెరువలేదు. వధకు తేబడు గొఱ్ఱెపిల్లయు బొచ్చు కత్తిరించువాని యెదుట గొఱ్ఱెయు మౌనముగా ఉండునట్లు అతడు నోరు తెరువలేదు. **యెషయా 53:7.**

## 32వ పాఠము – పరీక్ష

# సువార్తికుడైన ఫిలిప్పు

1. యెరూషలేములో సౌలు యింటింటికి వెళ్లి........................... . ( )
   ఎ. ప్రజలకు యేసును గూర్చి చెప్పుచుండెను.
   బి. స్తెఫను కొరకు వెదకుచుండెను.
   సి. క్రైస్తవులను బంధించుచుండెను.
2. ఈ కథలో ఫిలిప్పు ఎవరు? ( )
   ఎ. అపోస్తలుడు
   బి. యెరూషలేములో విధవరాండ్రకు సేవ చేయువారిలో ఒకడు.
   సి. యూదుల అధికారి
3. ఈ సందర్భములో ఫిలిప్పు................. నుండి ఆదేశము పొందెను. ( )
   ఎ. దేవదూత
   బి. యేసు
   సి. దేవుడు
4. ఫిలిప్పు................ ఐతియోపీయుడైన ఒక మనుష్యుని కలుసుకొనెను. ( )
   ఎ. మార్గములో నడుచుచున్న
   బి. గుర్రముపై స్వారీ చేయుచున్న
   సి. రథములో కూర్చొని ప్రయాణము చేయుచున్న
5. ఆ మనుష్యుడు .................................... . ( )
   ఎ. రోజు వారి కూలి
   బి. రాణి యొక్క ధనాగారముపై అధికారి
   సి. రథములు తయారు చేయువాడు
6. ఆ మనుష్యుడు ............................. చదువుచుండెను. ( )
   ఎ. వార్తా పత్రిక
   బి. దావీదు రచనలు
   సి. యెషయా గ్రంథము
7. అతడు ఫిలిప్పును...................... కోరెను. ( )
   ఎ. తాను చదువుచున్న రచనలను వివరించమని
   బి. అతడు గ్రంథము చదువుచుండగా రథము నడుపమని
   సి. తనను ఒంటరిగా విడిచి వెళ్ళుమని
8. ఫిలిప్పు ఆ మనుష్యునికి ................... బోధించెను ( )
   ఎ. యూదుల పండుగలను
   బి. యేసు యే విధముగా మరణించి తిరిగి మృతులలోనుండి లేపబడెనో
   సి. దావీదు కీర్తనలు
9. ఆ మనుష్యుడు ..................... మరియు ఫిలిప్పు దేవుని ఆత్మ చేత కొనిపోబడెను. ( )
   ఎ. ఫిలిప్పును విడిచి వెళ్ళమని చెప్పెను.
   బి. ఫిలిప్పు చెప్పిన మాటలు నమ్మలేదు
   సి. విశ్వసించి బాప్తీస్మము పొందెను.
10. మనము.......................... దేవుడు మనలను దీవిస్తాడు. ( )
   ఎ. నిజాయితీగా సత్యమును వెదకినప్పుడు
   బి. సత్యము యెడల ఉదాసీనముగా ఉన్నచో
   సి. సత్యమును నిర్లక్ష్యము చేసినచో

## 33వ పాఠము

# పేతురు మరియు దొర్కా

### అపోస్తలుల కార్యములు 9:36-43

దొర్కా కొన్ని సార్లు తబిత అని కూడా పిలువబడెను. దొర్కా అను మాటకు అర్థము "లేడి". ఆమె చాలా దయగల వ్యక్తి. ఆమె తన సమయమును యొప్పెలోని విధవరాండ్ర కొరకు శ్రద్ధచూపుచు గడిపెను.

దేవుడు ఎల్లప్పుడు విధవరాండ్రు మరియు పేదలైన ప్రజలను గూర్చి పట్టించుకొనుచుండెను. బైబిలు కాలములో ఒక స్త్రీ యొక్క భర్త మరణించినప్పుడు ఆమె జీవనోపాధికి మార్గము లేకుండెను. (ఈ పరిస్థితి ఈ రోజున ప్రపంచము యొక్క కొన్ని భాగములలో ఇంకను ఉన్నది ).

ఆ కాలములలో ధర్మశాస్త్రము చెప్పినదేమనగా ఒక విధవరాలి భర్త భూమిని కలిగియుంటే, అది పెద్ద కుమారునికి చెందును మరియు ఆ కుమారుడు తన తల్లి యెడల శ్రద్ధ చూపని యెడల ఆమె సహాయము పొందుటకు వేరొక మార్గము లేదు. కుమారుడు లేని యెడల అప్పటికినీ ఆమె తన ఆస్థిపోగొట్టుకొనును మరియు ఆమె భర్త బంధువొకడు ఆమెను పెండ్లి చేసుకున్నప్పుడు మాత్రమే దానిని తిరిగి పొందవచ్చును. రూతు మరియు బోయజుల కథ మనము జ్ఞాపకము చేసుకొనగలము.

పేదవారిని పట్టించుకొనవలెనని దేవుడు యూదులను ఆజ్ఞాపించి యుండెను. వారు వారి పొలముల ఓరలను కోత కోయకూడదు. ఏరుకొనుటకు లేదా కోసుకొనుటకు పేద ప్రజల కొరకు ధాన్యమును విడిచిపెట్టవలెను. యజమాని కూడా క్రింద రాలిన ధాన్యమును ఎత్తుకొనుటకు పొలమునకు రెండవసారి వెళ్ళకూడదు. అది పేదవారి కొరకు విడిచిపెట్టబడవలెను.

ప్రతి మూడవ సంవత్సరము దశమభాగము లేక పంటలో పదవభాగము పేదలకు యివ్వబడెను మరియు ప్రతి ఏడవ సంవత్సరము ప్రజలు ఒక నూతన ప్రారంభము పొంది మరియు ధనపు ఋణముల నుండి విడుదల కలిగి తిరిగి ప్రారంభించునట్లు ఋణములు అన్నియు రద్దు చేయబడును.

ఒక వ్యక్తి విధవరాండ్రు మరియు అనాథలను సంరక్షించుటయే పవిత్రమైన భక్తి యొక్క గుర్తులలో ఒకటి అని క్రొత్త నిబంధనలో యాకోబు వ్రాసెను. పేదలను సంరక్షించువారు దేవుని చేత ఆమోదింపబడుదురు మరియు అట్లు చేయనివారు దేవునికి అయిష్టులుగా ఉందురు.

దొర్కా ఓడరేవు పట్టణమైన యొప్పేలో నివసించెను.

ఆమె ప్రేమ కలిగిన వ్యక్తి, ఇతరులకు ముఖ్యముగా పేదవారికి దయ చూపించెను. శీతాకాలములో వారిని వెచ్చగా ఉంచుటకు వారు ఏదైన కలిగియుండునట్లు ఆమె విధవరాండ్ర కొరకు చొక్కాలు తయారుచేసెను.

ఒకరోజున ఆమె జబ్బుపడి చనిపోయెను. ఆమె స్నేహితులు చాలా విచారించిరి మరియు ఆంధోళన చెందిరి. వారి ప్రియ స్నేహితురాలు వెడలిపోయెను.

పేతురు రోగులైన ప్రజలను స్వస్థపరచు అద్భుత క్రియలను చేయుచున్నాడని వారు వినిరి. ఈ సమయమునకు ఏ అపోస్తలుడును మృతులలో నుండి ఎవనిని లేపియుండలేదు. కాని దొర్కా స్నేహితులు పేతురు దానిని కూడా చేయగలడని నమ్మిరి కాబట్టి వారు ఇద్దరు మనుష్యులను పేతురు ఉండిన లుద్ద అను దగ్గరలోని పట్టణమునకు పంపిరి.

పేతురు ఆ మనుష్యుల వెంట యొప్పేకు వెళ్ళెను అతడు అక్కడకు చేరినప్పుడు ఆమె స్నేహితులు దొర్కాను ఉంచిన మేడ గదికి అతడు నడిపింపబడెను. ఆ గది విధవరాండ్రతో నిండియుండెను. వారు ఏడ్చుచుండిరి మరియు ఆమె బ్రదికియున్నప్పుడు వారి కొరకు దొర్కా చేసిన చొక్కాలు మరియు ఇతర వస్త్రములను ఒకరికొకరు చూపించుకొనుచుండిరి. ప్రతి కుట్టూ ఆమె విశ్వాసమును మరియు వారి యెడల ఆమె కలిగియున్న ప్రేమను చూపెను.

అందరు గది వదలిపోవలెనని పేతురు వారికి చెప్పెను. అప్పుడు అతడు తన మోకాళ్లని ఆమె నిశ్చలమైన దేహము లోనికి జీవమును తిరిగి తెమ్మని దేవునిని అడుగుచు ప్రార్ధన చేసెను. అతడు ఆమెతో, "తబితా, లెమ్ము" అని చెప్పెను.

ఆమె తన కళ్ళు తెరచెను మరియు ఆమె పేతురును చూచినప్పుడు ఆమె లేచి కూర్చుండెను. అతడు చేతితో ఆమెను పట్టుకొనెను మరియు ఆమె లేచి నిలువబడెను.

గదిలోనికి తిరిగి రమ్మని ప్రజలను అతడు పిలిచెను మరియు అక్కడవారు తమ స్నేహితురాలు తిరిగి జీవించియుండుటను చూచిరి. వారు ఎంత ఆనందము పొందిరో కదా!

ఈ వార్త యొప్పే పట్టణము అంతయూ వేగముగా వ్యాపించెను. దోర్కా తిరిగి బ్రదికెను! ఈ అద్భుత కార్యాన్ని బట్టి అనేక ప్రజలు ప్రభువునందు విశ్వాసముంచిరి.

**: కంఠత వాక్యము :**

బీదలను కనికరించువాడు యెహోవాకు అప్పిచ్చువాడు. వాని ఉపకారమునకు ఆయన ప్రత్యుపకారము చేయును.

**సామెతలు 19:17**

## 33వ పాఠము – పరీక్ష

# పేతురు మరియు దొర్కా

1. దేవుడు తన ప్రజలు ఎప్పుడూ ............. అని కోరుచున్నాడు. ( )
   ఎ) పేదవారిని ఆదరించకూడదు
   బి) పేదవారిని ఆదరించాలి
   సి) తమ కుటుంబాలను మాత్రమే ప్రేమించాలి
2. ................ ద్వారా దొర్కా విధవరాండ్రకు సహాయపడెను. ( )
   ఎ) అంగీలు కుట్టుట
   బి) భోజనాలు తయారుచేయుట
   సి) భోజన సంబంధిత సరుకులు కొనుట
3. ఆమె స్నేహితులు చాలా విచారించారు ఎందుకంటే దొర్కా .............. . ( )
   ఎ) వారిని ప్రేమించడంలేదు
   బి) ధనముతో వారికి సహాయం చేసెను
   సి) చనిపోయెను
4. ఆమె స్నేహితులు ................ రావాలని సందేశం పంపించిరి. ( )
   ఎ) పౌలు
   బి) పేతురు
   సి) లేవి
5. అపోస్తలుడు అక్కడికి వచ్చేటప్పటికి ఆ విధవరాండ్రు .................. . ( )
   ఎ) దొర్కా వారి కొరకు కుట్టిన వస్త్రాలు చూపించిరి
   బి) ఆయనకు ఇవ్వడానికి ధనాన్ని ప్రోగుచేసిరి
   సి) తమ పిల్లలను దీవించాలని పేతురు దగ్గరకు తీసుకొని వచ్చిరి
6. ఆయన మేడ గదిలోనికి వెళ్ళిన వెంటనే విధవరాండ్రందరితో ....... అని చెప్పెను. ( )
   ఎ) మోకరించి ప్రార్థించండి
   బి) గది నుండి బయటకు వెళ్ళు
   సి) కళ్ళు మూసుకోండి
7. పేతురు దేవునికి ప్రార్థించి ........... అని చెప్పెను. ( )
   ఎ) దేవుడు నిన్ను బ్రతికించుచున్నాడు
   బి) విధవరాండ్ర దగ్గరకు నీవు తిరిగి రావాలి
   సి) తబితా లెమ్ము
8. ఆమె పేతురును చూచినప్పుడు, దొర్కా ................ . ( )
   ఎ) ఆయన ఎవరు? అని అడిగెను
   బి) పైకి లేచి కూర్చుని, తర్వాత నిలువబడెను
   సి) ఏడ్చుట ప్రారంభించెను
9. దొర్కాను గూర్చిన వార్త వ్యాపించినప్పుడు అనేకులు ....................... . ( )
   ఎ) ప్రభువు నందు విశ్వసించిరి
   బి) అలా నిజంగా జరిగెనని నమ్మలేదు
   సి) చనిపోయిన వారిని అందరిని బ్రతికించాలని పేతురుతో చెప్పిరి
10. ఈ పాఠము నుండి మనము నేర్చుకోవలసింది ఏమిటనగా .................. . ( )
   ఎ) అందరూ అంగీలు కుట్టుట
   బి) పేదవారికి చేయగలిగినంత సహాయం చేయుట
   సి) మనకంటే తక్కువ స్థానంలో ఉన్న వారికి సహాయం చేయకూడదు

## 34వ పాఠము

# పేతురు దర్శనము

## అపోస్తలుల కార్యములు 10:1-23

కైసరయ పట్టణములో కొర్నేలీ అను రోమా సైనికాధికారి ఉండెను. అతడు 100 మంది సైనికులపైన అధికారి అనగా ఒక శతాధిపతియై యుండెను. అతడు మరియు అతని కుటుంబమంతయు దేవుని యందు భయభక్తులు గలవారై యుండి బీదలకు సహాయము చేయుచు ఎల్లప్పుడును దేవునికి ప్రార్థన చేసిరి.

ఒకరోజు మధ్యాహ్నము మూడు గంటలకు అతనికి ఒక దర్శనము కలిగెను. కొన్నిసార్లు దేవుడు ప్రజలతో ఈ విధముగా సంభాషించెను. తనను పేరుపెట్టి పిలిచిన ఒక దేవదూతను కొర్నేలీ చూచెను. "కొర్నేలీ" అని దేవదూత పిలిచెను.

కొర్నేలి భయపడెను మరియు ఆ దర్శనము దేవుని నుండి అని గుర్తించెను. "ప్రభువా యేమని"? అతడు అడిగెను.

కొర్నేలీ బీదల కొరకు చేసియున్న దయగల సంగతులను గూర్చి దేవుడు ఎరుగునని మరియు అతని ప్రార్థనలు దేవుడు వినెనని దేవదూత చెప్పెను.

సముద్రపు ఒడ్డున ఉన్న సీమోను యొక్క యింటిలో చర్మకారుడైన సీమోనుతో నివసించుచున్న పేతురు అను మనుష్యుని వెంట తెచ్చుట కొరకు యొప్పే పట్టణమునకు మనుష్యులను పంపవలెనని అతడు చెప్పబడెను.

దేవదూత వెళ్ళిపోయినప్పుడు కొర్నేలీ తన యిద్దరు పనివారిని మరియు అతడు బాగుగా నమ్మిన అతని సైనికులలో ఒకనిని పిలిచి యొప్పేకు వెళ్ళి పేతురును కనుగొనుటకు పంపెను. ఆ పట్టణము కైసరయ నుండి సుమారు ముప్పది మైళ్ళ దూరమున ఉండెను.

మన కథలో ముందుకు వెళ్ళుటకు ముందు మనము యూదులు మరియు అన్యులను గూర్చి కొంత చెప్పవలసిన అవసరమున్నది. ఒక వ్యక్తి యూదుడు కానియెడల అతడు/ఆమె అన్యుడగును మరియు వారు "దేవుని ఎన్నిక జనాంగము" యొక్క భాగము కాదు. కావున యూదులు అన్యులను ద్వేషించిరి. వారు అన్యులతో సహవాసము కలిగియుండరు మరియు వారితో వ్యవహారము చేయరు.

మన కథలో ఒక అన్యుడైన కొర్నేలీ యూదుడైన పేతురుకు తన యింటికి రమ్మని ఒక సందేశమును పంపుటను మనము చూచుచున్నాము. పేతురు యొక్క స్పందన యేమైయుండును? ఈ "అపవిత్రుడైన" వ్యక్తితో అతడు ఎట్టి వ్యవహారము కలిగియుండకూడదు.

మరుసటి రోజు మధ్యాహ్నసమయమున ముగ్గురు మనుష్యులు యొప్పే పట్టణము చేరుకొనిరి. పేతురు ఆకలిగొనెను మరియు భోజనము సిద్ధపరచబడుచుండగా అతడు మిద్దె మీద ప్రార్థన చేయుచుండెను. ఆ ప్రాంతములోని మిద్దెలు సమతలముగా ఉండెడివి. వెచ్చని వాతావరణమునందు కుటుంబము మిద్దెపైన పడుకొనవచ్చును. జనులు యిల్లు కట్టుకొనినప్పుడు యింటి కప్పు నుండి ఎవడైనను పడిపోయిన యెడల ఎట్టి గాయము కొరకైనను వారు బాధ్యులు కాకుండునట్లు కప్పు అంచుచుట్టూ ఒక పిట్టగోడ కట్టవలెనని మోషే ధర్మశాస్త్రము చెప్పెను. (ద్వితియోపదేశ కాండము 22:8). ఆ గోడ సాధారణముగా నాలుగు అడుగుల ఎత్తు కలిగియుండెడిది.

పేతురు, ఒక కలవంటి స్థితిలోనికి, పారవశ్యములోనికి పోయెను. అతడు ఆకాశము తెరువబడుటయు మరియు ఒక పెద్ద దుప్పటి దాని నాలుగు చెంగుల ద్వారా క్రిందికి దింపబడుటయు చూచెను. ఆ దుప్పటిలో సకల విధములైన చతుష్పాద జంతువులును, పక్షులును మరియు ప్రాకుపురుగులును ఉండెను.

"పేతురూ, నీవు లేచి చంపుకొని తినుము" అని ఒక స్వరము అతనికి చెప్పెను. మోషే ధర్మశాస్త్రము ప్రకారము కొన్ని జంతువులు తినుటకు యుక్తమును "పవిత్రమై" యున్నవి. ఈ అపవిత్రమైన జంతువుల తినకూడదని ఇశ్రాయేలు ప్రజలు ఆజ్ఞాపింపబడిరి. బహుశ ఈ జంతువుల నుండి వచ్చుకొన్ని వ్యాధుల నుండి వారిని రక్షించుటకు దేవుడు ప్రయత్నించు చుండవచ్చును.

జంతువుల జాతులు లేవికాండము 11వ అధ్యాయములో వివరముగా వర్ణింపబడెను. అపవిత్రమైన జంతువులలో ఒంటె, నీటి కుక్క, కుందేలు, బల్లి మరియు పంది ఉండెను. వారు హేమ్ లేక బేకను వంటి పంది మాంసమును తినకూడదు. కేట్‌ఫిష్ వంటి రెక్కలు లేక పొలుసులు లేని చేపలు అపవిత్రము. కొన్ని పక్షులు, ముఖ్యముగా కృళ్ళిన వాటిని తినునవి మరియు వేటాడు పక్షులు రాబందు, డేగ, గ్రద్ద, గుడ్లగూబ, కాకి, కొంగ మరియు గబ్బిలము అపవిత్రము.

పేతురు యేమి చేయవలెను? అతడు అపవిత్రమైన జంతువును తినలేదు, అయినప్పటికినీ "చంపి తినుమని" స్వరము చెప్పియుండెను.

పేతురు, "వద్దు ప్రభువా, నిషిద్ధమైనది అపవిత్రమైనది ఏదైనను నేనెన్నడును తినలేదు" అని చెప్పెను.

ఆ స్వరము రెండవసారి పలికెను మరియు దేవుడు వాటిని పవిత్రము చేసెనని మరియు పేతురు వాటిని అపవిత్రమని పిలువరాదని అతనితో చెప్పెను.

మూడుసార్లు ఆ స్వరము అతనితో "చంపి తినుము" అని చెప్పెను, అప్పుడు ఆ దుప్పటి అకస్మాత్తుగా ఆకాశమునకు వెనుకకు తీసుకొనబడెను.

ఈ దర్శనము యొక్క అర్థమేమైయుండునో అని పేతురు ఆశ్చర్యపడుచుండగా కొర్నేలి ద్వారా పంపబడిన మనుష్యులు వచ్చి, వాకిట నిలిచి, సీమోను పేతురు అక్కడ ఉన్నాడా అని అడిగిరి.

సమస్తము సిద్ధముగా ఉండెను. ముగ్గురు మనుష్యులు అతనిని వెదకుచున్నారని, అతడు క్రిందికి దిగివెళ్ళి, వారితో వెళ్ళవలెనని ప్రభువు ఆత్మ పేతురుతో చెప్పెను. ఆ మనుష్యులను అతని వద్దకు ఆయనే పంపియున్నాడని ఆత్మ చెప్పెను.

పేతురు క్రిందికి దిగివెళ్ళి మరియు వారు వెదకుచుండిన వ్యక్తి తానే అని వారితో చెప్పెను.

మీరు వచ్చిన కారణమేమియని అతడు అడిగెను.

ఎట్లు ఒక దేవదూత వారి యజమానునికి కనబడెనో మరియు పేతురు కొరకు యొప్పేకు మనుష్యులను పంపుమని కొర్నేలీతో చెప్పెనో వారు తెలిపిరి. అప్పుడతడు వారిని యింటిలోనికి ఆహ్వానించి వారికి ఆతిథ్యమిచ్చెను.

ఇప్పుడు అతడు అన్యులను ఏమాత్రము "అపవిత్రులుగా" ఎంచరాదని, ఏలయనగా దేవుడు వారిని అంగీకరించెనని మరియు యేసును గూర్చిన శుభవార్తను వారికి చెప్పునది అతడే అని పేతురు అర్థము చేసుకొనెను.

**పేతురు ఆ మనుష్యులతో కైసరయకు వెళ్ళినప్పుడు యేమి జరిగెనో తెలుసుకొనుటకు తరువాత కథ చదువుము.**

## : కంఠత వాక్యము :

దేవుడు పవిత్రము చేసినవాటిని నీవు నిషిద్ధమైన వాటినిగా ఎంచవద్దని మరల రెండవ మారు ఆ శబ్దము అతనికి వినబడెను. **అపోస్తలుల కార్యములు 10:15**

## 34వ పాఠము - పరీక్ష

# పేతురు దర్శనము

1. కొర్నేలీ ఒక ....................... . ( )
   ఎ) ఒక అపోస్తలుడు
   బి) ఒక రోమా పరిపాలకుడు
   సి) ఒక రోమా సైనికాధికారి
2. దూత కొర్నెలీతో .................. అని చెప్పెను. ( )
   ఎ) దేవుడు అతని యెడల అయిష్టముగా ఉన్నాడు
   బి) దేవుడు అతనిని బట్టి సంతోషించుచున్నాడు
   సి) అతడు దేవునికి ప్రార్థన చేయుట మానవలెను
3. ... అను పేరుగల మనుష్యుని కొరకు యొప్పేకు మనుష్యులను పంపవలెనని అతడు చెప్పబడెను. ( )
   ఎ) పేతురు
   బి) పౌలు
   సి) బర్నబా
4. కొర్నేలీ ................. . ( )
   ఎ) యొప్పేకు తానే వెళ్ళుటకు నిర్ణయించుకొనెను
   బి) ఆ మనుష్యుని కనుగొనుటకు యిద్దరు పనివారిని మరియు ఒక సైనికుని పంపెను
   సి) దేవదూత అతనితో చెప్పినదానిని నమ్మలేదు
5. పేతురు మిద్దె మీద ప్రార్థన చేయుచుండగా ................. . ( )
   ఎ) అతడు ఆకలిగొనెను మరియు భోజనము చేయుటకు క్రిందికి వెళ్ళెను
   బి) కొర్నెలీ అతని దగ్గరకు వచ్చెను
   సి) పారవశ్యములో ఉండి ఒక పెద్ద దుప్పటి ఆకాశము నుండి క్రిందికి దిగివచ్చుట అతడు చూచెను
6. ఆ పారవశ్యములో అతడు ........... చూచెను. ( )
   ఎ) సమస్త విధములైన జంతువులు, పక్షులు మరియు ప్రాకు పురుగులను
   బి) గొఱ్ఱెలు మరియు ఆవులను
   సి) చేపలు మరియు పక్షులను
7. ఆ స్వరము పేతురుకు .......... చెప్పెను కాబట్టి అతడు కలవరము చెందెను . ( )
   ఎ) క్రిందికి దిగివెళ్ళి తినుమని
   బి) అపవిత్రమైన జంతువులను చంపి, తినుమని
   సి) భోజన సమయము గడచిపోయెను మరియు అతడు ఇంకను ఆకలితో ఉండెనని
8. అదే దర్శనము ............. కనబడెను . ( )
   ఎ) ఒకసారి మాత్రమే
   బి) రెండుసార్లు
   సి) మూడుసార్లు
9. ............. పేతురు ఆ దర్శనము నుండి నేర్చుకొనెను . ( )
   ఎ) అతడు మొదట అనుకొనినంత ఆకలిగా లేదని
   బి) అతడు అన్యులను అపవిత్రులుగా ఎంచరాదని
   సి) దర్శనములన్నిటినీ నీవు నమ్మలేవని
10. ............ ప్రజలను కొన్నిసార్లు అంగీకరించుట మనకు కష్టము. ( )
   ఎ) మన నుండి భిన్నమైన
   బి) మనవంటి
   సి) మన స్నేహితులైన

## 35వ పాఠము

# కొర్నేలి

## అపోస్తలుల కార్యములు 10:23-48

కొర్నేలి చేత పంపబడిన ముగ్గురు మనుష్యులు ఆ రాత్రి యొప్పేలో గడిపిరి మరియు మరునాడు పేతురు కొర్నేలిని కలుసుకొనుటకు వారితో కూడ బయలుదేరి వెళ్లెను.

యూదులైన అతని సహోదరులు యేమి తలంతురు? యూదులు అన్యులను పెండ్లి చేసుకొనకూడదని లేక ఎట్టి అన్య ఆరాధనలోను పాలుపొందరాదని మోషే ధర్మశాస్త్రము బోధించెను. ఒక యూదుడు ఒక అన్యుని దర్శించరాదని లేక కలసి భోజనము చేయరాదని కూడ బోధించుట ద్వారా యూదుల పారంపర్యాచారము దానిని ఇంకను పరిమితము చేసెను.

జరుగుచున్న దానికి సాక్షులుగా ఉండుటకు పేతురు యూదులైన ఆరుగురు మనుష్యులను తనతో కూడ తీసికొనిపోయెను. అతడు ఒక అన్యుని యింటికి వెళ్లెనని వారు కనుగొనినప్పుడు యూదులైన అతని సహోదరులు మిక్కిలి కలవరము చెందుదురు.

కైసరయలో కొర్నేలి అతని కుటుంబము మరియు అతని సమీప స్నేహితులను పిలిచియుండెను మరియు వారందరు అతని యింటిలో కూడి పేతురు రాక కొరకు ఎదురుచూచుచుండిరి.

పేతురు యింటిలోనికి వచ్చినప్పుడు, కొర్నేలి అతనిని పూజించుటకు అతని పాదముల యొద్ద పడెను, అయితే పేతురు అతనిని పైకి లెమ్మని చెప్పెను. "నీవు లేచి నిలువుము. నేను కూడ నరుడను మాత్రమే" అని అతడు చెప్పెను. ప్రజలు మనుష్యులను లేక దేవదూతలను అరాధించుటకు దేవుడు కోరలేదు.

వారు లోపలికి వెళ్లినప్పుడు ప్రజల యొక్క ఒక పెద్ద గుంపు కూడియుండుటను పేతురు చూచెను. యూదులు అన్యులతో సాంగత్యము చేయుట యూదుల ధర్మశాస్త్రమునకు వ్యతిరేకమని అతడు వారితో చెప్పెను. ధర్మశాస్త్రము ప్రకారము పేతురు అను అతడు వారిని దర్శించుట కూడ చేయరాదు. అయితే అతడు ఏ మనుష్యుని అపవిత్రుడని పిలువరాదని దేవుడు అతనికి చూపియుండెను (మిద్దెమీద దర్శనమును జ్ఞాపకము చేసుకొనుడి).

"ఎందు నిమిత్తము నన్ను పిలువ నంపితిరి?" అని అతడు అడిగెను. అతడు ప్రార్థన చేయుచుండగా అతడు చూచియున్న దర్శనములను మరియు పేతురు కొరకు పంపించుమని ప్రకాశమానమైన వస్త్రములు ధరించిన మనుష్యుడు ఎట్లు అతనికి చెప్పెనో కొర్నేలి అతనికి తెలియజేసెను.

"ప్రభువు నీకు ఆజ్ఞాపించినవన్నియు వినుటకై యిప్పుడు మేమందరము దేవుని యెదుట ఇక్కడ కూడియున్నాము" అని కొర్నేలి చెప్పెను. వారి హృదయములు సందేశమును స్వీకరించుటకు తెరువబడి సిద్ధముగా ఉండెను. యేసును గూర్చి, ఆయన వచ్చి వారి మధ్య ఎట్లు నివసించెనో, సిలువ వేయబడెనో మరియు ఎట్లు దేవుడాయనను మృతులలో నుండి లేపెనో పేతురు వారికి చెప్పుట ప్రారంభించెను. ఆయన తిరిగి సజీవుడైన తరువాత యేసు కొందరు ప్రజలకు కనబడెను.

యేసునందు విశ్వాసముంచు ప్రతివాడు ఆయన నామము ద్వారా పాపముల క్షమాపణను పొందునని పేతురు చెప్పెను. అప్పుడు ఒక విశేషమైన సంగతి జరిగెను. పేతురు ఇంకను మాటలాడుచుండగా, వినుచున్న వారి మీదకు పరిశుద్ధాత్మ దిగివచ్చెను, మరియు పెంతెకొస్తు దినమున అపొస్తలులు చేసియున్నట్లుగా వారును అన్యభాషలలో మాట్లాడుట ప్రారంభించిరి.

పేతురుతో వచ్చిన ఆరుగురు మనుష్యులు ఆశ్చర్యము చెందిరి. యూదులు ఆశీర్వదింపబడినట్లుగానే ఇక్కడ అన్యులు దేవుని చేత ఆశీర్వదింపబడుచున్నారు! “మా వలెనే పరిశుద్ధాత్మను పొందిన వీరు నీళ్ళతో బాప్తీస్మము పొందకుండ ఎవడైనను ఈ ప్రజలను ఆటంకపరచగలడా” అని పేతురు చెప్పెను.

**యేసుక్రీస్తు నామములో బాప్తీస్మము పొందవలెనని అతడు వారికి ఆజ్ఞాపించెను. అప్పుడు కొన్ని దినములు తమ యొద్ద ఉండవలెనని వారు పేతురును అడిగిరి. ఇక యేమాత్రము పేతురు ఒక “అపవిత్రుడైన” అన్యుని యింటలేదు కాని ఒక క్రైస్తవ సహోదరుని యింట ఉండెను.**

పేతురు ఒక అన్యుని యింటిని దర్శించియుండెనని యూదులు వినినప్పుడు ఖచ్చితముగా వారు చాలా కలవరపడిరి అయితే అతడు వారికి పూర్తి వృత్తాంతమును తెలియజేసెను మరియు అతనికి సాక్ష్యమిచ్చుట కొరకు యూదులైన ఆరుగురు సహోదరులను అతడు కలిగియుండెను. అన్యులు నిజముగా అంగీకరింపబడియున్నారని యూదులు ఒప్పింపబడిరి, మరియు దాని కొరకు వారు దేవుని స్తుతించిరి.

**కంఠత వాక్యము:**

ప్రభువు నీకు ఆజ్ఞాపించినవన్నియు వినుటకై ఇప్పుడు మేమందరము దేవుని యెదుట ఇక్కడ కూడి ఉన్నాము.

**అపోస్తలుల కార్యములు 10:33.**

## 35వ పాఠము – పరీక్ష

# కొర్నేలి

1. కొర్నేలి చేత పంపబడిన ముగ్గురు మనుష్యులు ఆ రాత్రి ................లో గడిపిరి. ( )
   ఎ. యెరూషలేము
   బి. బెత్లెహేము
   సి. యొప్పే
2. పేతురు యూదుల మతాచారము ప్రకారము నిషేదింపబడిన ......... వెళ్లినందున అతడు చింతపడెను. ( )
   ఎ. కైసరయకు
   బి. అన్యుని యింటికి
   సి. అపవిత్రమైన మాంసము తినుటకు
3. పేతురు తనతో పాటు................ తీసికొనివెళ్లెను. ( )
   ఎ. ఆరుగురు యూదులను సాక్షులుగా
   బి. వండుకొనుటకు కొంచెము మాంసమును
   సి. మరియొక వస్త్రమును
4. పేతురు యింటికి వచ్చినపుడు, కొర్నేలి.................... . ( )
   ఎ. పరిశుద్ధమైన మనస్సుతో అతనిని ఆహ్వానించెను.
   బి. అతనిని ఆరాధించుటకు సాగిల పడెను.
   సి. అతనిని తన కుటుంబమునకు పరిచయము చేసెను.
5. కొర్నేలి ఇట్లు చేసినప్పుడు, పేతురు............... . ( )
   ఎ. అదే రీతిలో ప్రతిస్పందించెను.
   బి. అతనిని దీవించెను
   సి. లేచి నిలువుమని చెప్పెను.
6. పేతురు కొరకు పంపవలెనని.......... తనకు చెప్పెనని కొర్నేలి పేతురుకు చెప్పెను. ( )
   ఎ. దేవుడు
   బి. ప్రకాశవంతమైన వస్త్రము ధరించిన మనుష్యుడు
   సి. యేసు
7. పేతురు............ కొర్నేలికి చెప్పెను. ( )
   ఎ. యేసు గూర్చి మరియు ఆయన ఎట్లు తిరిగిలేపబడెనో
   బి. మోషే ధర్మశాస్త్రమును గూర్చి
   సి. యూదుల కొరకు మాత్రమే యేసు ఏలాగు చనిపోయెనో
8. పేతురు ఇంకను మాట్లాడుచుండగా................. . ( )
   ఎ. కొంత మంది ప్రజలు గదిని వదలి వెళ్లిరి
   బి. వినువారి మీద పరిశుద్ధాత్మ దిగెను
   సి. బలమైన గాలి ఆ యిల్లంతటి మీద వేగముగా వీచెను
9. పేతురు కొర్నేలికిని అతని కుటుంబము మరియు స్నేహితులకు........... చెప్పెను. ( )
   ఎ. యేసుక్రీస్తు నామమున బాప్తీస్మము పొందవలెనని
   బి. వారు యూదులుగా మాత్రమే ఉండవలెనని
   సి. వారు ఇతర యూదుల చేత ఆహ్వానింపబడరని
10. పిల్లలు మంచి వైఖరి కలిగియున్నప్పుడు.................. . ( )
   ఎ. ఇంటిలో విభేదములు కలుగును
   బి. దేవునికి సంతోషము కలుగదు
   సి. ఇంటిలో ఐక్యత మరియు సంతోషము ఉండును.

# 36వ పాఠము

ప్రియమైన తల్లిదండ్రులారా,

బయటకు వెళ్ళి మరియు వారి కొరకైన దేవుని గొప్ప ప్రేమను గూర్చి వినని ప్రజలను కనుగొనుటకు అతని / ఆమె యొక్క పాదములను ఉపయోగించవలెనని మీ బిడ్డను ఈ వారము సవాలు చేయుడి. మిషనరీలను గూర్చి అనగా దేవుని యొక్క గొప్ప ప్రేమను గూర్చి మరియు మనమెట్లు జీవించవలెనని ఆయన కోరుచున్నాడో దానిని గూర్చి వినియుండని వారికి తెలియజేయు వారిని గూర్చి మాట్లాడండి. మన పాఠము పౌలు మరియు అతని మిషనరీ ప్రయాణముల చుట్టు కేంద్రీకరించి యుండును.

## పౌలు

సౌలు క్రైస్తవులను హింసించిన ఒక కోప స్వభావపు మనుష్యుడు. హింసించుట అనగా ఒక క్రూరమైన మరియు నీచమైన విధమున ప్రవర్తించుట. సౌలు సమాజ మందిరములలో ఉన్నట్టి ఏ క్రైస్తవులనైనను బంధించుటకు దమస్కునకు వెళ్ళు మార్గమునందుండెను. సమాజ మందిరము యూదులు ఆరాధన మరియు బోధ కొరకు ఉపయోగించు ఒక భవనము. అప్పుడు ఒక ఆశ్చర్యకరమైన సంగతి జరిగెను. సౌలు ప్రయాణము చేయుచుండగా అతడెట్లు క్రైస్తవులకు హాని చేయగలడను విషయమై ఆలోచించుచుండెను. అతడు దమస్కు దగ్గరకు వచ్చినప్పుడు ఆకాశము నుండి ఒక ప్రకాశవంతమైన వెలుగు అకస్మాత్తుగా ప్రకాశించెను.

సౌలు నేలను పడెను మరియు 'సౌలా, సౌలా, నీవేల నన్ను హింసించుచున్నావు?" అని ఒక స్వరము పలికెను. "ప్రభువా, నీవు ఎవడవు?" అని సౌలు బదులిచ్చెను. అప్పుడు ఆ స్వరము, "నేను నీవు హింసించుచున్న యేసును. నాకు వ్యతిరేకముగా పోరాడుట నీకు కష్టము. ఇప్పుడు దమస్కులోనికి వెళ్లుము మరియు నీవేమి చేయవలెనో నీకు తెలియజేయబడును" అని చెప్పెను.

పౌలు నేల మీద నుండి లేచినప్పుడు అతడు గ్రుడ్డివాడుగా ఉండెను. ఇతరులు అతనిని చేయిపట్టుకొని పట్టణము లోనికి నడిపించవలసి వచ్చెను. మూడు దినముల పాటు సౌలు గ్రుడ్డివానిగా ఉండెను మరియు యేమియు తినకయు త్రాగకయు ఉండెను.

అతడు వెళ్లి సౌలును చూడవలెనని దేవుడు అననీయ అను ఒక మనుష్యునికి కలలో చెప్పెను. అతడు సౌలును కనుగొనెను, అతనిపై తన చేతులు ఉంచెను మరియు సౌలు తిరిగి చూడగలిగెను. ఆ బోధకుడు అతనితో లేచి, తన పాపములు కడిగివేసుకొనుట కొరకు బాప్తీస్మము పొందుమని చెప్పెను.

అతడు చేయుచూ ఉండిన సంగతుల నిమిత్తము సౌలు దుఃఖపడెను. అతడు చేయవలెనని యేసు కోరిన సంగతులను చేయుట అతడు ప్రారంభించెను. అతని రక్షణ మార్పు తరువాత సౌలు పేరు పౌలుగా మార్చబడెను మరియు అతడు తన శేష జీవితమును యేసును సేవించుచు మరియు ఆయనను గూర్చి ప్రజలకు బోధించుచు గడిపెను. అతడు లోకమందంతటా ఉన్న ప్రజలకు ఒక మిషనరి ఆయెను. మిషనరి అనగా క్రీస్తును గూర్చి బోధించుటకు సంఘము ద్వారా పంపబడిన ఒక వ్యక్తి. అపోస్తలుడైన పౌలు అనేక హింసలు భరించెను. ఇతర క్రైస్తవులను హింసించు వ్యక్తిగా ఉండుటకు బదులుగా, అతడు తానే క్రీస్తు కొరకు హింసింపబడిన వానిగా ఆయెను.

పౌలు యొక్క రక్షణ మార్పు అపోస్తలుల కార్యములు 9వ అధ్యాయము 1-19 వచనములలో కొనుగొనబడును.

**కంఠత వాక్యము :**

అప్పుడతడు నేల మీద పడి – "సౌలా సౌలా, నీవేల నన్ను హింసిచుచున్నావ"ని తనతో ఒక స్వరము పలుకుట వినెను – "ప్రభువా, నీవెవడవని" అతడడుగగా ఆయన నేను నీవు హింసించుచున్న యేసును అని చెప్పెను.

**అపోస్తలుల కార్యములు 9:4-5.**

# 36వ పాఠము - పరీక్ష

## పౌలు

1. హింసించుట అనగా............ అని అర్థము. ( )
   ఎ. క్రూరముగా, నీచముగా బాధపెట్టుట
   బి. అదరగొట్టుట
   సి. శ్రద్ధ తీసుకొనుట
2. పౌలు దమస్కుకు .................... వెళ్లుచుండెను. ( )
   ఎ. సువార్త బోధించుటకు
   బి. ఒక వ్యాపారము కుదుర్చుకొనుటకు
   సి. క్రైస్తవులను బంధించుటకు
3. యూదుల ఆరాధనా స్థలము........... అని పిలువబడెను. ( )
   ఎ. మసీదు
   బి. సమాజ మందిరము
   సి. సంఘ భవనము
4. పౌలు మార్గములో ఉండగా..................... . ( )
   ఎ. అతడు దొంగల మధ్య పడెను
   బి. ఆకాశము నుండి ప్రకాశవంతమైన వెలుగు ప్రకాశించెను
   సి. అతడు బాగా జబ్బు పడెను.
5. "సౌలా, సౌలా,....................?" అని ఒక స్వరము అతనితో చెప్పెను. ( )
   ఎ. నీవేల నన్ను హింసించుచున్నావు?
   బి. నీ ఇల్లు ఎక్కడ?
   సి. నీవు ఎక్కడకు వెళ్లుచున్నావు?
6. పౌలు "..........................." అని జవాబిచ్చెను. ( )
   ఎ. నేను యెరూషలేములో నివసించుచున్నాను.
   బి. నేను బెత్లెహేముకు వెళ్లుచున్నాను
   సి. ప్రభువా నీవు ఎవడవు?
7. సౌలు పైకి లేచినప్పుడు..................... . ( )
   ఎ. అతడు గ్రుడ్డివానిగా ఉండెను
   బి. అతడు నడువలేక పోయెను
   సి. ప్రతి ఒక్కరు ఆయనను విడిచిపోయిరి.
8. అననీయా అను బోధకుడు అతనితో................ అని చెప్పెను. ( )
   ఎ. పట్టణములోనికి వెళ్లుము.
   బి. లేచి బాప్తీస్మము పొంది నీ పాపములు కడిగివేసుకొనుము
   సి. క్రైస్తవులను హింసించుము.
9. సౌలు ఒక మిషనరీ ఆయెను. అతని పేరు................ గా మార్చబడెను. ( )
   ఎ. పౌలు
   బి. బర్నబా
   సి. తిమోతి
10. మనము.................. దేవుడు మనలను క్షమించును. ( )
    ఎ. కొంత ధనమును చెల్లించిన యెడల
    బి. మన పాపములను గూర్చి పశ్చాత్తాపపడని యెడల
    సి. మన అతిక్రమముల విషయమై మారుమనస్సు పొంది ఆయనవైపు తిరిగిన యెడల.

## 37వ పాఠము

# దమస్కులో పౌలు

క్రైస్తవుల హింసకుడైన సౌలు దమస్కు మార్గమున యేసును కలుసుకొనెను. అతని రక్షణ మార్పు తరువాత అతడు ఒక వేరు వ్యక్తిగా ఉండెను. క్రైస్తవులను చంపుచూ ఉండిన ఆ మనుష్యుడు ఇప్పుడు యేసు యొక్క అనుచరుడయ్యెను మరియు విశ్వాసుల పంక్తిని చేరెను. అతనిని గూర్చి యేమి తలంచవలెనో దమస్కులోని క్రైస్తవులు ఎఱుగకుండిరి. ఆయన వారి పట్టణములో బోధించుట మొదలుపెట్టెను మరియు మరింత శక్తిమంతుడయ్యెను.

అతడు వారికి ప్రమాదకారియని యూదులలో కొందరు నిర్ణయించిరి మరియు అతనిని చంపుటకు ఒక మార్గమును వెదుకుట ప్రారంభించిరి, కాని వారి ప్రణాళికను గూర్చి పౌలు తెలుసుకొనెను. అతడు పట్టణమును విడిచివెళ్లుటకు ప్రయత్నించినప్పుడు అతనిని పట్టుకొనుటకు నిశ్చయించుకొని అతని శత్రువులు పట్టణపు గవినిని రాత్రింబగళ్ళు కావలి కాయుచుండిరి.

పౌలు మరియు అతని స్నేహితులు వేరు ప్రణాళికలు కలిగియుండిరి మరియు ఇతర పట్టణములలో బోధించుట కొరకు పౌలు బ్రదికి ఉండవలెనని దేవుడు కోరెను. వారి ప్రణాళిక యిట్లుండెను; ఒక మనుష్యుని పట్టుటకు చాలినంత పెద్దదైన, ఒక భారీయైన గంపను వారు సంపాదించిరి. దానిని నేలకు దించుటకు ఆ గంపకు తాళ్లను కట్టిరి. చీకటి యైనప్పుడు పౌలు ఆ గంపలోనికి ప్రవేశించెను మరియు అతని స్నేహితులు అతనిని గోడలోని ఒక సందు ద్వారా క్రిందికి దించిరి. అతడు ఏ మాత్రము గవినులను ఉపయోగించలేదు. అతని శత్రువుల ప్రణాళిక విఫలము చేయబడెను మరియు పౌలు ఆ పట్టణమును క్షేమముగా విడిచివెళ్లెను.

అతడు దమస్కు నుండి యెరూషలేమునకు వెళ్లెను అయితే అక్కడి క్రైస్తవులు కూడ అతనికి భయపడిరి. బర్నబా, మంచివాడైన బర్నబా, అతని కొరకు నిలువబడెను మరియు పౌలు నిజముగా మార్పు చెందెనని క్రైస్తవులకు చెప్పెను. అతడు వారిచే చేర్చుకొనబడెను మరియు అతడు బోధించెను. కాని గ్రీసు నుండి వచ్చిన యూదులు అతనిని చంపుటకు ప్రయత్నించినపుడు అక్కడ కూడ ప్రమాదము ఏర్పడెను.

అతని స్నేహితులు అతనిని కైసరయకు తీసికొని వెళ్లిరి మరియు తరువాత అతనిని అతని స్వంత ఊరైన తార్సుకు పంపిరి.

**కంఠత వాక్యము**

యెహోవా నా శైలము, నా కోట, నా రక్షకుడు. **2 సమూయేలు 22:2.**

## 37వ పాఠము - పరీక్ష

# దమస్కులో పౌలు

1. సౌలు యేసును .................... కలిసెను. ( )
   ఎ. యెరూషలేము దేవాలయములో
   బి. దమస్కు మార్గములో
   సి. గెత్సెమనె తోటలో
2. సౌలు .......................గా పిలువబడుట ప్రారంభమాయెను. ( )
   ఎ. పౌలు
   బి. తార్సువాడైన సౌలు
   సి. బర్నబా
3. అతడు.................... అని యూదులు ఆయనను చంపుటకు ప్రయత్నించిరి. ( )
   ఎ. దేవాలయమును నాశనము చేయును
   బి. ఒక యూదుడు
   సి. వారికి ప్రమాదకరమైన వాడు
4. అతడు .......... శత్రువులు అతనిని పట్టుకొనవలెనని చూచిరి. ( )
   ఎ. పట్టణము విడిచి వెళ్లుటకు ప్రయత్నించినప్పుడు
   బి. సమాజ మందిరమునకు వెళ్లినపుడు
   సి. బోధించుట ప్రారంభించినపుడు
5. ఆయన శత్రువుల ప్రణాళికలు విఫలమాయెను ఎందుకనగా..................... . ( )
   ఎ. వారు సరిగా ప్రణాళిక చేయలేదు.
   బి. పౌలు కొరకు దేవుడు ఇతర ప్రణాళికలు కలిగియుండెను.
   సి. పౌలు అతనికి సహాయము చేయుటకు కొంతమంది మనుష్యులకు ధనము నిచ్చెను.
6. పౌలు స్నేహితులు ఆయనను తప్పించుటలో సహాయపడుటకు ఒక పెద్ద ............. తెచ్చిరి. ( )
   ఎ. తొట్టి
   బి. గంప
   సి. బకెట్
7. ఆయన స్నేహితులు........................ . ( )
   ఎ. గోడమీదుగా ఆయనను దించిరి
   బి. గోడకు రంధ్రము చేసిరి
   సి. ఒక పెద్ద డబ్బాలో అతనిని రహస్యముగా గవిని వెలుపలకు పంపిరి
8. పౌలు యెరూషలేమునకు వెళ్లినపుడు...................... . ( )
   ఎ. క్రైస్తవులు అతనిని ఆహ్వానించిరి
   బి. అతడు క్రైస్తవులను కనుగొనలేకపోయెను
   సి. క్రైస్తవులు అతనిని చూసి భయపడిరి
9. ................. పౌలు కొరకు నిలువబడి సహాయము చేసెను. ( )
   ఎ. బర్నబా
   బి. తిమోతి
   సి. మార్కు అను పేరు గల యోహాను
10. మనము మన స్నేహితులతో.................... . ( )
   ఎ. అబద్ధమాడవలెను
   బి. నమ్మకముగా ఉండవలెను
   సి. కృతఘ్నులమై ఉండవలెను.

## 38వ పాఠము

# బర్నబా

**అపోస్తలుల కార్యములు 4:36-37, 11:19-30, 13:1-51; 14:8-20; 15:36-41**

**సంఖ్యాకాండము 35:1-5**

ఆదిమ సంఘములో చాలా మంది నాయకులు ఉండిరి కాని కొంత మంది మాత్రమే బర్నబా వలె వినయము మరియు ప్రభావము కలిగియుండిరి. అతని పేరు యోసేపు కాని అపోస్తలులు అతనికి బర్నబా అని పేరు పెట్టిరి. ఆ పేరుకు ప్రోత్సాహపుత్రుడు అని అర్థము. అది అతనికి సరియైన పేరు, ఎందుకనగా అతనిని ఎరిగిన వారందరికిని అతడు ప్రోత్సాహకరముగా ఉండెడివాడు.

పెంతెకోస్తు దినమున మరియు దాని తరువాత దినములలో రక్షణ మార్పు చెందిన వేలమంది యూదులు యెరూషలేములో ఉండిరి. వారు ఎక్కువ రోజులు ఆ పట్టణములో గడుపుటకు ముందుగా సిద్ధపడి రాలేదు. అయితే వారిలో చాలా మంది అపోస్తలుల బోధ వినుటకు అక్కడనే ఉండిపోయిరి. వారి ధనము అయిపోయెను. వారు పేదవారిగాను అవసరతలోను ఉండిపోయిరి.

ఆస్థి కలిగిన కొంతమంది ప్రజలు, అవసరతలో ఉన్న సమూహములను పోషించునట్లు తమ ఆస్థిని అమ్మి అపోస్తలులకు యిచ్చిరి. పొలమును అమ్మిన వారిలో ఒకడు కుప్ర ద్వీపమునకు చెందిన బర్నబా.

అతడు ఒక లేవీయుడు. కనాను దేశమునకు ఇశ్రాయేలీయులు ప్రవేశించిన తరువాత భూమి పంపకము ప్రకారము లేవీయులకు పట్టణములు మరియు వారి పశువులకు గడ్డి నిమిత్తము గడ్డి భూములు ఇవ్వబడినవి. లేవీయుల పట్టణమునకు నాలుగు వైపుల 3000 అడుగులు (ఇంచుమించు అరమైలు దూరము) వరకు ఈ గడ్డి భూములు విస్తరించియుండెను. బర్నబా తన పొలమును అమ్మగా వచ్చిన ధనమును అపోస్తలుల యొద్దకు తెచ్చెను.

ప్రభువు చేత రాజ్యము యొక్క "తాళపుచెవులు" ఇవ్వబడినప్పటి నుండి అన్యులకు బోధించిన వారిలో పేతురు ప్రధముడుగా ఉండెను. అయితే పౌలు అన్య జనమునకు బోధించుటకు ప్రభువు చేత ఎన్నుకొనబడిన ఒక ప్రత్యేకమైన బోధకుడై యుండెను. పౌలు క్రొత్తగా మార్పు చెందిన సమయములో అతడు యెరూషలేముకు వెళ్లి విశ్వాసులతో పొత్తు కొరకు ప్రయత్నించెను కాని వారు అతనికి భయపడిరి.

అతడు కేవలము క్రీస్తు నందు విశ్వాసిగా ఉన్నట్లు నటించుచున్న యెడల పరిస్థితి యేమి? అతడు వారిని కనుగొని బంధించుటకు ప్రయత్నించుచున్న యెడల పరిస్థితి ఏమి?

అక్కడ జరుగుచున్న దానిని బర్నబా చూసెను. అతడు విశ్వాసుల యొద్ద నమ్మికను మరియు గౌరవమును కలిగియుండెను మరియు పౌలు యదార్థవంతుడని అతడు తలంచెను. అతడు పౌలును యెరూషలేములో ఉన్న అపోస్తలులకు పరిచయము చేసిన యెడల ఇతరులు పౌలును అంగీకరించుదురు. అతడు అదే పనిని చేసెను. పౌలు ఏ విధముగా మార్పు చెందెనో మరియు ప్రస్తుతము అతడు యేసును గూర్చి ఎట్లు ప్రకటించుచుండెనో బర్నబా వారికి వివరించెను.

సంఘము పౌలును అంగీకరించెను మరియు అతడు యెరూషలేములో బస చేయగలిగెను. అప్పుడు దుర్మార్గులైన మనుష్యులు పౌలును చంపవలెనని ప్రయత్నించుట మొదలుపెట్టిరి. అందుచేత సహోదరులు పౌలును తార్సుకు పంపిరి.

తరువాత బర్నబా తిరిగి పౌలు కొరకు తార్సు వెళ్లను. అతడు పౌలును కనుగొని అంతియొకయ పట్టణమునకు తీసికొని వచ్చెను. ఆ యిద్దరు కలసి ఆ పట్టణములో ఒక సంవత్సరకాలము బోధించిరి.

అయితే ఆత్మ పౌలును, బర్నబాను బోధించుటకు కుప్రకు పంపెను. అక్కడ వారు బర్‌యేసు లేదా ఎలుమా అను ఒక అబద్ధ ప్రవక్తను కలిసిరి. అతడు అధిపతి యొద్ద పనిచేయువాడై యుండెను. అతడు వారి బోధను వ్యతిరేకించెను. పౌలు అతనిని అపవాది కుమారుడా అని పిలిచెను మరియు అతడు కొంతకాలము గ్రుడ్డివాడై ఉండబోవుచున్నాడని పౌలు అతనికి చెప్పెను.

వెంటనే అతడు గ్రుడ్డివాడాయెను మరియు ఎవరైనను అతని చేయిపట్టుకొని నడిపించుదురని చూచెను. అధిపతి ఆశ్చర్యపోయి పౌలు మరియు బర్నబా యొక్క బోధలను విశ్వసించెను.

పౌలు బర్నబాల పనిని పరిశుద్ధాత్మ నడిపించెను మరియు వారు చాల పట్టణములకు ప్రయాణము చేసి యేసునుగూర్చి శుభవార్తను ప్రకటించిరి.

లుస్త్ర పట్టణములో పౌలు ఒక అద్భుతమును చేయుట ద్వారా ఒక కుంటివాడు తిరిగి నడుచుట జరిగెను. ఆ పట్టణములో అన్యులైన ప్రజలు వారిని దేవతలుగా భావించి వారికి బలులర్పించుటకు సిద్ధపడిరి. పౌలు బర్నబాలు, వారు కూడ మానవ మాత్రులేయని చెప్పి, నిజదేవుని ఆరాధించునట్లు వారిని నడిపించుటకు ప్రయత్నించుచున్నారని కేకలు వేయుచు బయటికి వచ్చిరి.

బర్నబా 12 మంది అపోస్తలులలో ఒకడు కాదు కాని ఈ సందర్భములో అతడు అపోస్తలుడుగా పిలువబడెను. ఎందుకనగా అతడు పరిశుద్ధాత్మ చేత ఒక ప్రత్యేక పని నిమిత్తము పంపబడెను.

బర్నబా బంధువు మార్కు అను మారుపేరు గల యోహాను బర్నబా మరియు పౌలుతో కొన్ని పట్టణములు తిరిగెను. కాని అతడు వారిని ఒక పట్టణములో విడిచిపోయెను మరియు వారితో కలసి ప్రయాణము కొనసాగించలేకపోయెను. తరువాత ఈ సంఘటన ఒక సమస్యను కలుగజేసెను. తిరిగి మార్కును తీసుకొని వెళ్లవలెనని బర్నబా కోరెను కాని అతనిని తీసికొని వెళ్లుటకు పౌలు అంగీకరించలేదు.

ఆ విషయములో వారి మధ్య తీవ్రమైన అసమ్మతి కలిగెను. మార్కు విషయములో అవకాశమిచ్చుటకు పౌలు ముందుకు రాలేదు. అయితే బర్నబా ఎల్లప్పుడు ప్రోత్సహించుటకు సిద్ధముగా ఉండెను. అతని బంధువుకు అవకాశమిచ్చుటకు కోరెను. వారు విడిపోవుటకు నిర్ణయించుకొనిరి. బర్నబా మార్కును తనతో తీసుకొని కుప్ర దీవికి వెళ్లెను. పౌలు మరియొక బోధకుడైన సీలను తీసికొని సిరియగుండా వెళ్లెను. వారు ఈ విధముగా రాజీపడిరి మరియు దేవుని పని ముందుకు సాగెను.

పౌలు బర్నబా తిరిగి కలసి పనిచేసినట్లుగా ఒక సూచన కలదు. చెరసాల నుండి కొలస్సీయులకు వ్రాసిన అతని పత్రికలో పౌలు మార్కు తనతో కూడ ఉండెనని తెలియజేయును మరియు మార్కు సంఘమునకు వచ్చిన యెడల అతనిని ఆహ్వానించవలెనని చెప్పెను.

బర్నబా నిజముగానే ప్రోత్సాహపుత్రుడై యున్నాడు. అతడు ఎల్లప్పుడు ప్రజలలో మంచినే చూచెను. వారిలో అతని నమ్మకము ప్రతిఫలము పొందెను.

**: కంఠత వాక్యము :**

వినువారికి మేలు కలుగునట్లు అవసరమును బట్టి క్షేమాభివృద్ధికరమైన అనుకూల వచనమే పలుకుడి గాని దుర్భాషయేదైనను మీ నోట రానియ్యకుడి. **ఎఫెసీయులు 4:29.**

## 38వ పాఠము – పరీక్ష

# బర్నబా

1. బర్నబా అను పదమునకు అర్థము............... . ( )
   ఎ. ప్రోత్సాహపుత్రుడు
   బి. బర్న్ యొక్క కుమారుడు
   సి. పవిత్రుడు
2. యెరూషలేములో చాల మంది పేదవారైరి ఎందుకనగా............ . ( )
   ఎ. ఆ సంవత్సరము పంటలు బాగా పండలేదు
   బి. అపోస్తలుల బోధ వినుటకు పట్టణములో ఉండిరి మరియు వారి ధనము ఖర్చు అయిపోయెను.
   సి. దొంగలు వారి ధనమును దొంగిలిరి.
3. కొందరు ప్రజలు.......... ఆ ధనము అపోస్తలులకు యిచ్చిరి. ( )
   ఎ. వస్త్రములు అమ్మి
   బి. రెండు ఉద్యోగములు చేసి
   సి. ఆస్తిని అమ్మి
4. బర్నబా ........... అమ్మి ధనము అపోస్తలుల యొద్దకు తెచ్చెను. ( )
   ఎ. ఆవు
   బి. పొలము
   సి. గుడారము
5. దేవుడు..............ను అన్యులకు బోధించుటకు ఎన్నుకొనెను. ( )
   ఎ. పౌలు
   బి. మత్తయి
   సి. ఆంద్రెయ
6. బర్నబా పౌలుకు ............... ద్వారా సహాయము చేసెను ( )
   ఎ. నివసించుటకు స్థలము ఇచ్చుట
   బి. అతని కొరకు భోజనము కొనుట
   సి. అపోస్తలులకు పరిచయము చేయుట
7. పౌలు బర్నబా............లో ఒక సంవత్సరమంతా బోధించిరి ( )
   ఎ. యెరూషలేము
   బి. ఎఫెసు
   సి. అంతియొకయ
8. వారు ఒకసారి................ అయిన ఎలుమను ఎదుర్కొనిరి ( )
   ఎ. యేసు బోధకుడు
   బి. అబద్ధపు ప్రవక్త
   సి. నమ్మకమైన క్రైస్తవుడు
9. పౌలు బర్నబాలు మార్కు గూర్చి అభిప్రాయబేదము కలిగియున్నప్పుడు వారు............. . ( )
   ఎ. ఒకరి యెడల ఒకరు ద్వేషముతో విడిపోయిరి.
   బి. తమ కలహమును పరిష్కరించుకొనిరి
   సి. ఆ యౌవనుని యింటికి పంపివేసిరి.
10. .................. ద్వారా నీవు కూడ బర్నబాలా ఉండవచ్చును. ( )
   ఎ. పాఠశాలకు కొత్తవారిని ఆహ్వానించుట
   బి. మనుష్యుల వెనుక వారిని గూర్చి మాట్లాడుట
   సి. ప్రజల పట్ల చెడుగా ప్రవర్తించవలెనని స్నేహితులను కోరుట.

## 39వ పాఠము

# పేతురు చెరసాల నుండి తప్పించుకొనుట

## అపోస్తలుల కార్యములు 12:1-18

రాజైన హేరోదు ఒక క్రూరుడైన పాలకుడు. అతడు క్రైస్తవులను హింసించుచుండెను మరియు యోహాను సహోదరుడును, అపోస్తలుడైన యాకోబును చంపించెను. దీనిని బట్టి యూదులు సంతోషించిరని తెలుసుకొని అతడు పేతురును బంధించి చెరసాలలో వేయించెను.

పేతురు తప్పించుకొని పోకూడదని అతడు కోరెను కాబట్టి అతనికి కాపలా కాయుటకై చెరసాలలో కావలివారిని నియమించెను. ప్రతీసారి నలుగురు కావలివారు చొప్పున నాలుగు దఫాలుగా వారు విధులు నిర్వహించుచుండిరి. అయితే చెరసాల నుండి బయటకు పోవుటకు పేతురుకు ఎట్టి మార్గము లేనట్లు కనిపించును. నిశ్చయముగా అతడు మరుసటి దినమున విచారణకు పెట్టబడును.

ఈ సమయములో సంఘము పేతురును దేవుడు కాపాడునట్లు ప్రార్థన చేయుచుండెను. అతడు వచ్చి తిరిగి వారితో ఉండవలెనని వారు కోరిరి.

పేతురు చెరసాలలో నిద్రించుచుండెను. అతని రెండు చేతుల మణికట్టులపైన సంకెళ్ళుండెను మరియు అతనికిరువైపుల ఒక కావలివాడు ఉండెను మరియు ద్వారము నొద్ద ఎక్కువ మంది కావలివారు ఉండిరి.

అయితే దేవునికి ఏదియును అంత కష్టముకాదు. అకస్మాత్తుగా చెరసాల లోపల ఒక ప్రకాశమానమైన వెలుగు కలిగెను మరియు ఒక దేవదూత ప్రత్యక్షమాయెను. ఆ దేవదూత పేతురును మేల్కొలుపుటకు అతని ప్రక్కలో తట్టగా అతని సంకెళ్ళు ఊడిపడెను.

"త్వరగా లెమ్మని" అతడు చెప్పెను. అతని వస్త్రముల మరియు చెప్పులు ధరించుమని దూత అతనితో చెప్పినప్పుడు పేతురు ఆ దూత ఆదేశములను పాటించెను. అప్పుడు దూత అతనితో అతనిపై వస్త్రమును అతని చుట్టూ కప్పుకొనుమని మరియు తన్ను వెంబడింపుమని పేతురుతో చెప్పెను. అది నిజముగా జరుగుచున్నదని పేతురు తలంచనప్పటికినీ అతడు లోబడెను. అది ఒక దర్శనము మాత్రమే అని అతడు తలంచెను.

వారు మొదటి కావలిని తరువాత రెండవ కావలిని దాటిరి, అయితే కావలివారు వారిని చూడనైన చూడలేదు. వారు నిద్రించుచుండిరా లేక జరుగుచున్నదానిని వారు కేవలము చూడలేని గ్రుడ్డివారా?

అతని విడుదలకు ఇంకను మరియొక అడ్డు ఉండెను. పట్టణమునకు పోవు ఇనుప ద్వారము వారి యెదుట ఉండెను మరియు అప్పుడు ఎవడును దానిని త్రోయకుండగనే దానంతట అదే ఆ ద్వారము ఒక్క సారిగా తెరచుకొనెను. వారు ఆ ద్వారము గుండా నడచిరి మరియు ఒక వీధి పొడవు వెళ్ళిరి. అప్పుడు ఆ దూత, అతడు ఎంత అకస్మాత్తుగా ప్రత్యక్షమాయెనో అంతే అకస్మాత్తుగా, అతనిని విడిచిపోయెను.

పేతురు ఆ చీకటి వీధి యొక్క నిశ్శబ్ద నిశ్చలత్వమునందు నిలబడిపోయెను. జరిగియున్నది అతనికి అర్థమాయెను. అది దర్శనము కాదు. అది వాస్తవముగా జరిగెను. హేరోదు నుండి మరియు అతని కొరకు ఆ రాజు ఉద్దేశించిన భయంకరమైన విధి నుండి దేవుడు అతనిని విడిపించెను.

అతని స్నేహితులను కనుగొనుటకు అతడు త్వరపడవలెను. అతడు మార్కు తల్లియైన మరియ యింటికి వెళ్ళెను. అక్కడ సంఘము అతని కొరకు ప్రార్థన చేయుచుండెను. అతడు బయటి ప్రవేశ ద్వారమును తట్టెను. రోదే అను పేరుగల పనిపిల్ల తలుపుతీయుటకు వచ్చెను. పేతురు మాట్లాడగా రోదే అతని స్వరమును గుర్తుపట్టెను. ఆమె ఎంతగానో ఉద్వేగము చెంది, తలుపుతీయకుండెను. ఆమె ఇతరుల యొద్దకు వెనుకకు పరుగెత్తి "పేతురు తలుపునొద్ద ఉన్నాడు!" అని చెప్పెను.

ఆమె మతిపోయినదని వారు తలంచిరి. అది ఎట్లు పేతురు కాగలడు? పేతురు చెరశాలలో ఉండెను. "అది తప్పక ఒక దేవదూత కావచ్చును" అని వారనిరి. ప్రతి ఒక్కనికి ఒక సంరక్షక దూత ఉండునని యూదులు నమ్మిరి. ఈ దూత పేతురు స్వరముతో మాట్లాడుచుండవచ్చును.

పేతురు ఇంకను తలుపు తట్టుచుండెను. చివరకు వారు తలుపు తీసిరి మరియు అక్కడ పేతురు నిలువబడి యుండుట చూచి వారు ఎంతగానో ఆశ్చర్యపడిరి. పేతురు విడుదల కొరకు వారు చేసిన ప్రార్థనలకు దేవుడు జవాబిచ్చునని వారు విశ్వసించి యుండలేదా?

ప్రతి ఒక్కరు ఒకే సమయమున మాట్లాడుట మొదలుపెట్టిరి. వారు నిశ్శబ్దముగా ఉండుట కొరకు పేతురు తన చేయి పైకెత్తెను, అప్పుడు అతడు తనను విడిపించుటకు దేవుడెట్లు ఒక దేవదూతను పంపియుండెనో వారికి తెలియజేసెను.

తన విడుదలను గూర్చి యాకోబుకు మరియు ఇతరులకు తెలియజేయవలెనని అతడు వారిని ఆదేశించెను. ఇది బహుశ యేసు సోదరుడైన యాకోబై యుండవచ్చును, ఏలయనగా అపోస్తలుడైన యాకోబు అప్పటికే హేరోదు చేత చంపబడెను. పేతురు వేరొక స్థలమునకు వెళ్ళెను.

మరుసటి దినము చెరసాల యొద్ద యేమి జరిగెను? వారు పేతురు కొరకు ఎంతగానో వెదకిరి కాని అతనిని కనుగొనలేకపోయిరి. పేతురును చెరసాలలో కాపలా కాయుటకు కావలికాయువారు బాధ్యత కలిగియుండిరి మరియు తమ కర్తవ్యము విషయములో విఫలమైన యెడల మరణమే వారి శిక్ష. ఆ నలుగురు కావలివారు చంపబడవలెనని హేరోదు ఆజ్ఞాపించెను.

ఎక్కువరోజులు కాకముందే హేరోదు తన సింహాసనముపై ప్రత్యక్షమయ్యెను మరియు ఒక ఉపన్యాసము నిచ్చెను. ఇది దేవుని స్వరమే కాని మానవ స్వరము కాదు" అని ప్రజలనిరి. హేరోదు వారి పొగడ్తలను స్వీకరించెను గాని దేవుని స్తుతించలేదు. వెంటనే ప్రభువు యొక్క దూత అతనిని మొత్తెను, మరియు అతడు పురుగులు పడి మరణించెను.

## : కంఠత వాక్యము :

నీవు ప్రార్థన చేయునప్పుడు, నీ గదిలోనికి వెళ్ళి, తలుపువేసి రహస్యమందున్న నీ తండ్రికి ప్రార్థన చేయుము. అప్పుడు రహస్యమందు చూచు నీ తండ్రి నీకు ప్రతిఫలమిచ్చును. **మత్తయి 6:6**

## 39వ పాఠము – పరీక్ష

# పేతురు చెరసాల నుండి తప్పించబడుట

1. రాజైన ................. ఒక క్రూరుడైన పరిపాలకుడు. ( )
   ఎ) యోషీయా
   బి) హేరోదు
   సి) దావీదు
2. రాజు యొక్క ......... మంది కావలివారు పేతురును రాత్రి పగలు కాపలా కాయుచుండిరి . ( )
   ఎ) పదహారు
   బి) నాలుగు
   సి) ఎనిమిది
3. పేతురు చెరసాలలో నిద్రించుచున్నప్పుడు అక్కడ ..................... . ( )
   ఎ) నలుగురు సైనికులు అతని ప్రక్కన ఉండిరి
   బి) అతని చేతి మణికట్టుకు గొలుసులు ఉండెను
   సి) అతని కాళ్ళకు బొండలు వేయబడెను
4. చెరసాలలో ............... వచ్చెను . ( )
   ఎ) దేవదూతల సమూహము
   బి) తాళపు చెవిగల దేవదూత
   సి) ప్రకాశవంతమైన వెలుగు మరియు ఒక దేవదూత
5. పేతురు ................ అనుకొనెను . ( )
   ఎ) అతడు ఒక దర్శనమును చూచుచున్నాడని
   బి) అది నిజముగా జరుగుచున్నదని
   సి) అతనికి ఒక ఖడ్గము అవసరమున్నదని
6. చెరసాలకు గల ఇనుప ద్వారము .................... . ( )
   ఎ) దేవదూత చేత త్రోయబడి తెరువబడెను.
   బి) కావలివారి చేత తెరువబడెను
   సి) దానంతట అదే తెరుచుకొనెను
7. పేతురు విడిపింపబడినప్పుడు, అతడు ............. వెళ్ళెను . ( )
   ఎ) మార్కు తల్లి ఇంటికి
   బి) దేవాలయమునకు
   సి) క్రైస్తవులు కూడుకొనిన గుహకు
8. పేతురు తలుపు తట్టినప్పుడు ............... వచ్చెను. ( )
   ఎ) మరియ
   బి) పనిపిల్ల రోదే
   సి) మార్కు
9. పేతురు కనపడలేదని రాజు కనుగొనినప్పుడు కావలివారు ................. . ( )
   ఎ) జరిమానా కట్టవలసి వచ్చెను
   బి) చంపబడిరి
   సి) ఉద్యోగము నుండి తొలగించబడిరి
10. మనము చెడు పరిస్థితులలో ఉన్నప్పుడు మనము ......... జ్ఞాపకము చేసికొనవలెను. ( )
    ఎ) కొన్ని పరిస్థితులలో దేవునికి కూడా సహాయము చేయుట కష్టమని
    బి) మనము చాలినంతగా కష్టపడిన యెడల దానిని అధిగమించగలమని
    సి) దేవునికి సమస్తము సాధ్యము అని

## 40వ పాఠము

# లూదియ

## అపోస్తలుల కార్యములు 16:1-15

పౌలు మరియు సీల తమ ప్రయాణములలో తిమోతి అను పేరుగల ఒక యౌవనస్థుడైన బోధకుని తమవెంట తీసుకొని వెళ్ళిరి. తిమోతి తల్లి ఒక యూదురాలైన స్త్రీ, యేసునందు ఒక విశ్వాసియై యుండెను మరియు అతని తండ్రి ఒక గ్రీసు దేశస్థుడై యుండెను.

వారు ప్రయాణము చేయుచుండగా పరిశుద్ధాత్మ వారిని నడిపించెను మరియు తరువాత ఎక్కడికి వెళ్ళవలెనో వారికి తెలియజేయుచుండెను. ఒక రాత్రి వారు త్రోయలో ఉన్నప్పుడు పౌలు ఒక దర్శనము పొందెను. మాసిదోనియవాడైన ఒక మనుష్యుడు తమకు సహాయము చేయుటకు మాసిదోనియకు రమ్మని అతని వేడుకొనుచుండెను. ఆత్మ తిరిగి వారిని నడిపించుచుండెను.

వెంటనే వారు సిద్ధపడి వెళ్ళిరి. అది త్రోయ నుండి మాసిదోనియకు ఓడ ద్వారా ఒక పెద్ద ప్రయాణము. వారు ఒక రోమీయుల ప్రవాస స్థానము మరియు మాసిదోనియలోని మిక్కిలి పెద్ద పట్టణములలో ఒకటైన ఫిలిప్పీకి వచ్చి చేరిరి.

వారక్కడ అనేక దినములుండిరి. అప్పుడు వారు ఒక ప్రజల సమూహము విశ్రాంతి దినమున ఆరాధించుటకు నది ఒడ్డున కూడుకొనిరని వినిరి. కాబట్టి వారు పట్టణపు గవిని బయటకు ఆ కూడిక స్థలమునకు వెళ్ళిరి. వారు క్రింద కూర్చుండిరి మరియు ప్రార్థన చేయుట కొరకు కూడియున్న స్త్రీలతో మాట్లాడుట మొదలుపెట్టిరి. వారిలో ఒకతె లూదియ అను పేరు కలిగియుండెను. ఆమె మాసిదోనియ యొక్క తూర్పు భాగములో ఉన్న తుయతైర పట్టణస్థురాలు. ఆమె ఊదారంగు వస్త్రమును అమ్ము ఒక వర్తకురాలు.

ఊదారంగు వస్త్రము చాల ఖరీదైనది. అది అంత ఎక్కువ ఖరీదైనదిగా ఉండుటకు కారణము దానిని తయారుచేయుట కష్టమగుటయే. ఆ వస్త్రము కొరకైన అద్దకము ఒక గుల్ల చేప నుండి వచ్చెను. దాని ద్రవము చేప యొక్క రక్తనాళములలో ఉన్నంత వరకు తెల్లగా ఉండెను, కాని దానికి సూర్యరశ్మి తగిలినప్పుడు, ఆ ద్రవము కాంతివంతమైన ఊదా మరియు ఎఱుపు రంగులోనికి మారును. ఒక్క వస్త్రమునకు అద్దకము చేయుటకు కూడా సరిపోవునంతగా గుల్ల చేపలను పట్టుకొనుట ఎంతో శ్రమయై యుండెను.

ఈ సుందరమైన వస్త్రము వారి తోగాలు లేక అంగీల అంచుల చుట్టూ ఒక ఊదారంగు పట్టీ కలిగియుండవలసిన అవసరమున్నట్టి రాజ కుటుంబముల సభ్యులు మరియు రోమా అధికారుల చేత ముఖ్యముగా వాడబడెను.

పౌలు ప్రకటించగా యేసును గూర్చిన సందేశమును అందుకొనుటకు ప్రభువు లూదియ హృదయమును తెరచెను. ఆమె అతని మాటలను నమ్మెను మరియు బోధకు స్పందించెను. ఆమె మరియు ఆమె యింటివారు బాప్తీస్మము పొందిరి.

ఆమె వివాహితురాలో, ఒంటరియో లేక ఒక విధవరాలో మనము ఎఱుగము. ఆమె ఒక వ్యాపారస్థురాలు కాబట్టి ఆమె వ్యాపారమునందు ఆమె కొరకు పనిచేయుచున్న జనులను ఆమె బహుశ కలిగియుండ వచ్చును.

ఆమెను ప్రభువునందు ఒక విశ్వాసిగా వారు తలంచిన యెడల వారు వచ్చి ఆమె యింటిలో ఉండవలెనని ఆమె కోరుచున్నదని ఆమె ఆ మనుష్యులతో చెప్పెను. పౌలు, సీల, తిమోతి, మరియు లూకా కూడ వారితో ఉండెను. ఆ నలుగురికి సరిపోవునంతగా ఆమె యొద్ద విస్తారముగా స్థలమున్నట్లు విశదమగుచున్నది. వారిని వేడుకొనుట ఆమె కొనసాగించెను. వారు ఆమె ఆహ్వానమును అంగీకరించిరి మరియు ఆమె యింటి వద్ద బస చేసిరి.

లూదియ హృదయము విత్తువాని ఉపమానములోని మంచి నేలను పోలియుండెను. ఆమె దేవుని వాక్యమును విన్నప్పుడు ఆమె దానిని సంతోషముతో అంగీకరించెను మరియు అపోస్తలుల మాటలకు లోబడెను.

### : కంఠత వాక్యము :

పరిశుద్ధుల అవసరములలో పాలుపొందుచు, శ్రద్ధగా ఆతిథ్యము ఇచ్చుచుండుడి. **రోమీయులు 12:13**

# 40వ పాఠము – పరీక్ష

## లూదియా

1. పౌలు సీలలు తమ ప్రయాణములలో..........అను యౌవనుడైన బోధకుని వెంట తీసికొని వెళ్ళిరి. ( )
   ఎ) తిమోతి
   బి) బర్నబా
   సి) మార్కు అను మారుపేరు గల యోహాను
2. ఆ యౌవనస్థుని తల్లి యూదురాలు మరియు అతని తండ్రి ................. . ( )
   ఎ) రోమీయుడు
   బి) సిరియనుడు
   సి) గ్రీసు దేశస్థుడు
3. వారి ప్రయాణములలో వారు ................. ద్వారా నడిపింపబడుచుండిరి. ( )
   ఎ) పేతురు
   బి) పరిశుద్ధాత్మ
   సి) వ్యాపారస్థుల
4. పౌలు దర్శనములో చూసిన మాసిదోనియ మనుష్యుడు .................... . ( )
   ఎ) ప్రమాదమును గూర్చి వారికి చెప్పెను
   బి) తమ యొద్దకు రావలెనని వేడుకొనెను
   సి) కైసరయకు వెళ్ళమని వారికి చెప్పెను
5. వారు మాసిదోనియకు ........... పై ప్రయాణమైపోయిరి . ( )
   ఎ) ఓడ
   బి) గాడిద
   సి) నడక
6. వారు ఒక సమూహముతో కలసి ప్రార్థించుటకు ..................కూడుకొనిరి. ( )
   ఎ) దేవాలయములో
   బి) స్టేడియములో
   సి) నదీ తీరమున
7. ఆ స్త్రీలలో లూదియ ఒకరు. ఆమె .......................... . ( )
   ఎ) కుట్టుపని చేయు స్త్రీ
   బి) కుమ్మరి
   సి) ఉదారంగు అమ్మునది
8. ఆమె పౌలు మాటల యందు విశ్వాసముంచెను, మరియు ..................... . ( )
   ఎ) ఆమెయు ఆమె యింటివారు బాప్తీస్మము పొందిరి
   బి) ఆమె ఒక్కతె బాప్తీస్మము పొందెను
   సి) వారు బోధకుని నదీ తీరముననే విడిచిపెట్టిరి
9. లూదియ ....................... . ( )
   ఎ) వారి కొరకు ఎట్టి గదులు లేవని ఆమె వారికి చెప్పెను
   బి) తన యింట బస చేయుటకు ఆ నలుగురిని ఆహ్వానించెను
   సి) ఆమె అతిథి మర్యాద చేయు స్త్రీ కాదు.
10. ఒక బద్ధకస్థుడైన వ్యక్తి .............................. . ( )
   ఎ) మిగతావారికి ఆశీర్వాదముగా ఉండును
   బి) దేవుని మెప్పించును
   సి) విజయము పొందలేదు

## 41వ పాఠము

# ఫిలిప్పీయుడైన చెరసాల నాయకుడు

## అపోస్తలుల కార్యములు 16:16-40

పౌలు తిరిగి నది ఒడ్డున ఉన్న ఆరాధనా స్థలమునకు వెళ్లెను. ఈ సమయమున అతడు ఒక బానిస చిన్నదానిని చూచెను. ఆమె శరీరమును ఒక దురాత్మయైన దయ్యము పట్టియుండెను. భవిష్యత్తులో యేమి జరగబోవుచున్నదో ఆమె ప్రజలకు చెప్పగలిగియుండెను.

వారికి యేమి జరుగబోవుచున్నదో ప్రజలకు ఆమె చేత చెప్పించుట ద్వారా వారు కొంత ధనము సంపాదించవచ్చని ఆమె యజమానులు చూచిరి. ఆ దీనురాలైన చిన్న దానిని దయ్యము పట్టుటను బట్టి వారు సంతోషించిరి.

ఆమె పౌలు మరియు ఇతరులను వెంబడించగా ఆమెలో ఉన్న దయ్యము వారెవరో గుర్తించెను, మరియు "ఈ మనుష్యులు సర్వోన్నతుడైన దేవుని దాసులు. వీరు మీకు రక్షణ మార్గమును ప్రచురించుచున్నారు" అని కేకలు వేసెను.

ఇది దినము వెంబడి దినము జరిగెను. పౌలు ఆ చిన్నదాని మీద జాలి పడెను మరియు వెనుకకు తిరిగి ఆ ఆత్మను ఆమెలో నుండి బయటికి రావలెనని యేసు నామమున ఆజ్ఞాపించెను. (యేసు వారికి బోధించుచుండగా అంతకు ముందు ఆయన వారు దయ్యములను వెళ్లగొట్టగలరని చెప్పియుండెను).

వెంటనే ఆ దురాత్మ ఆమెను వదలి పోయెను మరియు ఆమె స్థిమితమైన మనస్సు పొందెను, కాని ఆమె యిక యేమాత్రము సోదె చెప్పలేకపోయెను. ఆమె యజమానులు యిక యేమాత్రము తమకొరకు ధనము సంపాదించుకొనుటకు ఆమెను ఉపయోగింపలేకపోయిరి. వారి యొక్క అదృష్టమును తెలియజేయు వ్యాపారమును నాశనము చేసిన పౌలుపై వారి కోపమును నీవు ఊహించగలవు.

వారు పౌలు సీలలను పట్టుకొని అధికారుల ముందుకు వారిని ఈడ్చుకొనిపోయి, వారు గలిబిలి చేయుచున్నారని మరియ తమ జీవిత విధానమునకు వ్యతిరేకముగా బోధించుచున్నారని వారిపై నేరము మోపిరి. అప్పుడు జన సమూహము దొమ్మిగా వచ్చెను మరియు కోపోద్రేకము పొందెను. న్యాయాధిపతులు వారి బట్టలు ఊడదీయించి మరియు బెత్తములతో కొట్టబడవలెనని వారిని ఆజ్ఞాపించిరి.

వారు కనికరము లేకుండా బెత్తముతో కొట్టబడిరి. అప్పుడు బలహీనముగాను మరియు రక్తము కారుచును వారు చెఱసాల లోపలి గదిలోనికి వేయబడిరి. వారి పాదములకు బొండలు వేయబడెను. వారి కాళ్లు దూరముగా విడగొట్టబడెను మరియు వారి పాదములు చెక్కపరికరములలో పెట్టబడెను. అది ఖైదీలు పారిపోకుండ చేయుటకును మరియు వారిని చిత్రహింసపెట్టుటకును ఉపయోగింపబడెను.

అప్పుడు వారికి కావలి కాయుటకు ఒక చెరసాల నాయకుడు ఆజ్ఞాపింపబడెను. వారిని చెరసాలలో ఉంచుటలో అతడు విఫలుడైన యెడల అతడు చంపబడును. అతనికి గొప్ప బాధ్యత యివ్వబడెను. కట్టబడి, చెరసాలలో పెట్టబడినందుకు పౌలు మరియు సీలలు మూలిగి మరియు ఫిర్యాదు చేసిరా? లేదు. అర్థరాత్రి సమయమున వారు దేవునికి ప్రార్థన చేయుచూ పాటలు పాడుచుండిరి అని బైబిలు చెప్పెను. వారిని వినుచు ఇతర ఖైదీలు ఆ చెరసాల గదిలో ఉండిరి.

హఠాత్తుగా ఒక గొప్ప భూకంపము కలిగెను, మరియు చెరసాల వణికెను. తలుపులు తెరచుకొనెను మరియు ఖైదీల సంకెళ్లు విడువబడెను కాని ఎవడును పారిపోవుటకు ప్రయత్నించలేదు. అయితే చెరసాల నాయకుడు లేచినప్పుడు మరియు తలుపులు తెరువబడియుండుట చూచినపుడు, అతడు తన స్వంత ప్రాణమును తీసుకొనబోయెను. ఏలయనగా అతని ఖైదీలు పారిపోయిన యెడల అతడు చంపబడునని అతడు ఎఱిగెను.

"నీవు ఏ హానియు చేసుకొనవద్దు. మేమందరము ఇక్కడనే యున్నాము!" అని పౌలు కేక వేసెను.

చెరసాల నాయకుడు ఎంతగా భయపడెననగా అతడు వణకుచుండెను. అతడు చెరసాల గదిలోనికి చూడగలుగునట్లు అతడు దీపములు తెప్పించెను. అతడు పౌలు మరియు సీల యొక్క పాదముల వద్ద పడెను. "అయ్యాలారా, రక్షణ పొందుటకు నేనేమి చేయవలెను?" అని అతడు అడిగెను.

యేసునందు విశ్వాసముంచుమని వారతనికి చెప్పిరి మరియు వారు చెరసాల నాయకునికి మరియు అతని యింటివారైన ప్రజలకు ప్రభువును గూర్చి ప్రకటించిరి.

అదే ఘడియలో అతడు ఆ యిద్దరు మనుష్యులను తీసికొని  వారు దెబ్బలు తిన్నప్పుడు పొందిన గాయములను కడిగెను. తాను తప్పుచేసి ఉండెనని అతడు ఎఱిగియుండెను మరియు అతడు సరికాబడవలెనని కోరెను.

వెంటనే చెరసాల నాయకుడు మరియు అతని కుటుంబము బాప్తీస్మము పొందిరి. అతడు పౌలు మరియు సీలను తన యింటికి తెచ్చెను మరియు వారికి ఆహారము పెట్టెను. కుటుంబమంతయు ఎంతో సంతోషించెను! వారిప్పుడు దేవునియందు విశ్వాసులు.

మరుసటి దినమున పౌలు మరియు సీలను విడుదల చేయవలెనని వారికి చెప్పుటకు అధికారులు చెరసాలకు పంపబడిరి. పౌలు మరియు సీలలు రోమా పౌరులని న్యాయాధికారులు తెలుసుకొనినప్పుడు వారు భయపడిరి. ఆ మనుష్యులను కొట్టి మరియు చెరసాలలో పెట్టుట వారికి అది చట్టవ్యతిరేకమైయుండెను. దానిని నేర్పుగా చక్కబెట్టగలమని వారు తలంచిరి.

అయితే పౌలు వేరుగా తలంచెను "లేదు! వారే వచ్చి మమ్మును చెరసాల నుండి బయటికి తీసికొనిపోవలెను" అని అతడు చెప్పెను.

న్యాయాధికారులు చెరసాలకు వెళ్ళిరి మరియు క్షమాపణ తెలిపిరి. వారా మనుష్యులను బయటికి తీసికొని వెళ్లిరి మరియు పట్టణము విడిచి వెళ్లుడని వారిని బ్రతిమాలుకొనిరి.

పౌలు మరియు సీల లూదియ యింటికి తిరిగి వెళ్లిరి మరియు అక్కడ విశ్వాసులతో కలిసిరి. అప్పుడు వారు వేరుచోట బోధించుటకు వెళ్లిరి.

**: కంఠత వాక్యము :**

ఎల్లప్పుడు సంతోషముగా ఉండుడి! ఎడతెగక ప్రార్థన చేయుడి! ప్రతి విషయమునందును కృతజ్ఞతా స్తుతులు చెల్లించుడి. ఈలాగు చేయుట యేసుక్రీస్తు నందు మీ విషయములో దేవుని చిత్తము. **1 థెస్సలోనికయులు 5:16-18**

# 41వ పాఠము - పరీక్ష

# ఫిలిప్పీయుడైన చెరసాల నాయకుడు

1. బానిస చిన్నదానిలోని దయ్యము ఆమె............. చేసెను. ( )
   ఎ. అమితముగా నాట్యము చేయునట్లు
   బి. భవిష్యత్తును ముందుగా చెప్పగలుగునట్లు
   సి. నోటి నుండి నురగ కార్చుకొనునట్లు
2. ఆమెను దయ్యము పట్టినందుకు ఆమె యజమానులు సంతోషించిరి ఎందుకనగా................ . ( )
   ఎ. ఆమె ద్వారా వారు ధనము సంపాదించుచుండిరి.
   బి. ఆమె ఐశ్వర్యవంతురాలగు చుండెను.
   సి. ఆమె వారిని అదుపు చేయుచుండెను.
3. ఆ చిన్నదానిలో ఉన్న దయ్యము.................... . ( )
   ఎ. ఎవనిని ఎరుగకుండెను
   బి. పౌలును గుర్తించలేదు
   సి. పౌలు ఎవరో ఎరిగియుండెను
4. పౌలు దయ్యమును వెళ్లగొట్టెను ఎందుకనగా................... . ( )
   ఎ. అది అతని పని
   బి. అతడు ఆ చిన్నదాని గూర్చి జాలి పడెను
   సి. దయ్యమును మాటిమాటికి వినుటలో అతడు విసికిపోయెను
5. దయ్యము ఆ చిన్నదానిని వదలిపోయినప్పుడు..................... . ( )
   ఎ. ఆమె ఆ మనుష్యుల కొరకు పనిచేయుట కొనసాగించెను.
   బి. ఆమె తన స్థిరచిత్తముతో ఉండెను.
   సి. అది ఒక పందిలోనికి వెళ్లెను.
6. ఆ మనుష్యులు పౌలు మరియు సీలలపై..................... నేరారోపణ చేసిరి. ( )
   ఎ. యేసును గూర్చి బోధించుట విషయములో
   బి. ఆ చిన్నదానిని బాగుచేసినందున
   సి. గలిబిలి కలుగజేసి మరియు వారి జీవిత విధానమునకు వ్యతిరేకముగా బోధించుటను గూర్చి
7. పౌలు మరియు సీలలు .......................... . ( )
   ఎ. పట్టణము విడిచిపొమ్మని చెప్పబడిరి
   బి. ప్రజలను స్వస్థపరచుట ఆపవలెనని ఆజ్ఞాపించబడిరి
   సి. కొట్టబడి, చెరసాలలో పెట్టబడిరి
8. చెరసాల తలుపులు తెరువబడినప్పుడు................. . ( )
   ఎ. ఖైదీలందరు పారిపోయిరి
   బి. ఖైదీలలో ఎవడును విడిచిపోలేదు
   సి. చెరసాల నాయకులందరు మృతి చెందిరి.
9. పౌలు అతనికి బోధించిన తరువాత చెరసాల నాయకుడు అతని మాటల యందు విశ్వాసముంచి.......... ( )
   ఎ. వారి గాయములను కడిగెను మరియు బాప్తీస్మము పొందెను.
   బి. కాని తిరిగి వారిని చెరసాలలో బంధించవలసివచ్చెను.
   సి. మరియు కావలి వారిచే చంపబడెను.
10. పౌలు మరియు సీల................అని న్యాయాధికారులు వినినప్పుడు వారు భయపడిరి. ( )
    ఎ. యేసును గూర్చి బోధించుచున్నారు.
    బి. ఇంకను చెరసాలలో ఉన్నారు.
    సి. వారు కొట్టిన వారు రోమా పౌరులు

## 42వ పాఠము

# పౌలు మొదటి సువార్త ప్రయాణము

## అపోస్తలుల కార్యములు 13:1-52

బర్నబా మరియు పౌలు అంతియొకయ నొద్ద సంఘములో బోధకులుగా ఉండిరి. ఒక దినమున ఆరాధన సమయములో పరిశుద్ధాత్మ ఈ యిద్దరు మనుష్యుల కొరకు తన ప్రత్యేక ప్రణాళికలను బయలుపర్చెను. సంఘము వారి కొరకు ఉపవాసముండి ప్రార్థన చేసి వారిని వారి మార్గమున పంపివేసిరి.

వారు ఓడలో ప్రయాణించి కుప్ర అను ద్వీపమునకు వెళ్ళిరి. వారు ఆ ద్వీపము అంతయు తిరిగి, దాటి పాఫు అను పట్టణమునకు వచ్చిరి. వారు ఆ పట్టణములో ఉన్నప్పుడు ఒక ఆసక్తికరమైన సంఘటన జరిగెను. అక్కడ బర్ యేసు అను ఒక అబద్ధ ప్రవక్త ఉండెను. అతడు గారడీవాడును, ఇంద్రజాలమును ప్రదర్శించుచు ప్రజలను మోసపరచుచుండెను. అతని అధిపతి సెర్గిపౌలు అను పేరుగల ప్రభుత్వ అధికారి. అతడు పౌలు, బర్నబాల నుండి నేర్చుకొనగోరెను కాని ఎలుమగా ప్రసిద్ధి చెందిన బర్ యేసు తన అధిపతి పౌలు, బర్నబాల సందేశము వినుటకు యిష్టపడలేదు. అందుకు వాడు వారికి వ్యతిరేకముగా మాట్లాడుట మొదలుపెట్టెను.

పౌలు ఎలుమను పిలిచి “అపవాది కుమారుడా, సమస్త నీతికి విరోధి, నీవు గ్రుడ్డివాడవై సూర్యుని వెలుగును చూడకుందువుగాకని” అతనితో చెప్పెను. వెంటనే అతనికి సమస్తము చీకటి ఆయెను. అతడు ఏమియు చూడలేకపోయెను. అప్పుడతడు ఎవరైనను తన చేయిపట్టుకొని నడిపింతురేమోయని వెదుకుచుండెను.

జరిగిన దానిని ఆ అధికారి చూచినప్పుడు అతడు పౌలు బర్నబా చెప్పిన మాటలయందు విశ్వాసముంచెను. మరియు అతడు యేసును గూర్చిన బోధకు మిగుల ఆశ్చర్యపడెను.

ఆ యిద్దరు బోధకులు ప్రయాణమును కొనసాగించిరి. ఆరోజుల్లో కార్లుకాని, రైళ్ళుకాని, బస్సులుకాని లేవు. వారు కేవలము నడచిరి లేక జంతువులపైన ప్రయాణముచేసిరి. వారు మైళ్ళకు మైళ్ల ప్రయాణము చేసిరి. చాలామంది ప్రజలు వారి బోధయందు విశ్వాసముంచిరి మరియు యేసు అనుచరులైరి. వారు లెక్కలేనన్ని కష్టములు, హింసలను అనుభవించిరి, అయితే ప్రభువుకు లోబడుట మరియు పరిశుద్ధాత్మ నిర్దేశములను అనుసరించుటలోని ఆనందము మరియు వాగ్దానము చేయబడిన బహుమానముతో పోల్చినచో ఈ సంగతులు లెక్కలేనివని వారు తలంచిరి. వారిక ఏమాత్రమును తమ కొరకు కాదుకాని దేవుని కొరకు జీవించిరి.

### : కంఠత వాక్యము :

నేను మిమ్మును గూర్చి ఉద్దేశించిన సంగతులను నేనెరుగుదును. రాబోవు కాలమందు మీకు నిరీక్షణ కలుగునట్లుగా అవి సమాధానకరమైన ఉద్దేశములేగాని హానికరమైనవి కావు. **యిర్మీయా 29:11**

## 42వ పాఠము - పరీక్ష
# పౌలు మొదటి సువార్త ప్రయాణము

1. పౌలు మరియు బర్నబా ............ సంఘములో బోధించుచుండిరి. ( )
ఎ) యెరూషలేము
బి) ఎఫెసీ
సి) అంతియొకయ
2. వారు ఓడ ఎక్కి చేరుకున్న ద్వీపము .............. . ( )
ఎ) కుప్ర
బి) మాల్టా
సి) క్రేతు
3. బర్-యేసు అనువాడు ................... . ( )
ఎ) షామియానా తయారు చేయువాడు
బి) నిజమైన ప్రవక్త
సి) మాంత్రికుడు
4. బర్-యేసు .................. గా కూడా ప్రసిద్ధుడు. ( )
ఎ) పౌలు
బి) ఎలుమ
సి) బర్నబా
5. బర్-యేసు ................... ( )
ఎ) షామియానాలు ఎలా తయారు చేయాలో చెప్పేవాడు
బి) గారడీ విద్యలు ప్రదర్శించుచూ ప్రజలను మోసగించేవాడు
సి) యేసుని గురించి బోధించేవాడు
6. బర్-యేసు వారికి వ్యతిరేకముగా మాట్లాడుచున్నప్పుడు పౌలు వానిని ......... అని పిలిచెను. ( )
ఎ) అపవాది కుమారుడా
బి) యేసు కొరకు గాయపడిన వాడా
సి) త్రోవ తప్పినవాడా
7. .............. అని పౌలు బర్-యేసుతో చెప్పెను. ( )
ఎ) నీవు నడవ కుందువుగాక
బి) నీవు కుష్టువ్యాధి పొందుదువుగాక
సి) నీకు గ్రుడ్డితనము కలుగుగాక
8. జరిగిన సంఘటన చూసిన అధిపతి .................... . ( )
ఎ) పౌలు, బర్నబాలను వెళ్ళిపొమ్మని ఆజ్ఞాపించెను
బి) పౌలు, బర్నబా చెప్పిన వాక్యమునందు విశ్వాసముంచెను
సి) ఎలుమ విషయములో బాధపడెను
9. పౌలు మరియు బర్నబా .................... . ( )
ఎ) కష్టములను సంతోషముగా ఎదుర్కొనినారు
బి) తమ యిబ్బందులు ముగిసిపోవాలని తలంచినారు
సి) కష్టముల వలన బోధించుట మానివేసినారు
10. యేసు ............................అని చెప్పెను. ( )
ఎ) ఎంతో మంది ప్రజలు నాకు వ్యతిరేకముగా ఉన్నారు
బి) ప్రజలు వ్యతిరేకముగా ఉండుట నాకు ఇష్టము
సి) నాతో లేనివాడు, నాకు వ్యతిరేకముగా ఉన్నాడు

### 43వ పాఠము

# పౌలు రెండవ సువార్త ప్రయాణము

## అపోస్తలుల కార్యములు 17:1-15

మార్కును గూర్చిన అభిప్రాయ భేదము కారణముగా పౌలు మరియు బర్నబాలు వేరైపోయిరి. ఆ యౌవనస్థుడు వారి సహవాసమును ముందే వదలివేసెను మరియు యెరూషలేముకు తిరిగి పోయెను. బర్నబా తన మేనల్లుడైన మార్కుకు మరియొక అవకాశము యివ్వగోరెను కాని పౌలు అతనిని తదుపరి ప్రయాణములో తీసికొనిపోవుటకు యిష్టపడలేదు. కావున బర్నబా మరియు మార్కులు ఒక మార్గమున వెళ్ళిరి మరియు పౌలు వేరొక దిశలో ప్రయాణము కొరకు తనకు తోడుగా వచ్చుటకు సీలను ఎన్నుకొనెను.

ప్రయాణములో పౌలు సీలలే కాక మరో యిద్దరు బోధకులు ఉండిరి, తిమోతి అను పేరుగల ఒక యౌవనస్థుడైన క్రైస్తవుడు మరియు వైద్యుడైన లూకా.

వారు ఒక సముద్ర ఓడరేవు పట్టణమైన థెస్సలోనికకు వచ్చిరి. పౌలు యూదుల సమాజ మందిరములో మూడు విశ్రాంతి దినములు బోధించెను. చాలామంది యూదులు మరియు గ్రీసు దేశస్థులు అతని బోధయందు విశ్వాసముంచిరి కాని విశ్వసింపని యూదులైన అతని శత్రువులు తిరిగి అల్లరి రేపుటను ప్రారంభించిరి మరియు పౌలు సీలలు రాత్రివేళ చీకటి ముసుగున ఆ పట్టణమును విడచి వెళ్ళవలసివచ్చెను.

వారు బెరయకు వెళ్ళిరి. ఆ ప్రజలు పౌలును వినిరి కాని వారు పౌలు చెప్పుచున్నవి దేవుని వాక్యమని వారు అంగీకరించిన లేఖనములతో అంగీకారముగా ఉన్నవని ఖచ్చితముగా తెలుసుకొనుటకు వారు లేఖనములను పరిశోధించిరి కూడా. అయితే బోధలు పరిపూర్ణ సమ్మతిలో ఉండెను, ఎందుకనగా లేఖనములను ప్రేరేపించిన దేవుడు పౌలు బోధను కూడా నడిపించుచుండెను.

బెరయవారు థెస్సలోనిక వారికంటె ఎక్కువ ఘనులని బైబిలు చెప్పుచున్నది, ఏలయనగా వారు పౌలు మాటలు సత్యమని ఋజువు చేయుటను కోరిరి.

థెస్సలోనికలోని యూదులు బెరయకు వచ్చిరి మరియు పౌలును అల్లరి చేయుట మొదలుపెట్టిరి కనుక క్రైస్తవులు అతనిని ఏథెన్సుకు పంపిరి కాని పౌలును వీలయినంత త్వరలో కలుసుకొనుటకు ఉద్దేశించుచు సీల మరియు తిమోతి బెరయలో ఉండిరి.

### : కంఠత వాక్యము :

దేవుని యెదుట యోగ్యునిగాను,సిగ్గుపడనక్కరలేని పనివానిగానుసత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనపరచుకొనుటకు జాగ్రత్తపడుము. **2 తిమోతి 2:15**

## 43వ పాఠము - పరీక్ష

# పౌలు రెండవ సువార్త ప్రయాణము

1. ........ గూర్చిన అభిప్రాయ భేదము వలన పౌలు మరియు బర్నబా విడిపోయిరి. ( )
   ఎ) తిమోతి
   బి) మార్కు అను పేరు గల యోహాను
   సి) సీల
2. పౌలు మరియు ........ రెండవ సువార్త ప్రయాణమును చేసిరి . ( )
   ఎ) మరి యిద్దరు బోధకులు
   బి) మరియొక బోధకుడు
   సి) మరి ముగ్గురు బోధకులు
3. థెస్సలోనికలో పౌలు ........................ బోధించెను. ( )
   ఎ) యూదుల సమాజమందిరములో
   బి) దేవాలయములో
   సి) నదీ తీరమున
4. పౌలు మరియు సీల ................. కారణముగా థెస్సలోనిక విడిచి వెళ్ళవలసి వచ్చెను. ( )
   ఎ) విశ్వసింపని యూదుల
   బి) గ్రీసు దేశస్థులు వారి వెంటబడిన
   సి) పౌలు అక్కడ ఉండనిష్టపడని
5. వారు పట్టణమును ................ విడిచిరి. ( )
   ఎ) మధ్యాహ్నమున
   బి) రాత్రివేళ
   సి) ఉదయమున ప్రొద్దన్ననే
6. బెరయ పట్టణములో ..................... . ( )
   ఎ) యూదులు వారిని హింసించిరి
   బి) పౌలు మరియు పేతురు విడిపోయిరి
   సి) ప్రజలు లేఖనములను పరిశోధించిరి
7. బెరయ ప్రజలు ...................... . ( )
   ఎ) ఖచ్చితముగా పౌలు సత్యమునే బోధించుచున్నాడని తెలుసుకొనగోరిరి
   బి) లేఖనముల యొక్క జ్ఞానమును వారు ప్రదర్శింపగోరిరి
   సి) మరి ఎక్కువ లేఖనములు కావలెనని కోరిరి
8. ............. వలన బెరయలోని క్రైస్తవులు పౌలును ఏథెన్సుకు పంపిరి. ( )
   ఎ) వారు యిక ఏమాత్రము అతనిని వినుటను కోరలేదు
   బి) యూదులు యిబ్బందిపెట్టుట ప్రారంభించుట
   సి) తనకు తాను సహాయము చేసుకొనుటకు అతడు యిష్టపడలేదు
9. పౌలు విడిచి వెళ్ళిన తరువాత ...................... బెరయలో నిలిచిరి. ( )
   ఎ) సీల మరియు తిమోతి
   బి) బర్నబా మరియు మార్కు
   సి) పేతురు మరియు లూకా
10. నా స్నేహితుడు మరియు నేను ఒక అభిప్రాయ భేదమును కలిగియున్న యెడల మేము ........... . ( )
   ఎ) యిక ఏమాత్రము స్నేహితులుగా ఉండకూడదు
   బి) ఒకరి మీద ఒకరు చెడుగా మాట్లాడవలెను
   సి) మా విభేదములను పరిష్కరించుకొనవలెను మరియు స్నేహితులుగా కొనసాగవలెను

## 44వ పాఠము

# ఏథెన్సులో పౌలు

## అపోస్తలుల కార్యములు 17:16-33

పౌలు ఏథెన్సులో సీల మరియు తిమోతి కొరకు ఎదురు చూచుచుండెను. అతడు పట్టణము చుట్టూ సంచరించుచున్నప్పుడు అతడు అనేక అందమైన భవనములను చూచెను. అతడు బహు దేవతా విగ్రహములను కూడ చూచెను. మనుష్యులు రాయి లేక కర్రతో విగ్రహములను చెక్కుదురు మరియు వాటిని వారు తమ దేవుళ్లని పిలుచుదురు. ఆ రాయి లేక కర్ర ఏదోక శక్తి కలిగియున్నట్లు వారు ఈ విగ్రహములకు సాగిలపడి మ్రొక్కుదురు మరియు ఆరాధింతురు.

వారు ఏ దేవునినైనను వదలిపెట్టకూడదని వారు కోరిరి కావున వారు "తెలియబడని దేవునికి" అని ఒక విగ్రహమును చేసుకొనిరి. "నేను ఈ దేవునిని గూర్చి మీకు తెలియజేయగోరుచున్నాను" అని పౌలు చెప్పెను మరియు జగత్తును మరియు అందున్న సమస్తమును సృష్టించిన నిజమైన దేవుని గూర్చి వారికి చెప్పుట అతడు ప్రారంభించెను. అతడు వారికి యేసును గూర్చి మరియు ఆయన భూమికి ఎట్లు వచ్చెనో, ఎట్లు చంపబడెనో మరియు తిరిగి ఎట్లు సజీవునిగా చేయబడెనో వారికి తెలియజేసెను.

ఏథెన్సు ప్రజలు అత్యంత ఆసక్తి కలిగినవారు. క్రొత్త సంగతులను వినుటను ప్రేమించిరి మరియు ఇది వారికి ఖచ్చితముగా క్రొత్త సంగతియే. కొందరు ప్రజలు పౌలు బోధను విశ్వసించిరి మరియు అనుచరులైరి.

నీవు ఈ రోజున ఏథెన్సును దర్శించిన యెడల నీవు ఎత్తైన కొండ ఎక్కవచ్చును మరియు అక్రొపోలి (ఎత్తైన కోటలు) చూడవచ్చును. ఏథెన్సు వారికి పౌలు బోధించినప్పుడు అతడు చూచిన అదే భవనముల శిధిలములను నీవు చూతువు. పౌలు కాలములోనే ఆ భవనములు అప్పటికే 400 సంవత్సరముల కంటె ఎక్కువగా పాతవిగా ఉండెను. ఈ రోజు అవి 2400 సంవత్సరములకు పైగా పాతవి.

**: కంఠత వాక్యము :**

దేవుడు ఆత్మగనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెను. **యోహాను 4:24.**

## 44వ పాఠము – పరీక్ష

# ఏథేన్సులో పౌలు

1. పౌలు ఏథెన్సులో................. కొరకు ఎదురుచూచుచుండెను. ( )
   ఎ. బర్నబా మరియు మార్కు
   బి. సీల మరియు తిమోతి
   సి. లూకా మరియు సీల
2. పట్టణమంతటిలో అతడు అనేక అందమైన భవనములను మరియు ............. చూచెను. ( )
   ఎ. విగ్రహములను
   బి. నీటి ఊటలను
   సి. స్మారక చిహ్నములను
3. మనుష్యులు................ నుండి దేవుళ్లను చెక్కిరి. ( )
   ఎ. సబ్బు లేక చలువరాయి
   బి. రాయి లేక కర్ర
   సి. కర్ర లేక మైనము
4. ............... ప్రజలు ఈ దేవుళ్లకు వంగి నమస్కరించిరి. ( )
   ఎ. వారిని యిష్టపడనందున
   బి. వారి స్నేహితులు వారిని యిష్టపడవలెనని
   సి. విగ్రహములు శక్తి కలిగియున్నవని తలంచుట వలన
5. వారు "..........." అను విగ్రహమును కూడ చేసిరి. ( )
   ఎ. అన్నిటిని చూచు దేవునికి
   బి. తెలియబడని దేవునికి
   సి. అందరు ఎఱిగిన దేవునికి
6. పౌలు ఈ విగ్రహమును చూచినపుడు, అతడు ........... చెప్పెను ( )
   ఎ. ఈ దేవుని గూర్చి అతడు వారికి తెలియజేయగోరెనని
   బి. అది ఏ మాత్రము దేవుడు కాదని
   సి. వారు దానిని ముక్కలు చేయవలెనని
7. ........... ఒక నిజమైన దేవుడు ఉన్నాడని పౌలు వారితో చెప్పెను. ( )
   ఎ. వారి విగ్రహములను ద్వేషించిన
   బి. లోకమును చేసిన
   సి. వారి యెడల అయిష్ఠముగా ఉన్న
8. ఆయన ............. గూర్చి కూడ వారితో చెప్పెను. ( )
   ఎ. పాత నిబంధనను
   బి. మోషేను
   సి. యేసును
9. ఏథెన్సు ప్రజలు ....................... . ( )
   ఎ. పౌలును రాళ్లతో కొట్టవలెనని కోరిరి.
   బి. పౌలు చెప్పిన దానియందు ఆసక్తి కలిగియుండిరి
   సి. వినిరి మరియు అప్పుడు అందరు వెళ్ళిపోయిరి.
10. ....... దేనినైనను మనము ఒక విగ్రహముగా చేసుకొనగలము. ( )
   ఎ. మన జీవితములలో దేవుని స్థానమును తీసుకొను
   బి. మనకు మేలైన
   సి. మనము కొద్దిగా అభిరుచి కలిగియున్న

### 45వ పాఠము

# పౌలు కొరింథును సందర్శించుట

### అపోస్తులుల కార్యములు 18:1-17

పౌలు ఏథెన్సును వదలి కొరింథుకు వెళ్ళెను. సీల మరియు తిమోతి చివరికి అక్కడ అతనితో చేరుటకు వచ్చి చేరిరి.

యేసే క్రీస్తని పౌలు యూదులకు బోధించుచుండెను కాని వారు అతనిని నమ్మలేదు మరియు వారతనిని దూషించుట, అతని యెడల అమర్యాదగా ప్రవర్తించుట మొదలుపెట్టిరి. కొంతకాలమైన పిమ్మట వారతని బోధను అంగీకరించుటకు యిష్టపడని యెడల, అతడు వెళ్ళి, అన్యులకు బోధించునని అతడు వారితో చెప్పెను. వీరు కొరింథులోని యూదులుకాని ప్రజలు. అతడు అదే చేసెను. అతడు అన్యులకు శుభవార్తను ప్రకటించెను మరియు వారిలో అనేకులు విశ్వసించిరి మరియు బాప్తీస్మము పొందిరి.

ఒకరాత్రి అతనికి దర్శనము కలిగెను మరియు ప్రభువు అతనితో మాట్లాడెను. అతడు కొరింథులోనే ఉండి అక్కడ బోధించుట కొనసాగించుమని ఆయన అతనితో చెప్పెను. ఆ పట్టణములో అనేకమంది ప్రజలను పౌలు దేవుని కొరకు మార్చగలుగును. అతడు అక్కడ ఒక సంవత్సరము ఆరు మాసములు ఉండెను.

కొరింథు చాలా దుష్టపట్టణము మరియు ప్రజలు దుర్నీతిపరులై యుండిరి కాని స్వీకరించు హృదయములు కలవారు తమ దుష్టమార్గముల నుండి తిరిగిరి మరియు వారెట్లుండవలెనని దేవుడు ఉద్దేశించెనో అట్టి విధమైన ప్రజలుగా మారిరి.

నీవు ఈరోజు కొరింథును దర్శించిన యెడల, అక్కడి కొన్ని ప్రాచీన భవనముల శిథిలములను నీవు చూచెదవు. వస్తు ప్రదర్శనశాలలో మట్టిపాత్రలు మరియు విగ్రహములు సేకరింపబడియుండుట నీవు చూడగలవు.

**: కంఠత వాక్యము :**

న్యాయముగా నడుచుకొనుటయు, కనికరమును ప్రేమించుటయును, దీన మనస్సు కలిగి నీ దేవుని యెదుట ప్రవర్తించుటయు ఇంతే గదా యెహోవా నిన్నడుగుచున్నాడు. **మీకా 6:8**

## 45వ పాఠము - పరీక్ష

# పౌలు కొరింథును సందర్శించుట

1. పౌలు ........... నుండి కొరింథు పట్టణమునకు వచ్చెను ( )
ఎ) ఏథెన్సు
బి) క్రేతు
సి) కుప్ర
2. కొరింథులో పౌలుతో వచ్చి చేరినవారు .............. ( )
ఎ) బర్నబా మరియు మార్కు
బి) లూకా మరియు పేతురు
సి) సీల మరియు తిమోతి
3. పౌలు కొరింథులోని యూదులకు బోధించినప్పుడు వారు .......... ( )
ఎ) అతని మాటల యందు విశ్వాసముంచిరి
బి) అతనిని విశ్వసించలేదు
సి) ఇంకా ఎక్కువ వినవలెనని కోరిరి
4. పౌలు అక్కడి యూదులతో, అతడు ........... అని చెప్పెను. ( )
ఎ) అన్యుల యొద్దకు వెళ్ళి బోధించెదను
బి) యూదులకు మాత్రమే బోధించెదను
సి) ఈ పట్టణము నుండి వెళ్ళిపోయి బోధించుట మానెదను
5. ఎంతో మంది ............ పౌలు యందు విశ్వాసముంచి, బాప్తీస్మము పొందిరి ( )
ఎ) కొరింథులో ఉన్న యూదులు
బి) అన్యులు
సి) బానిసలు
6. ఒకరాత్రి వేళ ప్రభువు పౌలుతో .......... మాట్లాడెను. ( )
ఎ) దర్శనము ద్వారా
బి) అతడు నిద్రించుచుండగా కలలో
సి) అతడు ప్రార్థించుచుండగా
7. ప్రభువు పౌలుతో .............. అని చెప్పెను. ( )
ఎ) పట్టణము నుండి త్వరగా వెళ్ళిపొమ్ము
బి) పని కొరకు మరి కొంతమంది సహాయకులను రప్పించుకొనుము
సి) కొరింథులోనే ఉండి బోధించుట కొనసాగింపుము
8. పౌలు కొరింథులో నివసించిన దినములు .............. ( )
ఎ) రెండు నెలలు
బి) ఒక సంవత్సరము ఆరు నెలలు
సి) ఆరు వారములు
9. నీవు ఈరోజు కొరింథుకు వెళ్ళిన యెడల, నీవు ........... చూసెదవు. ( )
ఎ) యేమియు లేకుండుట
బి) ఎదుగుతున్న తోటలను
సి) శిథిలములు మరియు విగ్రహములు
10. మనము మన హృదయములను దుర్నీతి నుండి .......... కాపాడుకొనగలము. ( )
ఎ) మంచి పుస్తకములు చదువుట ద్వారా
బి) మంచి సినిమాలు చూచుట ద్వారా
సి) ఉగ్రూతలూగించు సంగీతము వినుట ద్వారా

## 46వ పాఠము

# పౌలు మూడవ సువార్త ప్రయాణము

## అపోస్తలుల కార్యములు 18:18-19:22

పౌలు కొరింథులో ఉన్నప్పుడు, అతడు అకుల మరియు అతని భార్య ప్రిస్కిల్లను కలుసుకొనెను. వారును పౌలు వలె డేరాలు కుట్టువారు కావున అతడు వారితో ఉండెను మరియు వారు కలసి పని చేసిరి.

అతడు కొరింథు విడిచి వెళ్ళినప్పుడు ఆ భార్యాభర్తలు అతనితో వెళ్ళిరి. అతడు ఎఫెసుకు వెళ్ళెను, తరువాత యెరూషలేముకు, అటు తరువాత అంతియొకయ పట్టణమునకు వెళ్ళెను. ఆ తరువాత అతడు వెనుకకు వెళ్ళెను మరియు ముందటి ప్రయాణములో ప్రజలు రక్షణ మార్పు పొందియున్న పట్టణములను తిరిగి దర్శించెను.

ఎఫెసులో అనేక ఆసక్తికరమైన సంఘటనలు జరిగెను. యోహాను ద్వారా బాప్తీస్మము పొందిన పన్నెండు మంది పురుషులను పౌలు కనుగొనెను మరియు వారు ప్రభువైన యేసు యొక్క నామము లోనికి బాప్తీస్మము పొందవలసిన అవసరమున్నదని అతడు వారితో చెప్పెను. అది వారు చేసిరి అప్పుడు పౌలు వారిపైన తన చేతులుంచెను మరియు పరిశుద్ధాత్మ వారిపైకి వచ్చెను. పెంతెకోస్తు దినమున అపోస్తలులు చేసినట్లు వారు అన్య బాషలలో మాట్లాడుట మొదలుపెట్టిరి.

అంతేకాక ఎఫెసులో పౌలు చేత తాకబడిన చేతి గుడ్డలు రోగులైన ప్రజల యొద్దకు తీసికొనిపోబడినప్పుడు అద్భుతములు జరిగెను. ప్రజలు స్వస్థపరచబడిరి మరియు దురాత్మలు వారిని వదలిపోయెను.

**: కంఠత వాక్యము :**

చేయుటకు నీ చేతికి వచ్చిన యే పనియైనను నీ శక్తిలోపము లేకుండా చేయుము. **ప్రసంగి 9:10**

## 46వ పాఠము – పరీక్ష

# పౌలు మూడవ సువార్త ప్రయాణము

1. పౌలు కొరింథులో ఉన్నప్పుడు, అతడు ............. కలిసెను. ( )
   ఎ) పేతురు మరియు యోహానును
   బి) ఆకుల మరియు ప్రిస్కిల్లను
   సి) మరియ మరియు మార్తను
2. పౌలు వారితో ఉండెను మరియు వారు ............... పని చేసిరి. ( )
   ఎ) డేరాలను కుట్టు
   బి) ఊదా రంగు అమ్మే
   సి) చేపలు పట్టె
3. ఆ ముగ్గురు ................... దర్శించిరి. ( )
   ఎ) కేవలము ఎఫెసు మరియు యెరూషలేము
   బి) ఎఫెసును దర్శించి, కొరింథుకు తిరిగి వచ్చిరి
   సి) ఆ ప్రాంతములో అనేక పట్టణములను
4. పౌలు ఎఫెసులో యోహాను చేత బాప్తీస్మము పొందిన ........... కనుగొనెను. ( )
   ఎ) ఆరుగురిని
   బి) నలుగురు పురుషులు, ఆరుగురు స్త్రీలను
   సి) పండ్రెండు మంది పురుషులను
5. పౌలు వారికి ........... చెప్పెను. ( )
   ఎ) వారు మరల బాప్తీస్మము తీసుకొనవలసిన అవసరమున్నదని
   బి) యోహాను బాప్తీస్మము చాలని
   సి) వారు మరల బాప్తీస్మము తీసుకొనకూడదని
6. పౌలు వారిపై చేతులుంచగా .................... . ( )
   ఎ) వారు జబ్బుపడిరి
   బి) పరిశుద్ధాత్మ వారి మీదికి వచ్చెను
   సి) వారు నేలపై పడిపోయిరి
7. ఈ సంఘటన తరువాత వారు ............... మొదలుపెట్టిరి. ( )
   ఎ) గంభీరముగా పాటలు పాడుట
   బి) భయముతో వణికిపోవుట
   సి) అన్యభాషలలో మాట్లాడుట
8. పౌలు తాకిన ............... రోగుల యొద్దకు తీసికొనిపోగా వారు స్వస్థపరచబడిరి. ( )
   ఎ) చేతి కర్రలు
   బి) చేతి గుడ్డలు
   సి) రాళ్ళు
9. మనము చేయవలసిన పని ఒకటి ఉన్న యెడల, మనము .................. అవసరము. ( )
   ఎ) మన శ్రేష్ఠమైన పనిచేయుట
   బి) సాధ్యమైనంత త్వరగా చేయుట
   సి) అతి సులువుగా చేయు మార్గము కనుగొనుట
10. మనము ..................... ఉండాలని దేవుడు కోరుచున్నాడు. ( )
    ఎ) అశ్రద్ధగా చేయువారిగా
    బి) సోమరియైన వ్యక్తిగా
    సి) కష్టపడువానిగా

## 47వ పాఠము

# ఎఫెసులో అల్లరి

## అపోస్తలుల కార్యములు 19:23-41

నిజమైన దేవుడు ఒక్కడే ఉన్నాడని మరియు విగ్రహములు ఎంతమాత్రము దేవుళ్ళు కారని పౌలు ఎఫెసులో ప్రకటించుచు ఉండెను. ఎఫెసులో అనేకమంది ప్రజలు డయానా దేవతను పూజించిరి. ఆమె గ్రీకు పేరు "అర్తెమి".

డయానా దేవత యొక్క వెండి ప్రతిమలను చేసి మరియు వాటిని ప్రజలకు అమ్ముచుండిన "దెమెత్రి" అను వెండిపనివాడు అక్కడ ఉండెను. ఈ విగ్రహములను అమ్మి అతడు బహుశ  చాలా ధనము సంపాదించి యుండవచ్చును. పౌలు అతని వ్యాపారమునకు ఒక ప్రమాదముగా ఉండెను. దెమిత్రి పౌలుకు వ్యతిరేకముగా ప్రజలను రేపెను. వారు "ఎఫెసీయుల అర్తెమి మహాదేవి"యని కేకలువేయుట మొదలుపెట్టిరి. వారు మరలా మరలా కేకలు వేయుచు చివరకు ఒక గొప్ప సమూహముగా కేకలు వేయుట మొదలుపెట్టిరి. వారిలో కొందరికి వారెందుకు కేకలు వేయుచున్నారో కూడా తెలియదు. ఇతరులు కేకలు వేయుచుండిరి కావున వారును కేకలు వేయుచుండిరి.

పౌలు జనసమూహముతో మాట్లాడగోరెను కాని అతడు గాయపరచబడునేమోయని భయపడి అతని స్నేహితులు అతనిని నిరుత్సాహపరచిరి. కేకలు వేయుట సుమారు రెండు గంటలు కొనసాగెను. అది ఒక దొమ్మిగా మారుచుండెను. చివరికి ఆ పట్టణ కరణము ప్రజల ధ్యాసను మరల్చి వారిని నిశ్శబ్దపరచెను. వారు ఆ విధముగా ప్రవర్తించుటకు వారికెట్టి కారణములేదని, మరియు దేమెత్రికి ఏదైనా సమస్య ఉన్నయెడల అతడు దానిని న్యాయస్థానములకు తీసికొనివెళ్ళవలెను అని అతడు చెప్పెను.

ఆ కరణము జనసమూహమును పంపివేసెను మరియు పౌలుకు ఎట్టి హాని కలుగలేదు.

**: కంఠత వాక్యము :**

జగత్తును అందలి సమస్తమును నిర్మించిన దేవుడు తానే ఆకాశమునకును భూమికిని ప్రభువై యున్నందున హస్తకృతములైన ఆలయములలో నివసింపడు. ఆయన అందరికిని జీవమును ఊపిరిని సమస్తమును దయచేయువాడు గనుక తనకు ఏదైనను కొదువయున్నట్టు మనుష్యుల చేతులతో సేవింపబడువాడు కాదు.

**అపోస్తలుల కార్యములు 17:24-25**

## 47వ పాఠము - పరీక్ష

# ఎఫెసులో అల్లరి

1. ................ అని పౌలు ఎఫెసులో బోధించుచుండెను. ( )
   ఎ) ఒకే ఒక నిజమైన దేవుడున్నాడు
   బి) అనేక దేవులున్నారు
   సి) విగ్రహములు ఆరాధింపబడవలెను
2. ఎఫెసులో వారు ......... దేవతను పూజించిరి. ( )
   ఎ) పొమోనా
   బి) మినర్వా
   సి) డయానా
3. దెమెత్రి ఒక ................. . ( )
   ఎ) బంగారు పనివాడు
   బి) వెండి పనివాడు
   సి) రాగి పనివాడు
4. దెమెత్రి పౌలును యిష్టపడలేదు ఎందుకనగా అతడు ........... . ( )
   ఎ) ఒక బోధకుడు
   బి) అతని వ్యాపారమునకు ప్రమాదముగా ఉండెను
   సి) దెమెత్రివలె అదేవాటిని అమ్ముచుండెను
5. దెమెత్రి ........... అమ్ముచుండెను. ( )
   ఎ) దేవతా ప్రతిమలను
   బి) డేరాలను
   సి) బజారులో పండ్లను
6. ఎఫెసీయుల .............. మహాదేవి అని ప్రజలు కేకలు వేయుచుండిరి. ( )
   ఎ) వీనస్
   బి) మినర్వా
   సి) అర్తెమి
7. పౌలు జన సమూహముతో మాట్లాడగోరెను, కాని ............ . ( )
   ఎ) అతని స్నేహితులు అతనిని నిరుత్సాహపరచిరి
   బి) అతడు భయపడెను మరియు లోపలకు వెళ్ళిపోయెను
   సి) అధికారి అతనిని నిశ్శబ్దముగా ఉండమని చెప్పెను
8. ............. చివరకు జనసమూహమును అదుపులోనికి తెచ్చెను. ( )
   ఎ) పౌలు
   బి) కరణము
   సి) నగరాధ్యక్షుడు
9. అంతయు ముగిసిన తరువాత ................ . ( )
   ఎ) పౌలుకు ఏ హానియు జరుగలేదు
   బి) పౌలు వైద్యుని వద్దకు పోవలసివచ్చెను
   సి) చాలామంది ప్రజలు ఆసుపత్రికి వెళ్ళిరి
10. .......... మనము జనసమూహమును వెంబడింపకూడదు. ( )
    ఎ) కేకలు వేయుట జరుగుచున్నప్పుడు
    బి) మనము వారిని ఎఱుగనప్పుడు
    సి) వారు తప్పుచేయుచున్నప్పుడు

## 48వ పాఠము

# పౌలు ఎఫెసు వదలివెళ్ళుట

**అపోస్తలుల కార్యములు 20:1-38**

త్రోయలో పౌలు ఆదివారమున శిష్యులతో కలుసుకొనెను. వారు ఒక మేడగదిలో ఉండిరి మరియు పౌలు ప్రసంగించుచుండెను. అతడు వారితో అర్ధరాత్రి వరకు మాట్లాడుచుండెను. అక్కడ ఐతుకు అను పేరుగల ఒక యౌవనస్థుడు కిటికిలో కూర్చుండియుండెను. ప్రసంగము చాలాసేపు జరుగుచుండగా అతనికి నిద్రాభారము కలిగెను మరియు గాఢ నిద్రలోనికి జారిపోయెను. కిటికి తెరువబడియుండుట వలన అతడు బయటకు పడి నేలకు కొట్టుకొనెను. వారు అతనిని పైకి తీసినప్పుడు అతడు చనిపోయి ఉండెను.

పౌలు అంతస్థు క్రిందికి వెళ్ళి ఆ బాలుని శరీరము చుట్టూ చేతులు ఉంచి కౌగిలించుకొనెను. అప్పుడు అతని జీవము తిరిగివచ్చెను. అతనిని తిరిగి పొందినందుకు అక్కడ ఉన్నవారందరు ఎంతో సంతోషపడిరి.

పౌలు మిలేతునకు వచ్చినప్పుడు వారు అక్కడ అతనిని కలుసుకొనవలెనని ఎఫెసులో ఉన్న సంఘ పెద్దలకు వర్తమానము పంపెను. వారు కలసి కూడికొనినప్పుడు అతడు వారితో మాట్లాడెను. అతడు ఎట్లు వారికి సత్యమును బోధించెనో అతడు వారికి తెలియచెప్పెను. యెరూషలేములో తన కొరకు కష్టములు మరియు హింసలు ఎదురుచూచుచున్నవని అతడు ఎరిగియుండెను. వారు సంఘ సభ్యుల విషయములో జాగ్రత్త తీసుకొనుటలో మంచి కాపరులుగా ఉండవలెనని అతడు వారిని బ్రతిమాలుకొనెను.

“పుచ్చుకొనుట కంటె, ఇచ్చుట ఎంతో ధన్యత” అను యేసు మాటలను పౌలు వారికి జ్ఞాపకము చేసెను.

పౌలు వారితో కలసి మోకరించి ప్రార్థించెను వారందరు చాలా ఏడ్చి, అతనిని కౌగిలించుకొని ముద్దుపెట్టుకొనిరి. ఇక ఎన్నటికిని వారు అతనిని తిరిగి చూడరని అతడు వారితో చెప్పినందుకు వారందరు చాలా దు:ఖపడిరి. తరువాత వారు ఓడ వరకు అతనిని సాగనంపుటకు వెళ్ళిరి మరియు పౌలు వెళ్ళిపోయెను.

**: కంఠత వాక్యము :**

మీరు ఈలాగు ప్రయాసపడి బలహీనులను సంరక్షించవలెను – పుచ్చుకొనుట కంటే ఇచ్చుట ధన్యము అని ప్రభువైన యేసు చెప్పిన మాటలు జ్ఞాపకము చేసుకొనవలెను. **అపోస్తలుల కార్యములు 20:35**

## 48వ పాఠము – పరీక్ష

# పౌలు ఎఫెసు వదలివెళ్ళుట

1. ఎఫెసులో సంఘటన జరిగిన తరువాత పౌలు ............ . ( )
   ఎ) యెరూషలేమునకు వెళ్ళెను
   బి) చాలా పట్టణములకు ప్రయాణించెను
   సి) బోధించుట విరమించెను
2. ఆదివారమున శిష్యులు .......... కూడుకొనిరి. ( )
   ఎ) మేడ గదిలో
   బి) సమాజ మందిరములో
   సి) దేవాలయములో
3. ఐతుకు అను పేరుగల యౌవనస్థుడు ............... . ( )
   ఎ) పౌలు బోధను జాగ్రత్తగా వినుచుండెను
   బి) భవనము లోనికి వెళ్ళలేకపోయెను
   సి) నిద్రలోనికి జారిపోయి కిటికీలో నుండి పడిపోయెను
4. వారు ఐతుకును కనుగొనినప్పుడు ................ . ( )
   ఎ) అతడు చనిపోయెను
   బి) అతనిలో నుండి శ్వాస తీసివేయబడెను
   సి) అతడు లేచి నడుచుకొనుచు వెళ్ళిపోయెను
5. పౌలు ఐతుకును ............ తీసికొని వచ్చెను . ( )
   ఎ) ఏదైనా తినుటకు
   బి) తిరిగి జీవమునకు
   సి) తనతో పాటు కూడికకు
6. పౌలు .......... అతనిని కలుసుకొనుటకు వర్తమానము పంపెను . ( )
   ఎ) మిగత అపోస్తలులకు
   బి) తిమోతి మరియు సీలలకు
   సి) ఎఫెసులోని సంఘ పెద్దలకు
7. అతడు వారికి జ్ఞాపకము చేసిన యేసుక్రీస్తు మాటలు ............ . ( )
   ఎ) నేను తప్పక శ్రమపొంది చనిపోవుదును
   బి) పుచ్చుకొనుట కంటె యిచ్చుట ఎక్కువ దీవెనకరము
   సి) సమాప్తమైనది
8. వారు చాలా దు:ఖపడిరి ఎందుకనగా ................. . ( )
   ఎ) ఇక ఎన్నటికినీ మీరు నన్ను చూడరని పౌలు చెప్పెను
   బి) పౌలు వారి యెడల దురుసుగా ప్రవర్తించెను
   సి) వారు గొఱ్ఱెల కాపరులుగా ఉండుటకు యిష్టపడలేదు
9. పౌలు వారిని విడిచిన తరువాత ............... . ( )
   ఎ) రోడ్డుమీద నెమ్మదిగా నడచి వెళ్లిపోయెను
   బి) ఓడ ఎక్కి వెళ్ళిపోయెను
   సి) గాడిద మీద ఎక్కి వెళ్ళిపోయెను
10. శనివారము రాత్రి నేను చేయవలసినది ........... . ( )
    ఎ) సినిమా చూస్తూ చాలా రాత్రి వరకు మేలుకొని యుండవలెను
    బి) అర్ధరాత్రి వరకు విడియో గేములు ఆడవలెను
    సి) ఆ రాత్రి మంచిగా విశ్రాంతి తీసుకొనవలెను

### 49వ పాఠము

## యెరూషలేములో పౌలు

### అపోస్తలుల కార్యములు 21:17-23:24

పౌలు యెరూషలేమునకు వెళ్ళెను. అక్కడ కొంతమంది యూదులు పౌలు ధర్మశాస్త్రమునకు విరోధముగా బోధించుచున్నాడనియు, అన్యజనులను దేవాలయము లోనికి తీసికొనివచ్చి దేవాలయమును అపవిత్రపరచుచున్నాడని అతనిపై నేరము మోపిరి. పట్టణమంతయు గలిబిలిగా ఉండెను. మరియు యేమి జరుగుచున్నదో చూచుటకు జనులు పరుగెత్తుకొని వచ్చిరి. వారు పౌలును చంపవలెనని ప్రయత్నించుచుండిరి. అయితే అతడు రోమా సైనికుల చేత తప్పింపబడెను. జనసమూహము ఎంతగానో దౌర్జన్యము చేయుచున్నందున అతని విరోధుల నుండి పౌలును తీసికొనిపోవుటకు వారు అతనిని మోసికొనిపోవలసి వచ్చెను.

వారు కోటలోనికి పోవు మెట్ల మీద నిలిచియుండగా పౌలు జనులతో మాట్లాడుటకు సెలవిమ్మని అడిగెను. సైనికులు అతనిచుట్టూ ఉండగా అతడు తన రక్షణవాదమును మొదలుపెట్టెను. అతడు తన రక్షణ మార్పును గూర్చి తెలియజేసెను. వారు అతనిని కొంత సమయము అనగా ప్రభువు అతనిని అన్యజనుల యొద్దకు పంపియున్నాడని చెప్పు వరకు ఆలకించుచుండిరి. తరువాత వారు బహు ఉగ్రులైరి. సహస్రాధిపతి అతనిని లోపలికి తీసికొనిపోయి అతనిని కొట్టవలెనని ఆజ్ఞాపించెను.

పౌలు రోమా పౌరుడని వారికి తెలియదు. మరియు రోమా పౌరులు కొట్టబడకూడదు. పౌలు తన పౌరసత్వమును గూర్చి వారికి తెలియజేసినప్పుడు అతని యెడల ఎట్లు వ్యవహరించియున్నామో అని వారు భయపడిరి. యూదుల సన్‌హెడ్రిన్ యెదుట అతనిని నిలువబెట్టవలెనని సహస్రాధిపతి ఆజ్ఞాపించెను. సభ యెదుట పౌలు తాను ఒక పరిసయ్యుడనని మరియు మృతుల పునరుత్థానమును విశ్వసించితినని తెలియజేసి, పరిసయ్యులకును, సద్దూకయ్యులకును మధ్యకలహము పుట్టించెను. పెద్ద గొల్లు కలిగెను మరియు సహస్రాధిపతి అతనిని సిపాయిల శాలకు తీసికొనిపోయెను.

ఆ రాత్రి ప్రభువు అతని యొద్ద నిలుచుండి, ధైర్యముగా ఉండుమని చెప్పెను. అతడు తన విశ్వాసమును అక్కడి ప్రజలకు తెలియజేయుటకు పౌలు రోమాకు వెళ్ళబోవుచుండెను.

పౌలును చంపుటకు ఒక కుట్ర జరిగెను. అయితే పౌలు మేనల్లుడు దాని గూర్చి తెలుసుకొని అధికారులకు తెలియజేసెను. పౌలును గవర్నరు "ఫెలిక్సు" నొద్దకు పంపవలెనని సహస్రాధిపతి నిర్ణయించుకొనెను. అతడు క్షేమముగా చేరుటకు అతని వెంట రెండు వందల మంది సైనికులు, డెబ్బది మంది గుఱ్ఱపు రౌతులు మరియు రెండు వందల మంది యీటెలవారు వెళ్ళిరి. పౌలు గుఱ్ఱముపై ప్రయాణము చేయుచు రాత్రి 9 గంటలకు వారు బయలుదేరివెళ్ళిరి.

**: కంఠత వాక్యము :**

దేవుడు యథార్థవంతుడు, యెహోవా వాక్కు నిర్మలము, ఆయన శరణుజొచ్చు వారందరికి ఆయన కేడెము.

**2 సమూయేలు 22:31**

## 49వ పాఠము – పరీక్ష

# యెరూషలేములో పౌలు

1. యేరూషలేములో కొందరు యూదులు పౌలు ........ దేవాలయమును అపవిత్రపరచెనని పౌలుపై నేరము మోపిరి. ( )
   ఎ) అన్యులను దేవాలయములోనికి తెచ్చి
   బి) అపవిత్రమైన బలులు అర్పించి
   సి) స్నానము చేయక
2. జనులు పరుగెత్తుకొనివచ్చిరి, ఎందుకనగా .............. . ( )
   ఎ) వారు పాడుటను వినిరి
   బి) అధికారి మాట్లాడబోవుచుండెను
   సి) అక్కడ గలిబిలిగా ఉండెను
3. ............... పౌలు తప్పించబడెను. ( )
   ఎ) అతని స్నేహితుల చేత
   బి) రోమా సైనికుల చేత
   సి) యాజకుల చేత
4. ............ అతడు చెప్పినంత వరకు ఆ జనసమూహము పౌలు మాట్లాడుచుండగా వినిరి. ( )
   ఎ) తాను యేసుక్రీస్తు చేత పంపబడెనని
   బి) ప్రభువు తన్ను అన్యజనుల యొద్దకు పంపెనని
   సి) వారు పాపులని
5. సహస్రాధిపతి పౌలును లోపలికి తీసుకొనిపోయి .............. . ( )
   ఎ) అతనిని కొట్టవలెనని ఆజ్ఞాపించెను
   బి) ప్రకటించుట ఆపమని ఆజ్ఞాపించెను
   సి) అతనికి తినుటకు కొంచెము యిచ్చెను
6. పౌలు వారికి ......... తెలియజేసినప్పుడు ఆ మనుష్యులు భయపడిరి. ( )
   ఎ) వారు మారుమనస్సు పొందవలెనని
   బి) ప్రభువు మరలా వస్తాడని
   సి) తాను రోమా పౌరుడనని
7. పౌలు ............ తెలియజేయుట ద్వారా యూదుల మహాసభలో కలహమును పుట్టించెను ( )
   ఎ) తనకు దేవదూతల యందు విశ్వాసములేదని
   బి) తాను ఒక పరిసయ్యుడనని మరియు పునరుత్థానమునందు విశ్వసించుచున్నానని
   సి) తాను ఒక సద్దూకయ్యుడనని
8. అతడు .......... వెళ్ళబోవుచున్నాడని ఆ రాత్రి ప్రభువు పౌలుకు తెలియజేసెను. ( )
   ఎ) రోమా
   బి) యెరూషలేము
   సి) ఐగుప్తు
9. ........ పౌలును చంపవలెనన్న కుట్ర ఆపబడెను. ( )
   ఎ) సంఘము దానిని గూర్చి తెలుసుకొన్నప్పుడు
   బి) పౌలు మేనల్లుడు దాని గూర్చి తెలుసుకొన్నప్పుడు
   సి) కాపలాదారులు దాని గూర్చి పౌలుకు తెలియజేసినప్పుడు
10. ప్రభుత్వము కల్పించు రక్షణను పొందవలెనంటే మనము ............. . ( )
    ఎ) దేశ చట్టాలకు లోబడాలి
    బి) నేరస్థులవ్వాలి
    సి) దేశ చట్టాలను అతిక్రమించాలి

## 50వ పాఠము

# అధిపతుల యెదుట పౌలు

## అపోస్తలుల కార్యములు 23:25-26:32

పౌలు ముగ్గురు అధిపతుల యెదుట హాజరుపర్చబడెను.

సహస్రాధిపతి పౌలుకు వ్యతిరేకముగా మోపబడిన నేరారోపణలను పేర్కొనుచు ఒక పత్రికను రోమా అధిపతియైన ఫేలిక్సునకు పంపియుండెను. ఐదు దినములైన తరువాత యూదుల పెద్దలు తెర్తుల్లు అను తమ న్యాయవాదితో కలసి వచ్చిరి. అతడు యూదుల నేరారోపణలను అధిపతికి తెలియజేసెను మరియు పౌలు అతని మీద మోపబడిన నేరారోపణకు ప్రత్యుత్తరమిచ్చెను. ఫేలిక్సు పౌలును రెండు సంవత్సరములు చెఱసాలలో ఉంచి, తరచుగా అతనిని పిలువనంపించుండెను మరియు మాట్లాడుచుండెను.

తరువాత పౌలు ఫేస్తు యెదుట హాజరు పర్చబడెను (ఈ ఫెస్తు పేలిక్సు తరువాత వచ్చిన రోమను అధిపతి). అతనికి వ్యతిరేకముగా తిరిగి నేరారోపణలు తీసుకొని రాబడెను మరియు పౌలు తన నిర్దోషత్వమును గూర్చి వాదించుకొనెను తన వివాదమును గూర్చి కైసరు యెదుట చెప్పుకొనగోరుచున్నానని పౌలు ఫేస్తుతో చెప్పెను మరియు అతని విజ్ఞాపన అంగీకరించబడెను.

అతడు రోమాకు పంపబడు సమయము రాక మునుపు రాజైన అగ్రిప్ప తన భార్యయైన బెర్నీకెయతో కలసి కైసరయ చేరుకొనెను. ఫేస్తు ఈ వివాదమును గూర్చి అతనితో చర్చించెను మరియు పౌలు మాటలను అతడు వినగోరుచున్నాడని రాజు అతనితో చెప్పెను.

మరుసటి దినమున పౌలు అగ్రిప్పరాజు ఎదుటకు తేబడెను. తన రక్షణ మార్పును గూర్చి మరియు క్రైస్తవులను హింసించిన తాను ఏ విధముగా తానే ఒక క్రైస్తవునిగా మార్పు చెందెనో ఆ విషయములను గూర్చి అతడు రాజునకు తెలియజేసెను. అప్పుడు ఫేస్తు - నీవు వెర్రివానివలె మాట్లాడుచున్నావని అతని నిందించెను. పౌలు ఆ యిద్దరు పరిపాలకులకు తన వాదనలను వినిపించుట కొనసాగించెను.

చివరకు ఆ అధిపతులు అధికార మందిరము నుండి వెళ్లిపోయిరి. పౌలు మరణము లేక చెఱసాల బంధకమునకు తగిన నేరము యేమియు చేయలేదని వారు ఒకనితో ఒకరు చెప్పుకొనిరి. పౌలు విచారణ కొరకు కైసరు నొద్దకు పంపబడవలెనని కోరి యుండని యెడల అతడు విడుదల చేయబడవచ్చని అగ్రిప్ప చెప్పెను. అయితే దేవుడు పౌలు కొరకు రోమాలో ప్రణాళికలను కలిగియుండెను మరియు అతడు వెళ్లవలసిన అవసరమున్నదని మనము ఎఱుగుదుము.

**: కంఠత వాక్యము :**

అందుచేతను మీరు ఆపద్దినమందు వారిని ఎదిరించుటకును, సమస్తమును నెరవేర్చిన వారై నిలువబడుటకును శక్తిమంతులగునట్లు దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించుకొనుడి (**ఎఫెసీయులు 6:13**)

నీవు దేవుని యొక్క సర్వాంగ కవచమును గూర్చిన వర్ణనను **ఎఫెసీయులు 6:14-17**లో కనుగొనగలవు. ఈ వచనములు మరింత కంఠస్థపు పని కొరకుపై వచనమునకు చేర్చబడవచ్చును.

## 50వ పాఠము – పరీక్ష

# అధిపతుల యెదుట పౌలు

1. పౌలు........... అధిపతుల ఎదుట హాజరుపర్చబడెను. ( )
   ఎ. ఇద్దరు
   బి. ముగ్గురు
   సి. నలుగరు
2. సహస్రాధిపతి........... అను రోమా అధిపతికి పత్రికను పంపెను. ( )
   ఎ. ఫేస్తు
   బి. ఫేలిక్సు
   సి. తెర్తుల్లు
3. రోమా అధిపతి పౌలును ................... చెరసాలలో ఉంచెను. ( )
   ఎ. రెండు సంవత్సరములు
   బి. ఆరు నెలలు
   సి. ఐదు సంవత్సరములు
4. తెర్తుల్లు....................... . ( )
   ఎ. రోమా అధిపతి
   బి. రాజు
   సి. యూదుల న్యాయవాది
5. పౌలు ఫేస్తుతో........... కోరుచున్నానని చెప్పెను. ( )
   ఎ. విడుదల పొందవలెనని
   బి. కైసరు ఎదుట హాజరుకావలెనని
   సి. న్యాయవాది చేత వాదించుకోవలెనని
6. అధిపతి................తో పౌలు యొక్క వివాదమును గురించి చర్చించెను. ( )
   ఎ. అగ్రిప్పరాజు
   బి. బెర్నీకేయ
   సి. పౌలు యొక్క న్యాయవాది
7. అధిపతి పౌలుతో.............. మాట్లాడుచున్నాడని నిందించెను. ( )
   ఎ. ఒక సువార్తకునిలా
   బి. ఒక వ్యాపారస్తునిలా
   సి. ఒక వెర్రివానిలా
8. ఇద్దరు పరిపాలకులు పౌలు.............. అంగీకరించిరి. ( )
   ఎ. నేరమేమియూ చేయలేదని
   బి. ఉరితీయ వచ్చునని
   సి. పిచ్చివాడని
9. వారు పౌలును గురించి చెప్పినది............ . ( )
   ఎ. అతను మానసిక వైద్యుని కలుసుకొనవలెను
   బి. అతడు తదుపరి విచారణ కోరియుండని యెడల విడుదల పొందవచ్చును.
   సి. అతను మరణమునకు తగినవాడే
10. కొన్ని సమయములలో............... నిర్భయముగా ఉండవలెను. ( )
    ఎ. తలుపులు తెరుచుటకు
    బి. బడికి వెళ్ళుటకు
    సి. విశ్వాసమును గురించి మాట్లాడుటకు

## 51వ పాఠము

# ఓడ బ్రద్దలైపోవుట

## అపోస్తలుల కార్యములు 27:1-28:16

పౌలు శతాధిపతియైన "యూలి" యొక్క కావలి క్రింద ఓడ ఎక్కి ఇటలీ వెళ్లెను. వారు మొదటిగా ఆగినపుడు పౌలు ఓడ దిగి వెళ్లుటకు మరియు అతని స్నేహితులను దర్శించుటకు అనుమతించునట్లు "యూలి" అతనిపై దయగలిగి ఉండెను. వారు అతని అవసరతలను సమకూర్చిరి.

మరలా వారు ఓడ ప్రయాణము చేసిరి మరియు ఓడరేవు వద్ద ఓడలు మారిరి. గాలి మిక్కిలి తీవ్రముగా కొట్టుచున్నందున మార్గమందు నిలిచి యుండుట వారికి కష్టముగా ఉండెను. ఈ ప్రయాణము అపాయకరమగునని పౌలు వారితో చెప్పెను. అయినను ఆ శతాధిపతి ప్రయాణమును కొనసాగించుటకు నిర్ణయించుకొనెను.

తీవ్రమైన పెనుగాలులు విసరుచుండెను. అప్పుడు వారు లంగరు దించిరి. సముద్రపు అలలు ఓడను పగులగొట్ట సాగెను. ఓడ బరువును తేలిక చేయుటకు వారు ఓడమీది నుండి నీటిలోనికి సరకులను పారవేయసాగిరి. తుఫాను మూడవదినమునకు వారు ఓడ ప్రయాణపు సామాగ్రి పారవేయసాగిరి. ఆ తుఫాను అనేక దినముల వరకు అలాగుననే కొనసాగెను. పౌలు వారి మధ్య నిలిచెను మరియు ఉద్వేగముతో "ఇది జరుగునని నేను మీకు ముందుగానే చెప్పితిని" అని చెప్పెను. గడచిన రాత్రి అతనికి కనబడిన దూతను గూర్చి వారికి చెప్పుట ద్వారా అతడు వారిని ధైర్యపరచెను. ఓడలో ఉన్న మనుష్యులందరి ప్రాణములు రక్షింపబడునని ఆ దూత అతనికి తెలిపెను.

వారు రెండు వారములు ఆ తుఫానును తట్టుకొనియుండిరి మరియు భూభాగమునకు సమీపముగా వచ్చుచుండిరి. అప్పుడప్పుడు వారు నీళ్ల లోతును కొలిచిరి. లోతులేని నీళ్ళలోనికి ప్రవేశించుచున్నట్లు వారికి స్పష్టమాయెను. సముద్రపు ఒడ్డున ఉన్న రాళ్లను ఢీకొనకుండునట్లు ఓడను నిలిపివేయవలెనని వారు నాలుగు లంగరులను దించిరి.

కొంత బలము పొందునట్లు ఆహారము పుచ్చుకొనుడని పౌలు ఆ మనుష్యులను బ్రతిమాలెను. వారు పదునాలుగు దినములుగా ఆహారము తినలేదు. పౌలు ఒక రొట్టెను పట్టుకొని కృతజ్ఞతా స్తుతులు చెల్లించి తినసాగెను. మిగిలిన వారు కూడ తినసాగిరి. అటుపిమ్మట ఓడను ఇంకొంచెము తేలిక చేయుటకు వారు ఓడలోని ఆహార ధాన్యమును సముద్రములో పడవేసిరి.

ఉదయమైనప్పుడు వారు భూమిని చూచిరి. వారు లంగరు పైకెత్తి ఓడను సముద్రపు ఒడ్డుకు నడిపించిరి. అయితే యిసుక దిబ్బలలో అది చిక్కుకొనెను. ఓడ ముక్కలుగా బ్రద్దలైపోసాగెను. ఖైదీలలో ఎవడును పారిపోకుండునట్లు వారిని చంపవలెనని సైనికులకు ఆలోచన పుట్టెను. అయితే ఎవరి ఆధీనములో పౌలు ఉండెనో ఆ శతాధిపతియైన యూలి అందరిని విడిచిపెట్టవలెనని సైనికులను ఒప్పించెను. ఓడమీద నుండి నీళ్ళలోకి దుముకవలెనని ఖైదీలకు యూలి ఆజ్ఞాపించెను. ఈదగలిగిన వారు ఈదుకొనుచు సముద్రపు దరికి చేరిరి. ఈదలేని వారు చెక్కముక్కలు పట్టుకొని నీళ్ళమీద తేలుకుంటూ వెళ్లిరి. పౌలు చెప్పినట్లు అందరును రక్షింపబడిరి.

ఆ ద్వీపము, 'మెలితే' అని వారికి తెలియజేయబడెను. అక్కడి ప్రజలు వారి యెడల దయతో ఉండిరి. అప్పుడు వర్షము కురియుచు చలిగా ఉండెను. నిప్పు రాజబెట్టవలెనని వారు పుల్లలు ఏరసాగిరి. పౌలు కొన్ని పుల్లలు ఏరి, నిప్పుల మీద వేయగా, ఆ పుల్లలో నుండి ఒక సర్పము ప్రాకుచు బయటికి వచ్చి అతని చేయిని పట్టెను. అక్కడి ప్రజలు ఆ సర్పమును చూసినపుడు వారు న్యాయము జరిగినదని తలంచిరి. పౌలు నరహంతకుడని, సముద్రము నుండి తప్పించుకొనినను, సర్పము యొక్క కాటు చేత చనిపోబోవుచున్నాడని వారు ఊహించుకొనిరి (లేదా వారట్లు తలంచిరి). యేమి జరుగునో చూడవలెనని అతనినే కనిపెట్టుచూ ఉండిరి. అప్పుడు అతనికి యేమియు జరుగనందున అతడు ఒక దేవత అని వారు నిర్ణయించుకొనిరి.

ఆ ద్వీపము అధికారియైన పొప్లి ఇంటిలో ఉండుటకు వారు ఆహ్వానింపబడిరి. 'పొప్లి' యొక్క తండ్రి రోగియై పడియుండగా పౌలు అతనిని స్వస్థపరచెను. ఆ ద్వీపవాసులు ఆ అద్భుతమును గూర్చి వినినప్పుడు, వారు అనేక మంది రోగులను తీసికొనివచ్చిరి.

అందరును స్వస్థత పొందిరి. ప్రజలు వారి అవసరతలను అన్నిటిని తీర్చిరి. మూడు నెలలైన తరువాత వారు మరలా ఓడ ఎక్కి బయలుదేరి ప్రయాణమై వెళ్లిపోయిరి.

**: కంఠత వాక్యము :**

ఏ అపాయము రాకుండ యెహోవా నిన్ను కాపాడును. ఆయన నీ ప్రాణమును కాపాడును. ఇది మొదలుకొని నిరంతరము నీ రాకపోకల యందు యెహోవా నిన్ను కాపాడును. **కీర్తన 121:7-8**

# 51వ పాఠము – పరీక్ష

## ఓడ బ్రద్దలైపోవుట

1. పౌలు ఓడ ఎక్కి ప్రయాణమై ఒక కావలి వాడు వెంటరాగా ............... కు వెళ్ళెను. ( )
   ఎ. క్రేతు
   బి. కుప్ర
   సి. ఇటలీ
2. వారు ఓడ మారిన తరువాత.......... పౌలు వారికి చెప్పెను. ( )
   ఎ. ఈ ప్రయాణము అపాయకరముగా ఉండునని
   బి. ఓడ దిగి వెళ్లగోరెనని
   సి. ఇది మంచి ప్రయాణముగా ఉండునని
3. తుఫాను ప్రారంభమైన తరువాత వారు ఓడలో నుండి నీళ్లలోనికి...........విసిరి ఓడను తేలిక చేసిరి. ( )
   ఎ. పౌలును
   బి. సరకులను
   సి. ఖైదీలను
4. దూత పౌలుకు కనబడి................ చెప్పెను. ( )
   ఎ. తుఫాను ఇంకొక దినము వరకు కొనసాగునని
   బి. అందరి ప్రాణములు రక్షింపబడునని
   సి. సైనికులలో సగము చనిపోవుదురని
5. తుఫాను............... వరకు కొనసాగెను. ( )
   ఎ. రెండు వారములు
   బి. రెండు దినములు
   సి. ఒక వారము
6. ఆహారము పుచ్చుకొనుడని పౌలు ఆ మనుష్యులను బ్రతిమాలెను, అప్పుడు ఆ ఓడ పనివారు........ . ( )
   ఎ. ఓడను క్షేమముగా భూమికి చేర్చిరి
   బి. ఓడ నుండి ఖైదీలను విసిరివేసిరి
   సి. ధాన్యమును పడవేసిరి
7. ............... సైనికులను ఒప్పించుట చేత ఖైదీలందరు రక్షింపబడిరి. ( )
   ఎ. పౌలు
   బి. శతాధిపతియైన యూలి
   సి. నావికుడు
8. ఆ మనుష్యులు............ ద్వీపమునకు ఈదుకొనుచు వచ్చిరి. ( )
   ఎ. మెలితే
   బి. కుప్ర
   సి. క్రేతు
9. ............. పౌలు ఒక దేవత అని ద్వీపవాసులు తలంచిరి. ( )
   ఎ. వారికి సువార్తను ప్రకటించెను గనుక
   బి. ఒక సర్పము అతనిని కాటు వేసెను అయినను అతడు చనిపోలేదు గనుక
   సి. పరలోకము నుండి అగ్ని దిగివచ్చునట్లు చేసెను గనుక
10. పిల్లలు.......... జ్ఞానముతో కూడిన హెచ్చరికలను వినవలెను. ( )
   ఎ. పొరుగు వారి పిల్లల
   బి. పాఠశాలనందున్న వారి స్నేహితుల
   సి. వారి తల్లిదండ్రుల

## 52వ పాఠము

# రోమాలో ఖైదీయైన పౌలు

## అపోస్తలుల కార్యములు 28:17-31

పౌలు రోమా పట్టణమునకు వచ్చినపుడు అతడు ఒక గృహఖైదీగా ఉండుటకు అనుమతింపబడెను. అతనికి కావలిగా ఒక సైనికునితోపాటు ఒంటరిగా నివసించుటకు పౌలు అనుమతింపబడెను.

మూడు దినములైన తరువాత అతడు పట్టణములో ఉన్న యూదుల నాయకులను తన యొద్దకు పిలిపించుకొని తన కథను వారికి చెప్పెను. అతనితో మాట్లాడు అవకాశమును బట్టి వారు ఆనందించిరి. ఈ క్రొత్త మతమును గూర్చి ప్రజలు మాట్లాడుచుండుటను వారు వినియుండిరి మరియు దీనిని గూర్చి మరి ఎక్కువగా తెలుసుకొనగోరిరి.

వారు తిరిగి కలుసుకొనుటకు ఏర్పాట్లు చేసిరి మరియు ఇంకను ఎక్కువ మంది ప్రజలు ఇంటికి వచ్చిరి. పౌలు ఉదయము నుండి సాయంత్రము వరకు రోజంతయు వారితో మాట్లాడెను. అతడు యేసును గూర్చి వారికి తెలియజేసెను. ప్రవక్తలు ఎవనిని గూర్చి వ్రాసియుండిరో ఆయనే “యేసు” అని వారికి చూపుటకు అతడు ప్రయత్నము చేసెను. కొంత మంది ప్రజలు నమ్మిరి కాని ఇతరులు అతని మాటలను నమ్మకపోయిరి.

పౌలు తన అద్దెయింటి నుండి రెండు సంవత్సరములు పూర్తిగా ప్రకటించగలిగెను. క్రీ.శ. 67 ప్రాంతములో పౌలు శిరచ్ఛేదనము చేయబడెనని లౌకిక చరిత్ర (బైబిలు కాదు) మనకు తెలియజేయుచున్నది.

ఈ రోజున నీవు రోమా పట్టణమును సందర్శించిన యెడల, క్రీ.శ. 80లో నిర్మాణము పూర్తి చేయబడిన కొలొస్సియము యొక్క అవశేషములను మీరు చూడవచ్చును. (ఇది బహుశ పౌలు మరణము తరువాతయై యుండవచ్చును).

**: కంఠత వాక్యము :**

భూమి మీద నీ మార్గము తెలియజేయబడునట్లును అన్య జనులందరిలో నీ రక్షణ తెలియజేయబడునట్లును దేవుడు మమ్మును కరుణించి మమ్మును ఆశీర్వదించును గాక. **కీర్తనలు 67:1-2.**

## 52వ పాఠము – పరీక్ష

# రోమాలో ఖైదీయైన పౌలు

1. పౌలు రోమా పట్టణము చేరినపుడు ................ అనుమతింపబడెను. ( )
   ఎ. అతనిని కావలి కాయుటకు ఒక సైనికునితో కూడ ఒక ఇంటిలో నివసించుటకు
   బి. కావలివాడు లేకుండా నివసించుటకు
   సి. అతడు ఎక్కడికి వెళ్ళగోరునో అక్కడికి వెళ్లుటకు
2. యూదుల నాయకులను తన యొద్దకు పిలువక ముందు పౌలు............. వేచి యుండెను. ( )
   ఎ. రెండు వారములు
   బి. మూడు దినములు
   సి. మూడు నెలలు
3. యూదుల నాయకులు............. ఆతృత కలిగియుండిరి. ( )
   ఎ. క్రొత్త మతమును గూర్చి తెలుసుకొనవలెనని
   బి. పౌలును మరణమునకు అప్పగింపవలెనని
   సి. పౌలు బోధలలో తప్పు పట్టవలెనని
4. యూదుల నాయకులు వెళ్లుటకు ముందు వారు ..................... ఏర్పాట్లు చేసిరి. ( )
   ఎ. న్యాయ సభ యెదుటికి పౌలును రప్పించుటకు
   బి. పౌలును అప్పగించు మార్గమును కనుగొనుటకు
   సి. పౌలును తిరిగి కలుసుకొనుటకు
5. మరియొకసారి వారు కలుసుకొనవలసినప్పుడు................ . ( )
   ఎ. ఎవడును రాలేదు
   బి. అక్కడ ఇంకను ఎక్కువ మంది ప్రజలు ఉండిరి
   సి. కొద్ది మంది ప్రజలు వారితో కలుసుకొనిరి.
6. పౌలు వారితో............ మాట్లాడెను. ( )
   ఎ. ఉదయము నుండి సాయంత్రము వరకు
   బి. రెండు గంటల సమయము
   సి. అర్థగంట సమయము
7. ప్రవక్తలు ఎవరిని గూర్చి వ్రాసియుండిరో ఆయనే................ అని అతడు వారికి బోధించెను ( )
   ఎ. మోషే
   బి. ఏలియా
   సి. యేసు
8. ఆ స్థలములో పౌలు .................... ప్రకటించగలిగెను. ( )
   ఎ. ఆరు నెలలు
   బి. రెండు సంవత్సరములు
   సి. ఒక సంవత్సరము
9. పౌలు ........................ లౌకిక చరిత్ర మనకు తెలియజేయుచున్నది. ( )
   ఎ. శిరచ్ఛేదనము చేయబడెనని
   బి. సిలువ వేయబడెనని
   సి. సింహముల చేత చంపబడెనని
10. మనకు ప్రతిబంధకము ఉన్నప్పుడు, మనము ....................... . ( )
    ఎ. మన ప్రతిబంధకమును గూర్చి ఫిర్యాదు చేయవలెను
    బి. ఇతరులను మన కొరకు ప్రతీది చేయనివ్వవలెను
    సి. ప్రతిబంధకము ఉన్నప్పటికినీ మన ద్వారా దేవుని పని జరుగనివ్వవలెను.

## 53వ పాఠము

ప్రియమైన తల్లిదండ్రులారా,

ఈ వారము మనకు పరిశుద్ధ గ్రంథము యొక్క అద్భుత ముగింపును గూర్చి సంక్షిప్తముగా అధ్యయనము చేయుదము సాతాను మరియు మరణము మీద క్రీస్తు ఎట్లు విజయము పొందెనో చదువుదుము.

యేసుక్రీస్తు మన కొరకు ఒక సుందర ప్రదేశమును సిద్ధపరచియున్నాడు మరియు ఆయన తిరిగి వచ్చి మనలను ఆయనతోపాటు తీసుకొని వెళ్లునని యోహాను 14లో ఆయన మనకు చెప్పెను.

మన జీవితములలో దేవుని మొదటి స్థానములో పెట్టుట యొక్క ప్రాముఖ్యతను గూర్చి మన పిల్లలకు బోధించుటకు మనము కలసి పనిచేయుచుండగా మనము ఒకరి కొరకు ఒకరు ప్రార్థించుట కొనసాగించెదము

## "పరలోకము"

"నేను క్రొత్త ఆకాశమును క్రొత్త భూమిని చూచితిని. నేను నూతనమైన యెరూషలేము అను ఆ పరిశుద్ధ పట్టణము పరలోకమందున్న దేవుని యొద్ద నుండి దిగివచ్చుట చూచితిని" అని యోహాను ప్రకటన గ్రంథములో చెప్పెను. దూత యోహానుతో దేవుని మాటలు చెప్పెను.

వినుము! నేను త్వరగా వచ్చుచున్నాను. నేను బహుమానములను నాతో తెచ్చుచున్నాను. నేను ప్రతి వానికి వాడు చేసియున్న దానిని బట్టి తిరిగి చెల్లించుదును. నేను సమస్తమునకు మొదటివాడను మరియు నేను సమస్తమునకు కడపటివాడను. నాకు విధేయులైన వారిని ఆశీర్వదింతును. వారు జీవవృక్ష ఫలములను తిందురు. వారు గుమ్మముల ద్వారా పరలోక పట్టణము లోనికి ప్రవేశింతురు.

పరిశుద్ధ గ్రంథములోని చివరి పుస్తకము ఆ సుందర పట్టణమును గూర్చి మనకు తెలియజేయుచున్నది. అది స్వచ్ఛమైన బంగారముతో చేయబడిన చాలా చాలా పెద్ద పట్టణమని వర్ణింపబడినది. ఆ పట్టణపు గోడకు పన్నెండు పునాదులు ఉన్నవి మరియ వాటి మీద పండ్రెండుగురు అపోస్తలుల పేర్లున్నవి. దాని పన్నెండు పునాదులు ప్రతివిధమైన అమూల్య రత్నములతో అలంకరింపబడినవి. ఆ ఎత్తైన గోడ పన్నెండు గుమ్మములు కలిగియుండెను. ప్రతి గుమ్మము ఒక గొప్ప ముత్యముతో నిర్మింపబడెను. ఇశ్రాయేలు యొక్క పన్నెండు గోత్రముల పేర్లు ఆ గుమ్మములపైన వ్రాయబడెను మరియు ఆ గుమ్మములు అన్ని వేళలా తెరువబడియుండును; అవి ఎన్నడును మూయబడవు. అక్కడ ఉన్నదంతయు మంచిదై ఉండును ఏలయనగా చెడుయైనది యేదియు లోన ప్రవేశింపలేదు. అక్కడ యిక ఏ మాత్రము దుఃఖము ఉండదు, ఎట్టి ఏడ్పు ఉండదు. ఎంత సుందర ప్రదేశము!

"ఈ సంగతులను గూర్చి మీకు సాక్ష్యమిచ్చుటకు నేను నా దూతను పంపియున్నాను. నేను ప్రకాశమానమైన వేకువచుక్కయునై యున్నాను. అవును, నేను త్వరగా వచ్చుచున్నాను", అని యేసు చెప్పెను.

ప్రభువైన యేసు రమ్ము!

పరలోకము యొక్క ఈ వర్ణన పరిశుద్ధ గ్రంథము యొక్క చివరి పుస్తకము, ప్రకటన గ్రంథము యొక్క 21 మరియు 22 అధ్యాయముల యందు కనుగొనబడును.

### : కంఠతవాక్యము :

దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వాని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్య జీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను. **యోహాను 3:16.**

## 53వ పాఠము – పరీక్ష

# పరలోకము

1. ప్రకటన గ్రంథము ...................... చే వ్రాయబడెను. ( )
   ఎ. పేతురు
   బి. యోహాను
   సి. మత్తయి
2. తన దర్శనములో యోహాను .................... చూచెను. ( )
   ఎ. నూతన యెరూషలేము పరలోకము నుండి దిగివచ్చుట
   బి. పరలోకము నుండి ఒక దుప్పటి క్రిందికి దింపబడుట
   సి. అగ్నిరథము
3. ................. దేవుని మాటలను యోహానుకు చెప్పెను. ( )
   ఎ. యేసు
   బి. అపవాది
   సి. ఒక దూత
4. దర్శనములో పేర్కొనబడిన వృక్షము........................... . ( )
   ఎ. మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షము
   బి. జీవ వృక్షము
   సి. అత్తి వృక్షము
5. ఆ పట్టణము....................తో చేయబడినట్లు వర్ణింపబడెను. ( )
   ఎ. పచ్చి యిటుక
   బి. కఱ్ఱ
   సి. బంగారము
6. ఆ పట్టణము యొక్క పునాదులు..................తో చేయబడెను. ( )
   ఎ. రత్నముల
   బి. ఇటికల
   సి. సిమెంటు
7. అక్కడ సూర్యుడైనను, చంద్రుడైనను లేడు, ఎందుకనగా....................... . ( )
   ఎ. అక్కడ విద్యుత్ దీపములు ఉన్నవి.
   బి. అక్కడ అన్ని వేళలా చీకటిగా ఉన్నది.
   సి. దేవుని మరియు యేసుక్రీస్తు మహిమ వెలుగిచ్చుచుండెను.
8. ఏ................. ఆ పట్టణములో ప్రవేశింపలేదు. ( )
   ఎ. వ్యక్తి
   బి. చెడు
   సి. దూత
9. యేసు తన్ను ..................... వర్ణించుకొనెను. ( )
   ఎ. ప్రకాశమానమైన వేకువ చుక్కగా
   బి. పట్టణము యొక్క సూర్యునిగా
   సి. పట్టణము యొక్క మేయరుగా
10. ఒక రోజున మనము ఆ పట్టణములో నివసించెదము ఎందుకనగా............... . ( )
   ఎ. మనము మంచి జీవితము జీవించగలము
   బి. యేసు మనలను పరిశుద్ధులుగాను మరియు దానిలో ప్రవేశించగల వారిగాను చేయును
   సి. దేవుడు ప్రతి ఒక్కరిని ఆ పట్టణము లోనికి ప్రవేశింపనిచ్చును.